
ఆంధ్రసచిత్రవార


పత్రిక

18412



6-1-67


త్వరలో!
గౌరి ప్రొడక్షన్స్ వారి
గోపాలుడు భూపాలుడు
నిర్వహణ
కె.భావనారాయణ
దర్శకత్వం
జి.విశ్వనాథం
మాటలు: పాలగుమ్మి పద్మరాజు
సంగీతం: కోదండపాణి
పాటలు: సి.నారాయణ రెడ్డి, ఆరుద్ర
రిలీజ్
NAVRANG


సంఘంలో నానాటికీ పెచ్చు పెరిగే
అధికార,పదవీ వ్యామోహాలు-
క్షీణించే నైతిక విలువలు-వివరంగా
చిత్రించే వినూత్న సాంఘిక చిత్రం!
తప్పక చూడండి!
వాహిని వారి
రంగులరాట్నం
నిర్మాత-దర్శకుడు. బి.యన్.రెడ్డి
రచన: నరసరాజు
కెమెరా: రాజగోపాల్
కళ: శేఖర్
కూర్పు: మణి
సంగీతం: రాజేశ్వరరావు-గోపాలం
* * *
ఆంధ్ర-సీడెడ్: విజయ రిలీజ్
తెలంగాణా: ఉషాఫిలిమ్స్
మైసూర్: విజయ పిక్చర్స్ సర్క్యూట్



సంక్రాంతి కానుక!
శ్రీకాంత్ ప్రొడక్షన్స్
పిన్ని
దర్శకత్వం:
బి.ఎ.సుబ్బారావు
ఈస్టిండియా రిలీజ్
గంగాధర్
MOULIS

పాఠకులకి మనవి

ఈ వారం మొదలయ్యే 'రామ్‌శాస్త్రి' సీరియల్ నవలని సినిమా 'స్క్రీన్‌ప్లే'గా రచయిత శ్రీవి.ఎస్.సుక్తాంకర్ 1940లో తయారు చేశారు. దానిని ప్రభాత్ ఫిల్మ్స్ కంపెనీవారు సిని మాగాతీసి ఉండాలి కాని ఇంతలో యుద్ధం రావటంతో ముడిఫిలిమ్ కొరత వల్ల కథని బాగా తగ్గించేశారు. ఈ నవల పూర్తి స్క్రీన్‌ప్లే ఆధారంగా తీసుకుని రాసినది. రామ్‌శాస్త్రి జీవిత వివరాలు మరికొన్ని ఇవ్వటానికి అవకాశం కలిగింది.

ఈ సందర్భంలో ఒక సంఘటన గురించి చెప్పాలి. 1955 లో భారతదేశం, పోర్చుగల్‌ల మధ్య కేసు అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారణకి వచ్చింది. 1779 లో పీష్వా పోర్చుగల్ వారికి ఇచ్చిన 'దాద్రా' (గుజరాత్‌లో ఉన్నది) స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన విచారణ అది. భారతదేశం తరపున సెటల్వాడ్ వాదించారు. వాద ప్రతివాదాలలో 18 వ శతాబ్దంలో మరాఠా సామ్రాజ్య ముఖ్యన్యాయాధిపతి రామ్‌శాస్త్రి ప్రభూనే పేరు చాలాసార్లు పేర్కొనటం జరిగింది. ఇటీవల 'ఓం బడ్స్‌మాన్' ఒకటి భారతదేశంలో నెలకొల్పాలనుకున్నప్పుడు కొందరు 'రామ్‌శాస్త్రి' అనే పేరు వాడితే ఉచితంగా ఉంటుం దనుకుంటున్నారు. పెద్ద అధికారంలో ఉన్నవారి నిజాయితీ క్రమంగా తగ్గిపోతున్నదనిపించే ఈకాలంలో రామ్‌శాస్త్రి కీర్తి ప్రతిష్ఠల ప్రాముఖ్యత మరింత అధికంగా కనిపిస్తుంది.

* * *

1966 డిశంబరు 15 వ తేదీన కాలిఫోర్నియాలోని 'బర్‌బాంక్' అనే వూరిలో వాల్టర్ ఎలియాస్ డిస్నీ తన 65 ఏట మరణించాడు. ఈయన డిశంబర్ 5, 1901 లో జన్మించాడు. ఆయన అసంఖ్యాక అభిమానులలో ఒకరు రాసిన చిన్న వ్యాసం ఒకటి 84 పేజీలో వేస్తున్నాము.

సం॥

ఉత్తరాలు

వ్యాసాలు

"కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెసు అధ్యక్షులు కామరాజు" అను వ్యాసములో తమకుకల సందేహాన్ని సుందరరామమూర్తిగారు (వరంగల్లు) మీ పత్రిక 2—12—1966 సంచికలో ఉత్తరప్రత్యుత్తరాల శీర్షిక క్రింద వెలిబుచ్చారు. తమకు కలిగిన సందేహాన్ని వెలిబుచ్చడం, వివరణ కోరడం, పాఠకుల హక్కు. సందేహాలను తీర్చడం రచయితల విధి. అనువాదకర్త తమ జవాబులో సందేహం తీర్చారు. మంచిదే! అంతతోవూరుకోక, "ఇంత అలంకారికంగా చెప్పిన దానిని గ్రహించని పాఠకుల్ని మనం చేసే దేమి?" అని ప్రశ్నించారు. సందేహ వివరణ కోరి నందుకు, అనువాదకర్త శ్రీ సుందరరామమూర్తి గారిని ఖూనీ చేద్దామనుకున్నారా? అట్టి ప్రశ్న శ్రీ తిరుమలరామచంద్ర విజ్ఞతని సూచించకపోగా, ఆయన విమర్శన, సహన శూన్యతనే స్ఫుటంగా ప్రదర్శిస్తుంది. సంశయాత్ములైన పాఠకుల్ని ఖూనీ చెయ్యవద్దని రామచంద్రగారిని అనండి.

దేశరాజు సీతారత్నం (విజయనగరం)

జవాబు

పాఠకుల నిజమైన సందేహాలను సానుభూతితో పరిశీలించడం, తిరుగులేని సమాధానాలిచ్చి సందేహాలు తీర్చడం రచయితల, అనువాదమైతే అనువాదకుల, సంపాదకుల విధి అనడంలో సందేహంలేదు. కాని, సందేహాలు వెలుబుచ్చే ముందు పాఠకులు పూర్వాపరాలు ఒకటిరెండుసార్లు చదివితే వాటంతట అవే విడిపోయే సందేహాలను కూడా లేఖల మూలంగా అడగాలా? — అన్నదృష్టితో రామచంద్ర కొంచెం వక్రోక్తిగా అన్నారేగాని, ఆయన మాటలలో సహన శూన్యత ఎంతమాత్రమూ లేదు. చిత్తశుద్ధి గల రచయిత, అనువాదకుడు, విమర్శకుడు పాఠకులను ఖూనీ చేయడానికి పూనుకోడు, అది అతని పనికాదు.

(సం॥)

* * *

కమ్యూనిస్టు చైనాలో నా అనుభవాలు, కమ్యూనిస్టు దేశాలలో కామరాజ్, వ్యాసాలు చాలా బాగుంటున్నవి. ఈలాంటి విజ్ఞాన దాయకమయిన వ్యాసాలు పాఠకులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. రచయితలకు హృదయపూర్వక ధన్యవాదాలు.

బి. బి. జి. సుందరరావ్ (హైద్రాబాదు)

* * *

"కమ్యూనిస్టుదేశాలలో కాంగ్రెసు అధ్యక్షుడు" అన్న శీర్షిక ద్వారా రష్యా మొదలైన కమ్యూనిస్టు దేశాల ప్రస్తుత స్థితిగతులను పాఠకులకు అంది య్యటం ముదావహమైన విషయం.

కాని, ఈ వ్యాసాల్లో కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌ను బొత్తిగా 'దేముణ్ణి' చెయ్యటం ఏమంత బాగాలేదు.

తెన్నేటి రామారావ్ రూర్కేలా (ఒరిస్సా)

* * *

మీ వారపత్రికలో ప్రచురింపబడే వ్యాసము "కమ్యూనిస్టుదేశాల్లో కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్" చదువుతూ వున్నా. లెనిన్‌గ్రాడ్‌లో జరిగిన విందులో కామరాజ్ మాట్లాడుతూ "మా తమిళనాడులో మీ ప్రియ నాయకుడు లెనిన్‌కు చాలా గౌరవమర్యాదలున్నాయి. మా తమిళ కవి భారతి..." చెప్పబోయారు. ఇల్లా వుపన్యసించడము చాలా విడ్డూరముగా గోచరిస్తున్నది. యావద్భారత దేశము తరఫున రష్యాకు వెళ్ళినారా? లేక తమిళనాడు తరపున వెళ్ళినారా? మా భారత దేశంలో లెనిన్‌కు చాలా గౌరవమర్యాద లున్నాయి అని మాట్లాడి వుంటే ఎంత హర్షించదగినదిగా వుండేది!

ఈనాడు కేంద్ర కాంగ్రెసు నాయకులలో ముఠాతత్వము ఏర్పడినందుకు కారణము మొట్ట మొదట కామరాజ్, రెండవది సంజీవరెడ్డి, పాటిల్ మొదలగు వారని చెప్పవచ్చు.

పై వారాలలో యీ వ్యాసాలు చదవను.

మొగిలి సుబ్రహ్మణ్యం (కమలాపురం)

కథలు

16—12—66 పత్రికలో "పిన్ని" కథ నిజంగా హృదయాన్ని కదిలించేదిగా వుంది. చక్కని రచన. ఈమధ్య యిటు వంటి రచన చాల అరుదుగా ఉంటోంది. 'కన్నప్రేమ కన్నా పెంచినప్రేమ బలమైంద'ని నిరూపించే యీ కథ పిన్నుల మనస్సులని కదిలించేదిగా వుంది. కన్నవారైతే "నీవారేకదా" అనే ధైర్యం వుంటుంది. మరి పెంచిన వారికి ఆ ధైర్యం వుండదు కదా ? అయినా మమతల్ని తెంచుకోలేక బంధాన్ని పెంచుకోలేక పరిస్థితులకు తల వొగ్గి మనసులోనే కుమిలిపోయే జగదీశ్వరి లాంటి పిన్ను లెంతమందో యీ ప్రపంచంలో? భర్తలు లేక పోతే మరో రూపంలో తయారవుతారు. ఇటువంటి మమతల్ని దూరం చెయ్యడానికి ఇంత ధైర్యంగా, హృదయాల్ని కదిలించే విధంగా రచన చేసిన రచయిత్రిగార్కి మాకృతజ్ఞతలు.

ఎ. భానుమతి, (హైదరాబాద్)

* * *

'సయోనారా' అన్నకథ చదివాను. చాలబాగుంది ఈమధ్య పత్రికలలో ఇంతమంచి కథ ఎప్పుడు చూడలేదు. 11—11—66వ తేదీ సంచిక ముఖ చిత్రము చాలా బాగుంది.

పర్సా. అంజనదేవి. ఆర్. విజయలక్ష్మిరెడ్డి, (ఖమ్మం)

రచయితలకి మనవి

ప్రచురణకి స్వీకరింపబడని తమ రచనలు తిప్పిపంపగోరే వారు వ్రాతప్రతులతోబాటు తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లు పంపాలి. స్టాంపులు మాత్రం పంపిన రచనలు తిప్పిపంపటం సాధ్యం కాదు కనుక రచయితలు పై నిబంధనని గమనించ ప్రార్థన. (విడిగా స్టాంపులు అతికించిన, స్వంత చిరునామా కవరు పంపించినప్పటికీ రచనలు తిప్పిపంపటానికి వీలుకాదు.)

సం॥

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 6—1—'67

పరాభవ సం|| మార్గశిర బహుళ ఏకాదశి

సంపుటము : 59 సంచిక : 17

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
9, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

చందా వివరాలు
భారతదేశం

పోస్టు ద్వారా

సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80
విడిప్రతి	0.35

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

విషయానుక్రమణిక

ముఖచిత్రం. నటి రాజశ్రీ

కథలు :

సీరియల్ కథలు:



వెల 35 పైసలు

భారతీయ సంస్కృతి - పౌరహక్కుల వైఖరి

...మారి రీటా ఫరియా ప్రపంచసుందరిగా ఎన్నికయింది. ఆమె, భారతదేశపు ఘనత వహించిన విదేశాంగమంత్రి శ్రీ శ్రీ చాగ్లాగార్ని ప్రాసిరాజని, దక్షిణవియాత్నాంకు వెళ్లింది. విదేశాంగమంత్రిత్వ శాఖగాని, ఆ శాఖామంత్రి శ్రీ చాగ్లాగాని, ఈ వివాదంలో ఎందుకు జోక్యం కలగజేసుకోవలసి వచ్చిందో— అది ఎవరికీ అర్థంకాని విషయం. ఇక్కడ ఈ సుందరీమణి విరసనచే ఎడం కాదుగాని, ఆమెకన్నా అందగత్తెలు మనదేశంలో వేలకు వేలున్నారు. ఏమైనా మనదేశం స్త్రీలు అందాల పోటీల్లో పాల్గొంటున్నారు. ముందుముందు మరింత మంది పాల్గొంటారు. ప్రపంచమంతా పర్యటిస్తారు!

పాశ్చాత్యదేశాలతో చేసుకున్న సాంస్కృతిక ఒప్పందాలు భారతదేశానికి బోలెడన్ని వున్నాయి. కొద్ది నెలల క్రితం జెకొస్లొవేకియాతో చేసుకున్న ఇలాంటి ఒక సాంస్కృతిక ఒప్పందం మీద సంతకాలయినాయి.

భారతదేశ సంస్కృతి, పుణ్యక్షేత్రాల్లోను, పుస్తకాల్లోను లేదు. న్యూఢిల్లీలోని కేంద్ర సచివాలయాన్ని ఒకసారి చూస్తే చాలు. అక్కడ ఎక్కువగా పెయింట్ చేయబడిన గోడలు, మూలలు, తమలపాకుల రసికత్వానికి దృష్టాంతాలుగా కనిపిస్తూ వుంటాయి! జెకొస్లొవేకియాతో మనం ఒక సాంస్కృతిక ఒప్పందాన్ని చేసుకున్నామూ అంటే మనం ఏమని తెలిపి వుంటుంది? అక్కడికి మన బృందం వెళ్లి పరిసరాల్ని అపరిశుభ్రంగా వుంచడం ఎలాగో, మట్టి ప్రాణాన్ని ఎలా జాగ్రత్త పరచాలో, చచ్చేవరకు నిరాహార దీక్ష నెరపడమెలాగో, మానవ సంక్షేమంతో సంబంధంలేని ఇటువంటి సంస్కృతి నంతా ప్రదర్శిస్తుంది!

సంస్కృతి గురించి ఆలోచిస్తున్నప్పుడు నాకు రెండు నిరశనవ్రతాలు చటుక్కున స్ఫురించాయి. నిన్న మొన్నటి వరకు జగద్గురువుగారు సంధి కుదుర్చుకోడానికి మాట్లాడనంటే మాట్లాడనుగాక అని కూర్చున్నారు. ఇప్పుడో? బేషరతుగా బేరమాడేందుకు సిద్ధంగా వున్నారు! దీక్షను విరమించేందుకు కూడా తయారుగా వున్నారు. పట్టుదలలో, ఆవు కంటే తమ ప్రాణం ప్రముఖమైందే మరి! అర్థం లేని ఆందోళనలో లోపాన్ని హిందువులు కూడా పసిగట్టేశారు. బీహార్‌లో ఆకలితో మలమలమాడి చచ్చిపోతున్న ఆవుల్ని ఆదుకునేందుకు ఏ ఒక్క భక్తుడూ ముందుకు రాలేదు!

ఈ భక్తులందరూ భజన చేస్తుండగా క్రైస్తవ మతాధికారి పోప్. కరువు కాటకాల నిధికి కొంత ధనాన్ని ఉదారంగా ఇచ్చారు. ఆకలితో ఇన్ని జీవరాసులు అలమటించి పోతున్నాయి, అయినా మన జగద్గురువు చిల్లిగవ్వ కూడా విదిలించ లేదు. దయనీయమైన పరిస్థితి ఏమిటే అంటే కాంగ్రెసు వారుగాని ప్రభుత్వంగాని ఈ సత్యాన్ని బహిరంగ పరచేలందుకు వెనకాడుతూ వుంది.



డిస్నీ లాండ్‌లో వాల్టర్ ఎలియాస్ డిస్నీతో నెహ్రూ, ఇందిరాగాంధీ.

(64 వ పేజీ చూడండి)

ఇప్పటి అకాలీ ఆందోళనలో సంత్ ఫతేసింగ్ నిరశనవ్రతాన్ని పురస్కరించుకొని, మన కాంగ్రెస్ పరిపాలకులు మొట్టమొదట పండిట్ జవహర్లాల్ నెహ్రూకు కృతజ్ఞతలు తెలుపుకోవలసి వుంటుంది. ఇక్కడ లాలా గుల్జారీలాల్ నందా కూడా స్తుతించ తగ్గవారే.

ఆంధ్రులందరూ మాకు స్వయం రాష్ట్రం కావాలని ఆందోళన జరిపారు. ఆ కోరిక తీర్చేముందు పండిట్ నెహ్రూ, పొట్టిశ్రీరాములు గారి ఆమరణ నిరాహారదీక్ష అంతం చూశారు! వెంటనే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం ఒకటి నెలకొల్పబడింది. ఆ తర్వాత బొంబాయి ప్రశ్న తేబడింది. అంతవరకు ఉమ్మడి రాజ్యంగావున్న బొంబయిలో అల్లర్లు లేచాయి. ఆరవైనాలుగు గంటలలోగా ప్రజాస్వామ్య విరుద్ధమైన సంక్షోభం చెలరేగింది. అంతే, తీర్మానం పరిణామాలకు దారితీసింది. శ్రీ అశోక్ మెహతా తెలివితేటలు వల్ల బొంబాయి ద్విభాషా రాష్ట్రమై కూర్చుంది. మహాత్మాగాంధీగారు కూడా ఇందులో చేర్చబడేవారే. ఆయన భాషల్ని దృష్టిలో వుంచుకుని మహారాష్ట్రులకు గుజరాతీలకు వేర్వేరు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలను ఏర్పరచివున్నారు. క్రిందటి సాధారణ ఎన్నికలకు ముందు ఈ ముసుగులో గుద్దులాటకు స్వస్తి చెప్పి మహారాష్ట్ర, గుజరాత్ అనే రాష్ట్రాలు బయటకొచ్చేశాయి.

లాలాగుల్జారీలాల్ నందా రాజనీతి, గురి తప్పని రాజనీతి ఆయన దేశీయాంగమంత్రిగా వున్నప్పుడు పంజాబ్‌ను భాషారాష్ట్రం చేస్తూ, సంత్ ఫతేసింగ్ పంజాబీ సుబా కోసం ఆందోళన జరపడానికి అవకాశం కల్పించారు!

గ్రాంఫోన్ ఒక్కటే, కాని రికార్డు మార్చబడింది. మాస్టర్ తారాసింగ్ వినయవిధేయతతో సిక్కిస్తాన్ కావాలని కోరారు. శిష్యులమారి సంత్ ఫతేసింగ్ బలాన్ని పుంజుకుని దాన్ని పంజాబీసుబాగా మార్చేశారు. సిక్కులు పంజాబీ సుబా కోసం ఎందుకు

పెట్టుబట్టారి? అనే విషయం మనం ఎన్నోసార్లు చర్చించుకున్నాం. మతవ్యాపారంగానూ, ఒక తెగ ప్రజాసంబంధమైన కోరికగానూ జమకట్టి పాకిస్తాన్ చీలిపోవడం గురించి కాంగ్రెసు అభ్యంతరం చెప్పింది. అసంగతమైన ఈ లౌకిక విధానంతోనే పంజాబీసుబా లేక సిక్కిస్తాన్ సేర్పాటు చేశారు. ఇది పూర్తిగా పాకిస్తాన్ కోరికలాంటిదే. ఒక మతానికి సంబంధించిందీ, ఒక తెగకు సంబంధించిందీను. దీనికి ఋజువు కావాలంటే, సంత్ ఫతేసింగ్ నిరశనవ్రతం చాలు.

ఈ వివాదంలో ఆయువుపట్టు లాంటి విషయం ఒకటివుంది. అది, సర్దార్లు హుకుమ్‌సింగ్, స్వరణ్ సింగ్, ఉజ్జల్‌సింగ్, ముసాఫిర్‌సింగ్ గారలు ఎవరి తరఫున పని చేస్తున్నట్లు? వీరందరూ జాతీయ వాదులైన సిక్కులుగా పరిగణింపబడుతూ వున్నారు. వీరు కీ. శే. మౌలానా అజాద్ నాయకత్వంలో వుండిన జాతీయవాదులైన ముసల్మానుల వంటివారే.

దేశం విభజింపబడిన తర్వాత కొందరు దేశభక్తులు ముఖ్యమైన సింహాసనాల మీద అధిష్టించారు. మౌలానా అజాద్ మరణానంతరం శ్రీ హుమయూన్ కబీర్ ఒక ఉద్గ్రంథాన్ని వెలికి తెచ్చారు. అది అజాద్‌గారి జీవితచరిత్ర. అందులో ఏం రాసి వుందని? భారత దేశం విభజింపబడినందుకు మహాత్మాగాంధి మీద ఆరోపణ!

ఆదే కథ ఇప్పుడు మళ్లీ చెప్పబడుతుంది. ప్రభుత్వము అనే అంగరఖా కప్పుకున్న కొందరు దేశభక్తులున్నారు. వారు సర్దార్‌స్వరణ్ సింగ్, సర్దార్ హుకుం సింగ్, సర్దార్ ముసాఫిర్‌సింగ్, వీరందరూ కాంగ్రెసు నాయకులు. తెల్లటోపీల క్రిందజాతీయవాదులుగా చలామణి అవుతున్నారు. వీరి లోగుట్టు పెరుమాళ్లకు కూడా తెలియదు. సిక్కు ప్రజా సందోహ భావాంతరంగికులు వీరు. సంత్ సాహెబ్ నిరాహారదీక్ష కొనసాగిస్తానని ప్రకటించినప్పుడు, వారించడానికి జయప్రకాశ నారాయణ్ వెళ్లారు. 'సంరక్షక చిప్పలు' మ్యాడిక్లీలో హంస తూలికాతల్పాల మీద పవ్వళిస్తున్నారు! నిజం చెప్పాలంటే వీరు, ఈ సంరక్షక చిప్పలు సంత్‌జీ నిరశనవ్రతం మీద ఒక్కటంటే ఒక్కమాట చెప్పలేకపోయారు.

ఒకసారి జిన్నా అన్నారు, "భారతదేశ ప్రజల గుణగణాల్ని ఇతరదేశాల్లో చాటేందుకు ప్రతిబింబాలు కాగలకొందరు'చూపులకుర్రాళ్లు' Show Boys) కావాలి" అని. ఇప్పుడు అక్షరాలా కాంగ్రెసుప్రభుత్వం అటువంటి వాళ్లను పోషిస్తున్నది. ముస్లింల తరఫున శ్రీ వాగ్లా ఆలీఘర్ యూనివర్శిటీలో నెగ్గుకు రాలేకపోయారు. హుమాయూన్‌కబీరు గార్ని కేంద్ర మంత్రివర్గం నుంచి బహిష్కరించినప్పుడు ఆయన కాంగ్రెసుకు ప్రతిపక్షాన్నొకదాన్ని లేవదీశారు.

జగద్గురువు ఎలాగైతే ప్రాణాన్ని నిలబెట్టుకొనేందుకు మార్గాన్వేషణ చేయడం ప్రారంభించారో అలానే, ప్రభుత్వం గనక తన బెదిరింపులకు లొంగనట్టయితే సంత్‌జీ తమ నిరశన వ్రతాన్ని (దేశప్రయోజనం దృష్ట్యా) విరమించేసుకుంటారనే జనవాక్యం ఒకటుంది!

సోవియట్ రష్యా సోదరభావం!

భారత ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో వున్నదని ఎరిగిన సోవియట్ నాయకులు, భారతదేశపు ఆర్థిక పరమైన కష్టాల్ని గురించి ఎంతో విచారిస్తున్నారు! భారతదేశం భవిష్యదభివృద్ధికి ఇది 'అంతిమ విధానాను సరణకు కరిన ప్రయత్న'మని ప్రావ్దా పత్రిక ఒక వ్యాసం ప్రచురించింది. ఈ వ్యాసం ద్వారా ఒక విషయం సుబోధకమవుతుంది. వచ్చే సాధారణ ఎన్నికల పర్యవసానానుగుణ్యంగా మాస్కో అనురాగం ఆధారపడి వుంటుందని.

ఎన్నికలకు ముందు రష్యాకు ఎక్కడలేని ప్రేమ పుట్టుకురావడమనేది ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. వారు మొట్టమొదటిసారిగా సహకార విధానమంటూ ఎప్పుడైతే మన దేశాన్ని వాటేసుకుని సౌహార్దాన్ని ప్రకటించారో, అప్పుడే ఈ చాతుర్యంలోని సద్భావం బయటపడి పోయింది. వారు భారతదేశంలోని నాయకులతో స్నేహబంధాల్ని పెంపొందించుకోవడం ద్వారా, ఇది ద్యోతకమవుతూవుంది (ఆర్థికపరమైన ఒత్తిడులను సుస్థిరం చేయడం కోసమని భావాంతరీకరణం!) భుజాలమీద చేతులువేసి ఆకాశాన్ని చూపిస్తూ గోతిలోకి తోస్తున్నారనే విషయం, వారు భారత కమ్యూనిస్టు పార్టీకి తోడ్పడడం ద్వారా అర్థమవుతున్న విషయమే.

అంతిమదశలో ఇటువంటి వ్యూహరచనా కౌశల్యం బోల్తా పడడానికి రెండు కారణాలున్నాయి. భారతదేశం కరువుపాటకాల్లో బాధపడుతున్నప్పుడు సహకరిస్తున్న పాశ్చాత్యదేశాల్లాగా, సోవియట్ దేశం తన తరఫున ఆశించినంత ధాన్యం సరఫరా చేయలేకపోతూ వుంది. మరొక కారణం ఏమిటి అంటే, అది కమ్యూనిస్టు పార్టీలో వున్న చీలికలు. వామపక్షంలోని చీలికల్ని కూడదీసి యునైటెడ్ ఫ్రంట్‌గా నిర్మించాలనుకున్న ఆశ నడలిపోయింది. కమ్యూనిస్టుపార్టీలోనే కావలసినన్ని తగాదాలు.

భారతదేశం మీద దయతో రాసిన వ్యాసాలన్నీ ఈ రెండు సమస్యలూ తుడిచిపెట్టేస్తాయి.ఈ వ్యాసాలు సోవియట్ ప్రెస్ ద్వారాను, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ప్రతిరూపాలైన 'వరల్డ్ మార్క్సిస్ట్ రెవ్యూ'ల ద్వారాను ప్రచురింపబడ్డాయి. అవి సూచించిన సూత్రమేమిటి అంటే, ప్రభుత్వం — దాని ఆర్థిక విధానాన్ని మార్చుకోనేట్టు చేయడానికి వాగు పడ్డ దేశాలన్నీ కృషి చేయాలి, అని.

సెప్టెంబరు 'వరల్డ్ మార్క్సిస్ట్ వ్యూ' గత నెలలుగా కాంగ్రెసు ప్రభుత్వం సాధించిన అభ్యుదయం మీద దెబ్బతీసింది. 'భారతదేశంలో సాంఘిక సంబంధమైన అన్యాయం జరుగుతోందని ఒక రచయిత పేర్కొన్నారు. ఇటువంటి పనులు గుట్టు చప్పుడు కాకుండా వుండేది ఇప్పుడు ప్రకాశవానస్నె పోయిందన్నారు. కాంగ్రెసు పార్టీ యొక్క ముఖ్యోద్దేశం సోషలిస్ట్ విధానంతో ప్రజల ఈతిబాధలు తొలగించాలని. కాని, ఆర్థిక పరిస్థితి దిగజారిపోవడంతో ఈ విధానం గెబ్బతినిపోయింది, దేశంలో శాసనాలు పరస్పర విరుద్ధమైనవిగా వుంటూ నిర్దిష్టమైనవి కాకపోవడంవల్ల విమర్శించబడుతున్నాయి అన్నారు.

ఈ వ్యాసాల్లోని భావాలను సోవియట్ పత్రికలు వరుసగా ప్రచురిస్తూ వచ్చాయి పత్రికలకు సోవియట్ పార్టీతోను, ప్రభుత్వంలోను వున్న సన్నిహిత సంబంధాలే ఇందుకు కారణం. అని ఎంతో విశేషంతో యీ భావాల్ని ప్రచురించాయి. 'భారతప్రభుత్వాన్ని విమర్శించండి, అథోగతిలో వున్నట్టు చిత్రించండి, కాని ఎదురుపడి విమర్శించవద్దు, వీలైనంత వ్యంగ్యంగా పోనీండి.' అని.

ఇటీవల 'న్యూఏజ్'లో ప్రచురింపబడ్డ వ్యాసం ఇందుకు చక్కని సాదృశ్యం. సోవియట్ బలంగానే భారత కమ్యూనిస్టు పార్టీయొక్క అధికార వర్గానికి శ్రీమతి ఇందిరా గాంధీని ఎదుర్కొనే వుద్దేశం లేనే లేదు. "ఇందిరాగాంధీ పరిపాలనలో ధరలు పెరిగిపోయాయి; నిరుద్యోగ సమస్య ప్రబలిపోయింది; వ్యయం గంతులేస్తోంది. ఎక్కడికక్కడ ప్రజలకోర్కెల్ని అణచివేయడం జరుగుతోంది. అంచేత ప్రతిపక్షాలు మీదపడి కఠినంగా విమర్శిస్తున్నాయి" అంతేగాని ఇందిరాగాంధీ తప్పేం లేదు, అని ప్రావ్దా పత్రికలోని వ్యాసం ప్రకటించింది




బాండ్ కూడా యిష్టపడ్డాడు. బాండ్‌కి పేక ముక్కలతో ఏం చేయటమన్నా సరదాయే. పదివేల డాలర్ల బహుమానం మోసాన్ని పటాపంచలు చేయ డానికి కూడా పనికొస్తుంది...

"అసలు ఈ గోల్డ్‌ఫింగర్ ఎవరు? అతని పరు కెంత?"

'బాగా డబ్బున్న వాడు. ప్రపంచంలోని ధన వంతుల్లో ఒకడు. అసలు అతనికి అంత డబ్బు ఉండి కూడా వెధవ 25 వేలకి నన్నెందుకు మోసంచేస్తాడు?

"మీరు రేపు గోల్డ్‌ఫింగర్‌తో ఆడితే నేనేం చేయగలనో చెప్తాను. కానీ, సహాయం చేసినా చెయ్యక పోయినా నేను మాత్రం చీకటి పడేసరికి వెళ్ళి పోవాలి."

'సరే'



మర్నాడు ఉదయం పదిగంటలకి దూపాంట్‌ని కల్సుకోడానికి ఏర్పాటు చేసుకున్నాడు బాండ్. ఇద్దరూ కలిసి కబానా క్లబ్ వైపు నడకసాగించారు.

'కానీ నేను మీకు వ్యాపార విషయంగా పరిచయ స్తుడిగా చెప్పాలి. అది మరవకండి—నాచురల్ గాస్ కెనడాలో నాకు వాటా ఉంది..'


'ఇతనేనా గోల్డ్‌ఫింగర్? కానీ అదేమిటి! అతని మెడ చుట్టూ తగిలించుకున్నాడు?'

'పాలిష్ చేసిన తగరం. చర్మం ఎండకి రంగు తేరటానికి! అతనికి బ్రహ్మచెముడు. బిగ్గరగా పిల వాలి.'

'ఇదిగో'

'ఇతను జేమ్స్‌బాండ్. వ్యాపార విషయంగా నాతో పనుండి ఇక్కడికొచ్చాడు.'

'చాలా సంతోషం మిస్టర్ బాంబ్!'



గోల్డ్‌ఫింగర్‌ని కల్సుకున్న మొదటి క్షణంలోనే అతను అసాధ్యుడనుకున్నాడు బాండ్. అతని నీలం కళ్ల నిశితమైన చూపులు లోపలికి తొల్చుకుపోతున్న ట్లున్నాయి.


'మీరు వ్యాపారాన్ని గురించి మాట్లాడ్తారా? అయితే ఇవాళ ఆట లేదన్నమాట.'

'ఆట లేదా! నా డబ్బు నాకు రావద్దా?...జేమ్స్ పేపర్ చూస్తూ విశ్రాంతి తీసుకొంటాడు.

'గాల్ఫ్ ఆడి ఉండవచ్చు. మిస్టర్ బాంబ్ గాల్ఫ్ ఆడ్తారా?'

'నాపేరు బాండ్— బాం...డ్! ఇంగ్లండులో ఉంటే ఆడ్తాను. మా క్లబ్ పేరు హంటర్ కొంబే!'

'ఆహా! నాది సాండ్‌విచ్‌లో రాయల్ సెంట్ మార్క్స్. మనిద్దరం ఒకరోజు ఆడాలి. క్షమించండి! నేను డ్రెస్ చేసుకోవాలి.'



డ్రెస్ చేసుకున్న తర్వాత గోల్డ్‌ఫింగర్ కొంత మనిషిలాగా కన్పించాడు. చెవికి తగిలించుకున్న హియరింగ్ ఎయిడ్ మాత్రం చెవుడుని తగ్గించి నట్లు లేదు.

'అంతా బాగుందా జేమ్స్?'


'ఎంతో దూరం ప్రయాణం చేయటంవల్ల విశ్రాంతి ఎంతో హాయిగా ఉంది.'

'వీడు మోసగాడుకాదు. డూపాంట్ ఇంతకు ముందు చెప్పినట్టే మంచి ఆటకాడ. ఇక మోసానికి తావెక్కడ?'

గోల్డ్‌ఫింగర్ వరసగా మూడాటలు గెలిచాడు. ఒకసారి డూపాంట్ గెల్చే సూచనలు కన్పించాయి. కానీ గోల్డ్‌ఫింగర్ ఆ వూహల్ని అనుకోకుండా తలక్రిందులు చేశాడు.

'మీరు మధ్యలో వదిలేయడానికి కారణం? నా ఆట బలేగా ఉంది.'

'నాకేదో బారగా ఉన్నట్లనిపించింది.'



గోల్డ్‌ఫింగర్ మొదటాట గెల్చాడు. తనకి కావాల్సినంతవరకూ చూశాననుకున్నాడు. ఇక పరిసరాల్ని పరిశీలించటం మంచిది.


'అయితే నేనలా కాస్త తిరిగొస్తాను.'

'అలాగే జేమ్స్. మనం లంచ్‌లో వ్యాపార విషయాలు మాట్లాడుకుందాం!'

అతను రూఫ్ మీద ఆచివర్నించి ఈ చివర దాకా పచార్లు చేశాడు. మళ్లీ ఆ దృశ్యాన్ని పరిశీలించ పూనుకున్నాడు.

'అదుగో హోటల్! నాగది నెంబర్ 1200—పై అంతస్తులో కాబట్టి గోల్డ్‌ఫింగర్ గది దానికి కిందగా ఉన్న రెండు అంతస్తులో నెంబర్ 200 అన్నమాట.

'అవును! కబానా క్లబ్ రూఫ్‌నించి పైకి 20 గజాలు. పేకాడే టేబిల్ నుంచి 20 గజాలు. తెలివై వాడివోయ్ గోల్డ్‌ఫింగర్!'



లంచ్ తర్వాత కొంతసేపు కెమేరా ఫ్లాష్ సరిచేసుకున్నాడు బాండ్. మధ్యాహ్నం మూడింటికి మళ్లీ పేకాట ప్రారంభమవుతుంది.

'కానీ నేనక్కడుండను. ఊళ్లో కెళ్లానని గోల్డ్‌ఫింగర్‌తో చెప్పండి. ఏదో తగలేట్టే ఉంది.'

'మంచిది! వెళ్లిరా!'

సరిగ్గా గం. 3—15 ని.లకు కబానా క్లబ్ పైకప్పు కేసి దృష్టిని సారించాడు బాండ్...

పది నిమిషాల తర్వాత...

'గోల్డ్‌ఫింగర్! ఇప్పుడు మనం చూసేదేదో చూస్తాం కదూ!'

(ఇంకా ఉంది),

సుప్రభాతం
(సీరియల్)

రంగధామ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. సత్యమూర్తి చెల్లెలు కళ్యాణి ఎక్కడికో వెళ్ళిపోయింది. అతను తల్లిని తీసుకుని రామవరానికి మకాం మార్చి ప్రకాశం సుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు. ఆ చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పరపతి వున్నట్లు గ్రహించాడు సత్యమూర్తి. ప్రకాశం, రామదాసుకు సంబంధించిన జాడ తెలియని ఒక అమ్మాయికోసం వెదుకుతున్నాడు. ఆ అమ్మాయిని వశపరచుకుంటే కావలసినంత ఆస్తి దక్కుతుంది.

10

దామోదరం ఇలా ఆలోచిస్తూండగా, దాలినాయుడు గబగబ లోపలికి వచ్చాడు. వస్తూనే, "మనక్కావలసిన మడిసి వస్తుండాడు. సూడు." అన్నాడు దామోదరం చెవి దగ్గర మెల్లిగా. అదే సమయంలో సత్యమూర్తి ఆ గదిలోకి వచ్చాడు. దామోదరం అతని వైపు చూసి, దాలినాయుడి వైపు చూశాడు. దాలినాయుడు, సత్యమూర్తి వైపు చూపిస్తూ కన్నుకొట్టాడు. దామోదరం మెల్లిగా తలూపాడు. ఈ విషయమేమీ గమనించని సత్యమూర్తి, "మిమ్మల్ని ఈ సాయంకాలం మెయిల్లోనే మద్రాసు వెళ్ళమని చెప్పమన్నాడు ప్రకాశం. కాగితాలన్నీ తీసుకొచ్చాను." అన్నాడు దామోదరంతో, ఒక కాగితాల కట్ట ఇస్తూ.

"సరేనప్పా! ఏమయింది ఆ 'యాక్సిడెంటు' సంగతి?"

"పైడిగాడి కూతురు పదేళ్ళ పిల్ల, గొడ్లు తోలుకుంటూ అక్కడ తిరుగుతోంది. అక్కడ మన ఫ్యాక్టరీ వాళ్ళు కొన్ని ఎలక్ట్రిక్ వైర్లు చాలా తక్కువ ఎత్తులో వేశారు. 'టెంపరరీ'గా ఎక్కడో దూరంగా ఒక పంపు బిగించాలని, ఆ వైర్లు కొన్ని క్రిందపడిపోయాయి నిన్నా, మొన్న, గాలికి. ఆపిల్ల ఆ వైర్లు ముట్టుకున్నట్లుంది. అందుకని షాక్‌కొట్టి చచ్చిపోయింది. పైడిగాడి ముఠా అంతా పెద్దగొడవ లేవదీశారు. అసలలా కరెంటు వైర్లు వెయ్యకూడదుట. వేసినా అంత తక్కువ ఎత్తులో వెయ్యడం మరీ ప్రమాదం. ఈ యాక్సిడెంటుకి బాధ్యత ఫ్యాక్టరీదేనని వాళ్ళు వాదించడం మొదలెట్టారు. పోలీస్ రిపోర్టు ఇస్తామని జనరల్ మానేజర్ని బెదిరించారు. ఆయన భయపడి ప్రకాశానికి ఫోన్ చేశారు."

"ప్రకాశం ఏమన్నాడు?"

"అసలు ఫ్యాక్టరీలోకి వస్తూనే పైడిని పిలిపించాడు. వాడు రాగానే, వాడి ముందరే మేనేజర్‌తో, 'వీడి తాలూకు నలుగురు మన ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు, వాళ్ళని వెంటనే పనిలోంచి తీసెయ్యండి' అన్నాడు. తరువాత పైడితో, 'నువ్వూ నీ జట్టు ఎంతమంది వున్నారో, వాళ్ళూ కూడా ఈ క్షణం నుండి మా ఫ్యాక్టరీలో పని చెయ్యక్కరలేదు పొమ్మన్నాడు. వాడు, యాక్సిడెంటు గురించి రాజీ మాటలు మాట్లాడడానికి ప్రకాశం పిలుస్తున్నాడనుకొన్నాడు. ఈ మాటలు వినేసరికి పిచ్చెత్తిపోయాడు. వెంటనే తనది తప్పయిపోయిందని ప్రకాశం కాళ్ళ మీద పడ్డాడు. వాడూ వాడి జట్టు వాళ్ళందరూ ఒకగంట సేపు బ్రతిమాలాకగాని ప్రకాశం కోపం తగ్గలేదు. వాళ్ళందర్నీ నానాతిట్లూ తిట్టాడు. 'మీకందరికీ జీవనోపాధి ఏర్పడుతుందని నేను కష్టపడి ఫ్యాక్టరీ కట్టిస్తే, మీ తెలివితక్కువకు ఫ్యాక్టరీ బాధ్యత వహించాలా?' అని అడిగాడు. వాళ్ళు చివరకు తప్పంతా తమదేనని ఒప్పుకున్నాక, పైడి చేతిలో ఆ పిల్ల అంత్యక్రియలకై నూరు రూపాయలు పెట్టాడు."

"పైడికి ఎవరో దుర్బోధ చేశారప్పా, లేకపోతే పోలీస్ రిపోర్టు ఇస్తానని వాడెప్పటికీ అనడు. వాడలాటి వాడుకాదు."

"ఆ విషయం కూడా ప్రకాశం వాడిచేత చెప్పించాడు. ఇది తనకు పుట్టిన బుద్ధికాదనీ, సత్యం తాలూకా మనుష్యులు కొందరు తన వద్దకు వచ్చి పురికొల్పడం వలన చేశాననీ చెప్పాడు."

"అసలు విషయం అదీ. సరే, చూద్దాంలే ఎంత కాలం, సత్యం ఆటలు సాగుతాయో నేనూ చూస్తాను. నువ్వు పోయిరా అప్పా." అని సత్యమూర్తిని పంపించి వేశాడు దామోదరం. అతను వెళ్ళిపోయాక, అంతవరకూ మౌనంగా ఏటో మొహంపెట్టి, సత్యమూర్తిని పరీక్షిస్తున్న దాలినాయుడు, వెంటనే గది తలుపులు దగ్గరగా వేసి, దామోదరం వద్దకు వచ్చి 'ఆనాడు రేత్రి ఈడిసేతుల్లోనే కాగితాలన్నీ పెట్టేస్తుంటే నాను సూసాను. ఈడి కన్నీ తెలుసు. రామదాసు ఈడికే అన్ని అప్పగింతలూ సేసాడు. కూతురి మంచి సెబ్బరలు సూసుకోమన్నాడు. అదెక్కడుందో ఈడికి తెలుసు. ఈడిని పట్టుకుంటే అంతా తెలుస్తుంది.' అన్నాడు, మెల్లిగా.

"ఇతనికా?" అని తెల్లబోయాడు దామోదరం.

"అవును. ఈడంటే రామదాసుకు పాణం. ఈడికి తన సంగతులు సాలా మట్టుకు చెప్పినాడు."

కొద్దినిముషాలు ఆలోచించాక దామోదరం "ఆ కాగితాలు ఇతని కివ్వడం సరిగ్గా చూశావా?"

"ఆ, సూసాను. ఈడి దగ్గర నుండి ఆ కాగితాలు లాగియ్యాలని కూడా ఆలోసించా. ఆరేత్రి ఈడింట్లో దూరి యెతికినాను. ఏడ బెట్టేసేడో ఏటో అవుపించనేదు.':

"బాగా వెతికావా?"

"ఆ, యెతికినాను. రామదాసును పాడిసేసినాక, ఈడేటిసేస్తాడో సూద్దామని ఈడెనకాల రెండ్రోజులు తిరిగినాను. వూరంతా బలాదురు తిరిగాడుగాని యెవరింటికి యెళ్ళలేదు. మూడోనాడు పోలీసులు నన్ను పట్టేసినారు. ఆణ్ణే బాగా గుర్తుంచుకున్నా.

"చాలా విచిత్రంగా వుందప్పా. సరే, నీవు పోయి వాడినే కనిపెట్టూండు. వాడింటి పరిసరాలలో తిరుగుతూ ఎప్పుడు ఏంజేస్తుంటాడో కనిపెట్టూ అవసరమైతే నాతో వచ్చి చెప్పు." అని దామోదరం దాలినాయుడిన్ని పంపించేసి తనొక్కడూ ఆలోచిస్తూ కూచున్నాడు.

రామవరంలో వెంటనే, ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటన విషయం గుప్పుమంది. ప్రకాశం అనూయాయులు కొందరున్నారు. వాళ్ళు ఇటువంటివి వ్యాపిస్తాయని తెలుసుకునే, ముందుగా వాళ్ళే ప్రారంభిస్తారు, నలుగురి దగ్గరా ఈ విషయాలకు చిలవలూ పలవలూ కల్పించి చెప్పడం. అయితే వాళ్ళు చెప్పే దాంట్లో, ప్రకాశం మంచితనం, ఉదారతా మొదలైనవి ప్రాముఖ్యత వహిస్తాయి. ప్రకాశం గోరంత ఉపకారం చేస్తే దానిని కొండంతగా చిత్రిస్తారు వీళ్ళు. అవసరమైతే అబద్ధాలు కూడా ఆడేస్తారు. పైగా వాళ్ళ దగ్గర ఎవరైనా ప్రకాశం గురించి ఏమైనా అంటే, మళ్ళీ ఆ మాటలు ప్రకాశం చెవులోకి వీళ్ళ ద్వారా వెళ్ళిపోతాయి. అందువల్ల ప్రతీ వారికీ వీళ్ళ దగ్గర ఏమైనా అనడానికి భయం. తాము ప్రకాశం దృష్టిలో అతనికి వ్యతిరేకులమని తెలియడానికి ఆ వూళ్ళో ఎవరికీ ఇష్టం వుండదు. ప్రకాశం యొక్క వ్యతిరేకులకు ఆవూళ్ళో స్థానం లేనట్టే. ఎందుకంటే ఆఫీసర్లూ, సంస్థలు, పంచాయితీ బోర్డూ, స్కూలూ, ఫ్యాక్టరీ, అన్నీ అతని చేతుల్లోనే. వీటితో అవసరంలేని వారుండడం అరుదు. ప్రకాశం వ్యతిరేకులకు వీటన్నిటిలోనూ స్థానం వుండకపోవడమే కాక ఆఖరికి వాళ్ళింట్లో ఏదైనా అన్యాయం జరిగితే, రక్షణ ఇచ్చే దిక్కు కూడా వుండదు. అందువలన ప్రతివారూ, ఇష్టమున్నా లేకపోయినా, పైకి ప్రకాశం యొక్క హితులమే నన్నట్లు ప్రవర్తిస్తారు.

ఎన్నివిధాలుగా ప్రకాశం గురించి మంచి ప్రచారం చేస్తున్నా చేసే వాళ్ళకు కూడా, వినేవాళ్ళు తమ మాటల యందు పూర్తి నమ్మకం కలిగి వినటంలేదని తెలుసు. ఎందుకంటే ప్రజలలో నాయకుల మీద పూర్తి విశ్వాసం పోయింది. ఈ నాయకులకు తమ సుస్థిరతే ప్రధానంకాని, ప్రజాక్షేమం ప్రధానం కాదనే అభిప్రాయం రామవరం ప్రజలలో నాటుకుపోయింది. అనేక శతాబ్దాలుగా భారతదేశంలోని గ్రామజీవనం చలన రహితంగా, స్తబ్దంగా నిల్చిపోయింది. గ్రామీణుల బీద, అనాగరిక, శ్రమ జీవనంలో మార్పు ప్రవేశించలేదు. స్వాతంత్రం వచ్చాక ఏవో క్రొత్త మార్పులు గ్రామజీవనంలో తేవాలని కమ్యూనిటీ డెవలప్‌మెంటు బ్లాకులూ, గ్రామపరిశ్రమలూ మొదలైనవి ప్రవేశపెట్టబడ్డాయి గాని, వాటిలోని మంచేమీ ప్రజలకు కన్పించలేదు. ప్రకృతీ, మానవుడూ చేసిన అన్యాయాలను మౌనంగా భరిస్తూ, తమ కష్ట జీవనాన్ని కొనసాగించటమే రామవరం ప్రజల కలవాటయింది. వర్షాధారమైన భూములు, వర్షాలు సరిగా కురవక పండని సంవత్సరాలలో పస్తులుండడం, అప్పుల పాలవడం.

*   *   *

ఉమలో ఈమధ్య కొత్త ఉత్సాహం ప్రవేశించినట్లు తోచింది భానుమతికి. ఇద్దరూ ఇంచుమించు రోజూ కలుసుకుంటూనే వున్నారు. కాలేజీ వదలగానే భానుమతి విధిగా అనంతరావుగారి ఇంటికి వెళ్ళేది. ఉమతో అరగంటైనా కాలం గడపందే ఇంటికి వెళ్ళేదికాదు. అప్పుడప్పుడు ఇద్దరూ బీచి వైపు షికారుకి వెళ్ళేవారు. తరుచూ రమా, పద్మినులు

వీరితో కలుసుకుంటూండేవారుగాని, వాళ్ళు లేనప్పుడు వీళ్ళిద్దరూ గంటల కొలదీ కాలం, కలిసి గడిపేవారు. భానుమతిలో వున్న స్వచ్ఛ మనస్కత రమా, పద్మినీ లలో లేదు. వారి హృదయాలలో అనేక శంకలూ, భయాలకూ తావుంది. వాళ్ళకు ఎంతసేపూ ఇతరుల చెడు ప్రవర్తన గురించి మాట్లాడడం ఇష్టం. భానుమతి చిన్నప్పటి నుండీ సూటిగా, నిర్భయంగా మాట్లాడడం నేర్చుకుంది. ఆమె మనసు గీటురాయి వంటిదని ఉమకు నమ్మకం. ఏ విషయాన్నైనా భానుమతితో చెప్పుకుని, దానిపై భానుమతి అభిప్రాయం వింటేనేగాని ఉమకు తోచదు.

జీవితాన్ని లభించినంతవరకూ అనుభవించాలనే తత్వంగలది ఉమ. ఆమె అదృష్టం కూడా అనుకూలమైన పరిస్థితులు కల్పించింది. తండ్రి స్థితిమంతుడు. తను చదువుకున్నదీ, యౌవ్వనంలో వున్నదీ. తను కోరితే ఏదైనా లభించగల అవకాశాలున్నదీ. కాని ఆమె జీవితంలో ఒక నీడలా సత్యమూర్తి ప్రవేశించాడు. అతనిని ఉమ ప్రేమించడం చాలా పొరపాటు చేసింది. ఆ పొరపాటుకి ఆమె చాలా కష్టనష్టాల్ని అనుభవించడమే కాకుండా జీవితంలోని అనేక అమూల్య క్షణాల్ని వృథాగా వ్యథతో గడిపింది. ఇదంతా అనవసరం అని ఆమె ఈ మధ్యనే తెలుసుకొంది. తను ఇన్నాళ్ళ నుండి ఒక పెద్ద భ్రమలో వుంది. ఆ భ్రమ ఒకనాడు హఠాత్తుగా తీరిపోయింది. అసలు సత్యమూర్తి, ఉమను ప్రేమించనేలేదు. ఆ విషయం ఉమకు మనస్సు కొంతవరకూ తెలుసు. అయినా అతని ప్రేమను ఎప్పటికైనా సంపాదించగలనన్న భ్రమలో ఉండేది. దానికి కారణం సత్యమూర్తిలోని అనిశ్చియత. అతను ఏదీ సూటిగా, ధాటిగా చెప్పలేడు. ఒకరి మనసు నొప్పించుతుందేమోనని భయపడి తను గట్టిగా చెప్పదల్చుకున్నదీ కూడా చెప్పడు. అందువలన ఉమకు అతను స్పష్టంగా, తానామెను ప్రేమించలేదని, ఆమె కల్పన వ్యర్థమని చెప్పలేపోయాడు. కాని ఉమ అతని బలహీనతల్ని గ్రహించలేకపోయింది. అతని కొక విచిత్ర తత్వమనుకుంది.

వివాహమైనా, భర్తతో అనుకూల పరిస్థితులలో కాపురం చెయ్యగలిగే భాగ్యం లేకపోవడం, ఉమకు సత్యమూర్తి యందు మరికొంత మమతను రేకెత్తించింది. ఒంటరిగా వుంటున్న ఆమెలో సత్యమూర్తిని ఏవిధంగానైనా తన వాడిని చేసుకోవాలనే కాంక్ష ప్రబలింది. చివరకు ఒక ఉద్రేకం ఆమె నావహించింది. ఒకనాడు సత్యమూర్తి, అనంతరావు గారు కోసం వచ్చాడు. ఆయన వూళ్ళోలేరు. ఉమ, కొద్దిసేపు మాట్లాడి, తనకేమీ తోచటంలేదనీ, కారు మీద భీమునిపట్నం వెళ్ళి వద్దాం రమ్మని సత్యమూర్తిని ఆహ్వానించింది. అతను కూడా అంగీకరించాడు. ఇద్దరూ ఆరోజు ప్రొద్దున్న భీమునిపట్నం వెళ్ళి, వాళ్ళు, సాయంకాలం తిరిగివచ్చారు. ఆరోజు ఏమైనా సరే సత్యమూర్తిని తన వాడిని చేసుకుందామనుకుంది ఉమ. భీముని పట్నం బీచి, అందంగా, ప్రశాంతంగా వుంటుంది. వూరు చిన్నదవటం మూలానా, వూరికి, వర్తక ప్రాధాన్యం ఏమీ అంతగా లేకపోవటం వలనా, బీచి యొక్క ఆనందం అనుభవించడానికి అన్ని తరహాలవారూ పైవూళ్ల నుంచి వస్తూంటారు. ఆ ఇసకలో కూచొని, ఉవ్వెత్తున పొంగే అలల్ని చూస్తూ, తన హృదయంలోని ఆవేశపుటలల్ని సత్యమూర్తికి వెళ్లడించింది.

ఆమె అంతరంగంలోని కల్లోలాన్ని గమనించిన సత్యమూర్తి, మొదట ఆమె కెలా జవాబు చెప్పాలా అన్న సందిగ్ధంలో పడ్డాడు. కాని ఏ అందమైన ప్రకృతి మానవుడిలోని కాంక్షల్ని రెచ్చగొడుతుందో, ఆ ప్రకృతిలోనే ఒక అనంతమైన, ప్రశాంతత, మానవుడిని విశ్వానికీ, విశ్వమంతటికీ ఆధారభూతమైన భగవత్తత్వానికి చేరువగా తీసుకువెళ్ళి, తనలోని లోతుల్ని మానవుడికి వ్యక్తం చేస్తుంది. అందువలన సత్యమూర్తిలో కూడా ఒకవిధమైన ఆవేశం కలిగింది. ఆ ఆవేశంలో అతనెన్నో విషయాల గురించి



మాట్లాడాడు. తనలోని విజ్ఞానాన్నంతా, ఆమె ముందు ప్రదర్శించాడు. కామం ఎంత హేయమైనదో నిరూపించాడు. 'ప్రేమ' అనేది ఒక వ్యక్తికిగాని, ఒక ప్రత్యేక స్త్రీ మీదగాని పురుషుని మీదగాని కేంద్రీకృతమవడం అసందర్భమన్నాడు. అది విశ్వానికి సంబంధించినది, భగవంతుని పొందగలిగినది. స్త్రీపురుషుల మధ్య ఉత్పన్నమయ్యే ఆకర్షణా, కాంక్షామాత్రమే. దానిని ప్రేమ అనడం పొరపాటు అన్నాడు. ఈ ఆకర్షణకు లొంగటం కన్నా దానికి అతీతంగా వుండడంలోనే ఆనందం వుందన్నాడు. ఇంకా ఎన్నో విషయాల గురించి మాట్లాడాడు. వాటన్నిటినీ విన్నాక ఉమ మనసు మారిపోయింది. పైగా సత్యమూర్తిలోని బలహీనతలూ ఆమె [illegible]. అతనిని పెళ్ళి అర్థం చేసుకోకుండా అతనిని ప్రేమించడంలో తను పొరపాటు చేసిందని గ్రహించింది. ఉమది, ఆమె తండ్రి లాగే విశాలహృదయం. తన కోరికను కాదన్నగాని సత్యమూర్తి మీద కోపం తెచ్చుకునే బదులు తనను తనే విమర్శించుకుంది. కొన్ని కొన్ని అనుభవాలు మానవుల్ని, హఠాత్తుగా మానసికంగా ఎదిగేటట్లు చేస్తాయి. కొన్ని అంతస్థులు పైగా లాక్కుపోతాయి. ఆ పరిణామంతో వారిలో చాలా మార్పొస్తుంది.

ఉమను కూడా ఆ అనుభవం చాలా ఎదిగేట్లు చేసింది. ఈ సంఘటన జరిగిన తరువాత ఆమె కొద్దిరోజులు చాలా ఆలోచించింది. ఆ ఆలోచనలతోనే చాలా ఎదిగింది, ఎరగనట్లు అప్పటి నుండీ, తను ఇన్నాళ్ళ నుండీ తన జీవితం [illegible]ంగా భావిస్తున్నదల్లా, ఆమెలో చాలా మార్పేర్పడి తన జీవితం విషాదానికి దానే కారణం అనుకోసాగింది. సంఘటనల్నీ వ్యక్తుల్నీ యథాతథంగా చూడడం నేర్చుకుంది. వాటితోని అంతరార్థాల ననవసరంగా వూహించుకుని బాధపడడం మానేసింది. అప్పటి నుండీ ఆమెలో ప్రశాంతతా, నిర్మలతా ఎక్కువయ్యాయి. అదే

సుప్రభాతం

ఇతరులకి ఆమెలో కొత్త వుత్సాహం ప్రవేశించినట్లనిపించింది.

ఆరోజు మధ్యాహ్నం కాలేజీలో అంతగా వుండవసరం లేక, లెక్చరర్లెవ్వరు రాకపోవటంతో, రమా, పద్మినీ, భానుమతీ కూడా అనంతరావు గారింటికి వచ్చేశారు. ఉమ ఆ రోజు సింహాచలం వెళ్దాం రమ్మని వాళ్లని పిలిచిందిగాని, కారు రిపేరులో వుండడం వలన, ఆ ప్రోగ్రామ్ విరమించుకుని నలుగురూ బాతాఖానీలోపడ్డారు.

"సుధ నాకు ఉత్తరం రాసింది." అంది రమ.

"ఎలా వుందిట కొత్త కాపురం?" అని పద్మిని అడిగింది.

"బాగానే వుందిట. భర్త తననెంతో ప్రేమతో చూస్తాడట, కాని తనకే అతనిని చూస్తే వెగటుగా వుంటుందిట."

"అదేం కర్మ. అలాంటిది పెళ్ళెందుకు చేసుకోవాలి?" అని భానుమతి ప్రశ్నించింది.

"సుధ ఎవరు?" అని అడిగింది ఉమ.

"మా క్లాసుమేటు. చాలా అందంగా వుంటుంది. బాగా డబ్బున్నవాళ్లే. పెళ్లికాక ముందు ఒక యువకుడిని ప్రేమించి అతనితో చాలా చనువుగా తిరిగింది. ఆమె దృష్టిలో నీతికి ఎక్కువ విలువలేదు. కొన్నాళ్లు ఈమెతో సరదాగా గడిపి అతను పై చదువులకు మరో వూరు వెళ్లిపోయి ఈమెను పూర్తిగా మర్చిపోయాడు. ఈమెకు మూడవనెల దాటేసరికి తల్లిదండ్రులు మేల్కొని, మందు ఇప్పించి కడుపు పోగొట్టారు."

"పోనీ ఆ యువకుడినే చేసుకోమని బ్రతిమాలలేకపోయారా? ఆమె తల్లిదండ్రులు." అంది ఉమ.

"అతను వివాహం చేసుకోనని చెప్పేశాడు."

"బాగుంది. అయితే ఆమె గతేంకాను?" అంది ఉమ.

"గతికేముంది? తన చర్యల పరిణామం ఆమెకు ముందే తెలుసుకదా, ఆమె తన జాగ్రత్తలో తనే వుండాలిసింది అని అందరూ అన్నారు" అంది, రమ.

"ఇంతకీ పెళ్లయిపోయింది కదా. వాళ్ల నాన్నగారు తను మొదట ఇద్దామనుకున్న కట్నం కన్నా మరి రెండు వేలు ఎక్కువపెట్టి తొందరగా పెళ్లి చేసేశారు. ఇలాంటివి ఎన్నవుతున్నాయో ఈ రోజుల్లో!" అంది పద్మిని. రమ అవునని తలూపింది.

భానుమతి మాత్రం తన ఆమోదం ఇవ్వలేదు. అసలామెకు ఇటువంటి వంటే చాలా మంట. "అయితే పెళ్లయినంతమాత్రాన, గతం అంతా, తుడుచుకుపోతుందా? ఆమె తన భర్తతో నిర్మల హృదయంతో కాపురం చెయ్యగలదా?" అంది కొంత జుగుప్సతో.

"అది ఆమె వ్యక్తిగత విషయం." అంది రమ.

"కాదు. అందరికీ సంబంధించినదే. ఒక యువతి వివాహం కాకుండా అవినీతికి పాల్పడవచ్చా? పాల్పడినందు వలన పరిణామాలెలా వుంటాయి? అన్న విషయం ప్రతివారూ చర్చించదగినదే. అందువలన నిజంగా అవినీతి వలన నష్టముందో, లేక ఇదంతా 'హంబగ్' మాత్రమేనో తేలిపోవాలి. మతమూ, నీతి అనే వాటి మీద మనకు విశ్వాసం తగ్గిపోతున్న

కోణాలలో అవి గట్టి ఆధారాలు కాకుండాపోతున్నాయి. మన వ్యక్తిగత జీవనానికి అటువంటప్పుడు నిజా నిజాలు మనం 'ప్రాక్టికల్'గా చూసి తేల్చేస్తే మంచిది." అంది భానుమతి.

"ఎవరు తేల్చాలి? మన హిందూదేశంలో పాతి వ్రత్యం తప్ప వేరే గత్యంతరంలేదు. అందుకని అవినీతి నెవరూ ఆమోదించరు. కానీ అన్నిరంగాలలోనూ, చెప్పేదొకటీ చేసే దొకటీ, పెద్దలకే పరిపాటయి పోయినప్పుడు, మనలాటి పిన్నలేం చెయ్యగలరు?" అంది రమ.

"పాశ్చాత్యులకీ పట్టింపులు లేనే లేవనుకుంటాను." అంది పద్మిని, చిరునవ్వుతో.

"ఎందుకు లేవు? వారికి మాత్రం వివాహ వ్యవస్థ లేదా?" అంది గట్టిగా, భానుమతి, రమా, పద్మినీ. "అవునని" తల వూచారు.

ఉమ, "నేనొక పాశ్చాత్య మహిళ ఈ విషయం గురించి వ్రాసిన వ్యాసం చదివాను. ఆమె చాలా చక్కగా చర్చించి, పవిత్రత యొక్క అవసరం నిరూపించింది. అది చదివాక, వారికి కూడా మనలాటి సమస్యలే వున్నాయని బోధపడుతుంది." అంది.

"అయితే ఆమె చెప్పిన విషయాలేమిటో చెప్పండి" అని ముగ్గురూ అడుగగా, తను చెప్పడం మొదలెట్టింది. "అసలు సంఘవ్యవస్థ, పవిత్ర జీవనానికై ఉద్దేశింపబడింది గాని, అవినీతికి కాదు. ప్రతివ్యక్తీ తను చూస్తున్న ఆడపిల్లలలో చాలావరకు, ఈ అవినీతికి పాల్పడకుండా, బుద్ధిగా ఇంటి పనులూ, చదువు మరి ఇతర మంచి వ్యాసంగా లతో తమ జీవితం గడపడం చూస్తూంటారు. కాని మనకు తరుచూ అవినీతి వలన తప్పు లేదనే కొందరి ఉద్బోధ వినిపిస్తూనే వుంటుంది. అందువలన ఈ విషయాల్ని దాచకుండా, చర్చించాలి. కొందరు మగవాళ్ళు, అవినీతి ఒక పెద్ద విషయమే కానట్లు త్రోసిపుచ్చేస్తారు. కానీ డాక్టర్లూ, మనస్తత్వ శాస్త్రవేత్తలూ, అంత సులభంగా త్రోసివెయ్యరు. అంతరాత్మ అనేది మంచి చెడులను నిర్ణయించడంలో చాలావరకూ తోడ్పడుతుంది కాని అవినీతి వలన కలిగే వ్యక్తిగత, సాంఘిక పరిణామాలు మాత్రం అందరకూ తెలియాలి. ప్రతి సంవత్సరం చాలామంది అవివాహిత స్త్రీలు గర్భ విచ్ఛిత్తి కోసం ప్రయత్నిస్తూన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన పని. అందువలన ఒకస్త్రీ యొక్క ఆరోగ్యం శాశ్వతంగా పాడైపోవడంగాని, లేక మరణానికి కూడా గురయ్యే అవకాశం వుంది అంతేకాక ఆ ఆడపిల్లల జీవితాంతం ఒక భయమూ, విచారమూ ఆవరిస్తాయి. వివాహిత స్త్రీకి కాన్పు సమయం ఎంత బాధాకరమైనా, తరువాత తన కన్నబిడ్డ యొక్క ముద్దుమురిపెమూ, కట్టుకున్న భర్త యొక్క రక్షణా, సంఘం యొక్క గౌరవం, ఆబాధకు తగిన ఉపశాంతి నిస్తాయి. కాని అవివాహితకు ఆబాధే మిగిలి, తన నావిధంగా చేసిన యువకుడంటే అసహ్యమూ, మొత్తం మీద ప్రణయ వ్యవహారాల మీద భయం కలుగుతుంది."

"ఇటువంటి పరిణామాన్ని లెక్కచెయ్యని వాళ్ళెంత మందో వున్నారు." అంది రమ. పద్మిని కూడా అవునంది.

"మానసికంగా వీరి అవస్థను కూడా ఆమె చర్చించింది. ఒక స్త్రీ యొక్క నైతిక ప్రవర్తన ఆమె శీలమూ, నరముల శక్తీ, శారీరక సుఖమూ, మనసూ అనే వాటితో పెనవేసుకుని వుంటుంది. అవినీతికి పాల్పడడం వలన, ఆమె శీలం భంగమైనట్లే. దాని నామె లెక్కచెయ్యకపోవచ్చుగాని తరతరాలుగా, వస్తున్న సాంప్రదాయమూ, సాహిత్యమూ, ఆమెలో తానొక పాపం చేశాననే భావం కలిగించి తీరుతాయి. శీలం అంత పవిత్రం కాదనుకునేవారు, తమ భవిష్యత్తులో ఎటువంటి అపాయాలకు గురవుతారో తెలుసుకోలేకుండా వున్నారు. అంటుందామె. అసలీ రహస్య ప్రణయాల వల్ల, నరాలకు చాలా దెబ్బ. ఇవి జరిగేవి చాలా రహస్య స్థలాలలో, భయం భయంగా ఎక్కడ బైటపడతామో అనే తొందరలలోనూ. కాబట్టి, నరాలకు అనవసర ఒత్తిడి కలుగుతుంది. తన రహస్య ప్రవర్తన ఎక్కడ బైటపడుతుందో అని ఆమె ఎప్పుడూ భయంతో తల్లక్రిందులవుతూ వుంటుంది."

"ఒకవేళ అలా ప్రవర్తించిన స్త్రీ, పురుషుడూ, తరువాత వివాహం చేసుకుంటేనో?" అని ప్రశ్నించింది పద్మిని.


"అటువంటప్పుడు వివాహంలో వారికి కొత్తేమీ లేకపోగా ఒకరి మీద ఒకరికి అసూయా, అనుమానాలు వృద్ధవుతాయి. ఎందుకంటే, ఒకరికి మరొకరి సంగతి తెలుసుకాబట్టి, సాధారణంగా ఈ వ్యవహారం అంతవరకూ వెళ్ళదు. ఆ యువకుడు ఈ పిల్లను వదిలిపెట్టి మరొక పిల్ల వెంటపడతాడు. తత్ఫలితంగా ఈ పిల్లకు మిగిలేదల్లా, అసూయా, నిరాశలేనూ. ఆ బాధతో ఆమె పూర్తిగా పతనమవడం ప్రారంభిస్తుంది. అటువంటి స్త్రీ క్రమంగా, ఒక పురుషునితో తృప్తి నొందలేదు. వివాహం అనేది ఆమెను బంధించలేదు. ఈ విచ్చలవిడి ప్రవర్తన వలన, వైవాహిక జీవితంలోని 'ప్రేమ' అనే అనుభవం వ్యర్థమవుతుంది అంటుంది" అంది ఉమ.

"అసలు ప్రతి పురుషుడూ, తను వివాహం చేసుకోబోయే స్త్రీ 'అనాఘ్రాతపుష్పం' అయివుండాలని కోరుకుంటాడన్నదినిజమేనా?" అని అడిగింది భానుమతి.

"ఆ. నిస్సందేహంగా. అది ఆ కాలంలోనేకాదు, ఈకాలంలో కూడా అంతే. మగవాళ్ళెన్ని కబుర్లు చెప్పినా, తమ భార్యలకు, వివాహ పూర్వమే ఇతర పురుషునితో సంబంధం వుందంటే సహించలేరు. కాబట్టి, అవినీతికి పాల్పడే యువతి, తన వైవాహిక సుఖాన్ని వెలగాటమాడుతోందన్నమాట. అసలు స్త్రీపురుషుల మధ్య పరస్పరం నమ్మకం ఉండాలి. ఉద్రేకాలు తీరిపోయాక, స్త్రీ పురుషుల మధ్య, వివాహబంధమే ఈ నమ్మకానికి దోహదం చేస్తుంది. వివాహబంధాన్ని త్రెంపుకోవచ్చునని అనుకున్నా, అది ఒక పవిత్ర బంధమని దానిని మీరిన వారు శిక్ష ననుభవిస్తారని ఆమె రాసింది" అంది రమ.

"ఈ విషయాల గురించి మన సంఘంలో కూడా చర్చించడం అవసరం." అంది భానుమతి. అదే సమయంలో అనంతరావుగారు, మరొక వ్యక్తితో ప్రవేశిస్తూ, "అదిగో! నేననుకున్నట్లే అయింది. భానుమతి మా యింట్లో వుంటుందని ఈయనతో చెప్పాను. అలాగే వుంది." అన్నారు నవ్వుతూ. ఆయనతో వచ్చిన వ్యక్తి దామోదరం.

(సశేషం)



కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్

(గత సంచిక తరువాయి)

ఆర్. వెంకట్రామన్

కామరాజ్ సోవియట్ యూనియన్ నుంచి బయలుదేరే ముందు, మా వెంట సోవియట్ అంతటా తిరిగిన శ్రీ స్పిరిదినోవ్ అధికారపూర్వకమైన విందు చేశారు. ఆ విందులో భారత, సోవియట్ మిత్రసంబంధాలను గురించి, వియత్నాం యుద్ధం గురించి ప్రసంగాలు జరిగాయి. భారతదేశ విధానాన్ని గురించి పెక్కుసార్లు పునరుద్ఘాటించారు కామరాజ్.

సోవియట్ దేశాన్ని వదలి వెళ్లే సమయం సమీపించిన కొద్దీ, కామరాజ్‌కు "ఇక్కడ ప్రసంగించడానికి రావాలి", "అక్కడ ప్రసంగించడానికి రావాలి" అనే ఆహ్వానాలు ఎక్కువయాయి. మాస్కోలో వున్న పత్రికా రచయితలు ఆయనను కలుసుకోవడానికి "హోటల్ మెట్రోపోల్" అనే చోట ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రష్యా పత్రికా రచయితలు అందరూ వచ్చారు.

సామాన్యంగా పత్రికా ప్రతినిధులు ప్రశ్నలడిగేటప్పుడు, ఏదో తప్పు కనిపెడదామనే ఉద్దేశంతో ప్రశ్నలు వేయడం మామూలు. కాని, సోవియట్ పత్రికా రచయితలు ఆవిధమైన దృష్టితో ప్రశ్నలు వేయలేదు.

"తాష్కెంట్ ఒప్పందాన్ని నెరవేర్చడానికి ఎలాటి చర్యలు తీసుకున్నారు?"

"సోవియట్—భారత మైత్రి అభివృద్ధికి మీరు కొత్త పథకం ప్రత్యేకించారా?"

ఈ విధంగా ప్రశ్న మీద ప్రశ్న వేశారు.

కామరాజ్ తాష్కెంట్ ఒప్పందాన్ని గురించి ప్రస్తావించినప్పుడు, దానిని మనసారా నెరవేర్చడానికి భారతదేశం ప్రయత్నిస్తున్నదని, పాకిస్తాన్ నుంచి రావలసినంత సహకారం లభించనప్పటికీ, భారతదేశం దాని పొరుగులతో ఒకటాని మంచి కూడా వైరాలకు దాని వాక్కువెప్పారు.

సోవియట్ దేశంలో భారతీయ విద్యార్థులు ఉన్నత చదువు, వృత్తి శిక్షణ పొందడానికి వస్తున్నారు. మేము వెళ్లినప్పుడు కళాశాలలకు, పాఠశాలలకు సెలవులు కావడంవల్ల పలువురు భారతీయ విద్యార్థులు అక్కడ లేరు. అయినప్పటికీ మన దౌత్య కార్యాలయంలో వున్న వారు, కొందరు విద్యార్థులు కామరాజ్‌ను కలుసుకోవడానికి మాస్కోలోని మన రాయబారి కార్యాలయంలో ఏర్పాటు చేయబడింది.

అక్కడున్న భారతీయులకు భారతదేశం గురించి ఎక్కువ ఆందోళన ప్రకటించారు. "ఆహారం, వుందా? తగినన్ని వసతులున్నాయా?" దేశం పురోగమన మార్గంలో నడుస్తున్నదా?" అని ఎంతో విచారంతో ప్రశ్నలు వేశారు. మరికొందరు, తాము ఇకమీద భారతదేశానికి వస్తే, ఎలాటి అవకాశాలు వుంటాయో తెలుపాలని కోరారు. ఆ సాయంకాలం చాలసేపు కామరాజ్ మనదేశ ప్రజలతో సల్లాపించి సంతోషించారు.

అది జూలై 31 వ తేదీ, ఆదివారం. మేము మాస్కో వదలి బయలుదేరవలసిన రోజది. ఆ వుదయం మాస్కో రేడియోలో భారతదేశం కోసం ఒక ప్రసంగం చేశారు కామరాజ్. నేను చిన్న టేప్ రికార్డులో ఆ ప్రసంగాన్ని రికార్డు చేసుకున్నాను. ముందుగానే ఎలాటి ప్రయత్నమూ లేకుండా కామరాజ్ ప్రసంగించారు. దానిని ఇక్కడ పొందుపరుస్తున్నాను:—

రష్యా దేశ ప్రజలు మనదేశ ప్రజలపై చాల గౌరవం కలవారని విన్నాను. కాని, ఇక్కడికి వచ్చిన తర్వాతగాని, వారికి మనపై ఎంత ప్రేమ, మర్యాదలు వున్నాయో తెలుసుకొనే సావకాశం లభించలేదు.

రష్యా దేశప్రజలు చాల కష్టపడి పని చేసేవారు. పాటుకు గౌరవం ఇచ్చే మనస్తత్వం గలవారు. వారు ఆరంభించిన విప్లవం కార్మికులను ఉన్నత స్థితికి తీసుకొనిరావడం కోసమనే సని మనకందరికీ తెలుసు. నేను ఇక్కడికి వచ్చిన తర్వాత, సమష్టి వ్యవసాయ క్షేత్రాలను, కార్మికులు కర్మాగారాలలో ఎలా పని చేస్తారో ఎంతో ఆతురతతో వుంటారో అనడాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించింది.

నేను కొన్ని సమష్టి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాను. ఆ సమష్టి వ్యవసాయక్షేత్రాలలోనివారంతా అందరూ సమష్టిగా వ్యవసాయం చేస్తున్నారు. అంతేకాక, పనిచేసే శక్తి లేనివారికి వాళ్లే ఉపకార వేతనం ఇస్తున్నారు. సమష్టి వ్యవసాయక్షేత్రంలో వచ్చే లాభాలతోనే విద్య మొదలయిన సౌకర్యాలు కలిగించుకొని విజయం పొందుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లాను. రైతుల ఇళ్లలో అందరగా సంతోషంతో వుంటున్నారు. అంతేకాక, భారతదేశం నుంచి వచ్చిన మనను ఎంత గౌరవిస్తున్నారు, ఎంత ప్రేమతో చూస్తున్నారు అన్న విషయాన్ని తెలుసుకొనడానికి వీలయింది. వారి మనసులు విచ్చి, కల్లకపటాలు లేకుండా మనదేశం వారిలాగే మనతో ప్రవర్తించి, తమ తినుబండారాలన్నిటినీ మనకిచ్చి, విందు చేస్తారు. ఆ గ్రామ కర్షకులు మంచి ఆతిథేయులు. మనదేశ కర్షకులు కూడా అతిథి సత్కారంలో ఎంతో సంతోషిస్తారు. అలాగే సోవియట్ కర్షకులు కూడా సంతోషించేవారే.

నేను వెళ్లిన భాగాలలో చాలచోట్ల సమష్టిగా పత్తి పండిస్తున్నారు. దాని లాభమంతా గ్రామవాసుల సమష్టి లాభం. అంతేకాక, వారి కోసమని విడివిడిగా భూమి చెక్కలను ప్రభుత్వం ఇచ్చింది. ఆ భూములలోను పంటలు పండిస్తారు. పళ్ల చెట్లు నాటుతున్నారు. దానిలో వచ్చేలాభం వారి స్వంతం.

దానితోపాటు పాడి ఆవులను పెట్టుకొవడానికి కూడా వారికి అధికారం వుంది. మంచి పాలు సమృద్ధిగా దొరుకుతుంది. పసిపిల్లలు బాగా, కావలసినంత పాలు తాగుతారు. శరీరారోగ్యంతోను, సంతోషంతోను వున్నారు అక్కడి పిల్లలు.

తర్వాత, ప్రస్తుతం వాల్గాగ్రాడ్ అని పిలువబడే స్టాలిన్‌గ్రాడ్‌కు వెళ్లాను. అక్కడ, ఆనగర ప్రజలు గడచిన ప్రపంచ సంగ్రామంలో ఎలా వీరంతోను, ధైర్యంతోను పోరాడి తమ దేశగౌరవాన్ని కాపాడుకున్నారనే చరిత్రను ప్రత్యక్షంగా చూచి తెలుసుకున్నాను. పోరు జరిగే కాలంలో ఆ ప్రజలు ధైర్యంతో పోరాడారని పత్రికల మూలంగా తెలుసుకున్నాను.

అయితే, ప్రత్యక్షంగా చూచిన తర్వాతనే, వారు పోరాడి విజయం పొంది, తమ మర్యాదను, ప్రజల స్వాతంత్ర్యాన్ని, దేశస్వాతంత్ర్యాన్ని కాపాడుకొనడానికి ఎంతటి మహత్తర త్యాగాలు చేశారనడం తెలిసింది. యుద్ధ సమయంలో వారి ఇళ్ళు నాశనమయాయి. ఆస్తిపాస్తులు ధ్వంసమయాయి. సంతానం బలి అయింది. అయినా ధైర్యంతో పోరాడి విజయం సంపాదించారు. వారి విజయానికి చిహ్నంగానే ఆ నగరం విరాజిల్లుతున్నది.

ఆవిధంగానే లెనిన్‌గ్రాడ్‌కు వెళ్ళాను. అక్కడే మహావిప్లవ నాయకుడైన లెనిన్ సాక్షాత్కరించారు. అది చాల అందమైన నగరం.

అక్కడ వారు తమ విజయ చిహ్నం స్థాపించారు.



లెనిన్‌గ్రాడ్‌లో ఒక అందమైన ప్రదేశం

...రాజా, వెలాది ప్రజలు పుష్పాంజలి సమర్పించి మర్యాద చేస్తారు.

లెనిన్‌గ్రాడ్ నగరాన్ని శత్రువులు మూడు సంవత్సరాలు ముట్టడించి పీడించారు. ఆ నగరవాసులను ఆకలితో మాడ్చి చంపుదామనే శత్రువుల వుద్దేశం. "ఆకలితో మాడైనా చస్తాముగాని, మా గౌరవాన్ని, స్వాతంత్ర్యాన్ని విడిచి పెట్టం" అని ఆ నగరవాసులు మూడు సంవత్సరాల పాటు పోరాడారు. అప్పుడు యుద్ధరంగంలో ఐదులక్షల మంది, ఆకలితో ఐదు లక్షలమంది మొత్తం పదిలక్షల మంది మడిశారని వారు చెబుతున్నారు. దానిని తలచుకున్నా, విన్నా ఒడలు పులకిస్తుంది. అంత ధైర్యంతో పోరాడారు ఆ నగరవాసులు.

నేను అక్కడ చూచిన కర్మాగారాల కార్మికులు ఎంతో ఆతురతతో, ఆసక్తితో పని చేసేవారు. పాటుపడడంలో ఎంతో శ్రద్ధాళులుగా వున్నారు, వుత్సాహంతో వున్నారు.

పాటుపడేటప్పుడు "మనదేశం కోసం మహత్తర సేవ చేస్తున్నాము. మనదేశం గౌరవం, అంతస్థు పెరగాలి" అనే సంతోషంతో వుంటున్నారు కార్మికులు. మమ్మల్ని ఆ కర్మాగారాలకు పిలుచుకుని వెళ్ళిన వారు ఎంతో ఆసక్తితో అక్కడ జరిగే పనులను వివరించి చూపారు.

ఈ లెనిన్‌గ్రాడ్ కర్మాగారం నుంచి మనదేశానికి విద్యుదుత్పత్తి యంత్రాలు విశేషంగా సరఫరా అవుతున్నాయి. ముఖ్యంగా మేట్టూరులోను, నెయ్‌వేలిలోను వారి విద్యుదుత్పత్తి యంత్రాలు వినియోగించబడుతున్నాయి. ఇంకా బ్రహ్మాండమైన యంత్రాలు తయారు చేస్తున్నారు.

ఆ విధంగానే, వాల్గాగ్రాడ్‌లోను, వాల్గానది పక్కన పెద్ద జలాశయం కట్టారు. అక్కడ విశేషంగా విద్యుదుత్పత్తి జరుగుతుంది. రోజుకు 20 లక్షల కిలోవాట్ల విద్యుత్తు వుత్పత్తి అవుతున్నది. విద్యుదుత్పత్తి చేయడంలో వారెంతో శ్రద్ధ చూపారు. ఎందుకంటే, విద్యుత్తు వుత్పత్తి అయితేనే దేశంలో పరిశ్రమాభివృద్ధి జరుగుతుందన్న విషయాన్ని వారు బాగా గ్రహించారు. హెచ్చుగా విద్యుత్తును వుత్పత్తి చేసి, పరిశ్రమలు అభివృద్ధి చేసి, దాని మూలంగా ఎక్కువయ్యే మంచి పద్ధతిని అనుభవించాలన్నదే వారిలక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరుతూ వస్తున్నది. ప్రజలు కష్టించి పనిచేసి, ఇంకా సంపదను పెంచి, దేశవాసులందరూ ప్రేమతో, మంచి వసతులతో జీవించాలని కోరుతున్నారనడాన్ని నేను చూస్తున్నాను. ఇది చూస్తున్నప్పుడు నాకు ఎంతో సంతోషంగా వుంటున్నది. మనదేశంలోను ఇలాటి వాతావరణం ఏర్పడాలనే భావం కలుగుతున్నది.

మరిన్ని, రష్యా ప్రజలు ఆర్థికరంగంలో అతి విస్తారంగా ముందుకు పోతున్నారు. వారి పురోగతికి కారణాలు ఏమిటని నేను నిన్న మాస్కోలో వున్న విద్యామంత్రిని కలుసుకుని సంభాషించినప్పుడు, అర్థమయింది. అక్కడి వారిలో 47 శాతం ఇంజనీరింగు చదువుతున్నారని విన్నాను. దాని అర్థమేమిటి? 47 శాతం ఇంజనీరింగు చదువుతున్నారంటే ఆ దేశంలో పరిశ్రమాభివృద్ధే కారణం. అక్కడి వారు ఇంజనీరింగు చదువడంలో ఎక్కువ ఆసక్తి కల వారయివున్నారు. అందువల్ల పరిశ్రమలు, వృత్తులు అభివృద్ధి చెందుతూనే వుంటాయి. కాగా, ఆదేశ ప్రజల వుత్తమ జీవితానికి అవసరమైన అన్నివసతులు కల్పించడానికి సాధ్యమవుతుంది.

ఈ దేశానికి వచ్చి, ఇక్కడున్న మహానాయకులందరిని కలుసుకుని సంభాషించాను. వారందరూ మనదేశ ప్రజల పట్ల ప్రీతి, ప్రేమ గలవారయి వున్నారు. దీనికి తార్కాణంగా వారు మన నాయకులయిన నెహ్రూజీ ఎడల చూపించే ఆదరాభిమానాలను పేర్కొనవచ్చు. తమ ప్రణాళికలు, వారి విధానాలు మనదేశంలో బాగా విజయం పొంది, మనప్రజలు క్షేమంగా జీవించాలని, మేలైన మనుగడ సాగించాలని వారు ఆశపడుతున్నారు.

రష్యా ప్రజల అతిథిసత్కార గుణాన్ని, ప్రేమను మనం ఎన్ని తడవులు చెప్పినా, ముగియదు. ఈ గుణాలు నేను వెళ్ళిన ప్రతిచోట కనిపించాయి. ఆ దేశప్రజలందరికి, మనదేశ పక్షాన, నా కృతజ్ఞతను, మర్యాదను తెలిపి వచ్చాను. వారి జీవితం మన కొక దృష్టాంతంగా వుంటున్నది.

మనము కూడా కొత్త జీవితంతో ముందుకు పోవాలని ఆశ పడుతున్నాము. ఆ క్రొత్త జీవితానికి వారు మనకు వూతకోలగా వున్నారని చెప్పడానికి ఇష్టపడుతున్నాను. మరొక మారు అందరికీ నమస్కారం.

* * *

రష్యా విజ్ఞాన, ఆర్థిక అభివృద్ధినంతా చూడదలచుకుంటే, మాస్కోలో వారు స్థాపించిన శాశ్వత ప్రదర్శనాన్ని ఒకమారు చూస్తే చాలు. అయితే ఆ ప్రదర్శనాన్ని పూర్తిగా, బాగా చూడడానికి కనీసం ఒకనెల పడుతుంది.

మాస్కోను వదలి బయలుదేరడానికి ముందు, మాకున్న రెండుగంటల తీరికలో ఈ శాశ్వత ప్రదర్శనం చూశాము. ఈ ప్రదర్శనాన్ని గురించి వివరించడానికి విడిగా ఒక పుస్తకం వ్రాసినా చాలదు.

రాకెట్లలో సాధించిన పురోగతి, స్పుట్నిక్ పంపినది మొదలు నేటి వరకు అభివృద్ధి చెందిన విజ్ఞానం, దానికోసం ఉపయోగించిన యంత్రాలు, వీటన్నిటినీ ఒక విభాగంలో చూడవచ్చు.

వ్యవసాయరంగంలో పొందిన అభివృద్ధి, అందుకు వాడే ట్రాక్టర్లు, యంత్రాలు, ఉత్పత్తి చేసిన వస్తువులు— వీటినన్నిటిని వ్యవసాయ విభాగంలో పెట్టారు.

వీటిని చూచి తిరిగివస్తున్నప్పుడు, మేము బయలుదేరే వేళ అయింది. మమ్మల్ని పిలుచుకొని పోయిన గైడ్ "దీనికోసం నిర్ణయించిన సమయం ముగిసింది" అన్నారు కామరాజ్‌తో. అప్పుడు, మాకు ప్రదర్శనాన్ని వివరిస్తున్నమహిళ, "అయ్యో!" అన్నది తమిళంలో. ఈ తమిళ మాటను విన్నదే, కామరాజ్ ఆశ్చర్యపడ్డారు.

"మీకు ఈ మాట ఎలాతెలుసు?" అని అడిగారు. తను కొంతకాలం మద్రాసులో వున్నానని, ఈ మాటను తరచు విన్నానని, అదొక్కటే తన మనస్సులో మిగిలిపోయిందని, ఆ మహిళ సమాధానం చెప్పింది..


ఆ అపరాహ్ణం 2—0 గంటలకు మాస్కో నుంచి తూర్పు జర్మనీకి ప్రయాణమయ్యాము.

పది రోజులపాటు సోవియట్ దేశంలోవున్న మాకు, ఏదో మన స్వంత వూరు వదలిపోతున్నామనే ఆరాటం ఏర్పడింది. ఆ విధంగానే స్విరిదినోవ్ కూడా, కామరాజ్‌ను కౌగలించుకుని, "మరొకమారు మీరు ఈ దేశానికి దయచేసి, మరిన్ని ప్రాంతాలను చూడాలి" అని కోరారు.

(సశేషం)

—అనువాదం. తి. రా.

(ఆనందవికటన్ సౌజన్యంతో)



సుందర్రావుకి నిద్ర మెళకువ వచ్చేసరికి బాగా ప్రొద్దెక్కింది. కానీ ఎంత ప్రొద్దెక్కిందో మాత్రం అతను అంచనా వెయ్యలేకపోయాడు.

అర్ధరాత్రి నుంచీ కురుస్తున్న వాన, యింకా అలా కురుస్తూనే వుంది. ఆకాశమంతా మేఘావృత మవటం వల్ల, సూర్యభగవానుడు తెరవెనుకనే వుండి పోవాల్సి వచ్చింది.

సుందర్రావు చేతి గడియారం కూడ ఆగిపోయింది. కనుక ఎంత ప్రొద్దెక్కిందో అతడికి అంతుబట్టలేదు.

నిద్ర బద్ధకం పూర్తిగా వదలకపోవటంవల్ల, దిండు గుండెల క్రిందకు లాక్కుని, అరచేతిలో ముహాన్ని కూర్చోబెట్టి, కిటికీ చువ్వల గుండా, వీధి లోకి చూడసాగాడు.

కిటికీ కెదురుగా రెండు చింతచెట్లున్నాయి. తలమాసిన వాడి నెత్తిన కుంకుడు నీళ్ళు పడ్డట్లు, వాన చింతచెట్ల మీద పడసాగింది. వాటి మధ్యగల రెల్లు పాక మీది గుమ్మడి తీగె నగ్నంగా వానలో స్నానం చేస్తున్నది. పాకలో గవిడి గేదెలు, బురదలో రొచ్చులో పడుకోలేక రాట చుట్టూ తిరుగుతూ, తోకతో ఈగలను అదమాయిస్తున్నవి.

సుందర్రావుకి సిగరెట్టు కాలిస్తే బావుంటుం దనిపించింది. వెంటనే లేచి, రాత్రి సిగరెట్టు పెట్టె దాచిన జాగాలో వెతికాడు. ఒట్టి పెట్టె, నిండు అగ్గి పెట్టె దొరికాయి. సిగరెట్లు, 'కామేశ్వరి దాచి వుంటుంది' అన్న నిర్ణయాని కొచ్చి, ఏం చెయ్యాలీ అన్న జిజ్ఞాసలో పడ్డాడు.

అతగాడికి వాన కురుస్తుండంగా, వేడి వేడి పకోడీలు తినాలని, తర్వాత టీ పుచ్చుకుని, వెంటనే ఓ సిగరెట్టు ముట్టిస్తే సరదాగా వుంటుంది.

అతని కేం చెయ్యాలో తోచలేదు. ఇంట్లో ఎక్కడా అలికిడి లేదు. కామేశ్వరీ, ఆమెగారి తమ్ముళ్ళు చెల్లెళ్ళూ ఏమైనట్లు? అన్న అనుమానం వచ్చింది.

మంచం మీద నుంచి, లేచి, అద్దంలో ఓమారు ముహం చూచుకుని, జుత్తు సవరించుకుని, బద్ధకంగా వళ్ళు విరుచుకుని ఆపైన చేతి వ్రేళ్ళు విరుచుకుని, ఆవలించి చిటికె వేసి, వాకిలి తెరిచాడు.

వరండాలో ఓ బల్ల, నాలుగు కొయ్య కుర్చీలు, వరండా మెట్ల దగ్గర కాళ్ళు తుడుచుకునేందుకు వేసిన పాత గోనెసంచీ, గోడలన బూజుపట్టిన పాత ఫోటోలు తప్ప మరేం కనబడలేదు.

అక్కడే నలుదిక్కులా కళ్ళతో కామేశ్వరికై వెతుకుతూ నిలబడ్డాడు. పేరెట్టి కామేశ్వరిని పిలుద్దామన్న ఆలోచన వచ్చిందిగానీ,ఎవరైనా వింటే..క్రొత్త పెళ్ళికొడుకు అప్పుడే భార్యని పేరెట్టి పిలుస్తున్నాడు సుమా!.. అని విన్నవాళ్ళు కళ్ళు చికిలించి, ముక్కున వేలుంచుకోవచ్చు. పోనీ రాయబారం కరువుదామంటే బావమరుదులు ఎక్కడో అయుష్షు అజా లేరు.

ఏదో పని మీద వరండాలో కొచ్చిన శేషమ్మగారు, అల్లుడు ఇంటి దూలాలు లెక్కబెట్టటం గమనించి, "అమ్మాయి కావాలా నాయినా!" అని అడిగింది.

"ఓసారిలా రమ్మనండి" అని చటుక్కున గది లోకి దూకాడు సుందర్రావు.

కామేశ్వరి రాగానే సిగరెట్లు దాచినందుకు గట్టిగా కోప్పడాలని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నాడు సుందర్రావు.

కామేశ్వరి వస్తూనే "లేచారా నిద్ర! అయినా అదేం నిద్రండీ! ఇంతసేపా! త్వరలో ముహం కడుక్కోండి! టిఫిన్ చల్లారుతోంది." అని దండకం చదివేసింది.

సుందర్రావు మాట్లాడలేదు. అలా అని కోపం గాడు. నిశితంగా కామేశ్వరి కోలముహంలోకి చూస్తూ,"ముందర తలుపెయ్యి!" అన్నాడు మంద్ర ధ్వనిలో

"ఎందుకో?"

"వెయ్యి చెబుతాను."

"మీరు చెప్పేది నాకు తెలుసుగానీ..ముందు లేవండి బాబు! అమ్మ ఇప్పటికి నాలుగోసారి అడిగింది"

"ఏమని??"

"ఏమే మీ అయినింకా నిద్ర లేవలేదా? అని"

"వూ! నువ్వేం చెప్పావు?"

"వచ్చి చూస్తే స్వామివారు నిద్రలో ధ్యానమగ్నులై వున్నారు. అనవసరంగా నిద్ర పాడు చేయుటమెందుకని వచ్చినదాన్ని వచ్చినట్లు వెళ్ళాను."

"వూ! సరేగాని సిగరెట్లు తీసుకరా!"

"మహానుభావా! ఆ సిగరెట్లు నేనేం త్రాగను! భయపడకండి భద్రంగా వున్నాయి. ముందు ముహం కడిగి టిఫిన్, కాఫీలు పూర్తి చేస్తే, తిరిగ్గా కూర్చుని వాటి పని చూడచ్చు." కామేశ్వరి వెళ్ళిపోయింది.

కామేశ్వరి కీసారి మంచి గుణపాఠం నేర్పాలి అని నిశ్చయించుకున్నాడు.

సిగరెట్టు పొగ గట్టిగా పీల్చి ఆమె ముహం మీద వదలటం, లేదా ఈసారి గదిలోకి రాగానే గట్టిగా కౌగలించుకుని ఎముకలన్నీ పిండయ్యేలా నలిపి బుగ్గ మీద గట్టిగా.. కొరికెయ్యటంగానీ చెసెయ్యాలి.

"ఇదిగో బ్రష్ పేస్టు,నీళ్ళు వరండాలో పెట్టాను త్వరగా కానీయండి.నేనీ లోపల టిఫిన్ తీసుకొస్తాను" కామేశ్వరి గది బయట నుండే తాఖీదు అందజేసి వెళ్ళిపోయింది.

సుందర్రావు కిక్కురుమనకుండా, వెళ్ళి ముఖ ప్రక్షాళన గావించి, సినిమా తారలకు సౌందర్యానిచ్చే సబ్బుతో ముహం తోముకుని, టవల్‌తో ముహం తుడుచుకొని, అద్దంలో ముహం చూచుకుంటూ గదిలో కుర్చీలో చతికిలబడ్డాడు.

ఓ చేత్తో మరచెంబూ గ్లాసు, మరో చేత్తో ఉప్మా ప్లేటూ పట్టుకు, కామేశ్వరి గదిలో కొచ్చింది.

"అంతా!" అన్నాడు కామేశ్వరి చేతిలో ఉప్మా పరిమాణం చూసి.

"యిదేగా?..తినండి ఫర్వాలేదు!" ప్లేటు ముందుకు జరిపింది.

"నే తినలేను. సగం తీసెయ్యి!"

"పోనీ తిన్నంత తినండి!"

"మింగుతావా...."

"నే తింటాను."

"సరేరా! ఇద్దరం కలిసే తిందాం!" సుందర్రావు కామేశ్వరిని చెయ్యి పట్టుకు లాక్కున్నాడు వళ్ళోకి!

"అబ్బ వదలండి!"

"తినుమరి!"

"తింటా లే." విదలించుకుని, మంచం మీద కూర్చుంది కామేశ్వరి.

"పోనీ నే తినిపించనా!"

"ఏమీ వద్దు ఎవరన్నా చూస్తే బావుండదు!"

"చూడకపోతే బావుంటుందన్న మాటేగా!" చిన్నగా, నవ్వాడు ఓరగా చూస్తూ.

కామేశ్వరి చటుక్కున చూసింది భర్తను, కోపంగా.

"అబ్బ! యింత నెయ్యా వేసేది!"

"ఏం? బాగాలేదా!"

"తిని చూడరాదూ నీకే తెలుస్తుంది."

కామేశ్వరి మాట్లాడలేదు. కిటికీలోంచి, వీధిలోకి చూస్తూ, "అన్నట్లు మర్చేపోయినా! ఇవ్వాళ భోజనాలయ్యేసరికి చాలా ఆలస్యమౌతుందేమో! టిఫిన్ కాస్త బాగా తినండి!" అన్నది.

"ఏం?"

"కావమ్మగారు పోయారు!"

"ఎక్కడికో!"

కామేశ్వరి చిన్నగా నవ్వి, వచ్చే నవ్వుని మునివంటితో పెదిమను నొక్కిపట్టి, ఆపుకుని, "స్వర్గానికి" అన్నది.

"ఏం అంత తొందర! ఈ వానలో అంతదూరపు ప్రయాణం కష్టంగదా!"

"సర్లెండి! నేర్చారు మాటలు! చావుకు వానా వరద ఏముంది."

"ఓహో!"

"అమ్మాయి కాఫీ తీసుకెళ్లమ్మా!" శేషమ్మగారు వాకిటి ప్రక్కగా నిలబడి కేకేసింది.

'వచ్చే!' కామేశ్వరి లేచివెళ్ళి కాఫీ తెచ్చింది. ఈ లోపల సుందర్రావు ఉప్మాకి ఉత్తరాపోశన కానిచ్చేశాడు.

"అదేమిటి! సగం కూడ తినలేదేం!"

"కావమ్మగారి కంత కష్టం వచ్చే! యింకా నాకు టిఫినేం సయిస్తుంది."

"సర్లేండి. కొద్దిగా తినండి! భోజనాలు ఆలశ్యమవుతాయి."

"ఎందుకనో!"

"పీనుగ ఎత్తుకెళ్లేదాకా, పొయ్యి రాజెయ్యకూడదు."

"ఎందుకనో!"

"నాకు తెలియదు బాబూ!ముంది కాఫీ త్రాగండి! నే పోతాను."

"ఎక్కడికో!"

"స్వర్గానికి!" చిరుకోపంతోనే అన్నది కామేశ్వరి!

"వానగదా! పోనీ రేపెళ్ళు. నేనూ వచ్చి దిగబెడతాను!"

కామేశ్వరి పాల పొంగులాంటి కోపం చటుక్కున చల్లారింది! గలగలా నవ్వేసింది!

సుందర్రావు కాఫీ త్రాగటం మానేసి, మంచం క్రింద వెతకసాగాడు.

"ఏమిటీ వెతుకుతున్నావ్"

"రత్నాలు."

"రత్నాలా?"

"వూ! నువ్వు అలా అందంగా నవ్వితే, రత్నాలు రాలాయేమోనని..."

"పొండి! మీరు మరీను!" సిగ్గుపడింది కామేశ్వరి. చిరకొంగు నిండుగా కప్పుకుంది. "త్వరగా త్రాగండి" అన్నది కిటికీలోంచి, బయటకు చూస్తూ.

"అమ్మాయ్!" పురుషోత్తంగారు కేకేశారు వరండాలోంచి!

"ఏం నాన్నా!"

"కాసిని నీళ్లట్టుకు రామ్మా! కాళ్ళు కడుక్కోవాలి!"

సుందర్రావు సిగరెట్టు కాలుస్తూ, క్షణాలు లెక్కపెట్టుకోసాగాడు కామేశ్వరి రాక కోసం!

పురుషోత్తంగారు, కాళ్ళు కడుక్కుని, పైమీది బట్టతో కాళ్ళు తుడుచుకుని, సుందర్రావు దగ్గర కొచ్చి కూర్చున్నాడు.

"ప్రొద్దున్నే ఎక్కడికో వెళ్లారట్లే వుంది!" సుందర్రావే ముందర పలుకరించాడు మామగారిని.

"అవునోయ్! కావమ్మగారని, ఈ వీధి మొగదల, ఓ ముసలమ్మ వుంది. మనవాళ్లేలే. రెండురోజులు పట్టి జ్వరం వస్తున్నది. రాత్రి పదిగంటల నుంచీ స్పృహలేదు. ఈతెల్లవారు ఝామున 'హరి' అంది. తెల్లవారిగట్లే వెళ్ళి, వస్తున్నా."

"నాన్నా! స్నానం చేసి కాఫీ త్రాగుతావా!"

"తీసుకరామ్మా! యిప్పుడు స్నానం చేసినా మళ్లీ మయిల పడాలిగా! అంతా అయ్యాకా స్నానం చెయ్యొచ్చు." కామేశ్వరి వెళ్లిపోయింది.

"ఆమెకు కొడుకులూ వాళ్ళూ వున్నారా?"

"ఉహూ! లేరు! ఒకణ్ణి పెంచుకుంది."

"చిన్నపిల్లవాడా?"

"అబ్బే! పెళ్లదీ అయి ఇద్దరో ముగ్గురో పిల్లలు కూడ! గుంటూరులో పొగాకు వ్యాపారం చేస్తున్నాడు!"

"పోతే మరీ మె..."

"అదంతా ఓ కథలే!"

కామేశ్వరి కాఫీ తెచ్చింది. తాను త్రాగబోతూ "నువ్వు త్రాగావా!" అల్లుణ్ణి అడిగారు!

"ఆ! నువ్వొచ్చే ముందే!" కామేశ్వరి సమాధానం చెప్పింది మండిగం ఆనుకుని నిల్చుని.

"పిల్లలంతా ఏరి?" పురుషోత్తంగారు, కాఫీ కప్పు,కామేశ్వరి కందిస్తూ అడిగారు, ఇంట్లో సందడి లేకపోవటం గమనించి.

"కాసేపైంది, అలా వెళ్లారు ఆడుకోటానికి!" కామేశ్వరి వెళ్లిపోయింది.

పురుషోత్తంగారు చుట్ట ముట్టించి, "సమయానికి ఈవానొకటి దాపురించింది. కర్మకాండంతా పూర్తయ్యేసరికి ఈ వానలో ఏవరవుతుందో?" అన్నారు.

"మరి వానగదా దహనానికి వీలవుతుందా?"

"ఏమో! ఈ వానలో దహనం ఎలా చెయ్యటం? పైగా, గుంటూరు మనిషిని పంపాం ప్రాణంపోగానే! అక్కడ కబురంది, వాళ్ళు బయలుదేరి రావద్దూ! అప్పటి సంగతి!"

బయట వాన పెద్దదైంది. ధనధనామని చినుకులు, రాళ్ళ వర్షంలా పడసాగాయి! సముద్రపు హోరులా గాలి, వాన విసరసాగింది. దాకా మీది నుంచి, నీళ్ళు ధారగా, మెట్ల మీదపడి శత సహస్రాధికంగా, శకలికలుకాసాగాయి నీళ్ళు.

వాన తాకిడికి, చెట్ల మీద కాకులు ముడుచుకుపోయి, పెద్దగా అరువసాగాయి. గాలి విసురుకు చెట్లు తలలొంచి త్రాగిన వాడిలా వూగుతున్నాయి.

గేద ఒకటి, మేకుతో సహా లాక్కుని, వీధి వెంబడి పరుగెత్తసాగింది తోకెత్తుకుని, వానలో దిక్కుతోచక అరుస్తూ!

"ఈ వానలో, వాళ్ళు వస్తారంటారా?" సుందర్రావు ప్రశ్నించాడు.

"వానని రాకపోతే నలుగురూ నోట్లో ఉమ్మెయ్యరూ! ఆమె ఆస్తితోనే అతగాడు వ్యాపారం చేస్తున్నాడు!"

"పేరేమిటన్నారూ?"

"రాఘవరావు! రింగురోడ్డులో మేడా అదీ కట్టాడు. ఓ పెద్దకారు, జీపు వున్నాయి!"

"పోతే జీపులో రావచ్చనుకుంటా ను!"

"చెప్పలేము. రోడ్డు పూర్తిగా బాగులేదు. మెయిన్ రోడ్డు దిగాక చెరువుంది చూశావుగా, అక్కడ వానాకాలం బళ్లు రావటం కష్టం! జీపు గాబట్టి వస్తే రావచ్చు!"

"మరి ఆయనొచ్చేదాకా...."

"ఆగాలి తప్పదు! పైగా యింకో సంగతేమంటే కావమ్మగారు, తనభర్త తాలూకు వాళ్ళు, తల కొరివి పెడితేనే పుణ్యలోకాలకు పోవటం జరుగుతుందని రాఘవరావుని పెంచుకుంది."

"అలా అని శాస్త్రంలో వుందా?"

"ఉందని, ఆమె భర్త తాలూకు వాళ్ళు ఆమెకు మూరిపోశారు. ఉందో లేదో వివరంగా చూసిన వాళ్లెవరు? ఎవరికేం అవసరం? ఆస్తి, మరొకడు అనుభవించకుండా జాగ్రత్తపడ్డారు!"

క్షణం ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు. పొగతో ఆ గదంతా నిండిపోయింది.

వీధంతా నీళ్ళు పారసాగాయి. వాన కాస్త తగ్గింది. గాలింకా తీవ్రంగా వీస్తూనే వుంది. మధ్యమధ్య మెరువసాగింది. ఆకాశమంతా మేఘావృతమై, ప్రకృతి, తల ఆరబెట్టుకుంటున్న స్త్రీలా వుంది.

"గాలివానట్లే వుంది" పురుషోత్తం గారన్నారు చుట్ట వీధిలో కిసిరేసి!

"అలాగే వుంది!"

"దొరగారూ!" వీధిలోంచి, వెట్టి వీరాయి కేకేశాడు.

"ఏదోకబురొచ్చింది! వస్తామరి!" పురుషోత్తంగారు వరండాలో కెళ్లారు.

సుందర్రావు వెళ్ళాడు ఆయన వెంట.

వెట్టివాడు, తల తడవకుండా, గోనెసంచి కప్పుకుని, వరండా మెట్ల క్రింద, నన్నజాజి చెట్టు దగ్గర నిలబడ్డాడు.

"ఏరా?"

"కరణంగారు మిమ్మల్నోసారి రమ్మన్నారు"

"వస్తున్నా నువ్వు పదా గుంటూరు వెళ్లిన మనిషొచ్చాడా!"

"రాలేద్దొరా!" వెట్టివాడు వెళ్లిపోయాడు.

పురుషోత్తంగారు ఇంట్లోకెళ్లి గొడుగు తీసుకొచ్చి, "నువ్వూ పిల్లల తోటి అన్నం తినవోయ్!

పంచయనం అయ్యేసరికి ఆలస్యమవుతుంది!" అని చెప్పి, ఘోసతి పై కెగబట్టుకుని వెళ్లిపోయారు.

*

పిల్లలతోపాటు అన్నం తినటానికి సుందర్రావు ఇష్టపడలేదు. అదేదో నామర్దాగా తోచిందతనికి.

"మరి సాయంత్రందాకా వుంటారా?" కామేశ్వరి అడిగింది.

"మవ్వా?"

"నా సంగతి మీకెందుకు. వుంటే వుంటాను. లేదా నేనూ రెండు ముద్దలు తింటాను."

"నేనూ అంతే!"

"బావుంది. కొద్దిగా మజ్జిగ పోసుకు తినండి!"

"ఉహూ!..నా ప్రాణం ఎందుకు తీస్తావుగానీ, కాస్త కాఫీ కలుపుకు రారాదూ?"

"వెధవ కాఫీతో కడుపు నిండుతుందా ఏమన్నానా! కాస్త అన్నమే తినండీ!"

సుందర్రావు భార్యను అదోలా చూసి, "తిననని చెప్పాను గదూ ఇంతకుముందు!" అన్నాడు!

"సరే మీ ఇష్టం!" కామేశ్వరి గిరుక్కున తిరిగి వెళ్లిపోయింది.

సుందర్రావు నవ్వుకున్నాడు, భార్య ముఖంలోని విసుగు, కోపమూ చూసి.

చామనచాయగా వున్నా 'కావుడు' అందమైంది. చక్రాలంత కళ్ళూ, కోటేరులా వుండే ముక్కూ, దొండపండు లాంటి పెదవులు, కొండరాళ్లపై ప్రాకే నల్లత్రాచు లాంటి జడా, అందులో ముద్ద బంతిపూలు పెట్టుకుంటే.. సుందర్రావు తన్మయత్వంలో కళ్లముందు, లీలామాత్రంగా, భార్య రూపాన్ని చిత్రించుకోసాగాడు.

కామేశ్వరి కాఫీ తెచ్చింది. కాఫీ త్రాగుతూ, కామేశ్వరి కళ్లల్లోకి చూస్తుంటే, సుందర్రావుకు, కామేశ్వరిని ఉడికించాలనిపించింది.

"కావుడూ!"

"కావుడేమిటి? కావమ్మగారిలాగ! మీరలా పిలవకండి"

"ఏం పిలిస్తే?"

"నా కిష్టంలేదు! పోనీ నేను మీ కళ్లకు అంత ముసలిదానిలా కనబడుతున్నానా?"

"ముసలిదానివి కానా ఏమిటి? అప్పుడు అంతా కావమ్మనే అంటారు!"

"అదెప్పటి మాటో! అంత వయస్సు దాకా బ్రతికితే అలా పిలిచినా అభ్యంతరంలేదు!"

కాఫీ కప్పు కామేశ్వరికి అందించి, "ఒకవేళ కావమ్మ గారిలా నీకూ చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తిస్తే, అప్పుడూ కావమ్మ అవుతావు!"

కామేశ్వరి ముఖం ఒక్కసారి పాలిపోయింది. కళ్లల్లో ఓ విచిత్రమైన భయం, జుగుప్స, భీతి ఏర్పడ్డాయి!

"ఏమిటా పాడుమాటలు!" అన్నది బెరుగ్గా.

"నిజం కావుడు. నాకు పెళ్లయిన మరు సంవత్సరంలో మారకముంది." అన్నాడు సుందర్రావు కామేశ్వరి ముఖంలోని భావసంచలనాన్ని, గమనిస్తూనే, మనస్సులో నవ్వుకుంటూ!

కామేశ్వరి తరచితరచి భర్త ముఖంలోకి, చూసింది, అతని అంతరార్థమేమిటా? అని! అంతుబట్టలేదు.

"నీకు తెలియదూ కావుడు! నాకిన్నాళ్ల దాకా

మనిషి మనస్సు

పెళ్లెందుకు కాలేదో తెలుసా? ఇందువల్లనే! జాతకంలో కళ్లకు కట్టినట్లు కనుపిస్తున్నసత్యాన్ని ఎవరు కాదనగలరు. అందుకే ఎవరూ పిల్ల నిస్తానని రాలేదు! అందుకని మా వాళ్ళు, మీ వాళ్ల కళ్లు గప్పి, జాతకం మార్పించి, నాకు బ్రహ్మచర్యం వదిలించారు! నీ గొంతు కురితాడు బిగించారు!"

"అబద్ధం!" కామేశ్వరి, ఏడుస్తూనే అరిచింది!

"నీ ఇష్టం! ఎలాగైనా భావించుకో! కానీ ఉన్న విషయం చెబుతున్నాను. వళ్లో నిప్పు ఎంతో కాలం దాగదు గదా! అంతకుముందే చెబుతున్నాను. నీ అమాయకమైన అందమైన ముహం చూశాక, చెప్పకుండా వుండలేకపోతున్నాను! ఇంత అందమైన ముహానికి వైధవ్యం...."

"ఆపండి!.." ఏడుస్తూ కామేశ్వరి అక్కడనుంచి దెబ్బతిన్న హరిణంలా వెళ్లిపోయింది!

కామేశ్వరి, అలా ఏడుస్తూ వెళ్లాక, సుందర్రావు, పడీ పడీ నవ్వుకున్నాడు, ఆ విషయం పదేపదే తల్చుకుంటూ.

ఎంత నమ్మకం కలిగేలా చెప్పాను! కామేశ్వరి తన ముహంలోని సీరియస్‌నెస్, మాటల్లో ఏమాత్రం తడబాటు లేకపోవటం గమనించి, నిజమేనని నమ్మేసింది!

ఎంత పిచ్చిది!

ఆ వూపులో సిగరెట్ ముట్టించి, పొగతో రింగులు వదులుతూ, అవి క్రమంగా పల్చబడి గాలిలో కలిసిపోతుంటే చూస్తూ, ఆనందించాడు.

మళ్లీ వాన పెద్దదైంది! అర్ధరాత్రిప్పుడు, కంకరరోడ్డు మీద ఇనప బూట్ల పోలీసులు పరిగెత్తుతున్నట్లు, పది పెద్దలారీలు ఒక్కసారి బయలుదేరినట్లు మోతతో వాన కురుస్తోంది! ఉగ్రం వచ్చినవాడిలా, శివం వూనినట్లు, చెట్లుచేమలు గాలికి ఊగసాగాయి.

సుందర్రావు వాన జల్లు కిటికీలో గుండా లోపలికి రావటంలో, కిటికీ తలుపులు వేసి కూర్చున్నాడు.

కావమ్మగారు చాలా దురదృష్టవంతురాలు! అనుకున్నాడు.



లేకపోతే ఈ వానేమిటి? తల కొరివి పెడతాడని పెంచుకున్న కొడుకు దూరంగా వుండటమేమిటి? ఇదంతా దురదృష్టమే!

కొడుకు వచ్చాడో లేదో?

వచ్చినా ఈ వానలో, బురదలో, వరదలో శవాన్ని దహనం చేసేదెలా?

అలా అని ఎన్నిరోజులు శవాన్ని ఉంచటం సాధ్యమౌతుంది. ఈ మబ్బులు, ఉరుములు, మెరుపులు చూస్తుంటే వాన నాలుగురోజులన్నా తిష్టవేసేటట్లే వుంది!

మరి ఏం చేస్తారు?

సుందర్రావుకు ఆలోచనలు, కెరటాల్లా రాసాగాయి!

"కొంతసేపు ఈ వెధవ ఆలోచన మానేసి, కామేశ్వరితో కబుర్లు చెప్పుకుందామనిపించింది!

అంతలోనే, కామేశ్వరి ఏం చేస్తుందో చూడాలి! కానియ్! కాసేపు చూద్దాం! అనిపించింది.

*　　*　　*

కామేశ్వరి రెక్కతెగిన పక్షిలా వెళ్లి ఏ చీకటి గదిలోనే, మంచం మీద వాలిపోయి, కడుపులోంచి ఉప్పెనలా వచ్చే దుఃఖాన్ని అనుభవిస్తూ, తన అంధకార బంధురమైన భవిష్యత్తును తలపోస్తూ వుంటుంది!

కామేశ్వరి చాలా అమాయకురాలు! కాకపోతే తన మాటలు నిజంగా నమ్ముతుందా?

అలా ఆలోచిస్తు కూర్చున్నాడు సుందర్రావు ఏకాకిగా, గదిలో,

అభాగ్యుని కన్నీళ్లలా వాన కురుస్తూనే వుంది!

నిజంగానే తను ఏ అర్ధాంతరంగానో/మరణిస్తే?

అవును మరణిస్తే?

సుందర్రావు ప్రశ్నించుకున్నాడు!

కామేశ్వరి అమాయకురాలు! పుట్టిన ఊరు, పుట్టిన వూరు తప్ప మరో వూరు, బస్తీ తెలియవు. ఇంతవరకూ ఆకు చాటు పిందెలా, తల్లి చాటున పెరిగింది! అందుకే ఆ కళ్లల్లో అమాయికతే గాక స్వచ్ఛత, ముఖంలో తేజస్సు వున్నాయి. పట్నవాసపు అలంకారాలు, తళుకు బెళుకులు లేకుండా, అరణ్యంలో పుట్టిన బంతిపువ్వులా, నిండుగా అందంగా వుంది!

తనింతవరకూ, ఇంతటి సౌకుమార్యం గల అమ్మాయిని పట్నంలో చూడలేదు! తనకు తెలిసిన అమ్మాయిలంతా తెలివితేటలు, హొయలు, సోయగాలు, కలిగి, బ్రతుకులో తెగబడి ముందుకు తోసుకెళ్లి జీవితాన్ని అనుభవించగల సమర్థులు. వాళ్ల ప్రకృతిలో స్త్రీత్వం తక్కువ!

అందుకే, చదువు లేకపోయినా, చామనచాయగా వున్నా, నాగరికత తెలియకపోయినా, మారుమూలగా వున్న కుగ్రామంలోని, కామేశ్వరినే కావాలని చేసుకున్నాడు.

ఇంతవరకు, తన ఆలోచన, ఆశయాలు సవ్యంగా సాగుతూనే వున్నాయి!

మృత్యువు చెప్పిరాదు! తను చేసే ఉద్యోగం ఫ్యాక్టరీలో! తెల్లారి లేస్తే, యంత్రాలతో మాట్లాడి, కలసిమెలసి పని చేయాలి! ఎప్పుడు ఏక్షణంలో పరాకుగా వున్నప్పుడు, ఏ యంత్రమో, బెల్టో, కరెంటు తీగో, తనను కాటేయవచ్చు! లేదా, దారిలో ఏ బస్సో, బండో కుమ్మెయ్యవచ్చు! ఏమో చెప్పలేం!

నిజంగా అలా జరిగితే?

కామేశ్వరి?...గతేమిటి?

అరణ్యం లాంటి ఈ వర్షా రాత్రి పుట్టిన బంతిపూవు లాంటి కామేశ్వరి, కాలచక్రంలో బడి, వయస్సు, అందము కోల్పోయి, జీవితంలోని చేదు, చీకటి, అనుభవిస్తూ, కావమ్మ ఐ, ఏ వానలోనో, వరదలోనో, అర్ధరాత్రి దిక్కూ, మొక్కూ లేకుండా, అనంత విశ్వంలో కలిసి పోవాల్సిందేనా?

కావమ్మగారిలా, కామేశ్వరీ, చనిపోవాల్సిందేనా? ఎందుకో నమ్మ శక్యంగాలేదు సుందర్రావుకు! అలా అని నమ్మకుండా వుండలేకపోయాడు! ఏమో?

భవిష్యత్తు ఎవరికి తెలుసు?

ఏం కానున్నదో!

అలా ఆలోచిస్తూ కూర్చున్న సుందర్రావుకు, తన ఆలోచన, తనకే వెగటనిపించింది.

ఛ! ఏమిటీ వెధవాలోచన వూరికే వుండలేక మనసు పాడు చేసుకోవటం తప్ప ప్రయోజన మేముంది వెధవ ఆలోచనతో!

కామేశ్వరి ఎంత బాధపడుతున్నదో తన మాటలకు!

సుందర్రావు, లేచి వరండాలోకెళ్ళి, "కామేశ్వరీ" అని పిలిచాడు!

సమాధానం రాలేదు! మళ్ళీ పిలిచాడు.

ఆ పిలుపుకు, శేషమ్మగారు వచ్చింది.

"కామేశ్వరిని ఓ సారి రమ్మనండి!"

గదిలో కూర్చుని, కామేశ్వరి రాకకోసం ఎదురు చూస్తు కూర్చున్నాడు.

బయట వాన తగ్గింది. గాలింకా వీస్తూనే వుంది.

కామేశ్వరి, చక్కగా ముస్తాబైంది. ముహంలోని భీతి, భయమూ లేవు. కళ్ళకు కాటుక దిద్దుకుంది. తల దువ్వుకుని, జడలో సన్నజాజులు తురుముకుంది. వంగ పూవురంగు చోళీ వేసుకుని, గచ్చకాయ రంగు లేత చీర ధరించింది. మెళ్ళో నల్లపూసలు, నాలుగు పేటల బంగారు గొలుసు, ముక్కున ఎర్రరాయి పుడక, చెవులకు లోలకులు, కాళ్ళకు వెండి పట్టాలు మెట్టెలు ధరించింది.

ఆ రూపం చూసి, సుందర్రావు ముగ్ధుడయ్యాడు. సాక్షాత్తూ వనలక్ష్మి అని మురిసిపోయాడు.

లేచి, వెళ్ళి ఆమెను పొదివి కౌగలించుకుని, "అనవసరంగా నీతో అబద్ధాలు చెప్పాను కామేశ్వరీ! నిజంగా నువ్వేంత బాధపడ్డావో" అన్నాడు.

"మొదట నిజమే అనుకున్నా."

"నిజంగా?"

"వూఁ!"

"ఎందుకని?"

"నా పేరు కామేశ్వరి! పెద్దయితే కావమ్మనే అంటారు! పైగా, కావమ్మగారి భర్త పేరేమిటి తెలుసా?"

"ఏమిటి?"

"సుందర్రావే"

సుందర్రావుకు క్షణం గుండె ఝల్లుమంది!

"నిజంగానా!"

"ఆ! ఇవన్నీ ఆలోచించుకుంటే నిజమేననిపించింది! కానీ నిజమైనా, ఆమె లాగా, నాకూ కావాలనేముంది? ఏమంటారు!"

సుందర్రావుకు ఎందుకో నీరసం వచ్చింది! ఏం మాట్లాడలేదు! మంచం మీద పడుకొని శూన్యంలోకి చూస్తూ, ఏమిటో ఆలోచించసాగాడు! ●



అంతస్థులు అభిమానాలు

ఉమన విజయలక్ష్మి

జ రి గి న క థ

స్కూలు ఫైనలు పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా వచ్చిన సారథి, పరీక్ష రాస్తున్న ఇందిరను ఆకర్షించాడు. ఫలితంగా వాళ్లిద్దరికీ పెళ్లయింది కొద్ది కాలంలోనే మగపిల్లాడు జన్మించాడు. ఇందిర ప్రయివేటుగా చదివి బియ్యే పాసయింది. ఇంకా పైకి చదివేందుకు సారథి ప్రోత్సహించాడు. మరో అమ్మాయి కూడా కల్గింది. సారథి తలనొప్పి జ్వరంగా మారి అతన్ని హతం చేసింది భవిష్యత్తు ఆలోచించుకున్న ఇందిర ఉద్యోగం చేయడానికి నిశ్చయించుకుంది ఒక గరల్స్‌స్కూల్లో టీచరుగా చేరింది.

6

"ఒరేయ్ నువ్వక్కడ మామిడి పళ్ళు బాగా తిన్నావురా?" గోపీ అడుగుతున్నాడు గిరిని

"ఓ. తాతగారు రెండు పెర్కు తెచ్చారు సంతలో." గిరి హుషారుగా సమాధానం చెప్పాడు

"ఇంతేనా?" ఈసడించాడు గోపి.

"మేం అక్కడ రోజూ కడుపు నిండా మామిడి పళ్లే తినేవాళ్లం. ముంజికాయలకి లెక్కేలేదనుకో."

"మా నాన్నగారు కొబ్బరి బొండాలు కూడ కొట్టిస్తుండేవారు." గోపి చెప్తున్నదానికి కృష్ణుడు మెరుగులు దిద్దాడు.

నిక్కరు జేబులలో రెండు చేతులు పెట్టుకుని, ఏం మాట్లాడాలో తెలియక బిక్కమొహం వేసుకుని వింటున్నాడు గిరి.

"తిండుపుగాని లేరా, నాలుగురోజులలో పెద్ద బుట్ట వస్తుంది. బోలెడు పళ్ళు." అన్నాడు గోపి.

"అవును. మొన్నే కోయించి కావేశారు. కాస్త పండగానే పంపిస్తారు" అంది సావిత్రి.

అన్నట్టుగానే పళ్ళ బుట్ట వచ్చింది. పిల్లలంతా రాసిచుట్టూ మూగారు. బుట్ట విప్పటం అయీ కాక ముందే నేను అంటే నేను అనుకుంటూ తలో చెయ్యి వేసి పళ్ళు తీసుకున్నారు. ఆ తీసుకోటంలో గిరి చేతికి బాగా పెద్దపండు వచ్చింది. దానికోసం కృష్ణుడు పేచీ మొదలు పెట్టాడు.

"నేనివ్వను ఫో." అన్నాడు గిరి చేయి విసిరేస్తూ.

"ఏమిట్రోయ్ ఆ దౌర్జన్యం. ఈ పళ్ళు వాడి తాతగారి తోటలోవి—వాడు దయదలచి ఇస్తే తీసుకోవలసిన వాళ్లం మనం అంతా. తెలిసిందా." గోపీ మాటలు విన్న గిరి మరి వెనకాముందూ చూడకుండా.

"కాదు మా తాతగారి తోటలోవే." అనేశాడు గబుక్కున.

"ఏడిశావు. నీకు తాత లేడు. మామిడి తోట లేదు. ఈడుకిమించిన కబుర్లు మాత్రం వున్నాయి." బుట్ట సర్దుతున్న చంద్రం అన్నాడు. తల తిప్పి చూసిన గిరికి అతని మొహంలో ఏ భావం కనిపించిందో కాని పండు విసిరేసి తల్లి దగ్గరికి వెళ్లిపోయాడు. తర వాత ఎవరు బ్రతిమిలాడినా తీసుకోలేదు.

"పోన్లే అమ్మా. వాడికేం తోటలూ దొడ్లూ వున్నాయి కనకనా పళ్లు ఫలాలు అనుభవించడానికి." అనేసింది ఇందిర.

"సరేలే. వాడేదో సరదాకి అన్నదానికే మనస్సు ఇంత కష్టపెట్టుకోవాలా?" అంది కామేశ్వరమ్మగారు తెల్లబోతూ.

మధ్యాహ్నం పద్మని నిద్ర పుచ్చుతూ గదిలో పడుకుంది ఇందిర. హాలులో చాలమంది ఆడవాళ్లు కూడి కబుర్లు చెప్పుకుంటున్నట్లుగా గొడవ వినిపిస్తోంది." ఇంట్లో వాళ్లే కాకుండా ప్రక్కింటి సుగుణమ్మగారు అనసూయమ్మగారు కూడ వచ్చినట్లున్నారు. అంతా నవ్వుతూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అంత మందిలోకి వెళ్లడం అంటేనే ఓ విధమైన బెదురుగా వుంటోంది ఇందిరకి. తను కూడ అక్కడ వుంటే మిగతా వాళ్లంతా హాయిగా నవ్వుకోలేక ఏడుపు మొహాలు పెట్టుకుని కూర్చోవాలి అనుకుంటారేమోనని భయం.

"అత్తయ్యా, పాప ఏడుస్తోంది." గిరి గొంతు వాళ్ల మాటల కంతరాయం కలిగిస్తూ పలికింది.

"ఏం. ఎందుకు? పిలవొద్దా కొట్టారా?" అంది రుక్మిణి.

"ఊహు లేదు. మేమంతా బోర్డు ఆడుకుంటూంటే తనూ వచ్చింది—వచ్చి బిళ్లలన్నీ కలిపేసింది—వెళ్లిపొమ్మని గోపి మామయ్య కేక వేశాడు" అన్నాడు గిరి అత్తయ్య ఏమంటుందోనని భయపడుతున్నట్లు.

"కేకలెయ్యవద్దని చెప్పు గోపీకి. అందరూ కలిసి సరదాగా ఆడుకోండి. రేపు మేం ఎలాగా వూరెళ్లిపోతాం కదూ, ఈ ఒక్కరోజుకి పాపని కూడ మీతో ఆడనివ్వండి మరి." అంది రుక్మిణి.

"వూ" అని వెళ్లిపోయాడు గిరి.

"అబ్బో" అల్లుడి కిప్పటినించే అత్త మాటలలో ఎంచి గురి వున్నట్టుందే—రుక్మిణమ్మగారు హాయిగా కానీ కట్నం ఇవ్వక్కర్లేకుండా కూతురి పెళ్లి చేసేస్తారు." అంది సుగుణమ్మగారు నవ్వుతూ.

"ఆ. ఇవ్వక ఇవ్వక ఈ అల్లుడికే ఇవ్వాలి పిల్లని. అయినా మా అమ్మాయికి మొగుడు కుదిరేవున్నాడు." అంది రుక్మిణి.

"అల్లుడు కుదిరిపోయాడు. ఎవరేమిటి?" కుతూహలంగా అడిగింది సుగుణమ్మగారు.

"బంగారంలాంటి మేనరికం వుండగా ఎవరో ఎందుకవుతారు—మా సావిత్రి వదిన కొడుకే—ఇదుగో వదినా మేం కానీ కట్నం ఇవ్వంకాని, మా అమ్మాయికి మాత్రం నీలాగే వంటెడు బంగారం పెట్టాలి." అంది రుక్మిణి.

"అబ్బో కోడలు గడుసుదే." అన్న సుగుణమ్మగారి మాటలకి,

"గడుసుదనం అంతా కోడళ్లదే. ఈ వెర్రిబాగులు అత్తలు గారికే చెడ్డపేరు తెచ్చుకుంటారు." అంది కామేశ్వరమ్మగారు.

"అందుకే మా అమ్మ చక్కగా, ఇంత మంచి అత్తగారు లేదు. కోడళ్ని కూడ కూతుళ్లల్లాగే చూసుకుంటుంది అన్న పేరు తెచ్చుకుంది." అంది సావిత్రి నవ్వుతూ.

"రేపు నువ్వూ అంతే చెయ్యాలి మరి—అయినా నాకు తెలియక అడుగుతాను రుక్మిణీ? నీ కూతుర్ని ఇవ్వకపోయినంతమాత్రాన గిరి బాబుకి పెళ్లి కాదనుకున్నావా? వాడికేం లక్షణంగా దొరబాబులాగుంటాడు." అంది కామేశ్వరమ్మగారు.

"బాగుంది. ఎందుకు దొరకదు—నేను మాత్రం అష్టైశ్వర్యాలతో తులతూగుతున్న సంబంధం వదులుకుని అలాంటి సంబంధం చెయ్యను." రుక్మిణి సమాధానం చెప్పింది.

"పోనీ ఈసారి ఇంకో అమ్మాయి పుడితే చిన్న మేనల్లుడి కిద్దురుగాని.." సుగుణమ్మగారి మాటలని మధ్యలోనే అందుకుని, "ఇంకో అమ్మాయి పుడితే మా బాబాయి కొడుక్కి యిస్తాను. పిల్లాడు చక్కగా వుంటాడు. వాడి కివ్వడానికయినా ఈసారి కూడ అమ్మాయే పుడితే బాగుండునని వుంది." అంటున్న రుక్మిణి మాటలకి అందరూ నవ్వేశారు.

"సరేలే—అమ్మాయి వింటే బాధపడుతుంది అసలది ఎక్కడుంది. ఈ గదిలోలేదు కదా." అంది కామేశ్వరమ్మగారు అప్పుడే ఆ సంగతి గుర్తు వచ్చినట్లు.

"ఇంతకీ దాని రాత అలా వుండటం వల్లే వెరు

ఒక్కంటూ వచ్చినట్లే వచ్చింది సంబంధం. ఆస్తి లేకపోయినా పిల్లవాడు బుద్ధిమంతుడు, ఏదో సంపాదించుకుంటున్నాడు కదా అనుకున్నాం కాని, ఇలా జరుగుతుందనీ వీళ్లంతా నిరాధారంగా అయిపోతారనీ ఎప్పుడూ వూహించుకోనయినా లేదు." అంది మళ్లీ ఆవిడే గద్గదికంగా.

కాస్సేపు నిశ్శబ్దం అల్లుకుపోయింది అక్కడ. తరువాత మళ్లీ సాగిన సంభాషణ అంతా సావిత్రి సిరిసంపదలని గురించే—

కొడుకు పెళ్లిని గురించిన ఆలోచనకాని బెంగ కాని ఇప్పటినుంచి ఇందిరకి లేకపోయినా, ఆ సంభాషణలోని ప్రతి అక్షరం ఆమె హృదయంలో ముల్లులా గుచ్చుకుని బాధించసాగాయి. తల్లితండ్రులకి కూడ అదృష్టంతో తులతూగుతున్న సంతానం అంటేనే అభిమానం ఎక్కువగా వుంటుంది కాబోలు అని మరోసారి అనుకోక తప్పలేదు.

సాయంత్రం పిల్లలందరూ స్నానాలు చేస్తాం అంటూ తువ్వాళ్లు తీసుకుని బయలుదేరారు. నేను ముందంటే నేను ముందని బాత్‌రూమ్ దగ్గర మరో తగూ అయింది. చివరికి గిరి గబుక్కున లోపలికి వెళ్లి తలుపు గడియ పెట్టేసుకున్నాడు. ఒళ్లు మండిపోతున్న కృష్ణుడు చేతులు నెప్పి పెట్టిందాక తలుపు కొట్టి, అక్కడే కూర్చున్నాడు గునుస్తూ ఎంతమంది పిలిచినా లోపలికి రాకుండా. కాస్సేపటి తరువాత విజయగర్వంతో తలుపు తీసుకు వస్తున్న గిరి వంటి నిండా ఇంత మన్ను పోశాడు ఉక్రోషంతో దాంతో మళ్లీ ఇద్దరూ కలియబడ్డారు. ఆ గొడవ విని సూర్యం వచ్చి విషయం తెలుసుకుని గిరిని రెండు వేసి ఇవతలకి లాగి, "నువ్వు ఎప్పుడూ ఇక్కడ వుండేవాడివి ఏమిటి. వాడు నాలుగు రోజులుండి వెళ్లిపోతాడు సరదా పడి ముందు వెడతానంటే వూరుకోక నువ్వు దూరి కూర్చుంటావా?" అంటూ కేక వేశాడు గిరి గుడ్ల నీరు కుక్కుకుంటూ నిలబడిపోయాడు

"ఎప్పుడూ ఇక్కడ వుండేవాడివి." అన్న ఒక్క మాట వేయి శూలాలలా గుండెని తూట్లు పొడుస్తూంటే, ఏమీ చేయలేకపోయిన నిస్సహాయతతో కూడిన బాధని, కోపాన్ని అణుచుకోలేక, "స్నానం చేసి వచ్చిన వాడి వంటి నిండా మన్ను పోసిన వాడు బాగానే వున్నాడు. లోకువగా వున్నాడని వీడ్ని కొట్టావు." అనేసింది ఇందిర చటుక్కున.

సావిత్రి కామేశ్వరమ్మగారు మొహాలు చూసుకున్నారు.

"అంత పౌరుషం వున్నదానివి కొడుకుని అదుపులో పెట్టుకోలేకపోయావ్?" అనేసి వెళ్లిపోయాడు సూర్యం.

ఇందిర మౌనంగా కొడుకుని తీసుకుపోయి నూతి దగ్గర నాలుగు చేదలు తోడిపోసి లోపలికి తీసుకు వెళ్లిపోయింది.

రెండురోజుల దాకా పెద్దవాళ్లంతా మొహాలు ముడుచుకుని ముభావంగా వుంటూ వచ్చారుకాని కృష్ణుడు గిరి మర్నాటికే స్నేహితులయిపోయారు.

కొద్దిరోజులు మళ్లీ ప్రశాంతంగా గడిచాయి. ఓ సాయంత్రం చంద్రం బజారుకి వెళ్తూంటే మళ్లీ పిల్లలిద్దరూ తయారయారు సైకిలు మీద తీసుకు వెళ్లమని. అప్పటికి కృష్ణుడి ముస్తాబు పూర్తయిపోయింది. గిరి షర్టు వెతుక్కోడంలోనే వున్నాడు.

"నువ్వు బట్టలు వేసుకుని సిద్ధంగా వుండు. మళ్లీ వచ్చి తీసుకువెడతాను." అని కృష్ణుడిని ఎక్కించుకుని వెళ్లిపోయాడు చంద్రం.

గిరి తల్లి నడిగి ఇస్త్రీ చొక్కా తొడిగించుకుని తల దువ్వుకుని తయారయి వీధి అరుగు మీదే నిలబడ్డాడు మామయ్య కోసం. చాలాసేపటి తరువాత తిరిగివచ్చిన చంద్రం కృష్ణుడిని దింపేసి సైకిలు లోపలికి తెచ్చేస్తూంటే,

"మామయ్యా, నన్ను తీసుకువెడతానన్నావుగా." అని జ్ఞాపకం చేశాడు గిరి.

"ఏమిట్రా, ప్రాణాలు తీస్తున్నావ్. ప్రతిదానికీ వాడితో పంతమేమిటి. వాడు నాలుగురోజులుండి వెళ్లిపోతాడు, నువ్వు ఎప్పుడూ వుండేవాడివేగా." అంటూ సైకిలు తెచ్చి లోపల పెట్టేశాడు.

"నీపని అయిందిలే" అన్నట్లు చప్పట్లు కొడుతూ నవ్వేశాడు కృష్ణుడు. గిరికి దుఃఖం ముంచుకు వచ్చింది. పరుగు పరుగున వెళ్లి, ఎదురుగా కనిపించిన తల్లి రెండు కాళ్లకీ చుట్టేసుకుని చీరకుచ్చెళ్లలో తల దాచుకుని ఏదో చెప్పబోయి బావురుమన్నాడు. ఇందిర వంగి కళ్లు తుడిచి మెల్లిగా బుజ్జగించి అసలు విష



"అబ్బా, ఇప్పుడు ఆలస్యం అయిపోయిందిరా." అన్నాడు చంద్రం.

"నన్ను రెడీగా వుండమన్నావు కదా. పెట్లో చొక్కా తీసుకు తొడుక్కున్నాను." అన్నాడు గిరి జాలిగా మామయ్య కళ్లల్లోకి చూస్తూ.

కాని ఆ మామయ్య కరగలేదు. "ఏడిశావులే. పెట్లో చొక్కా తొడుక్కున్నాడుట, డబ్బు చిరుగులా అదీను. మా కృష్ణుణ్ణి చూడు చక్కగా సిల్కు బుష్‌కోట్ తొడుక్కున్నాడు." అన్నాడు.

"పోన్లే. చీకటయిపోయిందిగా, చిరిగిపోతేనేం తీసుకువెళ్లు." ఇంకా బతిమాలుకున్నాడు గిరి.

యం రాబట్టింది. వాడు మరిచిపోకుండా కృష్ణుడు కూడ సాయం చేశాడు.

"పోన్లే వెధవ సైకిలు. పెద్దయాక కారే కొనుక్కుందువుగాని హాయిగా." అంటూ వాడిని గదిలోకి తీసుకువెళ్లిపోయింది.

"పెద్ద కారేనా. నిజంగా కొనిస్తావా, అది నేను తొక్కగలనా, మరి ఎప్పుడు కొంటావ్." అంటూ వాడికి కలిగిన అనుమానాలన్నీ తీర్చుకుంటున్నాడు గిరి. దుఃఖం ఒప్పుకుంటూ ఎలాగో వాడి ప్రశ్నలకి మధ్యమధ్య సమాధానాలు ఇస్తూందేకాని ఇందిర

మనస్సు అవమానంతో పరితాపంతో మెలిదిరిగి పోతోంది

"ఎప్పుడూ ఇక్కడే వుండేవాడివి, ఎప్పుడూ ఇక్కడే వుండేవాడివి—"మేం ఆ విషయం మరిచి పోతామనా అయినప్పుడూ కానప్పుడూ వీళ్ళు దాన్ని యిలా గుర్తు చేస్తుంటారు. నేను కష్టపడి సంపాదించినదంతా చేతిలో పోస్తుంటేనే ఇంత లోకువగా వున్నామే, మరీ బొత్తిగా నిరాధారంగా వుంటే ఇంకెంత లోకువగా చూసేవారో..." లోలోపలే కుమిలి పోతూ పడుకున్న ఇందిర, కొడుకు నిద్రపోతున్నాడని గ్రహించి, కళ్ళు తుడుచుకుని వాడిని లేపి తీసుకు వెళ్ళి అన్నం పెట్టింది. వాడు నిద్ర మత్తులో కళ్ళు మూసుకునే కూర్చున్నాడు. గబగబా అన్నం కలిపి తినిపిస్తున్న ఇందిర కళ్ళు వాడి బుజం మీది చిరుగ మీద పడ్డాయి. "కృష్ణుడిది సిల్కు చొక్కాట, నా చొక్కా నిండా డబ్బై చిరుగులున్నాయట.' వెక్కిళ్ళు పెడుతూ గిరి కాస్సేపటి క్రితం చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి. చమరుస్తున్న కళ్ళని పటుక్కున ఎవరూ చూడకుండా అద్దేసుకుంది. అప్పటికే కనిపెట్టిన తల్లి "అలా వున్నావేం." అంది కూతురు మొహంలోకి చూస్తూ.

"బాగానే వున్నానే." పొడిగా సమాధానం చెప్పి గిన్ని లేవదీసి చెయ్యి కడిగింది

రోజులు గడుస్తున్నా ఇందిర మనస్సు మాత్రం కుదుటబడలేదు. సావిత్రి మరో నాలుగునెలలు అక్కడే వుండిపోవటంతో రోజూ పిల్లలు ఎందుకో అందుకు పోట్లాడుకోడం, ప్రతిసారి పెద్దవాళ్ళు గిరిని లోకువ చేసి కృష్ణుడిని గొప్పగా చూస్తున్నట్టు తనకి అనిపించటం, అంతే కాకుండా ప్రతి విషయంలో సావిత్రి అదృష్టాన్ని పొగడుతూ తన దురదృష్టాన్ని వెక్కిరిస్తున్నట్టుగా అనిపించటం ఇవన్నీ ఇందిర మనస్సు మరీ కృంగదీసేశాయి. అయితే ఈ మార్పు నిజంగా ఇంట్లోవాళ్ళ ప్రవర్తనలో వచ్చిందా లేక తనే అలా భ్రమపడుతోందా అనే అనుమానం కూడ ఒక్కోసారి వచ్చేది. "నా మొహం, భ్రమ ఏమిటీ, ప్రతి విషయంలో ఇంత స్పష్టంగా కనిపిస్తుంటే ఏమయినా నేనింకీ అవమానం భరించలేను ఈవూరు విడిచి వెళ్ళిపోతేనేకాని నా మనస్సుకి శాంతి వుండదు. కాని ఎలా? ఎక్కడికి వెళ్ళటం? పుట్టి పెరిగిన

అంతస్తులు - అభిమానాలు

వూళ్ళో ఈమాత్రం వుద్యోగం దొరకడమే గగనమయి పోయిందే, మరో దగ్గర నాకు ఎవరు సహాయం చేస్తారు? చేతిలో డిగ్రీ వుందని ధైర్యం చెప్పుకున్నానేకాని దానివల్ల నేను సాధించేదేమీ కనిపించటం లేదు—ఏవేవో చెయ్యాలని పిల్లలని పెద్దచదువులు చదివించాలని ఎన్నో అనుకున్నాను. అందులో ఒక్కటయినా చెయ్యగలనా—ఆలోచిస్తున్న కొద్దీ పరిస్థితులు మరీ భయంకరంగా భవిష్యత్తు అంధకారంగా మారిపోతుంది. దాని నుంచి తప్పించుకునే మార్గం కనిపించటంలేదు—వచ్చి ఇంకా రెండేళ్ళయినా కాకుండానే ఇంత లోకువయిపోయి ఇన్ని అవమానాలు సహించాల్సి వస్తోందే, ఎప్పుడో గిరి పెద్దవాడయ్యేదాకా ఇక్కడే ఎలా గడపటం ..?" రాత్రింబగళ్ళు ఒకే ఆలోచన, ఒకటే ఆవేదన.

అలాంటి స్థితిలో ఓ రోజు స్కూలు నుంచి వచ్చేసరికి, "ఎవరో స్వర్ణటమ్మా, నీకు వుత్తరం వ్రాసింది, మంచం మీద పెట్టాను." అంది కామేశ్వరమ్మగారు.

పోయినప్రాణం లేచి వచ్చినట్లయింది ఇందిరకి ఆ పేరు వినగానే. నా ఉత్తరం చదవాల్సిన అవసరం వీళ్ళకే మొచ్చింది అని చికాకు అనిపించినా ఏమీ అనకుండా గబగబా వుత్తరం చేతిలోకి తీసుకుంది.

నాలుగురోజుల క్రిందటే తను పుట్టింటికి వచ్చాననీ, రాగానే మాస్టారి సంగతి తెలిసిందనీ, జరిగిన దానికి తనెంతో బాధపడుతున్నానని వ్రాస్తూ ఇందిరకి పిల్లలకి తన హృదయపూర్వకమైన సానుభూతి తెలియజేసింది.

"నాకు మీ ఎడ్రసు సరిగ్గా తెలయదు. మీనాన్నగారి పేరు గుర్తు వుండటం వల్ల ఏదో రాస్తున్నాన. అందుతుందో లేదో. ఇది అందితేనాకు జవాబు వ్రాయగలిగితే చాల సంతోషిస్తాను. నేను వారంరోజులలో తిరిగి వెళ్ళిపోతాను. అందుకే మీకు హైదరాబాదు ఎడ్రసే ఇస్తున్నాను." అంటూ ముగించింది.

అది చూడగానే, చాలకాలంగా స్వర్ణ మామగారు హైదరాబాదులోనే వుంటున్నారనీ, అక్కడి ధనవంతులలో ఒకడిగా పేరుపొంది చాల పలుకుబడి కలిగి వున్నారనే సంగతి గుర్తు వచ్చి, కొండంత ధైర్యం, అపరిమితమైన సంతోషం కలిగాయి ఇందిరకి. దానికి జవాబు వ్రాస్తూ, మిగతా విషయాలతోపాటు,

"నేను సంవత్సరం పైగా ఇక్కడ స్కూల్లో పని చేస్తున్నాను. ఇక్కడి టీచర్ల స్కేల్సు అసలే తక్కువ, నాకు వస్తున్నది మరీ తక్కువ. ఏదైనా ఇంత కన్న మంచి ఉద్యోగం దొరికితే ఇది మానేయాలనుకుంటున్నాను. హైదరాబాదులో టీచర్ల జీతాలు బాగుంటాయని విన్నాను. మీ మామగారి పలుకుబడి ఉపయోగించి ఏదైనా మంచి వుద్యోగం, వీలయితే టీచర్ పోస్టు ఇప్పించగలిగితే నేను చాల సంతోషిస్తాను." అని వ్రాసింది. దానికి స్వర్ణ దగ్గర నుంచి వెంటనే జవాబు వచ్చింది. తప్పకుండా వుద్యోగం కోసం ప్రయత్నిస్తానని వ్రాసింది. అది ఏదో మాట వరసకి, ఇందిర కన్నీళ్ళు తుడవటానికి వ్రాసింది కాదు కొద్ది నెలలలోనే స్వర్ణ అన్నంత పనీ సాధించింది.

"అసలు ఉద్యోగం వద్దంటే విన్నావుకాదు. పోనీ ఏదో కాలక్షేపానికి చేస్తున్నావని వూరుకున్నాము. అది లేకపోతే గడవదన్నట్లు, మొగదిక్కయినా లేకుండా ఒక్కదానివీ దేశం కానిదేశం పోతానంటావేమిటి?" అంటూ కామేశ్వరమ్మగారు అభ్యంతరం పెట్టింది విషయం వినగానే.

"నాకూ బొత్తిగా ఇష్టంలేదు. ఇక నువ్వు కాదూ కూడదు వెడతానంటే నేనేమీ చెప్పలేను. ఒక్కదానివీ వుండడం చాల కష్టం. నువ్వే ఆలోచించుకోమరి." అని ఆ బాధ్యత కూడ కూతురి మీదే వదిలేశారు వైకుంఠంగారు.

"మరేం భయంలేదు.అదేం దేశంకాని దేశంకాదు. మనవాళ్ళు చాలామంది ఇప్పుడక్కడ వున్నారు. మా హెడ్ మిస్ట్రెస్ చెల్లెలు వాళ్ళు అక్కడే వున్నారుట. చాలా బాగుంటుందని చెప్పింది— ఆవిడ ఎడ్రసు కూడ తీసుకుంటాను. అసలు ఏ సహాయం కావలసి వచ్చినా చెయ్యటానికి ఆ స్వర్ణ చాలు. ఆ అమ్మాయి సంగతి మీకు తెలియదుకాని—కాస్త పరిచయం అయితే చాలు వదలదు. మరొకరయితే యింత శ్రద్ధ తీసుకుని, మామగారితో చెప్పి నా ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తారా..."

"సరే అన్నీ బాగనే వున్నాయి. పిల్లల్ని ఎలా చూసుకుంటావు. ఇక్కడ యింతమంది వున్నాం కనక ఏదో జరిగిపోతోంది. నువ్వెప్పుడో పొద్దున్న వెళ్ళి సాయంకాలం యింటికి వస్తే ఈలోగా వీళ్ల బాధ్యత ఎవరికి అప్పగిస్తావు—పిల్లలికి ఇక్కడ చదువు అయిపోయిందాకా నయినా ఇక్కడే వుంటావనుకున్నాను. తరువాత ఎలాగూ వాడిని కాలేజీకి పంపేటప్పుడు నువ్వూ ఆ వూళ్ళోనే చూసుకుంటే బాగుంటుంది—అనవసరంగా చిన్నపిల్లలతో ఇబ్బంది పడిపోతావు, ఆలోచించు."


"బాగుందమ్మా. సరిగ్గా మనం కావాలనుకున్నప్పుడు, కావాలనుకున్న దగ్గర అవకాశం వస్తుందా—నాకేం భయంలేదు. ఆలోచిస్తుంటే అన్నీ సమస్యలుగానే కనిపిస్తాయి. గిరిని ఎలాగూ స్కూల్లో జేర్పించేస్తాను కదా. ఇంక పద్మని చూడటానికి కొవ్వాళ్ళపాటు ఎవరినైనా పెడతాను మరి—మీకు అభ్యంతరం లేకపోతే లీలని కూడ నాతో పంపించండి. కాస్త నాకు సాయంగానూ వుంటుంది. నాకు తీరుబడిగా వున్నప్పుడు దానికీ ఏదైనా చెప్తుంటాను, ఇక్కడి చదువయిపోయిందిగా ఇంక." అంది ఇందిర.

(సశేషం)



వైజ్ఞానిక గాథావళి – 87


— డ్రాఫ్టర్...



ఆకాశ ఈలలు

ఈలవెయ్యడాన్ని క్రీ. పూ. 150 ప్రాంతపు బార్హుత్ శిల్పి చెక్కాడు ఒక బౌద్ధ చైత్యాలయము పక్కన. ఉత్సాహంతో ఈలలు వెయ్యడం నాటికే వాడుక అన్నమాట. రేడియో సెట్లులో వినపడే ఈ ఆకాశయీలలు మాత్రం ఉత్సాహ సూచనలేమీకావు. ఇవి ప్రారంభించడము కీచుగా ప్రారంభించినా త్వరగానే స్థాయి తగ్గిపోతాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలం (1914–18)లో హెచ్. బార్కాజెన్ అనే జర్మన్ సోల్జరు సిగ్నల్ మండలివారి టెలిఫోను వార్తల్ని రహస్యంగ గ్రహించే యత్నముమీద ఉండినాడు. యుద్ధభూమిలో టెలిఫోను వార్తలనంపినప్పుడు కొంత విద్యుత్ప్రవాహము నేలద్వారా సాగుతుంది. ఈ విద్యుత్ప్రవాహాన్ని పట్టి అతడు దానిని ఆంప్లిఫయ్యరుద్వారా పెంచి వినాలని యత్నించాడు. ఆ యత్నంలో విన్నాడు పక్షి యీలలవంటిశబ్దాల్ని. తన సాధనాలలో ఏదో రిపేరుకి రావడమువల్ల యీ అదనపు వ్యర్థ శబ్దాలు వస్తూండవచ్చునని ముందు అనుకున్నాడుకాని, తరువాత కొంత పరిశోధనతో ఆ శబ్దాల్ని టెలిఫోను రిసీవరులో కలిగించే అయానుల ప్రవాహాలు భూమినిచుట్టివున్న వాతావరణం నుంచే వస్తూండాలి అని కనుక్కొని వైజ్ఞానిక లోకానికి తెలియడానికి ప్రకటించాడు.


కేంబ్రిడ్జి పట్టభద్రుడు స్టోరీ అనేవాడు ఈ చిన్న ప్రవాహాలు మెరుపులవల్ల ఎక్కడో పుట్టిన హీనావృత్తి (Low Frequency) గలిగిన విద్యుత్తరంగాలనీ, అవి పుట్టినచోటు నుంచి నేరుగా వినేవాడి టెలిఫోనుకిరావు అందనీ, భూమియొక్క అయస్కాంతశక్తి రేఖలతో ఇవి ఆకాశవీధులకువెళ్ళి, ఆ రేఖలతో భూమి అవతలి అర్ధగోళానికివెళ్ళి అక్కడ—అంటే అవి వెళ్ళిచేరిన చోట రిసీవర్లు కందుతాయనీ కనుక్కొని ప్రకటించాడు. ఈ యీలల ఆవృత్తి రేడియో ప్రసార వృత్తికంటె తక్కువ. అయినా ఇవి కలిగించే శబ్దం చెవికి అందేపాటిదే. మెరుపుతోపుట్టే ఆవృత్తుల పెక్కు విలువలలోవుంటాయి. ఇవి పైకి ఆకాశము వైపు వెళుతూ, భూమియొక్క అయస్కాంతశక్తిరేఖల వెంబడిని ప్రయాణిస్తాయి. తక్కినవి—అనగా పక్క వైపుకి వెళ్ళేవి భూశక్తిరేఖల్ని నిటారుగా చేరడమువల్ల దారి తప్పిపోయి చెదిరిపోతాయి. ఈ వూహ రైటేనని స్టాన్‌ఫర్డు విశ్వవిద్యాలయపు ఆర్. ఏ. హెలివెల్ అనే వైజ్ఞానికుడు ప్రయోగ మూలకంగా నిరూపించాడు. అన్నాపోలిసులోని సిరీలాండు రేడియో స్టేషనునుంచి బయల్వెడలే భూమ్యయస్కాంత రేఖలు దక్షిణ అమెరికా కొసనవున్న హారన్ అగ్రము దగ్గరకు దిగుతాయని వైజ్ఞానికులు ఎరుగుదురు. హెలివెల్ హారన్ అగ్రము దగ్గరుండి అన్నాపోలిసునుండి 15.5 కిలోసైకిల్సు మీద ప్రసారమయ్యే సిగ్నలుకు తన రిసీవరుట్యూన్ చేశాడు. అతనికి ఆ సిగ్నలు మామూలురీతిగా అందింది, ఒక సెకండు తర్వాత మళ్ళీ తిరుగుతుంది అన్న 5000 మైళ్ళదూరపు దారిలో ఆలస్యంగావచ్చి అందింది. ఇది ప్రతీ సిగ్నలుకీ జరిగింది.



ఈ హీనావృత్తులు అన్నీ ఒకేవేగంతో సాగవు. ఉచ్చ ఆవృత్తులు త్వరగానూ, నీచ ఆవృత్తులు కొంత మందంగానూ ప్రయాణిస్తాయి. కనక మొదట రిసీవరుకి అందే ఉచ్చ ఆవృత్తి కీచుగా వినబడుతుంది, ఆ తరవాతి సెకనులో అందేవి మంద్రంగా వినబడి మొత్తపు శబ్దం పిట్ట అరుపులాగ హెచ్చు స్థాయినుండి తగ్గుతూ వినబడతాయి.

ఈ యీల వినబడేముందు కటక్ పటక్‌మని విరిచినట్టుండే చప్పుడు వినబడుతుంది. అదే అసలు మెరుపు శబ్దం. ఈ యీలలు భూమధ్య రేఖ ప్రాంతాలా, ధ్రువాల దగ్గరా వినబడవు. నడిమి లాటిట్యూడులలోనే వినబడతాయి. ఏమంటే భూమధ్యరేఖ మీదికి దిగే భూమ్యయస్కాంత శక్తి రేఖలేవీ లేవు, ధ్రువాలదగ్గర రేఖలు ఎక్కడికో అనంతాకాశసీమలలోనికి పోతాయి. ఈయీలలు ఉత్తరార్ధగోళమునుంచి దక్షిణార్ధానికీ, అక్కడినుంచి మళ్ళీ ఉత్తరానికీ గెంతుతూ,—ఉచ్చ నీచ ఆవృత్తుల వేగభేదము కారణంగా క్రమంగా పొడుగౌతూ వినిపిస్తాయి. వీటికి ఒకదానికీ, దానివెనక దానికీ వున్న కొద్ది విరామమువల్ల నరసంబాలలాగ వినబడతాయి. ఈ యీలల్ని వహించడానికి ఎలక్ట్రానులవసరము. భూగోళ వ్యాసార్ధము 4000 మైళ్ళు. భూమి అయస్కాంతశక్తి రేఖలు 7000 మైళ్ళు దాటిన ఎత్తుకి పోతాయి. ధ్రువప్రాంతంనుంచి రెండో ధ్రువ ప్రాంతానికి సంగడములో యీలలు రేఖల్ని అనుసరించిన చోటవల్ల ఆ యెత్తుకి వెళ్ళి ఉండాలి, అంత ఎత్తునీ, ఎలక్ట్రానులు—వీటిని వహించేవి ఉండి ఉండాలి. ఈ ఉదాహరణలో విద్యుత్ప్రవాహాలంటే ఎలక్ట్రానుల ప్రవాహాలే ఘన సెంటీమీటరు ఒక్కంటికీ—16,000 మైళ్ళ ఎత్తునైనా— నూరు ఎలక్ట్రానులేనా ఉండాలని అంచనా వేశారు వైజ్ఞానికులు. ఇదివరలో ఎక్రెప్ మేఘాలు 10,000 అడుగుల ఎత్తున ఉంటాయని ఎండవెల్తురు నూరు మైళ్ళ ఎత్తున ఉన్న గాలి అణువులు సూర్యుడి వెల్తుర్ని పరావర్తనము చెయ్యడమువల్ల ఏర్పడిందనీ, అంటూ నూరూ నూటపాతికా ఎత్తుదాకానే గాలివంటి పదార్థమేనా ఉంటుందని గ్రహించి, ఆపైన శూన్యమే నన్నారు. మరి ఎలక్ట్రానులు 16,000 మైళ్ళ ఎత్తునవుంటున్నాయో, అవి యెక్కడివి [ఈ ప్రశ్నకి] జవాబు సులువుగారాదు. సూర్యునినుంచి, [విశ్వ] కిరణాలవల్ల, విశ్వమయియాఘాల తాకిడికి, గాలిలో తేలడమువల్ల, ఇంకా అనేక కారణాలవల్ల ఎలక్ట్రానులు రాగలవు.

అన్ని రకాల ఆకాశ యీలలూ మెరుపులనుంచే నవడానికి వీలులేదు. మెరుపులతో సంబంధము లేనివి నడిమిలాటిట్యూడులలోనేకాక ప్రపంచమంత రా వినబడే యీలలూ ఉన్నాయి. పరిశోధనలు వల్లగాని ఏమీలేదు.



శ్రీపతి

రాత్రి భోజనానికి బసవరాజు ఆ ఇరుకు వీధిలోంచి పోతుంటే సరిగ్గా రాందాసు ఇంటిముందు ముగ్గు రొచ్చి ఎదురుగా అడ్డంగా నుంచున్నారు. ఐదుగు రయ్యారు. పదిమందయ్యారు. వాళ్ళంతా రైతులు. చుట్టుముట్టారు. ఒక్కడూ మాట డ్డంలేదు. వాళ్ళ మనసుల్లో ఎంతటి క్రూరభావాలున్నాయో ఆ నిశ్శబ్దమే చెపుతోంది.

ఆరోజు మరికొంచెం ఎక్కువ చీకటిగా ఉంది అసలే వర్షాకాలం. అందులోనూ తూర్పు కనుమల వడ్డునున్న వూరు. పైన ఆకాశంలో మేఘాలు. అంచేత మరింత దట్టంగా చీకటి.

ఆవూర్లో యింకా ఆముదపు దీపాలే. హరికెన్ లాంతర్లు వున్నా అవి బయటికి కనిపించవు. లోప లెక్కడో ఉంటాయి. ఇళ్ళ ముందు పశువుల పాలలు. అమురికి. ఆకంపు. దోమలు. ఇరుకు ఇళ్ళు. గాలీ వెలుతురూ వుండని బతుకు. మంచిగుడ్డలు వేసుకోరు, ఆడవాళ్ళు కూడా నిండుగా శరీరాన్ని కప్పుకోరు. జాకెట్లు వేసుకోరు. అన్నీ మూఢనమ్మకాలే. తుమ్మితే తప్పు. దగ్గితే తప్పు. గుడ్డి బతుకు. జీవితంలో ఆనందమంటే వీళ్ళకి తెలుసునా అనిపించింది. ఒత్తి అనాగరికపు మనుషులు అనుకునేవాడు వాళ్ళ గురించి బసవరాజు.

సుమారు మూడునెలల క్రితం బసవరాజు ఆ వూళ్ళో అప్పర్ ప్రయిమరీ స్కూల్ తెరవడం కోసం వచ్చినప్పుడు—మొదటిరోజునే తన కమ్యూనిష్టు స్నేహితునికి ఒక ఉత్తరం రాసాడు. 'ఈ వూరి నిండా అజ్ఞానమనే బురద. సంస్కార హీనమనే దుర్గంధం. పేదరికం అనబడే కుష్టురోగం. జమీందారీ విధానం వలన ఏర్పడ్డ వ్యభిచారం. అసలు ఇక్కడ మనుష్యులు పూర్వతరాలకి చెందినవాళ్ళూ కారు ఈ తరానికి చెందినవాళ్ళూ కారు. నిజంగా భయమేస్తోంది. కాని ఇట్లాంటి దగ్గర ఏమేనా మార్పు సాధించగలనేమో చూస్తాను. ఇక్కడ ఈ ప్రజల్లో కొత్త చైతన్యాన్ని మేల్కొల్పగలిగితే—నాకు నూటా ఏభైమంది పిల్లలు ఆసరాగా ఉన్నారు. వాళ్ళు నాకు ఆయుధాలు. ఆ ఆయుధాలనే ఉపయోగిస్తాను వూరు మీద' అని.

తర్వాత బసవరాజు అంటే చాలా మంచివాడు అని వూర్లో అందరికీ తెలిసింది. మొదట్లో బసవరాజు కమ్యూనిష్టు అని అన్నప్పటికి తర్వాత్తర్వాత బసవరాజు ఏ ఇస్టూ కాడు అనుకున్నారు. అతడికి రష్యా కంటే అమెరికా అంటేనే ఎక్కువ ఇష్టం అని తెలుసుకున్నారు.

మరొకసారి ఓ సెలవు దినాలు గడచిన తర్వాత బసవరాజు ఒక రచయిత మిత్రునికి ఉత్తరం రాస్తూ 'ఈ వూర్లో రాజకీయాలున్నాయి. కమ్యూనిస్టుల కొడవలీ సుత్తీ ఎర్రజెండాలు మనకి కన్పిస్తాయి. కాంగ్రెసు జోడెడ్లు కిందటి ఎలక్షన్ల గుర్తులు యింకా గోడల మీద కన్పిస్తూనే ఉన్నాయి. సమితి సర్పంచ్ కాంగ్రెసేనట. స్వతంత్రపార్టీ కూడా ఉంది. పంచాయితీ బోర్డు మాత్రం స్వతంత్రపార్టీ ఆధీనంలో ఉంది. నీలం ఆకాశంలో ఒంటరి నక్షత్రం మిణుకు మిణుకు లాడుతోంది. వీళ్ళు తెలివి తక్కువ్వాళ్ళు అనుకున్నాను గాని అబ్బో మనలాంటి వాళ్ళని వేలంవేసి అమ్మేయగలరు. ఇక్కడ మొన్నే కథ విన్నాను. క్విట్ ఇండియా తిరుగుబాటు రోజుల్లో రంగా నాయకత్వాన చిన్నచిన్న రాజులవీ, మొఖాసాదారులవీ, జమీందారులవీ పధ్నాలుగు కోటలు ఒకే రాత్రి కాల్చారు. ఆ తిరుగుబాటులో పాల్గొన్నాయన వాళ్ళబ్బాయి స్కాలర్‌షిప్ కోసం వచ్చి చెప్పాడు. మనకంటే మన ముందుతరాల వాళ్ళే నయం. చాలా కష్టాలని ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆయన ఆ విప్లవం గురించి చెపుతోంటే 'ఎంత అదృష్టవంతుడు!' అనిపించింది' అని రాశాడు.

బసవరాజుని చూట్టానికి ఆ దగ్గర్లో ఓ హైస్కూల్లో పనిజేస్తున్న ఓ మిత్రుడు, హిందీమేష్టరు, వస్తే 'ఈయన పెద్ద రైతుగారబ్బాయి. ఇంటర్మీడియట్ చదువుకున్నారు. మనకి ఈ వూర్లో ఈయన్దగ్గరే తెలుగు దినపత్రిక దొరుకుతుంది. పేరు చెప్పడం మరచాను. కోదండపాణిగారు.' అని పరిచయం చేసిన తర్వాత 'చదువుకున్న వాళ్ళు ఎస్సెస్సెల్సీ వరకూ ఓ పాతికమంది వరకూ ఉన్నారు. కాని ఏం లాభం? కనీసం దినపత్రిక కూడా చదవరు. దేశంలో ఏం జరుగుతుందో తెలీదు. వాళ్ళ చదువు పిచ్చివాడి చేతిలోని రాయిలా తయారయింది' అన్నాడు.

ఆవూర్లో ఆ చదువుకున్న కొద్దిమందికీ బసవరాజు తెలివితేటలు గలవాడు అనిపించింది. స్కూల్లో పిల్లలకి కొత్త హెడ్మాష్టరు వచ్చిన తర్వాత ఆటలూ, చదువులూ ఎక్కువయ్యా యనిపించింది. వూర్లో వాళ్ళందరికీ స్కూలు కళకళ్ళాడుతోందనిపించింది.

ఒక సెలవు రోజు వూర్లో వున్న మంచిదనబడే ఒక టీకొట్లో బెంచీల మీద కూచున్న పదిమంది గ్రామస్థుల మధ్య కూచుని తనకి తెన్నేటి విశ్వనాధమూ, వావిలాల గోపాలకృష్ణయ్యా, పుచ్చలపల్లి సుందరయ్యా, గౌతు లచ్చన్నా, ఇంకా కాంగ్రెస్ మినిష్టర్లూ తెలుసని చెప్పాడు బసవరాజు. ఆపేర్లు చెపుతోంటే ఒకాయన 'నెహ్రూగారిని చూసారా?' అని అడిగాడు. అప్పుడు బసవరాజు తన దగ్గరున్న ఆటోగ్రాఫ్ పుస్తకం గురించి చెపుతూ రాజాజీ, హీరేన్ ముఖర్జీ, జయప్రకాష్‌నారాయణ, మొరార్జీ, లోహియా, మీనన్, వాజ్‌పాయ్, వినోబా, డాంగే మొదలయిన నాయకుల పేర్లు చాలా చెప్పాడు. విదేశ రాజకీయ నాయకులని కూడా చాలామందిని చూసాడట! అక్కడున్న వాళ్ళ కెవ్వరికీ రచయితలంటే అర్థం కాలేదు కాని తెలుగు రచయితలు విశ్వనాధ, శ్రీశ్రీ, గోపీచందూ, చలం, కొడవటిగంటి, ఆరుద్ర, జంధ్యాల పాపయ్యశాస్త్రి, నారాయణరెడ్డి—వాళ్ళందరూ తనకి తెలుసుననీ, చూసాననీ చెప్పినప్పుడు మట్టు తాగుతున్న ఓ ఇరవై యేళ్ళ కుర్రాడు 'మేష్టరూ, నాగేస్రావుని సూసినావా?' అని అడిగాడు. సినిమాల గురించీ, స్టూడియోల గురించీ

[illegible] ఆ అడిగినాయన కళ్ళింతలు చేసుకుని చూసాడు. 'హెడ్మాష్టరు చిన్నోడు కాదు, మాగట్టి బుర్రే' అనుకున్నారు. ఢిల్లీలో, కలకత్తాలో, బొంబాయిలో, మద్రాసులో, హైదరాబాద్‌లో, ఖర్గపూర్‌లో ఆయనకి బంధువులూ స్నేహితులూ ఉన్నారని, అవూరి బ్రాంచి పోస్టుమాష్టర్ పట్నాయక్‌కి తెలుసు. అతడి ద్వారా మరికొందరికి తెలుసు.

అలాంటి బసవరాజుకి ఆరోజు ఆరాత్రి ఓ పల్లెటూరి రైతు ఇంటి ముందు అందరు అనాగరికులు భయంకరంగా చుట్టుముట్టారు. బసవరాజు భోజనానికి గదినించి బయల్దేరేముందు ఆయింటామె మామ్మ, 'ఇలా అనుకుంటున్నారు. ఉదయం ఈశ్వరాలయం నూతి దగ్గర ఇలా జరిగిందంట. నిజమేనా? మనుషులు మంచి వాళ్ళుకారు.' అని చెప్పింది.

బసవరాజుకి అప్పుడు తెలిసింది తప్పు చేసినట్టు. చాలా పెద్ద తప్పునే తను వొళ్ళు మరచి చేసినట్టు. అంతవరకూ అతడు మంచిపని చేస్తున్నాను అనుకున్నాడు. ఆ అమ్మాయి రోజూ తను స్నానం చేసే వేళకే ఈశ్వరాలయం మెట్ల మీదికి పిడకలు వేసుకోటానికి వస్తుంది. ఆశతో చూస్తుంది. ఇట్లా చూపులతో చాలా రోజులు గడిచాయి. చివరికి ఈరోజు ఆ అమ్మాయిని పిలవాలనిపించింది. కోరిక ఆపుకోలేక పిలిచాడు. మాట్లాడాలనుకున్నాడు. ఇట్లాంటి అమ్మాయిని చేసుకోవడం సంస్కార మౌతుందని భావించాడు. ఇట్లాంటి అమ్మాయికి ఈజిప్ట్‌లో పిరమిడ్ల గురించీ, గ్రీకు శిల్పాల గురించీ, ఫ్రెంచి విలాస జీవితం గురించీ, టాగోర్ కథల గురించీ, అమెరికా ఆకాశపు భవనాలుగురించీ, జాజ్ సంగీతం గురించీ, చైనా గోడ గురించీ మొత్తం ప్రపంచం గురించి చెప్పి గొప్పదాన్ని చెయ్యడం నిజమైన సంస్కారం అనుకున్నాడు.

ఆ పల్లెటూరు అమ్మాయిలో ఎల్లోరాలో కనిపించిన అపురూపమైన అందం వుందని ఆరోజు బసవరాజు గుర్తించాడు. ఆ ఉదయం నించీ బసవరాజుకి ఆఅమ్మాయి రూపు కళ్ళముందు కదలడం మొదలు పెట్టింది.

మామ్మగారు ఈ వార్త చెప్పి, ఆ ప్రశ్న వేసినప్పుడు బసవరాజు ఆనందం ఎక్కడో అక్షణంలోనే కూలిపోయి దుఃఖం ముంచుకొచ్చింది. ఆ అమ్మాయికి పెళ్ళయిందంట! పెళ్ళయిందని కూడా ఎలా తనకి తెలీలేదో బసవరాజుకి ఆశ్చర్యం వేసింది. వెయ్యక వెయ్యక చాలా పెద్ద తప్పటడుగు వేసాడన్నమాట! ఆ తప్పటడుగు తిన్నగా అగాధంలోకే నెట్టుతోంది!

రాళ్ళనీ, చెట్లనీ, పాములనీ మొక్కే ఈ అనాగరికులంతా తన వేపు వేలెత్తి చూపుతారని, తన మీదికి ఉమ్ముతారని భయమేసి బెదిసిపోయాడు. ఆ బాధతోనే హోటల్‌కి పోయి తినిరావాలని వెళ్తున్నాడు. సరిగ్గా వందగజాలు వచ్చాడో లేదో, ఆ చిక్కటి చీకటి సందులో, అదే వీధిలో, రాక్షసుల్లాంటి జనం గుమిగూడారు.

'ఏం మేష్టరూ' అని ఒకరెవరో మాట్లాడుతుంటే 'కొవ్వెక్కిందిరా' అని ఇంకోడు బూతులు తిట్టడం మొదలుపెట్టాడు. 'లంజ కొడుక్కి ఒక పోటు పొడిచ్చంపండి, చూస్తున్నారింక!' అని మరోడు ఉద్రేకాన్ని ఆపులేకుండా మాట్లాడుతున్నాడు. 'ఈడొక హెడ్మాష్టరట, పిల్లలకి! ఇస్కూలికి! ఇకన ఆడపిల్లల మీద కూడా పడతాడు' అని యింకొకడు. 'చూస్తున్నారేంటి ఎముక ఇరగ్గొట్టక' అని యింకో మనిషి. తొందర చేస్తున్నారు. వాళ్ళ మధ్య రాందాసు లేకపోతే వాళ్ళు అన్నిమాటలు మాట్లాడేవారేకాదు. అందర్లోనూ కసి. కర్కశత్వం. పగ. ప్రతీకార వాంఛ. రోషం. ద్వేషం అసహ్యం ఈర్ష్య పట్టుపగ్గాల్లేని ఆగ్రహం.

సూరమ్మ లాంటి పిల్ల అవూర్లో లేదు. అంత మంచిపిల్ల. ఆడపిల్ల అంటే ఆపిల్లనే చెప్పుకోవాలి. అవూర్లో ఆయీడు పిల్లలెందరో వున్నారు. లేకేం. కాని సూరమ్మఅంటే అవూళ్ళో అందరికీ అభిమానం. ప్రేమ. రత్నం లాంటిపిల్ల. నిప్పులాంటిపిల్ల. పరాయి మగాళ్ళని కన్నెత్తి చూడదు. తన పనేమిటో తను చేసుకుపోతుంది. ఇంత చిన్నవయసులోనే శనివారాలూ, సోమవారాలూ, ఏకాదశులూ ఉపవాసముంటుంది. అన్ని పండుగులూ చేస్తుంది. పెద్దలంటే ఆ అమ్మాయికి గౌరవం భక్తీ వున్నాయి. పేదసాదలంటే ప్రేమాదయా ఉన్నాయి. అలాంటి మంచి ముత్యం లాంటి పిల్లకు, గంగిగోవులాంటి పిల్లకు ఆరకంగా జరిగినందుకు విన్న వాళ్ళంతా బాధపడ్డారు. బసవరాజునీ, పట్నపోళ్ళ గుణాలనీ తిట్టారు. తెలిసిన వాళ్ళంతా వచ్చి సూరమ్మనీ, సూరమ్మ తలిదండ్రులనీ ఓదార్చి ఏవో హెచ్చరికలు కూడా చేసి, సూరమ్మ మంచితనాన్ని స్మరించుకుని వెళ్ళిపోతున్నారు.

నిప్పుల్లోకి నెట్టే జ్వాలల మధ్య సజీవ దహనం చేస్తున్నట్టయింది బసవరాజుకి. అంతలో అరవైయ్యేళ్ళు దాటిన రాందాసు మళ్ళీ 'ఏమ్మేష్టరూ?' అని అడగబోయాడు.

'తప్పయిపోయింది. ఇంకెప్పుడూ చేయను. క్షమించండిసారి' అన్నాడు. ఆమాటలు అన్న తర్వాత అతడికి మరింత బాధ కలిగింది. బతుకు మీద తీపి కొద్దీ గౌరవాన్ని మంట కలిపి, చదువూ సంస్కారమూలేని అనాగరికులైన పశువుల్లాంటి వాళ్ళని క్షమాపణ అడగటమూ, తప్పయిందని ఒప్పుకోవడమూ, వాళ్ళ జాలి, సానుభూతి కోరడమూ, వాళ్ళ దయాధర్మాలతో బతకడమూ అవమానకరంగా ఉంది. ఆ అమ్మాయిని పిలిచిన తప్పుకంటే, తప్పయిందని, క్షమించమని దయాభిక్ష వేడుకోవడం ఘోరమైన తప్పు అనిపించింది.

అతడు చెమర్చాడు. కంపించిపోయాడు. పిరికివాడయిపోయాడు. ప్రాధేయపడ్డాడు. యాచించాడు. ఉన్నత గౌరవ శిఖరంనించి అప్రతిష్ఠ అధోలోకాలకి కూలిపోయాడు. సంస్కారిపోయి పశువయ్యాడు ఇప్పుడు ఈ నిమిషాన. ఉదయం ఈశ్వరాలయం నూతి దగ్గర.

బూతులు తిట్టే మనుషులని నెట్టుకుంటూ ముందుకు ఉరుకుతూ 'తప్పయిందా? సిగ్గులేదూ? థూ—తగల్నీయుండి. తప్పేవిటో తెలిసొస్తాది పేణానికి. బదుస్తున్నా రెందుకురా' అని మరొకడు బలమైన చెయ్యెత్తాడు. రాందాసు వాడినిపట్టుకుని 'తప్పయిపోయిందంతన్నాడు గదా? వొదిలేయండ్రా. వొదిలేయండి. మేష్టరూ, యెల్లు. బుద్ధితెచ్చుకొని మంచోడిగా బతుకు. యెల్లు. యెల్లిపో.' అని రాందాసు అటూ ఇటూ ఆ గుంపుని తప్పించి దారి చూపాడు.

బసవరాజుకి అక్కడనించి కదిలి నడుస్తుంటే వెనక ఎవరో వీపు మీద కత్తులతో పొడవటానికి సిద్ధంగా ఉండి వెంటాడుతున్నట్టయింది. ఎలా వెళ్ళాడో వెళ్ళాడు భోజనానికి. అది హోటల్ కాదు. పూర్వకాలపు పేదరాశి పెద్దమ్మ యిల్లు లాంటి యిల్లు. ఆ యింటిలో వయసు మళ్ళిన ఒకావె ఉంది. ఆమె వుండి అన్నం పెడుతుంది. అవూర్లో అప్పర్ ప్రయిమరీ స్కూల్‌లోని మరో ఇద్దరు మేష్టర్లు, వియుల్డబ్ల్యూ, ఫారెస్టు గార్డు ఇద్దరూ మాత్రమే తింటారు. నెలకి ఇరవై రూపాయిలకి రెండుపూటలా తిండి దొరుకుతుంది. వీధుల్లో ఉన్న మనుషులంతా వింతగా నిలబడి తనవే చూస్తున్నట్టు అనిపించింది. అన్నం పెడుతూ 'ముసలమ్మ' కొత్తగా చూసింది. తిండి ఒక్క మెతుక్కూడా తిన్లేకపోయాడు.

రేప్పొద్దున్న మాటాపిళ్ళైమంది పిల్లల ముందు తలెత్తుకు నిలబడాలి. ఆదర్శాలు బోధించిన తను, హితోపదేశాలు చేసిన తను మేష్టర్లకి ముఖం చూపించాలి. ఆ మేష్టర్లు చూపే సానుభూతికీ, జాలికీ, దయకీ ఎదురు చూడాలి. వాళ్ళ బుద్ధులు చెపితే తలూపి వినాలి. కరణంతో ఇంత ధైర్యంగా, వినయంతో మాటాడే శక్తి యింక వుండదు. మనుషులని మానీ తప్పించుకుంటూ దొంగచాటుగా, నటిస్తూ నడవాలి. కోదండపాణి దగ్గర తల వాల్చుకోవాలి. ఫారెస్టుగార్డులు లంచాలు పుచ్చుకోవటం గురించి యింక మాటాడకూడదు. ప్రెసిడెంట్ రెడ్డితో పదవుల్లో ఉన్న రాజకీయ నాయకుల అవినీతి గురించి నోరెత్తకూడదు. సారాయీపాలెం సాగిస్తున్న సత్తెన్నారాయణకి 'ఇంకో మంచి బిజినెస్ ఏదో చూసుకోకూడదూ?' అనకూడదు. షావుకారుతో 'ఓ సేట్‌జీ, లైసెన్సు లేకుండా యీ మందులమ్మ కూడదండీ' అనటానికి వీల్లేదింక. 'నీళ్ళు కలిపి పాలలాకి నీరు పోయకపోతే అమంచి పారేసో అర్ధరూపాయికో పొయ్యొచ్చుగా పాపమ్మా' అని పాలావిడతో చెప్పకూడదు. 'మంచోడు మామంచోడు' అన్న మొహాలన్నీ రేప్పొద్దున్న 'యీడేనా!' అని మొహాలు తిప్పుకుంటారు.

బసవరాజు మళ్ళీ అదే వీధిలోంచి అడుగుతీసి అడుగు వేసుకుంటూ నడిచి వెళ్ళాడు. అమ్మానాన్నా గుర్తుకొచ్చారు. తెలిస్తే ఎంత బాధపడతారో! ఎంత సిగ్గు పడతారో! ఎంత అవమాన పడతారో! పెళ్ళి చేస్తామంటే వద్దన్నాడు. తను స్వంతంగా చేసుకుంటా నన్నాడు. తనకి ఎవరో వెతికి పెళ్ళాన్ని ఇవ్వకూడదనుకున్నాడు. తను కుంటికాదు, గుడ్డికాదు. అంద వికారి కాదు. రోగికాదు. చేతకాని వాడు కాదు. తనకి ఒక యోగ్యురాలు దొరక్కపోదు. స్వంత వ్యక్తిత్వం లేని వాళ్ళకి మళ్ళే డబ్బు చూపి, ఆస్తి చూపి, కులం పేరు చెప్పి, ఉద్యోగం హోదా చెప్పి, ఇతర్ల చేత పొగిడించుకుని, ఆశ చూపి చేసుకోవాల్సిన అవసరం తనకేం లేదు. జీవితంలో యోగ్యురాలుగా, తోడుగా, మనసిచ్చిన మనిషిగా, మర్యాదస్తురాలిగా ఎవరు దొరికితే వారిని, ఎప్పుడు దొరికితే అప్పుడు చేసుకోవాలనుకున్న బసవరాజు ఈరోజు ఇలాంటి పని చేసాడు. కులాలెందుకున్నాయో అప్పుడతడికి తెలిసింది. పెళ్ళిళ్ళెందుకు పెద్దలు చేస్తారో అప్పుడతడికి బోధపడింది. ఇన్ని ఆచారాలెందుకో, యిన్ని నిందులెందుకో అప్పుడతడికి అర్థమయింది. స్వీయ రక్షణ కోసం తమ తప్పులని కప్పిపుచ్చుకోవడం కోసం, ఇతర్ల ఈర్ష్య మాయలని తొలగించటం కోసం

ఈ తంతు అంతా అనుకునేవాడు బసవరాజు. కానీ ఈరోజు—

బసవరాజు 'తను మంచివాడు' అనే స్వీయాభిప్రాయం ఉంది. వాళ్ళ నాన్నగారు ఒక హైస్కూల్లో హెడ్మాష్టరు. ఆయనకి రాజకీయాలంటే ఇష్టం. వాళ్ళమ్మగారు బాగా చదువుకున్నామె. యూనివర్శిటీ డిగ్రీలు లేవామెకు. కాని సంగీతం, సాహిత్యం ఆమెకి బాగా ఇష్టం. బాగా పాడతారామె. తలిదండ్రుల సంస్కారంలో అతడు చిన్నప్పటి నించీ మంచిగానే పెరిగాడు. మంచివాడుగా గుర్తింపబడ్డాడు. అతడు కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఎవరో గోపరాజు రామచంద్రరావు గురించి చెప్పారు. గోరాకీ గాంధీజీకి జరిగిన వాద ప్రతివాదాల గురించి చెప్పారు. ఆయన్ని చూడాలనిపించింది. చూసాడు. చార్వాకుడి గురించి ఒక ప్రొఫెసర్ చెప్పాడు కాలేజీలో. విన్నాడు. పాశ్చాత్య జీవితం గురించి చదివాడు. పాశ్చాత్యులు పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా చాలా అభివృద్ధి పొందారనిపించింది. అమెరికాలా తను దేశం గొప్పదవాలనుకున్నాడు.

బసవరాజు చాలా నిచ్చెనల నెక్కి పై అంతస్థు మీద ఉన్నాననుకున్నాడు. మూఢనమ్మకాలతో, ఆలోచనా రహితమైన జ్ఞానంతో, పశువులా బ్రతికిన రోజుల గురించి స్మరించుకునేవాడు. ఆ రోజులన్నీ దుర్వినియోగమైపోయాయని బాధ కలిగింది. గౌరీ పౌర్ణమి వెన్నెల రాత్రులు వూళ్ళో జరిగే ఉత్సవాల్లో, వినోదాల్లో వేషాలు వేసి పాటలు పాడి అతడు పాల్గొన్నాడు. దీపావళి రాత్రి కోసం బాణసంచా తయారు చేసుకుని చీకటి ఎప్పుడు పడుతుందా అని నరకుణ్ణి చంపిన సంతోషాన్ని ఎంత తొందరగా పంచుకోవడమా అని చీకటి కోసం ఎదురు చూసేవాడు. కార్తీక మాసంలో వేకువ జామునే లేచి నది ఒడ్డుకి అరటి దొన్నెల్లో దీపాలు ఉంచి, ప్రవాహంలో అవి వందలాది పోతో వుంటే ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాలని చూసుకుని చీకట్లో నది నడక సవ్వడి విని ఆ చీకట్లో ఆ చలిలో ప్రవహిస్తున్న నీటిలో స్నానం చేసి తడిగుడ్డలతో ఇంటికి వచ్చేవాడు. మాఘమాసంలో వణికే చలిలో, అక్కలతో, ఇరుగు పొరుగు పిల్లలతో వెళ్ళి మునిగి చీకటిలో చెట్లు, చుక్కల, ఆకాశంలోని మేఘాల అందాలు కళ్ళార్పకుండా చూసి వచ్చేవాడు. సంక్రాంతి నెల అర్ధరాత్రే లేచి మంటలేసుకుని జ్వాలల నృత్యం చూసుకుంటూ పరవశించిపోయి, కోడి కూతలు విని, విచ్చుకున్న పూల మీది మంచు బిందువుల తళుకు చూసి ఆనందించేవాడు. శివరాత్రి పూట జాగరం చేసి, దేవాలయాల్లో హరికథలూ, భాగవతాలూ చూసి వేకువనే స్నానాలు చేసి, పూజలు చేసి, దేవుని దగ్గర కొబ్బరి కాయలు కొట్టి ప్రసాదం తిని పగలంతా నిద్రపోయి పండగ కోసం మళ్ళీ నిరీక్షించేవాడు. శ్రీరామనవమి పండుగ దినాలన్నీ రాత్రులు ఎంతో హాయిగా, ఆనందంగా వుండేవి. ఎన్ని రకాల వింతలు! చల్లని హాయి గొలిపే గాలిలో మనుషుల రాపిడిలో నడవడం ఎంతో బాగా ఉండేది. గ్రహణం రోజున సముద్రానికి పోయి కెరటాలతో ఆడుకుని, ఆ కెరటాల మీది రంగుల నృత్యం చూసి వచ్చేవాడు. తులసి కోటలోని పరిమళాల మొక్కని పూజించటం, నాగుల చవితికి పుట్టల్లో పాలు పోయడం, మర్రిచెట్టు క్రింద త్రినాథవ్రతం చెయ్యడం, పెద్దలతో సింహాచలం, ముఖలింగం, అరసవెల్లి, శ్రీ కూర్మం యాత్రలకి వెళ్ళాలని పట్టుదల పట్టి, ఏడ్చి గెలుచుకోవడం, కనుమ నాడు ఆవులనీ, గేదెలనీ, ఎడ్లనీ పూజించటం అవన్నీ ఒకప్పుడు చాలా గొప్పగా ఉన్నప్పటికీ ఇప్పుడు అర్థంలేని ఛాందసాలుగా అనిపించాయి 'భారతీయ జీవిత విధానం ప్రకృతి సౌందర్యంతో తాదాత్మ్యం పొంది ఆధ్యాత్మిక అనుభూతి పొందడం, ఇంత ఉత్కృష్ట జీవిత విధానాన్ని ప్రపంచంలో ఏజాతీ అభివృద్ధి చేసుకోలేదు' అని ఒకసారి ఒకాయన అంటే వెంటనే బసవరాజు "పశువులు ఈ ప్రపంచ సుఖదుఃఖాలకి నిర్వికల్పంగా, అతీతంగా ఉంటాయని వాటిని ఋషులు అన్నట్టుంది మీ ధోరణి' అని ఖండించాడు. 'ఏం ఎందుకు ఎద్దు మాంసం తిన కూడదు? మనదేశ సమస్యలు, ప్రపంచంలో మన సమస్యలు, ప్రపంచంలో మనదేశ గౌరవమూ, మన ప్రజల ఆరోగ్యమూ కంటే సనాతన మూఢనమ్మకమే పవిత్ర మయిందన్నమాట!' అని బాధపడేవాడు.

బసవరాజు కొత్త ప్రపంచం గురించి తెలుసుకున్న తర్వాత, ఇంగ్లీషు పుస్తకాలు చదువుకున్న తర్వాత, జీవితం గురించి భౌతికంగా, హేతుబద్ధంగా ఆలోచించడం మొదలుపెట్టిన తర్వాత పెరిగాడనుకున్నాడు. తనకి మంచి చూపు వచ్చిందనుకున్నాడు. తను మనిషిలాగ బ్రతుకుతున్నాడనుకున్నాడు. తను బాగుపడ్డాడనుకున్నాడు.

అతడి కొత్త చూపు, అతడి మంచి, అతడి బాగు, అతడి ప్రగతి ఒక్కమాటలో, స్త్రీ యవ్వనం దగ్గర, ఒక్క నిమిషంలో మంట గలిసిపోయిన స్థితి గుర్తుకొచ్చింది. ఎంత తప్పయిపోయింది. ఇప్పుడెలా లోకాన్ని చూడడం?


ఆ రాత్రి ఒక్కడూ ఆగదిలో బసవరాజు కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు.


బసవరాజుకి ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది. ఆ అమ్మాయి పదహారేళ్ళది. తేనెరంగు శరీరం. అందం కంటే ఆరోగ్యం ఎక్కువ. ఆమె చూపులకి ఆమె నడకకి ఎక్కువ అందముంది. కొండలోయల్లో, చెట్ల నీడల్లో, ప్రవాహానికి ఉన్న అందం ఆమెది. ఆ అందానికి, ఆ చూపులకి, ఆ నడకకి, తన తెలివి తక్కువ తనానికి, భ్రమకి, తొందరపాటుకి, ఉద్రేకానికి, తనకి తల్లితండ్రీ యిచ్చిన ఆరోగ్యాన్ని, కుటుంబ మిచ్చిన మంచినీ, జీవిత పరిసరాలిచ్చిన ఆత్మబలాన్ని, అనుభవాలిచ్చిన ధైర్యాన్ని, సంస్కారాన్ని, కర్మణ్యతనీ—బలిచ్చాడు.

అంత మంచి అమ్మాయి జీవితం మీద, పెళ్ళయిన ఆ అమ్మాయి జీవితం మీద యింతటి మసిని పులిమేసాడు. ఆమె నిర్మల జీవితం మీద బురద చిమ్మాడు. ఆమె అమాయికత మీద నిప్పులు కురిపించాడు. ఎంత తెలివితక్కువ పని జరిగింది.

ఒక సామాన్యమైన పదహారేళ్ళ పిల్ల చూపులని అంత తప్పుగా, వక్రంగా అర్థం చేసుకున్న తను ప్రపంచంలోని దేన్ని నిజంగా, వాస్తవంగా అర్థం చేసుకున్నట్టు? ఏం అర్థమయినట్టు? అలా ఆలోచించగా బసవరాజుకి ప్రపంచం ఏమీ అర్థంకానట్టు, ప్రపంచానికి ఏమీ అర్థం లేనట్టూ బోధపడింది. అతడికి ఎందుకని తల్లి తమ్ముడంటే ఎక్కువ మమకారం చూపిస్తుందో అర్థం కాలేదు. అక్క 'నీగురించి నాకేం బోధపడదురా' అని ఎందుకంటుందో అర్థం కాలేదు. నాన్న తమ్ముళ్ళతో చెప్పినట్టుగా తనకెందుకు ఏ విషయమూ చెప్పడో అర్థం కాలేదు. చెల్లెలు 'నువ్వా, వదినొస్తేనా — మమ్మల్ని మరచిపోతావన్నయ్యా' అని ఏ దురభిప్రాయంతో అంటుందో కూడా అర్థం కాలేదు.

బసవరాజుకి సైన్సు చూపించిన అనంత విశ్వమంతా కనబడింది. కోట్లకోట్ల నక్షత్రాలు. ఆ నక్షత్రాల్లో అతి చిన్న—అతి చిన్ననక్షత్రం సూర్యుడు. ఆ సూర్యుని చుట్టూ చిన్న చిన్నటి గ్రహాలు.. ఆ గ్రహాల్లో ఒక చిన్నగ్రహం భూమి. ఆ భూమి మీద





సంతృప్తిపఱచే నూత్న ప్రపంచం

అపూర్వమైన తాజాదనంకొఱకు బ్రూక్ బాండ్ A-1 డస్ట్ టీ. ఒక ప్యాకెట్టు మీకు ఎన్నో కప్పుల కమ్మని టీ నిస్తుంది. ఉల్లాసకరమైన బ్రూక్ బాండ్ A-1 డస్ట్ నే వాడండి. అది మిమ్మల్ని రుచి, పరిమళాలతో సంతృప్తిపఱచే ఒక నూత్నప్రపంచానికే తీసుకు వెళ్తుంది.

BB-3148

కొట్టాడి ప్రాణులు? ఆ ప్రాణుల్లో ఒక చీమ కూడా ఉంది. ఒక బసవరాజు కూడా ఉన్నాడు. ఆ ప్రాణుల్లో చాలామంది బసవరాజులు ఉండి మసి అయిపోయారు. ఇంకా చాలామంది బసవరాజులు వచ్చి చీకటిలో కలిసిపోతారు.

బసవరాజుకి అదే సమయంలో అతడు నేర్చుకున్న చరిత్ర పాఠాలు కూడా గుర్తుకొచ్చాయి. సర్వభోగ భాగ్యాలూ, ఐశ్వర్యాలూ అనుభవించి చివరికి కిరాతకంగా, అమానుషంగా చంపబడ్డ రారాజులు చాలామంది గుర్తుకొచ్చారు. వాళ్ళ జీవిత చరిత్ర ఏరకంగా ప్రపంచానికి మిగిలిందీ అతడికి అర్థమయింది.

* * *

రంగు రంగుల మేఘాల్లోంచి కొత్త రోజు పసితనంతో ఉదయించింది. ఆరాత్రి చాలా పెద్దవర్షం కురిసినట్టుగా ఉంది. ప్రకృతంతా తడిసిపోయింది. ఇళ్ళ పైకప్పులన్నీ యింకా తడితడిగానే ఉన్నాయి. పరిపాటుల పొలాలు తెల్లటి నీటితో నిండిపోయి తొలి సంజె వెలుగుకి అద్దం ముక్కల్లా కనబడుతున్నాయి. ఊరుకి పడమటి దిక్కుకానుకుని మహేంద్రతనయ తొలి యవ్వనంలా పారుతోంది. కొండలు అకుపచ్చగా, నిర్మలంగా, మౌనంగా, గంభీరంగా కనబడుతున్నాయి. ఆకాశం కడిగేసినట్టుగా నిర్మలంగా ఉంది.

ఆ ఉదయం సూరమ్మ తమ యింటి ముందు అవుల సాలలో పేడఎత్తుతోంది. కాని ఆపిల్ల మనసు మనసులో లేదు. రాత్రి మేష్టరుని కొట్టబోయాడు. ఆ విషయం ఇంట్లో చెప్పినప్పుడు ఇంత రాద్ధాంతమౌతుందనుకోలేదు. ఆపిల్ల మేనమామ ఒకాయన దగ్గర పొలం గట్టుమీద కన్పించాడు. మేష్టరు తనతో మాటాడ్డం విన్నాడేమోననుకుంది. ఇంట్లో చెప్పకపోతే అమ్మ కొడుతుందని భయం కలిగింది. వివరంగా చెప్పాలో తెలీక చెప్పింది. ఆ చెప్పడం యీ రకంగా అర్థం చేసుకున్నారు. అవసరమున్నా లేకపోయినా అందరూ జోక్యం చేసుకున్నారు. రాత్రి పాపం ఆ మేష్టరు ఎంత బాధపడ్డాడో!

బసవరాజు అంటే ఆమెకి చాలా ఇష్టం. అతడు మంచివాడు. ఈరోజు పిలిచినప్పుడు కూడా ఎంతో మర్యాదగా పిలిచాడు. ఆరాత్రి సూరమ్మకి నిద్ర పట్టలేదు.

వేకువనే అమ్మ లేచిపోయి పల్లు తిప్పుతుంది. పిన్ని లేచి వంట మొదలు పెట్టుంది. అయ్య లేచి [illegible] తీస్తాడు. చిన్నయ్య లేచి పశువులకి కుడుతులు పెడతాడు. చిన్న పిన్ని కసవలూడుస్తుంది. నాయనమ్మ పనులు బెత్తాయిస్తుంది. తాత పొలాలు చూసి రావటానికి వెళ్ళిపోతాడు. కంచార్ల కొందరు పొలం పని మీద మరికొందరు పశువులని మేతకి తోలుకుని వెళ్ళిపోతారు. అత్త నదినించి నీళ్ళు మోసుకొస్తుంది. తను సాలల్లోని పేడలు తీసి ఊరుబయటి కోయిల్లగ్గర మెట్ట మీద పిడకలు చేస్తుంది. ఆ కోయిల్దగ్గర నూతి గట్టుకానుకుని సూర్యుడు కనిపించినట్టుగానే మేష్టరు కనిపిస్తాడు.

వీధుల్లోంచి పశువులు వూరి బయటికి పోతున్న [illegible] గిట్టల చప్పుడు వినిపిస్తున్న శబ్దం ఆగి [illegible]. తర్వాత పచ్చి సూరమ్మ చేస్తున్న పని సగంలో [illegible] తీసుకుపోయింది. వూళ్ళో [illegible] అయ్యయ్యో

చావు

అనుకోవడాలూ—అన్నీ బాగా చూసాకా చివరికి మేష్టరు ఉరిపోసుకున్నాడని అందరికీ తెలిసింది.

వేకువ జామునే లేచి రోజూ మల్లే మామ్మగారు పిలిచారట! పలకలేదట. నిద్రపోతున్నాడు గాబోలని వూరుకుందిట! తర్వాత పాలమనిషి పాపమ్మ వచ్చి కేకేసింది. పలకలేదు. నిద్రపోతున్నాడేమో, రాత్రంతా నిద్రలేక తెల్లవారే నిద్ర పట్టిందేమోనని మామ్మగారు పాలు తీసుకుని అతడి గదిలో పెట్టేయాలని లోపలికి వెళ్ళేసరికి మంచం మీద మనిషి కనిపించలేదు. మధ్య వాసానికి లుంగీ కట్టి, లుంగికి బెడ్షీంగ్ తాడుకట్టి, కుర్చీ పక్కకి తన్నేసి అతి భయంకరంగా కనబడ్డాడు. మామ్మ చాలా పెద్ద గావుకేక వేసింది. పాలమనిషి పాపమ్మ తిరిగి చూసి వచ్చింది. మామ్మ కొడుకూ కోడలూ చిన్నకూతురూ వచ్చారు. నాయుడొచ్చాడు. ప్రసిడెంట్ వచ్చాడు. కరణం వచ్చాడు. మనుషులెవర్నీ లోపలికి పోనివ్వద్దన్నాడు. మేష్టర్లొచ్చారు. పిల్లలంతా చూట్టానికి వీల్లేక బయట గుంపులు గుంపులుగా నిలబడ్డారు. కోదండపాణి వచ్చాడు. సెట్టి వచ్చాడు. రాందాసు వచ్చాడు. ఫారెస్ట్‌గార్డులు వచ్చారు. చిన్నిదోళ్ళు వచ్చారు. పెద్దిదోళ్ళు వచ్చారు. ఎగువిదోళ్ళు వచ్చారు. మనుషులే మనుషులు. ఆదామగా, అంతా భయంతో బాధతో, కన్నీటితో.

అవ్వాళ్లో రంగాగారి నీలంరంగు పతాకంలోని నక్షత్రంగానీ, సుందరయ్యగారి అరుణ పతాకంలోని కొడవలి సుత్తిగానీ, బ్రహ్మానందరెడ్డిగారి త్రివర్ణ పతాకంలోని ధర్మచక్రంగానీ బసవరాజుని సరియైన సమయంలో రక్షించలేకపోయాయి. చార్వాకుడుగానీ, గోరాగానీ, అతడు చూసిన రాజకీయ నాయకులుగానీ, చివరికి అతడికి బివి బీయీడీ పట్టాలతో యిచ్చిన బైబిల్ గ్రంథాలుగానీ, అతడు ఆదర్శంగా పెట్టుకున్న అమెరికా అభ్యుదయంగానీ వోదార్చలేకపోయాయి. అతడి విజ్ఞానమంతా భవిష్యత్తు దుఃఖమయంగా, నిస్సారంగా చూపింది.

బసవరాజు వేలాడుతున్నాడు.

మామ్మ గుండె బాదుకుని చచ్చిపోయిన తన కుమారుడిని గుర్తుకు తెచ్చుకుని ఏడుస్తోంది.. ఆరాత్రి రాందాసు ఇంటి ముందు అలా జరిగిందని తెలిసిం తర్వాత, మామ్మ, 'అంతా మన మంచికే నాయనా.కష్టాలుమనిషికి రాకపోతే మానుకొస్తాయా? ఈళ్లంతా పుణ్యాత్ములూ, నీవు ఒక్కడివే పాపాత్ముడువా, మనసు గట్టి చేసుకో' అని చెప్పాలనుకుంది కాని చెప్పలేకపోయింది. ఆ మాటలు చెప్పుంటే ఈ ఘోరం జరిగేది కాదని ఆమె ఏడుపు. ఆమాటలు మంత్రంగా పని చేసేవని ఆమె నమ్మకం.

బసవరాజు వేలాడుతున్నాడు.

'అయ్యయ్యో అయ్యయ్యో!' 'ఆతల్లీ తండ్రీ, ఎక్కడో?' 'ఇప్పుడేం చేస్తారు? వాళ్ళకి కబురెలాగ?' 'మాదొడ్డ మనిషి' 'బారికోడిని' పోలీల్దగ్గరికి సంపించినారట!' 'కృష్ణమూర్తిగారూ! మీరు ఇదే నిమిషం సైకిలేసుకుని పట్నమెళ్ళి, బస్సు పట్టుకుని వాళ్ళూరెళ్లి యీ కబురు చెప్పి తీసుకురండి?' 'మాదొడ్డమనిషి. దించిన కళ్ళు ఎత్తకుండానడిచేవాడు'' 'రాత్రిరాందాసు ఏంచేశాడంట?'' 'ఏముఖుతేం నిండు జీవితం మోనిగిపోయుంది.' 'ఆ వాడిమనరాలేమో పెద్ద పతివ్రత. ఈయనేమో పెద్ద నీతిమంతుడు' 'మేష్టరొట్టి పిరిగ్గుండోడు. దీనికే ఇంత తేగం సేసుకోవాలా? మనసిరుసుకోవాలా?' 'నానాయినా నీముచ్చట్లు నామనవడు రోజూ సెప్పేవోడురా. ఈవూర్లో నీఆయువు తీరిపోయిందా ఇక్కడ నీ రుణం తీరిపోయిందా?' 'సరియాద పోయిందని మానుభావుడు మనసిరిసుకున్నాడు' 'తినేసిందిముండ' 'సిరాములుగాడు డైలుకింద తలెట్టి సచ్చిపోయి యింకా నెలకాలేదు. మళ్ళీయిది' 'ఈవూరికి శనిపట్టింది. ఎంత మంచోడు' 'పాతి కేళ్ళుంటాయా? పాపం ఆతలిదండ్రులకి తెలిస్తే' పాపిష్టిముండ పుణ్యాతుముండ్ని తినేసింది.''ఆత్మహత్య మహాపాపం' 'గాడిదగుడ్డు'. 'చచ్చింతర్వాత పాపమో పుణ్యమో ఎవడిక్కావాలి?' 'ఇంతమంచి మనిషి పోయాడు గదా?' 'నేను గోడలు దూకాను. అర్ధరాత్రి దానిమొగుడు నిద్రలేచిపోతే వాడిని పడగొట్టి పరుగు తీసాను' 'అంతే మనిషిబతుకు అంతే' 'మగోడన్న తర్వాత ఆమాత్తరం రసికత్వం లేకపోతే ఎలాగ?' 'పద్మనాబం గాడిని నాయుడు ఎముకు విరగ్గొట్టించలేదా? పద్మనాభం నాయుడు కూతురుతో యిప్పుడుండడం లేదా?' 'పోలీసులొచ్చింతర్వాత ఏం జేస్తారు?' 'మాటవాత్రంగా నాకీ కబురు చెబితే నేను నాయుడుతో రాందాసుకి చెప్పించక పోయేవాడినా?' 'ఇంతకీ మేష్టరు ఏం చేసినాడురా రాందాసూ? పిలిస్తే తప్పురా? నీమనవరాలికేమై పోయిందిరా? ఎప్పుడూఎవ్వరూ గడపమీది కెళ్ళొద్దు పోలీసు లొచ్చిందాకా?' 'రాందాసూ పూరికి చాలా మంచిపేరు తెచ్చినావురా! వయసు ముదిరిపోతే సరేనా? బుద్ధి ముదరాలి. 'పాపిష్టిముండ బంగారం లాంటి మనిషిని తినేసింది'. 'ఎల్లుండ్రా ఎల్లుండి' 'రాందాసూ ఈ అపవాదు నీదేరా. నీదే' 'రాకరాక ఇస్కూలికి మంచిమేష్టరొచ్చినాడనుకుంటే—' 'మేష్టర్లూ, ఇంటికారణాలేమైనా ఉన్నాయా తల్లీతండ్రీ సంబంధాలు బాగున్నాయా?' 'రాక్షసుపుముండే తినేసింది, మా దొడ్డమనిషి' 'పోస్ట్‌మార్టమ్ చేస్తారా??'

* * *

తల్లి సూరమ్మని కదలనివ్వలేదు. సూరమ్మని ఓదార్చటానికి ఆపిల్ల స్నేహితురాళ్లుకూడా రాలేదు. ఆపిల్లకి ఆరోజు శరీరాన్నిఒలిచి నరాలన్నీ పూడదీస్తున్నట్లయింది. ఒక్కరూ ఆపిల్లని చూట్టానికి రాలేదు. తల్లి, తండ్రీ, తాతా, నాయినమ్మా ఇంట్లో వున్నవాళ్ళు తప్పించి. సూరమ్మకి సంవత్సరం క్రితం నూతిలో పడిపోయి చనిపోయిన బ్రాంచి పోస్ట్‌మాష్టర్ పెద్ద కూతురు గుర్తుకొచ్చింది. ఆపిల్లకి వెళ్ళి బసవరాజుని చూడాలనిపించింది. తను ఈసంగతి ఇంట్లో చెప్పకుండా వుంటే యీ ఘోరం జరక్కుండా వుండేదనిపించింది. తను మంచి మనిషిని నిండు జీవితాన్ని తినేసింది. అనిపించింది. తను రాక్షసపుముండ అనుకుంది..

బాధ ఆపిల్లగుండెని క్రూరంగా సిందుతోంది.

ఆపిల్ల కళ్ళనించి రక్తం కారుతోంది.

ఆపిల్లని—ఆపిల్ల స్నేహితురాళ్ళకూడా, చూట్టానికి రాలేదు!

నేనున్నాను

మోహనుమంతరావు



డియర్ రాజా,

నువ్వీ జిల్లాకు పెద్దఆఫీసర్‌గా వస్తున్నావని తెలిసింది. నిన్ను చూడాలని వుంది. నువ్వెంత నాకు దూరమైనా నీకు దగ్గరగా రావాలనీ, నీ భుజాలపై చేతులేసి నీ కళ్లల్లోకి చూస్తూ మాట్లాడాలనీ, నా మనసులోని బాధను నీ ముందు ఉంచాలని వుంది. మళ్ళేదో నాదగ్గర దాస్తున్నావు. నా ఉత్తరాలకి జవాబు లివ్వడంలేదు. శ్యామల నన్ను విడిచి పెట్టిందా అని బాధ పడుతున్నావా? వొద్దు నేస్తం వొద్దు. నీకేమైనా బాధ కలిగితే నేను చూడలేను. నిన్ను చూడాలనివుంది. ఒకసారి నాదగ్గరకు వచ్చి "శ్యామల, నేనున్నాను. నీకోసం"—

రాజా ఉత్తరం చదవడం ఆపేసి దాన్ని నలిపి కాళ్ళ దగ్గరున్న చెత్తబుట్టలో పడేశాడు. అసలా ఉత్తరాన్ని చదవకూడదనుకున్నాడు. కాని అనాలోచితంగా చదివాడు. ఉదాసీనంగా బలంగా కణతలు రుద్దుకున్నాడు. కాని అతనికి శిరోవేదన తగ్గలేదు. శ్యామల రాసిన ఉత్తరాన్ని దూరం చేసుకున్నాడుగానీ ఆమె తాలుకు స్నేహస్మృతులకు దూరం కాలేక పోయాడు. గాఢంగానిట్టూర్చాడు. 'శ్యామల, శ్యామల.,. పరమ కిరాతకురాలు. మంచి మనసుగల మధుమూర్తి ఆత్మహత్యకి కారణమైన ఆ పాతకిని నేనెలా చూడగలను.. నేనున్నాను శ్యామలా..నీ బాధల్ని, కష్టాల్ని పంచుకోడానికి నేనున్నాను శ్యామలా..అంటూ దగ్గిరకు ఎలా తీసుకోగలను—అంటూ పరిపరి విధాల ఆలోచించాడు రాజా. అతని ఆలోచనలు భంగం చేస్తూ ఫోన్ మ్రోగింది. రసీవర్ అందుకున్నాడు.

"......"

"ఎవరూ.. నళినీదేవిగారా.. ఏమిటి విశేషాలు.."

"నిన్న అమలాపురం వెళ్ళాను. శ్యామల పరిస్థితి విషమించింది" మౌనంగా వింటున్నాడు రాజా.

"సదా మిమ్మల్నే కలవరిస్తున్నది. మీరొకసారి వెళ్ళిరండి."

"సారీ ప్లీజ్.. ఆమె ఎటువంటిపరిస్థితిలో వున్నా నేను చూడదలచుకోలేదు" అన్నాడు స్థిరస్వరంతో రాజా.

"ఆమె ఆఖరి క్షణాలలో వుంది. మిమ్మల్ని చూడాలనీ వేయి కళ్ళతో ఎదురు చూస్తుంది" ఆమె ఆర్ద్ర పూరిత స్వరంలోని ఆవేదన అతనిలో ఆలోచనలు లేపింది. అతనిమొహంపై రంగులు మారాయి. కాని నిరుత్తరుడిలా వుండిపోయాడు. అప్రయత్నంగా అతని నయనాలు సజలాలయినాయి. నళినీదేవి కంఠంలోని విషాదపు జీర అతని చెవులలో మారు మ్రోగుతోంది.

"వెళ్తాను. ఒకసారి చూసి వస్తాను అంతే" అంటూ రిసీవర్ హుక్‌కి తగిలించి గాఢంగానిట్టూర్చి, జేబురుమాలుతో మొహం తుడుచుకున్నాడు.

* * *

రైలు గమ్యం కోసం పరుగులు తీస్తున్నది. రాజా మస్తిష్కంలో చిన్ననాటి శ్యామల మెదిలింది. రాజాకి శ్యామలతో పరిచయం ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగింది. ఆరోజు పంతులమ్మ ఆరోఎక్కం వేయమంది. ఎక్కం బలపం లేక ఏం చేయాలో పాలుపోక మిగతా పిల్లల వంక చూస్తూ కూర్చున్నాడు రాజా

"ఒరేయ్ రాజా.. నీకు ఆరో ఎక్కం వచ్చునా?" తనని పిలిచింది ఎవరా అని వెనక్కి తిరిగి చూశాడు గది గుమ్మం దగ్గర కూర్చున్న శ్యామల తన ప్రశ్నని తిరిగి రెట్టించింది,

"వచ్చు..కాని బలపంలేదు.. దారిలో పారేసుకున్నాను."

"వూ!"అంటూ తలపంకించి తనపక్కన కూచున్న మధు బలపం బలవంతంగా తీసుకొని మూడు ముక్కలు చేసి రాజుకో ముక్క యిచ్చింది. "మధు పంతులమ్మగారికి చెబుతాడేమో" అన్నాడు రాజా భయంగా.

"చెప్పలేదు" అంది తన పెద్ద పెద్ద కళ్ళను విచిత్రంగా త్రిప్పుతూ. రాజా ఎక్కం వేశాడు. కానీ కొట్టింది శ్యామల. అంతలో మధు "పంతులమ్మగారు" అంటూ లేవబోయాడు. మధు చొక్కా పట్టుకొని లాగుతూ—"రేపు నీకు జీడీలు తేవద్దూ" అంది శ్యామల. అది అభ్యర్థనో లేక బెదిరింపో పాలుపోలేదు రాజాకి.

ఆ మొదటి పరిచయంలోనే యిద్దరు దగ్గరైనారు. శ్యామల రోజూ, రాజాని పిలుచుకొని పాఠశాలకి వెళ్లేది. ఇద్దరు కలిసి చదివేవారు. ఆటలాడేవారు. ఇద్దరూ మధ్యతరకం కుటుంబానికి చెందినవాళ్ళు కావడంవల్ల వాళ్ళ స్నేహం మరింత పటిష్ఠమయింది. శ్యామల పరికిణీలు వేసుతున్నది.రాజా పొడుగు

సిగులకి అలవాటు పడ్డాడు. యిద్దరూ దగ్గరున్న ఎస్టేటులోని హైస్కూల్‌లో చదివేవారు. రాజుకన్నా వయసులో ఒక సంవత్సరం చిన్నదైనా చదువులో సమానమే శ్యామల. చిలిపిగా నవ్వుతూ, నవ్విస్తూ స్మితనయనాలతో చందనపు బొమ్మలా వుంటుంది. ఎత్తైన కొండల నుంచి మిక్కిలి వేగంతో ప్రవహించే సెలయేరులాంటిది శ్యామల. ఎక్కువ మాట్లాడకుండా సదా ఆలోచిస్తూ నిర్మల తటాకంలా వుండేవాడు రాజు. కాని వారిద్దరికి పొత్తు కలిసింది. పెద్దలు ముక్కున వేలేసుకున్నారు. విరుద్ధ భావాలు గల మనసులు కలవడం విచిత్రం కదా! కాని అప్పటికి వారిద్దరు పసివారు! బాలలు!

* * *

ప్రారి చివర యిన కలిన్నెలపై ఆసీనులైన ఆఇద్దరి మనసులలోను ఏవేవో వూహాలు చెలరేగుతున్నాయి. శ్యామలిప్పుడు బాలకాదు తరుణి. ఆమె మనసులోని వూహాల్ని చెంపలలోని కెంపులు, శరీరపు వంపుల్ని పరికిణీ, ఓణి దాచలేక విఫలమవుతున్నాయి. తన విశాలమైన నుదుటిపై విచిత్రంగా లాస్యం చేస్తున్న వంకీల జుత్తులోని భావాల్ని వ్యక్తం చేయలేక విశాల నయనాలతో చూస్తున్నాడు రాజు. ఆ సోగకళ్ళల్లోని భావాలు, ఆ విస్ఫారితనేత్రాలలోని ఆలోచనలు లిప్త మాత్ర కాలం కలుసుకున్నాయి. నిరంకుశంగా రాజ్య మేలుతున్న నిశ్శబ్దాన్ని భేదించి అంది శ్యామల:

"ఏమిటి రాజూ.. అలా చూస్తావ్. నేనేం కొత్త దాన్నికాదు" యిప కలో పిచ్చిగీతలు గీస్తున్నది.

"ఏమో నా కళ్ళకు కొత్తదానివిగా కనబడుతున్నావ్" అతని మాటలు తడబడినాయి. ఆమె చెంపల్లో గులాబీలు విచ్చుకున్నాయి. ఆ అరుణిమ కళ్ళకెగ్రబాకింది.

"అది సరేగానీ యిప్పుడేం చేస్తావ్?" అంటూ మామూలు ధోరణిలో తిరిగి ప్రశ్నించింది శ్యామల.

"ఇప్పుడు ఇక్కడేం చేయలేను. నాకు భయం."

"పిల్లవాడే అనుకున్నాను అల్లరి వాడివికూడానా"

"వూఁ" అంటూ ఆమె చెంపల్ని మృదువుగా స్పృశించాడు.

"అదికాదు రాజూ.. ఇంటరు ఫస్టు క్లాసులో పాస్ అయ్యావు కదా.. యిప్పుడేం చేస్తావ్" ఆసక్తితో ప్రశ్నించింది.

"బి. ఏ. చదువుతాను" అన్నాడు మామూలుగా.

"బి. ఏ. నా, ఇంజనీరింగ్—" ఆమెమాటలకు అడ్డు వస్తూ అన్నాడు. "ఆ ఎందుకు లేనిపోని ఆశలు. మేం ఆర్థికంగా ఆరోగ్యవంతులం కాదని నీకు తెలుసుగా."

"పోనీ ఎం. ఏ. చదివి పి. హెచ్‌డి. చేస్తావా?"

"ఉహూఁ, ఏది చెప్పలేను..అసలు నేను భవిష్యత్ గురించి ఆలోచించను.. బడిపంతులుగామిగిలి పోతానేమో.. ఏమో.. నేనెప్పుడు ఆ విషయం గురించి ఆలోచించలేదు."

"నీకేఁ ఆశలు ఆశయాలు లేవా?" నిరుత్సాహంగా ప్రశ్నించింది.

"అంటే"

"పెద్ద చదువులు చదవాలనీ, ఆఫీసర్ కావాలనీ, బంగళాలో వుండాలనీ, కార్లు మీద తిరగాలనీ, అందమైన భార్యని పొందాలనీ."

"ఏమ్ శ్యామలా అవు నీ దండకం.. ఏమిటి నీ ధోరణి, ఈఆశలు, ఆశయాలు, పిచ్చి వూహాలలో ఎస్. ఎస్. ఎల్. సి. మూడుసార్లు డింకి కొట్టావ్"

"ఇప్పుడు పాస్ అయ్యానుగా.. రేపు కాలేజీలో చేరుతాను. తరువాత మెడిసిన్ చదవాలని వుంది."

"అమ్మాయిగారికి యింకేమి ఆశలున్నాయి" అంటూ కొంటెగా ప్రశ్నించాడు.

"రాజు నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను.. నన్ను నువ్వు ప్రేమిస్తున్నావా? లేదా?"

"సినిమాలు, నవలల సాహిత్యం నీకు బాగా వంట పట్టినట్లుంది. అవునులే మూడు సంవత్సరాలు—"

అతని మాటలు మధ్యలో త్రుంచివేస్తూ—

"రాజూ..నేను భవిష్యత్ గురించి ఎన్నో పసిడి కలలు కన్నాను.. నేను వివాహం చేసుకోబోయే వ్యక్తి అన్ని విషయాలలోను ఉన్నతుడిగా వుండాలి."

"నేనొక సామాన్యుడనని దేవిగారు గ్రహించాలి" అతని ధోరణిలో మార్పులేదు. ఇసుకలో పిచికల గూడుకడుతున్నాడు.

"అవును సామాన్యుడవే.. బలహీనుడవే.. జీవితంపై నీకు ఆశలు తప్ప ఆశయాలు లేవు.. ఉన్న దానితో సంతృప్తిపడే మనస్తత్వం నీది. కాని ఉన్నత పథాల్ని అందుకోవాలనే ఆశ, అరుణిమ నీలో లేవు— నీవొక అసమర్థుడివి. నన్ను నువ్వు అందుకోలేవు" ఆమె కంఠం వొణికింది. రాజు నిశ్శబ్దుడైనాడు. అనాలోచితంగా అతని చేయి తగిలి పిచికల గూడు కూలిపోయింది.

"నిజంగానా శ్యామలా" అంటూ ఆమె మొహంలోని మార్పులు గమనించడానికి ప్రయత్నించి విఫలుడైనాడు. ఆమె వేరొక దిక్కుకేసి, శూన్యంలోకి చూస్తున్నది. అంతే అతను తలవంచి యిస కలో పిచ్చిగీతలు గీస్తూ కూచున్నాడు. ఎంతసేపు కూర్చున్నాడో తెలీదు. తల ఎత్తి చూసేసరికి శ్యామల అక్కడలేదు.

* * *

"నేను ఒకచోట ఉంటే ఏలాగు.. నాకు చాలా ఎంగేజిమెంట్స్ వున్నాయి" అంది స్నేహితులతో కాలేజి స్టూడెంట్స్ ఎసోసియేషన్‌కి సెక్రెట్రి అయిన శ్యామల. స్నేహితులతో సరదాగా కాలక్షేపం చేస్తున్న శ్యామల పరీక్షలలో కృతర్థురాలు కాలేక పోయింది.

బి. ఏ. పూర్తి చేసిన రాజుకి సెంట్రల్ గవర్నమెంట్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. శ్యామల ప్రవర్తన చాలా మారిపోయిందని గ్రహించిన రాజు ఆమె విషయంలో ఎటువంటి జోక్యం కలుగచేసుకోలేదు. అధికంగా అలంకరించుకొని నలుగురిలో అందంగా కనబడాలని ఆమె పడుతున్న యాతనను ఏవగించుకునే వాడు. ఆమె నైతికంగా చెడిపోతుందేమో అని బాధ పడేవాడు. ఆమెను గురించిన దుష్ప్రచారం కూడా అతని చెవినపడింది. ఆమెను మందలించలేక మథన పడ్డాడు.

రాజు ఒకరోజున సినిమాకి వెళ్ళినప్పుడు ముందు సీటులో కూర్చున్న స్త్రీ, పురుషుల్ని చూసి విస్తుపోయాడు. జుగుప్స చెందాడు. శ్యామల భుజంపై చేయివేసి నవ్వుతూ కబుర్లు చెబుతున్నాడు మధుమూర్తి. ముప్పై ఎకరాల మాగాణి భూమికి వారసుడు మెడిసెన్ చదువుతున్న ఆమూర్తి చేతులలో మధురానుభావం పొందుతున్న శ్యామల్ని చూసి మురిసిపోలేదు రాజు. సినిమా మధ్యలో లేచి వచ్చాడు.

అమర్నాడు కాలేజి హాస్టల్ దగ్గరకు వెళ్ళాడు. బి. ఎస్. సి. చదువుతోంది శ్యామల. ఆమెను కలుసుకున్నాడు. యిద్దరు తోటలో నడుస్తున్నారు. మూడు సంవత్సరాల అనంతరం యిద్దరు ముఖాముఖి కలుసుకున్న సమయం. కాని యిద్దరి మధ్య నిశ్శబ్దం. శ్యామల అంది—

"నిన్న సినిమా మధ్యలోనే వెళ్ళిపోయావేం"

"బాగుండలేదు" నిర్వికారంగా జవాబు వెలువడింది.

"ఏమిటది సినిమానా.. ముందు సీటులోని మా ప్రవర్తనా."

"అవేంకాదు. నా మనసు"

"ఇప్పుడు నీ మనసు బాగుండదు. నాకు తెలుసు. కాని నువ్వు నన్ను పోగొట్టుకున్నావు. నేను పోలేదు. నువ్వు ఒక్కసారైనా 'నేనున్నాను శ్యామలా నీకోసం నేనున్నాను' అని అన్నావా? ఆ ధైర్యం చొరవ లేని అసమర్థుడివి నీవు. నీ వంటివాడ్ని పెండ్లి చేసుకొని ఏ స్త్రీ సుఖపడుతుంది" మౌనంగా కళ్ళు తుడుచుకున్నాడు రాజు.

"మధుని నేను వివాహం చేసుకోదలిచాను"

"చాలా సంతోషం కాని.. నీకు మధు విషయం తెలుసుగా. అతనిది మన వూరే.. కావలసిన సంబంధం.. పఠాన్ మేనమామ కూతురుంది. వాడు నిన్ను ప్రేమించినా, మేనమామ కూతుర్ని పెండ్లి చేసుకోక తప్పదు. వాళ్ళ నాన్న చండశాసనుడు."

"ఈ విషయం చెప్పడానికేనా యిక్కడకి వచ్చావు"

"వాళ్ళది మన కులంకాదు.. ఈ వివాహం—"

"థాంక్స్.. చాల శ్రమ తీసుకుంటున్నావు. మెయిన్‌గేటు తూర్పుదిక్కున వుంది" అంటూ రెండు అడుగులు వేసింది. ఆమెను వెంబడిస్తూ అన్నాడు.

"శ్యామలా తొందరపడకు. నాకో చిన్న వాగ్దానం చేయాలి.. నీ చిన్ననాటి స్నేహితుడ్ని నా చిరుకోరిక చెల్లించవా?"

"ఏమిటది" ఆమె మాటలో రాజసం ఉట్టిపడింది.

"నువ్వు మధుతో హద్దుమీరి ప్రవర్తించకు. తరువాత చింతించి లాభం వుండదు."

"సరే.. నువ్వింక వెళ్ళవచ్చు"

"థాంక్స్" అంటూ వెళ్ళిపోయాడు రాజు. అతని వంకే చూస్తూ వుండిపోయింది శ్యామల.

* * *

రాజు ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ గోదావరి స్టేషన్‌లో రైలు ఆగింది. కాఫీ త్రాగి సిగరెట్ వెలిగించాడు. అప్పటికింకా తెల్లవారలేదు. అతని మనసులో లాగా బయట అంతా చీకటి. అస్తవ్యస్తంగా ఆలోచనలు అతని మస్తిష్కాన్ని ఆవరించినాయి. మధుమూర్తి చనిపోయాడు. డజన్ స్లీపింగ్ టాబ్‌లెట్స్‌తిని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని చావుకు కారణం— జీవితంపై విరక్తి పుట్టిందనీ, ఈ ఆత్మహత్యకి ఎవరూ బాధ్యులుకారని వివరించిన వది అతను రాసిన ఉత్తరం. యిది సత్యదూరమైన విషయమని అందరికి తెలుసు. కారణం: మధుమూర్తి ఆత్మహత్య చేసుకున్న రోజునే శ్యామల

యింట్లోంచి పారిపోయింది. ఎవరితోనో లేచిపోయిం దని పుకార్లు పుట్టాయి. తాను ప్రేమించిన పడతి మరొకరితో పరారైపోయిందని విని మధు ఆత్మహత్య చేసుకున్నాడని పదిమంది పెద్దలు పంచాయితీ చేసి నిర్ణయించారు.

* * *

లాంచి బొబ్బర్లంకలో ఆగింది. బలహీనంగా బస్సెక్కి అమలాపురానికి టికెట్ తీసుకున్నాడు. శరీరకంగా సీటులో కూర్చున్నాడ కానీ మానసికంగా శ్యామల గురించే ఆలోచిస్తున్నాడు. శ్యామల పరారైపోయిందని విన్న దగ్గరనుండి రాజులో చాలా మార్పు వచ్చింది. అతనికి వివాహంపట్ల విముఖత ఏర్పడింది. మధు ఆత్మహత్యకి చాలా బలమైన కారణం వుండితీరాలి అనుకున్నాడు. "చంచల స్వభావురాలైన ఆమె చెరలో వున్నవాడు రాజా. చెరసాలలోనే చిన్నాభిన్నమై పోయినవాడు మధు మూర్తి" అని అనుకునేవాడు.

శ్యామల్ని మరచిపోవాలని ప్రయత్నించేవాడు. అతని ప్రయత్నాలకు అడ్డువచ్చేవి ఆమె రాసే ఉత్తరాలు. వాటిని చింపేసేవాడు. కాల్చేవాడు. యాదృచ్ఛికంగా రెండు మూడుసార్లు శ్యామల అతనికంట పడింది. అతనితో మాట్లాడాలని అభిలషించింది. కాని అందుకు అవకాశం యివ్వలేదు రాజా. ఆమెపట్ల అతనికి అదోరకమైన పగ, జుగుప్స, ద్వేషం ఏర్పడినాయి. ఆమె నింక చూడకూడదను కున్నాడు. కాని చూడవలసి వచ్చింది. అతని హృద యంలో ఏదో తెలియని బాధ ఆవరించింది.

* * *

ఆ యింటి ముందు ఆగాడు రాజా. శ్యామల ఉంటున్నది ఈ యింట్లోనా? అవునులే ఆమె చేసే అవినీతి పనులను దాచడానికి ఈ చీకటి గొంది లోని యిల్లే బాగా పనికివస్తుంది అని అనుకుంటూ తడుముకుంటూ కాంపౌండువాల్ గేటుతీసి లోపలికి వచ్చాడు. యిల్లు బాగా కనబడడం లేదు. ఒక గదిలో వెలుగుతున్న కొవ్వొత్తి కనబడుతోంది.

అగ్గిపుల్ల వెలిగించాడు. వరండాలో లుంగీ, బనీను ధరించిన వ్యక్తి కాలుతున్న అగ్గిపుల్లలా రాజా కళ్ళల్లో మెదిలాడు. చేయి చురుక్కుమంది.

"ఎవరండీ—" ఆ ఆగంతకుడి ప్రశ్న.

"రాఘవయ్యగారి యిల్లు ఇదేనాండీ—"

"అవును. వారు కుటుంబ సహితంగా పెండ్లికి వెళ్ళారు."

"నేను వారికోసం రాలేదు— వారింట్లో అద్దె కుంటున్న శ్యామలాదేవిగార్ని చూడడానికి వచ్చాను."

"మీపేరు రాజాగారా?"

"అవును" అంతలో దీపాలు వెలిగాయి.

"మీరు వచ్చారు దీపాలు వెలిగాయి. శ్యామల చెప్పింది నిజం." అన్నాడా వ్యక్తి తిరిగి.

"మీరెవరో తెలుసుకోవచ్చా"

"నేను, శ్యామలా ఒకే ఆఫీసులో పనిచేస్తు న్నాము. నన్ను ఆమె అన్నయ్యా అని పిలుస్తుంది."

రాజా ఆ వ్యక్తిని పరికించి చూశాడు. బాగా వయస్సు ముదిరినవాడిలా కనబడుతున్నాడు. జీవి తంలో ఏదో పోగొట్టుకున్నట్లు బాధ అతని కళ్ళల్లో కనబడుతోంది!

అంతలోనే కుర్చీ వరండాలోవేసి "కూర్చో" మన్నాడా వ్యక్తి!

"ఫరవాలేదు నేనిప్పుడు శ్యామల్ని చూడాలి."

"ముందీ ఉత్తరాలు చదవండి మీరిక్కడికి వచ్చినా రాకపోయినా మీకీ ఉత్తరా లివ్వమని శ్యామల చెప్పింది." అంటూ రెండు ఉత్తరాలు యిచ్చాడు.

ఆతృతతో అందుకొని మవునంగా చదివాడు రాజా.


డియర్ శ్యామలా,

మన భావిజీవితం గురించి ఎన్నో తీపి కలలు కన్నాం. మనం ఎన్నో అనుకున్నాం. నేను పుట్టక మునుపే నాగురించి ఎన్నో అనుకున్నారుట మా అమ్మా నాన్నా. అప్పుడే పెండ్లి సంబంధం నిర్ణ యించారుట! ఈ దేశంలోనే ఇలా జరుగుతుంది అనుకుంటాను. చిన్నప్పుడు వాళ్ళు అనుకుం టుంటే నవ్వి పూరుకున్నాను. యిప్పుడు మన వ్యవహారం వాళ్ళకి తెలిసింది! నాన్న మందలించాడు. అమ్మ బ్రతిమాలింది! మావయ్య మానిష్టైనాడు. అత్తయ్య అన్యాయంగా మాట్లాడింది. మావ కూతురు కన్నీరు కార్చింది. మనకులంకాదు. ఇదే మంత ఆరోగ్యకరమైన ప్రవర్తన కాదన్నారు పెద్ద మనుష్యులు. అందరిని విడిచి నీ దగ్గరకు వద్దామని నీ చల్లని ఒడిలో నిద్రపోవాలనీ, ఈ కలుషిత ప్రపం చాన్నీ మరిచి పోదామనుకున్నాను— కానీ, మానాన్న కీళ్ళ జబ్బుతో బాధపడులోకూడా, ప్రతీ కానీని ప్రోగుచేసి 'ఖర్చు' అనే పదాన్ని దూరం చేసుకుని తన వారసులకోసం శ్రమించేనాన్న అన్నాడు కదా: 'ఒరేయ్ అబ్బీ నువ్వీగుమ్మందాటి బయటకు వెళ్లే వంటే చాలు నాచేతులో స్లీపింగ్ టాబ్లెట్స్ సీసావుంది— అది నాకడుపులో వుంటుంది!' అంతే నేనక్కడే ఆగిపోయాను: "మమ్మల్ని అన్యా యము చేయకుబాబు. నీకోసం ఎన్ని వ్రతాలు చేశాను. పూజలు చేశాను. పది నెలలు మోసి కన్నాను, ఇప్పుడు మా కళ్ళల్లో నలుసులా మిగిలి పోకు బాబూ— అంది అమ్మ, నేనొక్క క్షణం ఆలో చించాను. మనసా, వాచా, నిన్నే వాంఛిస్తున్నాను. నేనిప్పుడు శారీరకంగా మరింకెవరికి అంకితమై పోవడం యిష్టంలేదు. అందుకని ఈ శరీరాన్నే దూరం చేసుకోదలిచాను. నేనిక వుండను! నీ కిష్ట మైన వ్యక్తిని వివాహం చేసుకో— ఆ వ్యక్తిపేరు రాజా. నాకు తెలుసు. అతను అన్ని విషయాల్లో కూడా రాజే— యిక వుంటాను... ఇట్లునీ మధు.

పి. యస్. నా మరణంతోనైనా మా అమ్మా నాన్నలాంటి వాళ్ళు కళ్ళు తెరుస్తారు. ఇకవుంటాను శ్యామలా."

రెండో ఉత్తరం చదివాడు.

డియర్ రాజా,



నువ్వు అన్నివిధాలా రాజావే. ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా గుర్తించాను. మధు రాసిన ఉత్త రము అందగానే నా మనస్సు వికలమైపోయింది. పిచ్చెక్కి నట్లయింది. ఎవరితోను మాట్లాడడ నికి కానీ, కనీసం ఎవరి మొహాల్లోకి కూడా చూడ లేక పోయాను. ఆశలతో జీవించే వారికి నిరాశా, నిస్పృహలు సదా లభిస్తాయనుకుంటాను. నేను మాయింటికి వచ్చాను. అప్పుడు నువ్వు కేంపులో వున్నావని చెప్పారు. అసలు నువ్వు కేంపులోనే వున్నావో లేక యింట్లోనే వుండి అలా చెప్పించావో తెలీదు. ఏదిఏమైనా నేనంటే నీకు అసహ్యమేర్ప డింది. నీకేకాదు చాలా మందికి. యింటికి వెళ్ళలేక పోయాను. ఆత్మహత్య చేసుకోలేక పోయాను. కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నాను. ఒంటరి అయిన స్త్రీ అంటే ఈ సంఘానికి ఎంత లోకువో కాని నేను పతనమైపోలేదు. రాజా నామాట నమ్ము. నేను మానసికంగా పతిత నయ్యాను కానీ శారీరకంగా కాదు. అనేక విషయాలు, నీతోచెప్పాలని ఉబలాట పడ్డాను. ఉత్తరాలు రాశాను. మాట్లాడ డానికి వచ్చాను. కాని ఫలితం శూన్యం. శూన్యమై పోతున్న నా హృదయాన్ని చిక్క బట్టుకొని నీ కోసం నిరీక్షించాను. నేనిప్పుడు చావు బ్రతుకుల మధ్య వున్నాను. ఒక్కసారి మాత్రం రా... శ్యామలా నిన్ని ప్రపంచం, విధి, కర్మ, వగైరా పదాలు అన్యా యము చేసినా, నేనున్నాను. నీబాధలు, కష్టాలు విని సానుభూతితో రెండు కన్నీటి చుక్కలు కార్చ డానికి నేనున్నానని అను చాలు హాయిగా సంతృప్తిగా కళ్ళు మూస్తాను...."

"ఇక చదవలేక" శ్యామలా.... శ్యామలా— నేను వచ్చాను... నీకోసం వచ్చాను." అన్నాడు రాజా బిగ్గరగా. ఎదురుగా నించున్న ఆ వ్యక్తి రోదిస్తు న్నాడు.


"మాస్టారూ... చెప్పండి... శ్యామ లెక్కడ వుందో చెప్పండి ప్లీజ్." ప్రాధేయపూర్వకంగా అడిగాడు రాజా. ఆ వ్యక్తి చేతులు పట్టుకొని సజల నేత్రాలతో ప్రశ్నించాడు. రెండు కన్నీటి చుక్కలు ఆ వ్యక్తి చేతులపై పడ్డాయి. ఒణికిపోతున్న పెద వులతో అన్నాడ:

"మీరు కన్నీరు కార్చడానికి ఆమె యికలేదు. ఈ రోజ ఉదయమే ఆ అనాఘ్రాణిత కుసుమం ఆకాశంలో లీనమైపోయింది!"

. . . . ఆ డైరీలో యిలా రాసుకున్నాడు:

మేము, శ్యామలా, కలిసి పెరిగాం. ప్రేమించుకున్నాం. ఏవేవో పిచ్చి ఆశలతో తన జీవితాన్ని పాడుచేసు కుంది శ్యామల. ఆమెను ఎందరినించి "నీకోసమే నేను ఉన్నాను"ని దగ్గరకు తీసుకోలేకపోయాను. అస మర్థుడిలా, అందరిలా ఆమెను అనాదరించాను. ఆమె దగ్గరకు వచ్చినా దూరం చేసుకున్నాను. కాని మనసులో ఆమెపట్ల ముక్కువ మాసిపోలేదు. నా హృదయంలో ఆమె ప్రేమ చెరిగిపోలేదు. అందుకే వెళ్ళాను. శ్యామల్ని చూడాలని, నా ప్రేమను పంచి యివ్వాలని— కాని నేను వెళ్ళేసరికి ఆమె లేదు. అప్పటికే ఆలస్యమయింది. ఇక వేచించుకో లేను. ఏమని రాయగలను— శ్యామలా నీకోసం నేనున్నాను కాని నువ్వు లేవు.... నువ్వు లేవు శ్యామలా.. నేనున్నాను..... నువ్వు లేవు శ్యామలా—

కొత్త సీరియల్ ప్రారంభం!



అది పవిత్ర 'చతుర్మాస్' (వర్షర్తువు) కాలం. ఆ ఉదయం వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. వేకువ జామునుంచీ 'మాహులీ' గ్రామం చాలా సందడిగా ఉంది. మామిడాకు తోరణాలు, కొబ్బరి కాయలు, పువ్వులతో అందంగా అలంకరించి ఉన్న ఒక పందిరి ముందు మోగుతున్న సన్నాయి వాద్యం గ్రామ ప్రజలని ఆహ్వానిస్తోంది. ఆ పందిరిని ఒక సంపన్ను డయిన 'సర్దార్' వేయించాడు. ఆయన వూరు పూనా. పీష్వా అనుగ్రహం వల్ల 'సుబేదార్' పదవి లభించింది. ఉద్యోగంలో చేరటానికని ఉత్తరదేశానికి పయనమయి దారిలో ఇక్కడ ఆగాడు. పవిత్ర కృష్ణానదీ తీరం మీద వున్న మాహులీ పండితులకి ప్రసిద్ధి చెందినది. అందులో చతుర్మాస్ కాబట్టి సర్దార్ గ్రామంలోని పండిత వర్గానికి దక్షిణలు ఇప్పించే ఏర్పాట్లు చేశాడు.

ఈ వార్త విన్న బ్రాహ్మణులు—పిన్నలూ పెద్దలూ కూడా—అక్కడ పోగయ్యారు. ఇక శుభకార్యం ప్రారంభం కాబోతున్నదనగా ఒక చిన్న అసభ్యకరమయిన సంఘటన జరిగింది. మధ్యవయస్కుడయిన బ్రాహ్మణుడొకతను ఏడెనిమిదేళ్ల పిల్లవాడిని బల వంతంగా ఈడ్చుకు వచ్చాడు. పందిరి లోపలికి వెళ్లే ముందు అతని చెవిలో ఇలా వూదాడు:— "ఇదిగో రావ్! మళ్లీ చెబుతున్నాను జాగ్రత్త! ఇవాళ దక్షిణ పదుల కొనటానికి వీల్లేదు తెలిసిందా! ఎవరయినా అడిగితే గ్రామపాఠశాలలో చదువుతున్నానని ధైర్యంగా చెప్పెయ్యి...."

"కాని మామయ్యా— పాఠశాలకే వెళ్లనివాడిని కదా! ఎలా చెప్పను?" అని వెక్కిళ్ల మధ్య అడిగాడు చిన్నపిల్లవాడు.

"నోర్ముయ్." అని రహస్యంగానే బెదిరించాడు అతని మామ హరిభట్. అతని చెవి మెలేస్తూ, "నే చెప్పినట్లు చెయ్యకపోయావా చీరేస్తాను." అంటూ రావ్‌ని మొరటుగా లోపలికి నెట్టాడు.

పందిరిలోని గుంపునీ, వేదిక మీద ఆడంబరంగా అలంకరించుకుని కూర్చున్న సర్దార్‌నీ, అతనికి ఇరు వైపులా ఎర్ర శాలువలు కప్పుకుని కుండలాలు ధరించి కూర్చున్న ఇద్దరు పండితులనీ చూడగానే రావ్ భయం మరింత ఎక్కువ అయింది.

"దాతగా, పండిత పోషకులుగా పూనా నగరంలో అశేష కీర్తి గడించిన ధర్మప్రభువులు మన అధిపతి సర్దార్ తరపున మీకందరికీ స్వాగతం పలుకుతున్నాను!" అన్నాడు వారిద్దరిలో ఒక పండితుడు గంభీరంగా.

వెంటనే రెండవ పండితుడు, "సోదరతుల్యులయిన పండితులంతా ముందుకి వచ్చి తమ అర్హతలని వివరించి వీరు ఇచ్చే దక్షిణ స్వీకరించవచ్చు!" అని, కొన్ని క్షణాలు ఆగి మళ్లీ ఇలా అన్నాడు: "అయితే విద్యార్హతలు లేనివారు పండిత పోషణ కోసం ఇస్తున్న ఈ దక్షిణ స్వీకరించరాదని గ్రహించాలి! పంచమ మహా పాపం అని గమనించాలి!"

రెండవ పండితుని చివరి వాక్యం రావ్ వ్యాకులాన్ని మరింత అధికం చేసింది. పందిరి నుంచి జారుకుందామని ప్రయత్నించాడు కాని తన మామ పట్టు వదిలించుకోలేకపోయాడు. హరిభట్టు అతని మొహంలోకి ఉరిమి చూసి తొడపాశం కూడా పెట్టాడు.

దక్షిణలు ఇవ్వటం ప్రారంభం అయింది. ఒక్కొక్కరూ వేదికని సమీపించి పండితులకి తమ విద్యార్హతలని వివరించారు. వారు వాటిని క్షుణ్ణంగా పరీక్షించి తగిన దక్షిణ ఇప్పించి పంపేశారు.

విద్యాహీనుడయిన హరిభట్ వంతు వచ్చింది. అతను పండితులకి అతివినయంగా నమస్కరించి, "అయ్యా! నా పేరు హరిభట్. 'దశగ్రంథి'ని; ఈ గ్రామం కాదుకాని స్వగ్రామమయిన 'వాయీ'లో నా పాండిత్యాన్ని ఎరగనివారు లేరు." అన్నాడు. పండితులకి ఇతని వాలకం అనుమానాస్పదంగానే ఉన్నప్పటికీ తమ ప్రశ్నలకి గడుసుగానే సమాధానాలు ఇవ్వటం చేత అయిదు వెండి రూపాయలు దక్షిణ ఇప్పించారు. హరిభట్ రావ్‌ని చూపించి, "వీడు నా మేనల్లుడు. గ్రామ పాఠశాలలో చదువుకుంటున్నాడు. చాలా బుద్ధిమంతుడు." అన్నాడు.

రావ్ అమాయకపు చూపులు పండితులని ఆకర్షించాయి. అతని విద్యాభ్యాసాన్ని పరీక్షించటానికి ప్రయత్నించకుండానే అతని చేతిలో ఒక రూపాయి ఉంచారు. "బాబూ నువ్వు బుద్ధిమంతుడివిగా చదువుకుంటున్నందుకు చాలా సంతోషం. ఇంకా బాగా చదువుకుని గొప్ప పండితుడివయి పేరు తెచ్చుకోవాలని ఆశీర్వదిస్తున్నాము" అన్నారు.

కరుణాపూరితాలయిన వారి మాటలు రావ్ అంతఃకరణాన్ని కదిలించి వేశాయి. కళ్ల వెంబడి నీరు వచ్చాయి. తలవంచుకుని గద్గదస్వరంతో "అయ్యా క్షమించండి! నేను చదుకోవటం లేదండి— అసలు పాఠశాలలో ఎప్పుడూ చదువుకోలేదండి!" అని చప్పున రూపాయిని వేదిక మీద ఉంచేసి నేరుగా ఇంటికి పరిగెత్తుకుని వెళ్లిపోయాడు.

పందిరిలో అల్లకల్లోలం బయలుదేరింది. తమ మోసం చెయ్యటమేకాక పసివాడికి సంయితం పంచించటం నేర్పుతున్నాడని హరిభట్టుని అందరూ నానా మాటలూ అన్నారు. అతను చేసేది లేక చల్లగా బయటికి జారుకున్నాడు.

భర్త పోయిన తర్వాత రాధాబాయి ఇరుగుపొరుగు వారి ఇళ్లలో ధాన్యం దంచి, పిండి విసిరి జీవితం సాగిస్తోంది. ఈ అతిస్వల్పమయిన అర్జనతో రెండు పూటలూ సరిగ్గా గడవని ఆమె తన కొడుకు రావ్‌ని పాఠశాలలో ఏమి చదివిస్తుంది? కొన్ని నెలలుగా వరసకి అన్నగారయిన హరిభట్ స్వగ్రామం వదిలి వచ్చి ఆమెతో ఉంటూ వీలయిన సహాయం చెయ్యటం చేత కొంత తెరిపిగా ఉంది. ఉదయం జరిగిన సంఘటనతో ఆమెకి ఈ సహాయం కూడా లోటయింది. నిప్పులు కక్కుతూ వచ్చిన హరిభట్, ముద్దుచేసి చెడగొట్టటం వల్లనే పిల్లవాడిలా తయారయ్యాడని చెల్లెలి మీద మండిపడి, ఆమె ఎంత ప్రాధేయపడినా వినిపించుకోకుండా మూటాముల్లె ఎత్తుకుని స్వంత వూరు వెళ్లిపోయాడు.

తల్లి దుఃఖాన్ని చూసిన రావ్ చాలా బాధపడ్డాడు.

"అమ్మా మామయ్య వెళ్లిపోయాడని నా మీద కోపంగా ఉంది కదూ! కాని నేను ఆయన చెప్పిన పని చేస్తే నన్నింకా కోప్పడే దానివి." అని జరిగినదంతా చెప్పాడు.

రాధాబాయి కోపం మటుమాయమయిపోయింది. "బాబూ రావ్. అనవసరంగా నీ మీద కోపం తెచ్చుకున్నాను! దేవుడికి మన మీద దయలేదు. దానికి బాధపడను కాని భగవంతుడు నీకీ వయసులోనే ఇంత గొప్ప బుద్ధి నిచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది!' అంటూ కొడుకుని హృదయానికి హత్తుకుంది.

రావ్ భయం పోయినా అతనిలో మరొక భావం మొలకెత్తింది. దక్షిణ ఇచ్చిన పండితులకి చదువు మీద ఎంత గౌరవం ఉందో చూసిన అతనికి తనూ చదువుకుంటే బాగుండుననిపించింది.

"అమ్మా ఇంకోటి చెప్తాను కోప్పడవుగా? మనం బీదవాళ్లం, నేను పాఠశాలలో చదుకోలేను. కానీ, మన జాగిర్దార్‌గారి అబ్బాయి 'భయ్యాసాహెబ్' నా ఈడు వాడే! అతని కోసం పండితుడు ఇంటికొచ్చి చదువు చెప్తాడు. కొందరు పిల్లలు కూడావచ్చి పాఠాలు వింటారు. నీకు జాగిర్దార్‌గారి ఇంటావిడ తెలుసు కదా! నన్నూ పాఠాలు విననివ్వమని ఆవిడతో చెప్పవూ?" అని వేడుకున్నాడు.

"అలాగే రావ్! కాని నువ్వు వట్టి అల్లరివాడివి! అక్కడేం గొడవ తీసుకొస్తావోనని నా భయం. నీ చదువే కాకుండా నాఉద్యోగం కూడా వూడకుండా బుద్ధిమంతుడిగా ఉండాలి తెలుసా!"

"లేదమ్మా నేనేం అల్లరి చెయ్యను! ఇవాళే వెళ్లి ఆవిడకి చెప్పవూ?" రావ్ చాలా ఉత్సాహంగా అడిగాడు.

మర్నాటి నుంచి రావ్ జాగిర్దార్‌గారి ఇంట్లో పాఠాలు వినటం మొదలుపెట్టాడు. ప్రతిరోజూ విన్నవన్నీ తల్లికి చెప్పేవాడు. కొడుకు చురుకుదనానికి



ఆవిడ పొంగిపోయేది. కాని ఈ ఆనందం ఎన్నోరోజులు నిలవలేదు.

ఒకనాడు పండితుడు జాగిర్దార్‌గారు పిలిస్తే లోపలికి వెళ్ళాడు. ముఖ్య శిష్యుడు భయ్యాసాహెబ్ పిల్లలందరినీ బిళ్ళంగోడు ఆడటానికి తీసుకువెళ్ళాడు. గారాబానికి అలవాటు పడ్డ పిల్లవాడు కాబట్టి ఆటలో నియమాలని అనుసరించకుండా ఓడిపోయినప్పుడు కూడా కర్ర వదిలేవాడుకాదు. రామ్ దీనిని సహించ లేకపోయాడు. రెండుమూడు సారులు వూరుకుని అతని చేతిలోని కర్రని బలవంతంగా లాక్కున్నాడు. భయ్యాసాహెబ్‌కి కోపం వచ్చింది. రామ్ తనని కొట్టాడని గట్టిగా ఏడవటం మొదలుపెట్టాడు.

శిష్యుడి ఏడుపు విన్న పండితుడు హడావుడిగా బయటికి పరిగెత్తుకు వచ్చాడు. కోపాన్నంతా రామ్ మీద చూపించి అతను చెప్పింది వినిపించుకోకుండా వాలుగు వాయించి, "భయ్యాసాహెబ్ కాళ్ళ మీద పడి క్షమించమని వేడుకో" అని గద్దించాడు.

రామ్ ఈ అన్యాయాన్ని సహించలేక విదిలించుకుని పారిపోయాడు. పారిపోయాడేకాని తన తల్లికి రాబోయే కష్టాలు తలుచుకున్నప్పుడు అతనికి కన్నీ రాగలేదు. తన వల్లనే ఆమె ఆర్జన కాస్తా తగ్గిపోతుందని తనని తనే తిట్టుకున్నాడు.

అదేసమయంలో 'జాన్‌బా' అనే రైతు తన ఎడ్లబండి అటు తోలుకుపోనటం చూశాడు. రామ్ తండ్రి బతికి ఉన్నప్పుడు జాన్‌బా, అతనూ మంచి స్నేహితులు. తన మిత్రుడు మరణించిన తర్వాత జాన్‌బా ఆతని భార్యనీ, కుమారుడినీ మరచిపోకుండా అభిమానంగానే చూసుకునేవాడు.

రామ్ ఒక్క ఉదుటున బండి వద్దకి పరిగెత్తుతూ, "ఎంతదాకా వెడుతున్నారండి?" అని అడిగాడు.

"సతారా, ఏం వస్తావా?" అని జాన్‌బా నవ్వుతూ ఎదురు ప్రశ్న వేశాడు.

"అవును!" రామ్ జాన్‌బా ఆశ్చర్యం నుంచి కోలుకోకముందే తన కథంతా చెప్పి సతారాలో 'అన్‌గల్ షావుకార్' ఇంట్లో పని ఇప్పించమని వేడుకున్నాడు. జాన్‌బా అన్‌గల్ షావుకార్ ఇంట్లో గడ్డివేస్తూ ఉంటాడని రామ్‌కి తెలుసు. జాన్‌బాకి రామ్‌ని చూస్తే జాలి వేసింది.

"సరే ఎక్కు!" అన్నాడు.

రామ్ సంతోషంగా బండిలోకి ఎక్కి కూర్చున్నాడు. అయితే వూరి పొలిమేర దాటేముందు దారిలో ఎదురయిన వారిని ఒకరిని తను జాన్‌బాతో సతారా వెళ్ళి పనిలో చేరబోతున్నట్లు తల్లితో చెప్పమని కోరాడు. (ఉత్తరాల పేజీ చూడండి)

(సశేషం)

వారఫలం

6-1-1967 శుక్రవారం మొదలు 12-1-1967 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో వారం ప్రారంభంలోనే చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల్లో భేదాభిప్రాయాలు వస్తాయి. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలు ఫలించగలవు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృషభం : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనిపించిన అనుకూలత ఆఖరు వరకు నిలవదు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో యితరుల జోక్యం వలన ఆటంకాలు కలుగుతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో చికాకులు యేర్పడతాయి. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీ కృషి ఫలించగలదు.

మిథునం : ప్రయత్నించిన పనులకు ఆటంకాలు రావడం అనుకోని వ్యవహారాలు నెరవేరడం వంటి సంఘటనలు జరుగుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వృత్తిలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. సాంఘిక కార్యక్రమాలకు అనుకోని మార్పులు వస్తాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా నెరవేరుతాయి. అలంకార వస్తువులు కొంటారు.

కర్కాటకం ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలవల్ల కేవలం తాత్కాలికమైన లాభమే కాకుండా మున్ముందు కూడా ఉపయోగం ఉంటుంది. వ్యాపారంలో ప్రయోజనం గల పరిచయాలు యేర్పడుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

సింహం కొన్ని వ్యవహారాల్లో మీరు యితరుల మంచిని కూడా కోరడం వలన మీరే యిబ్బందికి గురి కాగలరు. వృత్తిలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. వ్యాపారంలో శ్రమ మీద అనుకూలతను సాధించగలరు. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు.

కన్య : వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా దానికి తగిన ఫలితం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలత లభించగలదు. ప్రయాణాలు శ్రమ మీద ఫలించగలవు.

స్త్రీలకు—ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా నిర్లక్ష్యం చేయడం తగదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

తుల : వ్యాపారంలో మీ ఆలోచనలు మీకే కాకుండా మీ మిత్రులకు కూడా లాభదాయకంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో సాటివారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

వృశ్చికం : గ్రహబలం అనుకూలంగా ఉంది. వృత్తి వ్యాపారాల్లో మీ ఆలోచనలు సరియైనవని రుజువు కావడం వలన ఆదాయంతోపాటు అంతస్తు కూడా పెరుగుతుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. మీకు మున్ముందు ఉపయోగించగల వ్యక్తులను కల్సుకొంటారు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

ధనుస్సు : వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు. వారంమధ్యలో మంచి పరిస్థితి యేర్పడుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

మకరం : కొన్నివ్యవహారాల్లో మీరు మొగమాటాలకు లొంగిపోవడం వలన కార్యభారం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాల్లో ఆదాయవ్యయాలు రెండూ పెరుగుతాయి. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభించగలవు.

కుంభం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయం బాగానే ఉంటుంది కాని అకారణంగా సాటివారితో భేదాభిప్రాయాలు వస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు శ్రమ మీద నెరవేరుతాయి. అధికవ్యయం జరుగుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు.


స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరుతాయి.

మీనం : వృత్తి వ్యాపారాల్లో యిదివరకు యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. అవసరానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. వృత్తిలో సాటివారితో యేర్పడిన పోటీ తగ్గుతుంది. ఉద్యోగంలో అధికారులు కూడా మీ అభిప్రాయాలను గౌరవిస్తారు. స్థిరాస్తి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

—మహేష్


అబ్బ
జలుబు ఎంత
భారంగా వుంది!




VICKS
VapoRub
VICKS
VapoRub
ఫేమిలీ సైజుసీసా
కొని డబ్బు పొదుపు
చేసుకోండి.

గాజుకుప్పె

శివల జగన్నాథరావు

ఆకాశం అంతా నిండుగా మబ్బు పట్టి వుంది. చిటి గాలి స్పర్శ వంటిని జివ్వుజివ్వు మనిపిస్తోంది.

సూట్‌కేసు సర్దుకోవటం ముగించి వరండాలోకి వచ్చిన శ్రీహరి మెడ ఎత్తి నాలుగు పక్కలా చూసి నిట్టూర్చాడు. లోపలి గదిలో నుంచి పిలుపు వచ్చింది. "వస్తున్నాను బాబాయ్" అంటూ లోపలికి వెళ్ళాడు. గదిలో పడక కుర్చీలో చేరగిలబడి చుట్ట కాల్చు కుంటున్న వాసుదేవరావుగారు అడుగుల చప్పుడు విని ముందుకి వంగి అన్నారు.

"అయితే వెళతావంటూ వచ్చుమాట?"

"వెళ్ళక తప్పదు బాబాయ్"

శ్రీహరి మెల్లిగా జవాబిచ్చాడు. వాసుదేవరావుగారు చుట్టని ప్రక్కన విసుగ్గా పడేసి "మొండి. మొండి" అంటూ చేత్తో నుదుటు కొట్టుకున్నారు. శ్రీహరి పెదవుల మీద బాధతో కూడిన చిరునవ్వు మెదిలి మాయమైంది. మొహం తిప్పుకొని "పిన్ని విష యంలో మొండి వాడిని అనక తప్పటంలేదు బాబాయ్' అని సూట్‌కేసు ఎత్తి పట్టుకుని ద్వారం వేపు నడి చాడు.

వాసుదేవరావుగారి మొహం ఎర్రబడింది. తనలో ఉద్భుతమౌతోన్న ఆవేశాన్ని బలవంతాన అదిమిపట్టి కంఠంలోకి సౌమ్యతని తెచ్చుకుని "అదక్కడ దించి ఇలా వచ్చికూర్చో శ్రీహరీ! నా మాట విను!" అన్నారు.

"ఎంతసేపూ మీరు చెప్పేది ఒకటే మాట బాబాయ్. అది విని విని విసిగిపోయాను. క్షమించండి. ఇంక వినలేను" అనేసి శ్రీహరి విసురుగా నడుచు కుంటూ వెళ్ళిపోయాడు.

బాధతో బాధపడుతోన్న శ్రీహరి బరువుగా వచ్చాడు తన వంట్లో వున్న ఒక్కొక్క శక్తిని లాక్కుపోతు న్నట్లువుతుంటే సత్తువని కూడదీసుకుని "నీకు కూడా నేను పలకనంయిపోయానురా శ్రీహరీ!" అంటూ పెద్దగా అరిచి పడక కుర్చీలో వెనక్కి వాలి పోయారు వాసుదేవరావుగారు.

*　　*　　*

రైలు కదిలింది.

శ్రీహరి బాబాయిని తలచుకొని నిట్టూర్చాడు.

తను చెయ్యకూడని పాపం ఏదో చేస్తున్నాడేమో అనిపించింది ఓ క్షణం అతనికి. బాబాయిని బాధ పెట్టడమే తను చేస్తున్న పాపమా?

శ్రీహరి తల విదిలించుకున్నాడు. 'లేదు. లేదు. తను మూర్ఖుడయి బాబాయిని బాధపెట్టడం లేదు. దుర్మార్గుడయి అతనితో కారణంలేని విరోధం తెచ్చు కోవటం లేదు. పిన్ని గురించి.. ఆవిడ విషయంలో ఏది ధర్మం? ఏది అధర్మం అని బాబాయితో వాదించి, చెప్పాడు. అంతే. అది తను బాబాయిని బాధ పెట్ట డమా?...

శ్రీహరి ఆలోచనలో పడ్డాడు. బాబాయితో తను ఇప్పుడు కాదు. ఎప్పుడూ విరోధపడడు. ఆ సమయం ఎప్పుడూ రాకూడదనే దేవుణ్ణి ప్రార్థిస్తాడు. ఎండలో కంటే బాబాయి తనకి చల్లని నీడ ఇచ్చిన గొడుగు. తను ఆయన వలన పొందిన ఉపకారం తల్చుకున్న ప్రతిమారు గతం కళ్ళకి కట్టకమానదు..విచిత్రమైన పుట్టుక తనది. జన్మ ఇచ్చిన తండ్రి బిడ్డని శత్రు వులా చూస్తాడంటే సాధారణంగా ఎవరూ నమ్మరు. తనని భూమి మీద వదులుతూనే తన తల్లి భూమిలో కలిసిపోవటం తన పాలిట పెద్ద దురదృష్టం. అపు రూపంగా చూసుకుంటున్న భార్య ఉన్నట్టుండి ఈ లోకాన్ని వదిలిపోతే కలిగిన దుఃఖం, ఆ దుఃఖానికి కారకుడుగా కనిపిస్తున్న కొడుకు పట్ల ద్వేషంగా మారిందని అమ్మమ్మ వాళ్ళు అనుకొంటుంటే తెలిసేది. ఆ ద్వేషానికి కొలబద్ద లేదు. కళ్ళబడితే తిట్లు, శాపనార్థాలు, చేతికి చిక్కితే ప్రాణం పోయేంత గట్టిగా దెబ్బలు నాన్న నుండి తనకి లభించేవి. ఇలా ఒక పదేళ్ళు ఆ ఇంట్లో యముడు లాంటి నాన్న సమక్షంలో నరకం అనుభవించాడు తను.

ఒకరోజు నాన్నకి వరసకి తమ్ముడైన వాసుదేవరావు గారు ఏదో పని వుండి వచ్చారు. పని మీద ఆయన ఇంట్లో వున్న మూడురోజుల్లో మూడు జన్మల అనుబంధం ఇద్దరి మధ్య ఏర్పడింది. కారణం తను అంతవరకు ఎరగని అభిమానం పితృవాత్సల్యం వాసు దేవరావుగారి నుండి చవిచూడటమే! ఆవేళ ఆయన వెళ్ళిపోవాల్సిన రోజు. ఆ ఉదయం ఎందుకో నాన్న తనని పేముబెత్తంతో కొట్టారు. ఇలాంటిదౌర్భా గ్యుడు తన కళ్ళకి అనునిత్యం అపుపించే కంటే చస్తేనే నయమన్నారు. అదే సమయంలో వాసుదే



రావు గారక్కడికి వచ్చారు. అంతకు ముందు మూడు రోజులుగా తనకి ఆ ఇంట్లో వున్న స్థానం, విలువ ఎలాంటివో చూచి తెలుసుకున్న ఆయన నాన్న దగ్గర తన అభిప్రాయాన్ని బైట పెట్టారు.

"మీ కభ్యంతరం లేకపోతే శ్రీహరిని నేను తీసుకు వెళ్దామనుకొంటున్నాను ప్రకాశం" అని. అంతకంటే సంతోషకరమైన విషయం లేనట్టు నాన్న తలూపగా, తనకీ అంతే అన్నట్టు ఉత్సాహంగా వాసుదేవరావుగారి వెంట ఆయన ఇంటికి వచ్చేశాడు తను. తరువాత రెండు సంవత్సరాలకి నాన్న హృద్రోగంతో చనిపోయి నట్టు తెలిసింది.

వాసుదేవరావు బాబాయిది అదొక రకమైన తీరు. పైకి ఎంతో నిండుగా, సరళంగా గలగల నవ్వుతూ మాట్లాడే ఆయనలో ఏదో బడబానలం దాగి వుం దేమో అనిపించేది. ఒక్కో అర్ధరాత్రి నిద్రపోకుండా కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ అలా వుండి పోయే బాబాయిని చూస్తే, తన గురించి సంభాష ణలో విషయం రానంత వరకు ఎంత ఉల్లాసంగా వున్నా వుండేవారు. వచ్చేసరికి గంభీరంగా అయి పోవటమో, ప్రసంగం మార్చటమో చేసేవారు. తను బాబాయిని ఎరిగి వున్నంతవరకు ఆయన ఉద్యోగం అన్నది ఏదీ చెయ్యగా చూడలేదు. ప్రతినెలా మొదటి వారం ఏలూరు నుంచి మనియార్డరు వస్తుంది. ఎవరి దగ్గర నుంచి అని అడిగితే 'పిన్ని దగ్గరి నుంచి' అని మాత్రం ముక్తసరిగా చెప్పి వూరుకునేవారు. ఈ జవాబు తనలో ఎన్నో ప్రశ్నల్ని పుట్టించేది. తనవి పరిష్కారం కాని ప్రశ్నలు.

బాబాయి సిద్ధాంతాలు తనకి వింతగా కుతూ హలంగా వుంటాయి. బడి చదువులు పరీక్షలు ప్యాసు కావటానికి, పురాణేతిహాసాలయిన రామాయణ,భారత భాగవతాదులు జ్ఞానార్జనకు, హిందూ నియమ నిష్ఠానుసరణలు వ్యక్తి పురోభివృద్ధికి అంటాడు బాబాయి! పిల్లలు లేని బాబాయి ఇష్టపడి తెచ్చు కొన్నందుకు తన సిద్ధాంతాల కనుగుణంగానే తనని మల్చుకున్నాడు. తను కూడా ఆయన్ని ఓ దైవంలానే ఎంచుకుని పూజించాడు.

ఒకే ఇంట్లో వున్న తామిద్దరి మధ్య ఎప్పుడూ అభిప్రాయభేదాలు రాలేదు. ద్వేషించుకోవటానికి, దూషించుకోవటానికి అనువైన స్థితిగతులే ఎదురవ లేదు. నాలుగురోజుల క్రిందట ఆ ఉత్తరం రాకపోతే బాబాయికీ తనకీ మధ్య వైషమ్యమే మొలకెత్తేది కాదు

ఆరోజు కాలేజి నుంచి వచ్చి సైకిలు దిగుతుంటే అప్పుడే ఇంటి ముందు వచ్చి ఆగిన పోస్టు జవాన్ ఒక కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు. అప్పుడప్పుడూ బాబాయి పేర్న వచ్చే ఉత్తరాలలో, తరచు ఎమ్. వో. కూపన్లలో కనిపించే వ్రాతే అది. బాబాయికీ ఈమధ్య దృష్టి మాంద్యం ఏర్పడింది కనుక ఆయన దగ్గరిగా కూర్చుని చదివాడు.

"పూజ్యులైన వాసుదేవరావుగారికి,

మొన్న పంపిన డబ్బు ఎప్పటికంటే ఆలశ్యముగా అందినందుకు విచారిస్తున్నాను. నాకు సుమారు నెల రోజుల్నుంచి వంట్లో అస్వస్థతగా ఉంటోంది. మొన్న అమ్మాయి రమణి నన్ను మందలించి డాక్టర్ని పిల్చి చూపించింది. డాక్టరు నా అస్వస్థతకి ఏదో పెద్ద పేరు పెట్టాడు. బ్రతికే ఆశలేదని చెప్పటానికి జంకు తున్నాడని నా అనుమానం. నా దొక ప్రార్థన. నమ్మ దిస్తారని ఆశిస్తాను. చనిపోయే ముందు ఒక్కసారి శ్రీహరి బాబుని చూడాలని వుంది. ఈ, నా కోరిక అప్రస్తుతమూ, అసమంజసమూ కాదు. బాబుని చూడాలని నాకు ఎప్పటి నుంచో వున్నది. ఇంత కాలమూ నా కోరికని బైట పెట్టడం వలన మీతో విరోధపడవలసి వస్తుందని, మీ మనసు నొప్పించవలసి వస్తుందని వూరుకున్నాను. దాన్ని నాలోనే అణచు కున్నాను. ఇప్పుడు నా శరీరమూ, శక్తీ నా అదుపులో లేవు. కోరికలు బైట పడుతున్నాయి.

మూవు మాత్రంలో పోయేదేమీ లేదు కనక ఈ పిన్ని ఆకాంక్ష బాబుకి తెలుపుతారు కదూ?

కడసారి చూపులతో బాబు కోసం ఎదురు
చూచే మీ అచ్యుతం."

ఆ ఉత్తరం తనలో లేపిన కల్లోలం ఇంతింతకాదు.

"బాబాయ్! పాపం పిన్నికి జబ్బుగా వుందట. వెళ్ళనా?" అని అడిగితే, "వద్దు" అన్నాడు బాబాయి.

తను శ్రేయస్సు కాంక్షించిన భీష్ముడు అవసాన దశలో దప్పిక తీర్చమని కోరితే అర్జునుడు తక్షణం భూమిలోకి బాణాన్ని కొట్టి వచ్చిన జలంతో తాత దాహాన్ని తీర్చాడట ఆనాడు!

పిన్ని భీష్ముడు అనుకుంటే బాబాయి అర్జునుడు అవలేదు. ఆవిడ పాలిట యముడయ్యాడు. ప్రాణ దాత అర్జునుడు. ప్రాణగ్రహీత ఇతను! అదికట్టు లేనంత కోపం వచ్చింది తనకి.

"పిన్ని దగ్గరికి వెళ్ళకపోతే ఆవిడ చచ్చిపోతుంది బాబాయ్" అన్నాడు ఎలాగో కోపం మింగుతూ. దానికి బాబాయి సమాధానం ఇది. "ప్రాణం పోయే మాటుంటే నువ్వూ నేనూ ఎవరం వెళ్ళి అడ్డలేం. మనం అక్కడికి వెళ్ళినంత మాత్రంలో అది బ్రతికి పోదు, కనక వూరుకో."

తొలిసారిగా తన రక్తం ఉడికింది. "పిన్ని ఎవరో రోడ్డు మీద పోయే ఒక అపరిచితురాలు కాదు బాబాయ్. మన పిన్ని. అనంగులైన మీకీ దశలో కాలం సౌఖ్యంగా వెళ్ళేందుకు తోడ్పడుతున్నది. అంతకంటే పదిరెట్లు సహాయపడుతున్నది మీకొడుకు భావిని బంగారు మలామా చేసేందుకు. ప్రత్యక్షంగా చూస్తున్న ఈ నిజాన్ని నేనెలా మరవగలను?" అంటుంటే బాబాయి కంఠం ఖంగుమంది.

"శ్రీహరీ! మాటలు మీరుతున్నావు. ఈ కాలానికీ కళ్ళు సరిగ్గా అవుపించకపోబట్టేగాని ఈ భూమ్మీద పడిందగ్గర నుంచి మీ పిన్నే పెట్టి పోషించిందా నిన్నా, నన్నా? ఏమోయ్! నిన్ని ఇంటికి తెచ్చిందెవ రసలు? మీ పిన్నేనా?"

ఏం చెబుతాడు తను? కన్నీళ్ళతో బాబాయి చేతులు పట్టుకున్నాడు.

"గతాన్ని త్రవ్వుకున్నందు వల్ల ఇద్దరికీ మనో వ్యథే తప్ప మరేమీ లేదు. నేను అన్నది అర్థం చేసు కోండి. ఇన్నాళ్ళుగా మన నుండి ఏ ప్రతిఫలం ఆశించ కుండా మన క్షేమం కోరే ఆవిడ, ఈనాడు వాంఛించిన స్వల్ప కోరికని త్రుణీకరించటం మనుషులుగా మనం చెయ్యవలసిన పని కాదంటున్నాను. వెళ్ళి కనిపించి నంతలో మనదేం పోతుందో నాకు తెలీదు. మీమధ్య ఆవేశాలు, కక్షలు అంటూ వున్నా అవి చూపించు కోవల్సిన సమయం ఇదికాదు. నన్ను వెళ్ళనీండి.." ఇలా ఎంతసేపో, ఎన్నెన్నో చెప్పినా బాబాయి 'నసే మిరా' అన్నాడు. ఎందుకో ఆయనకి పిన్ని మీద అంత కక్ష. వారిద్దరిదీ విచిత్రమైన విరోధంలా కనిపి స్తుంది.

"బాబాయికి పిన్ని అక్కరలేదు. ఆవిడ డబ్బు కావాలి.

పిన్నికీ బాబాయి అక్కరలేదు. కాని అతని సుఖం కావాలి. సంతోషం కావాలి! ఇద్దరి మధ్య కొన్ని వందల మైళ్ళ దూరం!...

పెట్టెలో ఎవరో కెవ్వు మనటంతో శ్రీహరి ఆలోచన లాపి అటు చూశాడు. మూడేళ్ల పిల్ల. తల్లి కొంగు పట్టుకు లాగుతూ ఆవిడ భయంగా మీదికి చూస్తూ సముదాయించిన కొద్దీ ఏడుస్తోంది. పై బెర్తు మీద పడుకున్న ఆసామీ ఆపిల్ల తండ్రి కాబోలు "దాన్ని వూరుకోపెట్టు. లేకపోతే నాలుగు తగిలించమంటుందా చూడూ" అంటూ కేక వేశాడు. గతుక్కున ఆవిడ ఆపిల్ల నోటిని చేత్తో అదిమి పట్టింది. ఆ పై నున్న ఆసామీ వాటంచూస్తే నిజం గానే లేచి తంతాడనిపించింది శ్రీహరికి. తండ్రి చేతిలో చావుదెబ్బలు ఆ పిల్ల తింటే చూడలేని బాధ ఆ తల్లికి కాకపోతే ఎవరికి?

శ్రీహరి చెమ్మగిలిన కళ్ళతో తల తిప్పుకున్నాడు అమ్మ అనే పదానికి కనిపెంచినది అనే అర్థం తప్ప ఆ అనుబంధంలో వున్న అనుభవం తనకి తెలీదు. తన దురదృష్టం కొద్దీ పిన్ని కూడా డబ్బు రూపంలోనే చూపిస్తుంది తన అభిమానాన్ని. పిన్నిని ఒకసారి చూస్తే చాలు. తనకేదో తృప్తి కలుగుతుంది. కొరత తీరుతుంది. బాబాయితో పోరాడి ఇలా బయల్దేర టానికి కారణం తనకి కూడా పిన్నిని చూడాలని ఎప్పటి నుంచో వుండటమే!

అప్రత్యక్షంగా వుండి ఆవిడ తన మనసులో నిర్భరముకొన్న భావం అంతటిది! ప్రతి ఉత్తరంలో చెరిగిన వాక్యం 'బాబు కూడా క్షేమంగా వున్నాడని తలుస్తాను' అతనికి నా ఆశీస్సులు'---

రైలు ఒక్క కుదుపు కుదిపి ఆగింది. శ్రీహరి సూట్‌కేసు పట్టుకు దిగాడు. ప్లాట్‌ఫారంలో ఒక్క యువతి, కనులారా [illegible]

కిలకిల నవ్వు విని ప్రక్కకి తిరిగాడు శ్రీహరి. రెండు జడల అమ్మాయి ఒకతే సెకండుక్లాసు కంపార్టుమెంటులోంచి దిగుతున్న కాఫీరంగుసూటుతో వున్న అబ్బాయిని పలకరించి నవ్వుతోంది. ఆ ఇద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకుని దూరంగా ఆగి వున్న నీలం రంగు కారులో ఎక్కి వెళ్ళిపోయారు. ప్లాట్‌ఫారంలో వున్న కొద్దిమందితో పాటు వారిద్దరినీ సినిమా చూసినట్టు చూస్తున్న శ్రీహరి నవ్వుకుని రిక్షా పిల్చి ఎక్కాడు. ఏలూరు రోడ్లు చూస్తూనే శ్రీహరి ధ్యాస మళ్ళీ పిన్ని మీదికి పోయింది.

తను గట్టిగా వున్నన్నాళ్ళు అందరి బాగోగులూ చూసిన పిన్ని మంచం పడగానే ఆవిడ క్షేమం చూసిన వాళ్ళు లేకపోయారు. ఇది ఎంత సిగ్గులపల్సిన సంగతి! వినసంటూ వుంటే క్రుంగిపోనాల్సింది బాబాయి.

రిక్షా గమ్యాన్ని చేరింది. వాణ్ణి పంపేసి శ్రీహరి ముందుకి చూశాడు. అతని దృష్టి గేటు ప్రక్కనే వున్న నీలంరంగు కారు మీద పడింది. కళ్ళముందు రెండు జడలు, కాఫీ రంగు సూటు మెదిలాయి. కాంపౌండు గేటు తోసుకుని లోపలికి వెళ్ళాడు. వస్తువులు ఏవో సరిచేస్తున్న పనిమనిషి "ఎవరు కావాలి బాబూ?" అని అడిగింది

అచ్యుతాంబ గారి ఇల్లిదేనా?"
పాడు తలూపింది.

"[illegible] చూశాడు. ఆ కారుగల మనుషులు ఈ ఇంట్లో అద్దెకుంటున్న వాళ్ళా?" పిన్నికి నెలసరి ఆదాయం అద్దెల మీద వస్తుందని అంచనా వేసుకున్న శ్రీహరి తన అభిప్రాయం నిజమా? కాదా? అని తెలుసుకుందికి అడిగాడు. తోటమాలి శ్రీహరిని నిలువునా చూసి "మీరీ వూరికి కొత్తవారిలా వున్నారు." అన్నాడు. శ్రీహరికి ధోరణి చికాకు కలిగించింది.

"అవును. ఏం?"

"ఏం లేదు బాబూ. వూళ్ళో వీరికి తెలిసినంత మటుకు ఎవరీ ఇంటికి వచ్చినా ఇలా అడగరు"

"అంటే?"

"ఆ కారులోంచి దిగిన అమ్మాయిగారు మీరనుకున్నట్టు అచ్యుతాంబమ్మ గారింట్లో అద్దెకున్నారు కాదు. ఆయమ్మ కూతురే. ఆమె మొగాయన.."

"ఓ: ఆ అమ్మాయి భర్త అనుకుంటాను"

తోటమాలి ఇంకా విచిత్రంగా చూశాడు. "మీకెవరో. ఏంటో. ఎలా చెప్పాలో నాకు తెల్దు ఆ కారులో వున్న బాబు ఇయ్యాళకి గడప తొక్కిన వందల మందిలో ఒకరు. [illegible] వస్తా వున్నారు. ఈ దగ్గిరూరేనంట"

అర్థమయిందా అన్నట్టు చూశాడు వాడు. శ్రీహరి మొహం ఎర్రబడి నల్లబోయింది. ఒళ్ళంతా చెమటకే తడిసి వీపుకి అంటుకుపోయింది. పరీక్షగా వాడి మొహం చూసిన శ్రీహరికి వాడి కళ్ళల్లో ముఖ కవళికల్లో విపరీతం అప్రసన్నత కనిపించాక అప్పటికే పేరు పురుగు లాంటి అనుమానం తనని తొలిచేస్తుంటే ఆ ఇంట్లోకి నడిచాడు. 'భగవాన్! ఇది అచ్యుతాంబ గారిల్లు అయితే కావచ్చుగాని నా పిన్ని ఇల్లు అవకుండా చెయ్యి!' అనుకొంటూ విశాలమైన వాకిడ దాటి మధ్య వరండాకి అటూ ఇటూ వున్న రెండు గదుల్లో ఏ గదిలోకి వెళ్ళాలో తెలీక అక్కడ నుంచే పిలిచాడు.

"అచ్యుతాంబగారూ!"

"ఎవరు బాబూ?"

కుడిచేతి గదిలో నుంచి ఒక నీరస స్వరం వినిపించింది. శ్రీహరి గుండె గతుక్కుమంది. తడబడే అడుగులతో అటు నడిచాడు. పెద్దగదిలో సగం మేర ఆక్రమించుకున్న పట్టెమంచం మీద మొహం వాడిపోయి

గాజుకప్పు

వున్న ఒక నడివయసు స్త్రీ పడుకుని వుంది. పిన్ని అనబడే అచ్యుతాంబ ఆవిడ కానో, కాదో తెలుసుకుందికి శ్రీహరి పెదిమలు కదిపాడు.

"విజయనగరం నుండి వచ్చాను. వాసుదేవ రావు గారి కొడుకుని"

నడివయసు స్త్రీ చేతుల్లో బత్తాయిపండు వణికింది. జరగటనుకున్నది జరిగితే, ఎదురు చూస్తున్నది లభిస్తే కలిగే సంభ్రమం, సంతోషం ఆవిడ మొహం మీది [illegible] కదలికలో ద్యోతకమయ్యాయి. [illegible] కొద్దిగా ముందుకి జరిగి "రావా నాయనా. ఇలా కూర్చో" అందావిడ వెలిగిపోతున్న మొహంతో

గుండెల్లోంచి ఏదో వెలపరం పుట్టుకొస్తోంటే శ్రీహరి మొహం తిప్పుకున్నాడు. రెండు ప్రశ్నలు రైలు చక్రాల్లాగా అతని మెదడులో దొర్లుతున్నాయి "తను వూహించిందేమిటి? జరుగుతున్న దేమిటి?" పిన్నికి ఈ వూళ్ళో పెద్దమేడ వుందని, అందు మీద వచ్చే అద్దెల రాబడిలో తన అవసరాలకు పోగా మిగిలినది తనకీ బాబాయికీ పంపుతూందని అనుకున్న తన వూహ తారుమారయింది. పిన్ని సంపాదనంతా అక్రమ పద్ధతిలో గడిస్తూంది—కూతుర్ని అవినీతికి 'ఎర' చేసి!

భగవాన్! ఈ డబ్బుతోనా తను పెరిగింది? తన వ్యక్తిత్వానికో రూపు దిద్దింది ఈ పెట్టుబడితోనా?'

శ్రీహరికి షర్టు లోపల వీపు మీద జందెం చిరచిర లాడింది అరిపాదాల క్రింద అగ్ని పెట్టినట్లవుతుంటే తలెత్తి తేరిపార పిన్నిని చూడటానికి శక్యమవని అతను ఆ ఇంట్లోంచి ఎంత త్వరగా బైటపడదామనే ఆవేగంతో గుమ్మం వేపు నడిచాడు.

"బాబూ!" అచ్యుతాంబ పిల్చింది.

"క్షమించండి. ఇది మా పిన్ని ఇల్లు అనుకొని వచ్చాను. అడ్రసు మారింది. నాకు కావల్సిన వాళ్ళిక్కడ లేరు. వెళ్తాను."

"నా మాట విని వెళ్ళు బాబూ!"

ఉన్నట్టుండి గాద్గదికమైన ఆ కంఠం గుమ్మం దాటబోతున్న శ్రీహరిని నిలిపివేసింది. వెనక్కి తిరిగి చూశాడు. ఆవిడ కళ్ళు అశ్రుసిక్తాలయి వున్నాయి.

"నువ్వీ ఇంటికి పొరబాటుగా రాలేదు నాయనా నీకు కావల్సిన వాళ్ళిక్కడ వున్నారు. ఎంత అభిమానాన్నీ, ఆరాటాన్నీ పెట్టుకు వచ్చేవో. నీ ఉత్సాహాన్నంతటినీ అణిచేసింది పిన్ని. ఒక్కసారిలా వచ్చి నేను చెప్పేది విను. నావల్ల నీలో ఏర్పడిన గాయాన్ని కొంచెం ఉపశమింప చెయ్యనివ్వు. అది నా ధర్మం బాబూ. రాయి విసిరిన వాడికి తనవల్ల దెబ్బ తగిలిన వాణ్ణి వూరటపర్చవలసిన విధి వుంది. లేకపోతే వాడు మనిషి అనిపించుకోడు."

పిన్ని మాటలు వింటూ, ఆవిడ భాష్పపూరిత నేత్రాల వంక చూస్తూ మనస్థిమితం తప్పి నిల్చున్న శ్రీహరి మెల్లిగా ఆవిడ మంచం దగ్గిరికి నడిచాడు. తన బలహీనమైన చేత్తో ఆత్రంగా శ్రీహరి చెయ్యి పట్టుకుని నిమురుతూ కొద్దిసేపలా వుండిపోయిన అచ్యుతాంబ స్వాస్థ్యానికి వచ్చి అంది.

"నన్ను చూడటానికి వస్తున్నప్పుడు మీ బాబాయి నిన్నేమీ అడ్డలేదా? అయినా అంగీకారం తీసుకు వచ్చేవా, చెప్పు బాబూ?"

శ్రీహరి బిగుసుకుపోయి ఎటో చూస్తూ స్టూలు మీద కూర్చుండిపోయాడు. అచ్యుతాంబ గొణుగు తున్నట్టు అంది "నాకు తెలుసు. వాసుదేవరావుగారు కంఠంలో ప్రాణాలుండగా ఒప్పుకోరు. తన ప్రాణా లన్నీ పెట్టి పెంచుతున్న కొడుకుని ఈ భ్రష్టురాలి దగ్గిరికి పంపటానికి"


శ్రీహరి తలవంచుకున్నాడు.

"ఆ దురదృష్టం నా జన్మలోనే వుంది" అచ్యుతాంబ ఒక్కసారి ముంచుకు వస్తున్న శోకాన్ని బిగపట్టి కళ్ళు తుడుచుకొంది.

"లోకం దృష్టిలో నీచాతినీచంగా చూడబడే వేశ్యకులంలో పుట్టడం నా దురదృష్టం. ఆ కులంలో పుట్టిన వాళ్ళకి తనదైన వ్యక్తిత్వము, కోరికలు, ఇష్టాలువుండవని, అలా వుండడం అనవసరమని అనుకునే వాళ్ళలో మా అమ్మ కూడా ఒకర్తె. చదువుకుంటానంటే అభ్యంతరం చెప్పలేదుగాని, వృత్తిలో దించడానికి ఎంత ప్రయత్నమైనా చేసింది. అయితే స్వతహా మొండి మనిషిని అయిన నేను ఆవిడ్ని ప్రతిఘటించటానికి నా వ్యక్తిత్వం కాపాడుకుందికి ఒకే ఆయుధం దొరికింది. ఆవూసు ఎత్తినప్పుడల్లా చచ్చిపోతానని బెదిరించేదాన్ని.

ఇంటరులో వాసుదేవరావుగారితో పరిచయమయింది. నిలువెత్తు రూపం. తేజస్సు నిండిన నేత్రాలు. గాంభీర్యాన్ని సంతరించుకున్న నడవడితో క్లాసులోని వందమందిలో ఒకరుగా ఆయన నన్ను ఆకట్టుకున్నారు. అంతకంటె నన్నాకర్షించినది ఆయన విశాల భావాలు. నా కులం తెలిసి, నాతో స్నేహం చేసి, నన్నా వూబిలోంచి తప్పిస్తానని ప్రమాణం చేసిన వాసుదేవరావుగారికి కృతజ్ఞురాలినిగా నా సర్వస్వం ఆయనకి అర్పితం చేశాను. తెల్సిన వాళ్ళు, బంధు బలగం పెట్టే ఆరళ్ళతో ఒక నిశ్చయానికి వచ్చేసిన అమ్మ నన్ను బలవంతపరచటం మొదలు పెట్టింది.

వాళ్ళు నా పట్ల ప్రవర్తిస్తున్న విధం అతి జుగుప్సాకరంగా తోచి ఒకరాత్రి అనుకున్న విధంగా ఇంటి అవతల వేచి వున్న వాసుదేవరావుగారితో వూరు దాటేశాను. ఆ తరవాత కొన్నినెలలు నా డైరీలో రంగు రంగుల కాగితాల మీద పన్నీటి సిరాతో వ్రాసుకోవల్సిన



మధుర ఘడియలు. ఇన్నాళ్ళూ వాసు తన విలువైన పుస్తకాల్నీ వస్తువుల్నీ అమ్మితూ ఇద్దర్నీ పోషించాడు. నా వంటిస్థితి అధ్వాన్నంగామారింది. ఓనాడు వాసు ఓ టెలిగ్రాం చేతపుచ్చుకొని వచ్చి వాళ్ళ నాన్నగారు అర్జంటుగా రమ్మన్నారని రెండురోజుల్లో వస్తానని చెప్పి వెళ్ళాడు. అలా వెళ్ళిన తను ఆ తరవాత మూడు నెలలకి నా మొహం చూశాడు. ఈలోపున నాకు నెలలు నిండటం ధర్మాసుపత్రిలో మగపిల్లవాడిని కనటం వాడు పదిరోజులు నన్ను ఎన్నో కలల్లో తేల్చి చివరికి నీ కలలన్నీ కల్లలే సుమీ!— అన్నట్టు చనిపోవటం జరిగాయి. ఆస్పత్రి నుంచి బైటకొచ్చిన నేను అన్నం నీళ్ళూ లేక చావటానికే నిశ్చయించుకున్నాను గాని అభిమానం పడి అమ్మ గడప ఎక్కలేదు. ఆ స్థితిలో ఒకరోజు రోడ్డు మీద దర్శనమిచ్చాడు వాసు.

అశక్తత, కడుపు మంట, ఉక్రోషం నన్ను మండింపచెయ్యగా తిట్టాను. నాలాటి అబలను దుస్థితికి తెచ్చినందుకు ఇంతకింతా అనుభవిస్తావని శాపం పెట్టాను. తల దించుకుని వెళ్ళిపోయిన వాసు నాలుగు రోజులు పోయాక మళ్ళీ కలిసి ఒక ఉత్తరం చేతిలో పెట్టాడు. 'దయచేసి అది చదివైనా తన నిర్దోషిత్వాన్ని గ్రహించ' మని. చదువుతాను గాని ఇక నన్ను కలియక. నీకూ, నాకూ ఏదైనా సంబంధమంటూ వుంటే అది నా బిడ్డ మరణంతోనే తీరిపోయింది. ఇక ఎవరికెవరం ఏమీకాము' అని చెప్పేశాను.

జీవితం మీద విరక్తి పుట్టింది. రైలు పట్టాల కడ్డంగా పడుకొనబోతున్న నన్ను విధి వశాత్తూ ఆ స్టేషన్‌కొచ్చిన మా బంధు వొకాయన రెక్కపట్టుకు లాగేసి ఇంటికి తీసుకువెళ్ళాడు. ఇంట్లో నా వాళ్ళందరి మధ్య కూర్చుని గుండెల్లో బరువు దిగేదాకా ఏడ్చాను. అమ్మ నన్ను మందుమాకులతో ఎప్పటి మనిషిని చేసింది. వాళ్ళకి ఇష్టమైన విధంగా నేను నడచుకొనప్పటికీ వాళ్ళు నన్ను పన్నెత్తుమాట అనకపోవటంతో కలిగిన ఆశ్చర్యం, అనుమానం ఓరోజు వాళ్ళు నన్ను గదిలోకి తోసినపుడు తీరిపోయాయి. పెద్ద పులిలా గదిలో కాచుకున్న మార్వాడీ నా చెయ్యి పట్టుకోగానే చెంప చెళ్ళుమనిపించాను. అతను కేకలు వేసి ఇంట్లోంచి అందర్నీ బైటకి వెళ్ళమన్నాడు. అతని కంత హక్కు ఎక్కడి నుంచి వచ్చిందో అడిగే లోపునే మా వాళ్ళు వచ్చి నా నోరు మూసేశారు. అంతవరకు ఇల్లు గడుస్తున్నది మార్వాడీ దయ మీదనే అని, అతనికి ఆగ్రహం కలగకుండా చూచుకోవల్సిందని హితబోధ చేశారు. నన్ను అయోమయ స్థితిలో పడవేసి అతనితో రిక్షాలోకి ఎక్కించారు. సినిమా హాలులో వాసు కనిపించాడు. నేను తప్ప వేరెవ్వరూ లేనట్టు వెంటాడుతున్న అతడిని ఆమాటే అడిగాను. ప్రతిగా వాసు – అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యని ఎవరో ఎత్తుకుపోతున్నట్టు అతడికి ఇంకా నా మీద ఏదో హక్కు వున్నట్టు నా వంశాన్ని కులాన్ని ఎత్తిపెట్టి ఎగిరాడు. నేనూ వూరుకోలేదు. అప్పటి నుంచీ అతని మీద కసితీర్చుకుందికే ఆలోచించటంలో నేనెంత నైతికంగా పతనమవుతున్నదీ గ్రహించలేదు. రాబందులు నన్ను పీక్కు తింటున్నాయి. కార్లూ—మేడలూ—డబ్బూ నా చుట్టూ తిరుగుతున్నాయి. మార్వాడీ ఏదో ప్రమాదంలో పోయాడు. అతని వలన పుట్టిన రమణే నా అందాలన్నీ నింపుకుని ఎదిగి వచ్చింది. రమణిని నాలాగా ఈ అడుసులోకి తొయ్యటం నాకెంతమాత్రం ఇష్టంలేదు. అయితే మనం అనుకున్నవేవీ అలా జరగవు. జరిగితే మనిషికి మనస్సు పోతే వుండవేమో! పరిస్థితుల తాకిడికి తట్టుకోలేక నేనీ అడుసులో ఇరుక్కుపోతే రమణి కావాలన్నట్టు ఈ సాలెగూటిలో చిక్కుకుంది. దానిది తప్పని మందలించటానికి నాకు హక్కు లేకుండా చేసుకున్నాను గనక మౌనంగా మింగివూరుకోవలసివచ్చింది.

పెద్దమనిషిగా సంచరిద్దామని ఇల్లు దాటిన నాకు ఆవేశం తెచ్చిపెట్టిన అనర్థమిది! ఓ నాడు వాసు ఇచ్చి వెళ్ళిన ఉత్తరం జ్ఞప్తికి వచ్చి తీసి చదివాను. అర్జంటుగా రావాల్సిందని టెలిగ్రామిచ్చి రప్పించిన వాసు తలిదండ్రులు అదలించి బెదరించి మెడలు వంచి ఒక పిల్లను కట్టారుట. బోలెడు కట్నమూ, అపరంభలా కనిపిస్తున్న అమ్మాయీ, పెద్దవాళ్ళ మెప్పుకోళ్ళూ ఇవన్నీ అతనిలోంచి నా రూపాన్నీ వునికినీ తప్పించేశాయి. ఇంటర్ పూర్తి చెయ్యని మధ్యతరగతి వాసుని ఇంత ఐశ్వర్యం వరించడానికి వెనుక కథేమిటో తాళికట్టిన అమ్మాయి నెలతిరగకుండానే చనిపోయినపుడు డాక్టర్లు నెమ్మదిగా ఆమెకు టి బి. అని తేల్చడంతో వెల్లడయింది అతని కుటుంబానికి. ఖిన్నుడైపోయిన వాసు ఇక జన్మలో తన పెళ్ళి పూసెత్తవద్దని చెప్పి వచ్చేశాడట. అంతా చెప్పి ఇది నిన్ను పెట్టిన వుసురుకి ప్రతిఫలం అచ్యుతం! అని వ్రాశాడు. జరిగిందేమిటో తెలిశాక అంత వరకు ఆ వుత్తరం చూడని నామతి మరపుని నిందించుకున్నాను. ఒక సంగతి! వాసుని నేనెంత ద్వేషించినా అతనంటే ఒక అభిమానం నా మనసులో ఎప్పుడూ వుంది. ఆవేశం దిగజారే సరికి ఆ అభిమానం పైకి వచ్చింది.

ఒకనాడు విజయనగరం నుంచి వాసు నుండి ఉత్తరం వచ్చింది. మనిషిలోని పిరికితనం, వయసులోని ఉద్రేకం తనని అన్నింటికీ అందరికీ దూరం చేశాయని, చదువు పూర్తవని కారణంగా ఉద్యోగం దొరకక దినం గడవని ఈ సమయంలో తను ఒక పెద్ద ఆశకి పోయానని, నువ్వు నాకు ఒక సహాయం చెయ్యాలని వ్రాస్తూ నిన్ను పెంచుకున్న వైనం వ్రాశారు. వాసు పెంచుకున్న బిడ్డ నా బిడ్డ కాకపోడు. అతని ఈ ప్రయత్నం అభినందించ తగ్గదే! ఒక తల్లిలేని బిడ్డడిని ఆదుకుని పుత్రుడిగా చెయ్యటం ద్వారా నా డబ్బుకి విలువ వస్తుంది. నా బ్రతుక్కి ఒక అర్థమూ ప్రయోజనమూ వుంటాయన్న ఆశతో అంగీకరించాను.

కాని వాసు నన్నింకా అర్థం చేసుకోలేదు. అతని భయం నాకు తెలుసు. నా డబ్బు మిమ్మల్ని అపవిత్రం చెయ్యదుకాని నా సమక్షం మిమ్మల్ని కళంక పరుస్తుంది. అందుకే ఒక ఉత్తమ పురుషుడిగా నిన్ను తీర్చి దిద్దుతున్న వాసుదేవరావుగారు ఇక్కడికి నిన్ను పంపటానికి వెనుదీశారు. నిన్ను చూడాలనే నా వాంఛ నెరవేరింది. నాకిప్పుడు ఎంతో ఆనందంగా వుంది. ఇక బయల్దేరు బాబూ. మీ బాబాయి నీ కోసం ఎదురు చూస్తుంటారు. ఎన్ని బాధలు వచ్చినా తట్టుకుందికి అతనిది నా గుండెలాగా రంపుకోట కాదు. గాజుకుప్పె అంత మృదువైనది. అది అప్పుడే ఒకసారి బీట వేసింది. నీ కోసం మాత్రమే జీవిస్తున్న అతన్ని పది కాలాలపాటు జీవింప చెయ్యి బాబూ. ఇదే నేను కోరేది..."

పిన్ని ఆగింది. శ్రీహరి గభుక్కున వంగి పిన్ని పాదాలకి నమస్కరించి ఆవిడ నుండి సెలవు తీసుకున్నాడు.

బరువైన గుండెలతో తిరిగివస్తున్న శ్రీహరి ఇంటి ముందు గుంపుగా వున్న జనాన్ని కంగారుగా తోసుకుని వెళ్ళి, ద్వారం దగ్గర అచేతనంగా పడుకుని వున్న బాబాయిని చూస్తూనే అతని గుండెల మీద వాలిపోయాడు, గొల్లుమంటూ.





"రండి. మీకోసమే చూస్తున్నాను". సాదరంగా ఆహ్వానించారు మిసెస్ ఇందిర—

మిసెస్ ఇందిర భారత్ హెవీఎలక్ట్రికల్స్‌లో ఇంటర్‌ప్రెటర్‌గా పని చేస్తున్నారు. టవున్‌షిప్‌లో విదేశాలకు వెళ్లొచ్చిన స్త్రీలు చాలామంది ఉన్నారు. తమ భర్తలతో కలిసికాక ఉద్యోగరీత్యా వెళ్లిన స్త్రీలకు అక్కడి సాంఘిక వాతావరణంతో మరింత సన్నిహిత పరిచయం కలిగే అవకాశం ఉందని నేను మిసెస్ ఇందిరతో మాట్లాడాను.

"నేను ఎక్కువ రోజులు జెకోస్లొవేకియాలో ఉన్నాను. లండన్, పారిస్—మొదలైన ఇతరదేశాల్నీ కూడా తిరిగాను. కానీ అవన్నీ కేవలం వినోదయాత్రగా తిరిగాను. ఆయా ప్రదేశాల సాంఘిక వాతావరణం అర్థం చేసుకునేటంత అవకాశం కలగలేదు." అన్నారు మిసెస్ ఇందిర.

"మీ విదేశయానం కారణంగా మీదృక్పథాలలో ఏమైనా మార్పులు వచ్చాయేమో చెప్పండి. అది తెలుసుకుందుకు వచ్చాను."

"ఈ విదేశయానం కారణంగా కొన్ని విషయాలలో నా అభిప్రాయాలు పూర్తిగా మారిపోయాయి. వాటిల్లో మొదటిది 'డిగ్నిటీ ఆఫ్ లేబర్'ను అర్థం చేసికోగలగటం. అదివరలో నా సంతే నేను తీసుకురావాలంటే, బజారువెళ్లి ఏవైనా తెచ్చుకోవాలంటే చాలా చిన్నతనంగా ఉండేది. ఏమిటో నన్నుచూసి నవ్వుతున్నట్లనిపించేది. అదేదో మర్యాద తక్కువ పనిగా అనిపించేది. కానీ ఇప్పుడది లేదు. బస్‌దిగినా సూట్‌కేస్ నేనే తెచ్చుకుంటాను. నాపనులు నేను చేసుకోవటంలో చిన్నతనం ఫీలవటం లేదిప్పుడు. ఎవరైనా నన్నుచూసి నవ్వుతారనే భయం లేదిప్పుడు. నవ్వితే వాళ్లకర్మ! కష్టించి పనిచెయ్యటంలో ఉండే ఆనందం కూడా అర్థమయింది. వారమంతా కష్టపడి పనిచెయ్యబట్టే ఆదివారాలింత అందంగా ఉంటున్నాయి. నేను విదేశాలకు వెళ్లకపోతే, ఈజన్మలో కోఆపరేటివ్ స్టోర్సులో అలా కూరగాయలమ్మే దానినికాను"అని నవ్వారు.

ఇక్కడ కూరగాయలు మేమే హోల్‌సేల్‌లో కొని మేమే అందరికీ అమ్ముతున్నాం. ఈకారణం వల్ల ఓవర్ హెడ్స్ తగ్గిపోయి కూరలు కొంత చవగ్గా అందరికీ దొరుకుతున్నాయి. మిసెస్‌ఇందిర, ఇంకా చాలామంది పెద్ద ఉద్యోగస్థులు, ఎవరి విలువ బట్టి వాళ్లు సాధ్యమైనంత సహకరిస్తూ ఉంటారు.

"మేమంతా జెకోస్లొవేకియా వెళ్లి రావటం వల్లనే ఇలాంటిది ప్రారంభించ గలిగాం"అంటారు ఇందిర.

"శుభ్రతకు వాళ్ళిచ్చే ప్రాముఖ్యత నన్నుబాగా 'ఇంప్రెస్' చేసింది. ఇళ్లు, ఫర్నిచర్, ప్రక్కలు, పరిసరాలు, వాళ్లెంత శుభ్రంగా ఉంచుకుంటారో చెప్పలేం. రోడ్లుకూడా ఎంతమారుమూల రోడ్లయినా, అద్దంలా ఉంటాయి. వెళ్లిన కొత్తలో మేం తెలియక ఏవో కాగితం ముక్కలు రోడ్డుమీద పారేసాం. వాళ్లు మమ్మల్ని వింతవస్తువుల్లా చూసి, మొహమాటం లేకుండా ముఖంమీదే చెప్పేసారు అలా చెయ్యొద్దని. ఇక్కడికొచ్చిన కొత్తల్లో రోడ్డుమీద ఎవరైనా ఉమ్మేస్తుంటే నా ప్రాణాలు విలవిల లాడిపోయేవి. మనరోడ్లమీద చెత్త చూస్తుంటే చీపురు పట్టుకు వూడుద్దామా,అన్నంత చికాగ్గా ఉండేది. మురికి సందులు సరేసరి. మన వాళ్లకు ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడానికే ఓపిక లేదు. ఇంక రోడ్లూ, పరిసరాలు కూడా శుభ్రంగా ఎలా ఉంచుతారు? అందానికీ ఆరోగ్యానికీ శుభ్రత ఎంత ముఖ్యమైనదో బాగా అర్థమయింది. నామటుకు నేను పొరపాటున కూడా రోడ్డుమీదచిన్న కాగితం ముక్క కూడా వెయ్య లేను ఇప్పుడు.

'సంఘసేవ' అనే పదానికి అసలైన అర్థమేమిటో అక్కడ బోధపడింది నాకు. గమ్మత్తేమిటంటే అక్కడ సంఘసేవికలని కాని, సేవకులని కాని, ప్రత్యేకం పేరుపెట్టుకున్న వాళ్లెవరూ కనపడరు. కానీ, ఆసమయానికి ప్రతిఒక్కరూ సంఘసేవకులే! పసిపాపను పెరాంబ్యులేటర్‌లో బయట విడిచి తల్లి షాపులోకి వెడుతుంది. ఆసమయంలో ఆపాపగనుక ఏడిస్తే ఆదారిన పోతున్న ఎవరైనా సరే, ఎత్తుకుని లాలించి వూరుకోబెట్టికాని, ముందుకు కదలరు. ఆపాప ఎవరి సంతానమనే ఆలోచనేరాదు. ఆసన్నివేశం నన్నుబాగా కదలించింది. మనం ఎక్కడికైనా దారడుగుతే మనను వెంటబెట్టుకుని మనకు కావలసిన ప్రదేశానికి తీసికెళ్లి తరువాతే తమపని చూసుకుంటారు. సామాన్యంగా తమ ప్రక్క వాడి విషయంలో ఏమాత్రం జోక్యం కలుగ జేసుకోరు. అసలు పట్టించుకోరు. కానీ అవసరానికి మాత్రం ఆదుకుంటారు. సరిగ్గా అందుకు వ్యతిరేకం మనం. సంఘం అంటే మనచుట్టూ ఉండేది. సేవ అంటే అవసరం ఉన్న వాళ్లకు మనం చేసే సహాయం. దీనికి పెద్దపేరు పెట్టుకుని లేని పోని హడావుడి చేసి సమాజాలు స్థాపించి చివరికి సాధించేదేమిటో అర్థం కాదు......"



"అలంకరణ విషయంలో కూడా నాలోచాలా మార్పొచ్చింది. అలంకరణ అన్ని సమయాల్లో


ఒక్కలా ఉండకూడదనీ, విషయానికి తగిన అలంకరణ అనమయానికి రాణిస్తుందనీ తెలుసుకున్నాను. అక్కడివాళ్ళు ఆఫీసులకూ, కాలేజీలకూ ఎంతో సింపుల్ గా వస్తారు. అదే ఏడాన్సెస్‌కో వెళ్ళేటప్పుడు అప్సరసలా మారిపోతారు. మన వాళ్ళలో ఈతేడా కనుపించదు. నిరాడంబరంగా ఉండే ఆడపిల్లలు అటు కాలేజీలకూ ఇటు సినిమాలకూ కూడా నిరాడంబరంగానే వెళ్తారు. స్టైల్‌గా ఉండేవాళ్ళు కాలేజీకి సహితం ఏదో పెద్ద ఫంక్షను కెళ్ళినట్లే వెళతారు. అంటే అది వాళ్ళవాళ్ళ స్వభావాలలో ఉంది కానీ సందర్భాన్ని బట్టిచేసుకున్న అలంకరణ కాదు.

"ఇంకోవిషయం మంచి మేనర్సుకూడా అందంలో ఒకభాగమని అర్థమయింది. అతిసామాన్యమైన అందంతో—మాట్లాడేతీరు— నవ్వేతీరు—నడిచేతీరు—కూర్చునేతీరు— వీటివల్ల వాళ్ళలో అధికంగా కనిపించే ఆకర్షణ నాకీ విషయం స్పష్టంచేసింది. మనలో కొంతమంది—సామాన్యంగా అటూ ఇటూ కాని చదువు చదువుకున్న వాళ్ళు టిప్‌టాప్‌గాతయారయి వస్తారు. కానీ, నోరువిప్పి నాలుగు మాటలు మాట్లాడేసరికి ఆకర్షణ కలగకపోగా వికర్షణ కలుగుతుంది.

"పిల్లల పెంపకం విషయంలో ఇప్పుడు ఇంచుమించు అందరం తగిన శ్రద్ధ తీసుకుంటున్నాం లెండి. వాళ్ళను చూసి నేను ఒకటిముఖ్యంగా నేర్చుకున్నాను. డబ్బు పోగుచేసి ముందు ముందుపిల్లలకు ఆస్తికూడబెట్టడంకంటే వాళ్ళపోషణ, వాళ్ళ చదువు విషయంలో బాగా శ్రద్ధవహించటం మంచిదని. పళ్ళు, పాలు పెరుగు, ఇవి పిల్లలకు ముఖ్యంగా కావాలి. చూసి చూసిమనం అంతంత డబ్బు ఖర్చుచేసి కొనలేం! అంతకంటే ఆడబ్బు బ్యాంకులో పోగుచేసి ఒకఇల్లు కట్టి కొడుకు పేర పెట్టడం మంచిదిగా అనిపిస్తుంది మనకు. ఇందువల్ల పిల్లలు బలంగా ఆరోగ్యంగా పెరిగే అవకాశం తక్కువయిపోతుంది మంచి మంచి స్కూల్స్‌లో వేస్తే డబ్బయిపోతుందని (సమర్థత ఉండే) వీధిబళ్ళో చదివించే తలిదండ్రులున్నారు ఇంకా— —

"వాళ్ళను ఆరోగ్యంగా పెంచి మంచి చదువు చెప్పించి వాళ్ళంతటవాళ్ళు సంపాదించుకోగలిగే అవకాశం కలిగించటం మంచిదా? బలహీనులుగా చవటలుగా తయారు చేసి చివరకు వాళ్ళచేతుల్లో ఏకాస్తో ఆస్తిని పెట్టడం మంచిదా?

"అక్కడికి వెళ్ళొచ్చాక నాకు బంగారునగలమీద మోజు పూర్తిగా తగ్గిపోయింది. అక్కడసలు బంగారం వాడనివ్వరు. అన్నీ ఆర్టిఫిషియల్ నగలే. ఏరకం బట్టలకనుగుణమైన నగలా బట్టమీదవేసుకుంటారు. చెవులకూ, చేతులకూ, మెళ్ళోకీ, ఒకే రకమైన రాళ్ళతో చేసిన అలంకారాలు వేసుకుంటారు. నగలు అందానికనుకుంటే బంగారం గొలుసులకన్నా ఇవే అందంగా ఉంటాయి. కానీ నాకనిపిస్తుంది మనం నగలు అందానికి వేసుకోవటం లేదు, డాబుకు వేసుకుంటున్నామని. మనగొప్పను ఇతరులకు చాటకలిగేమంచి సాధనా లీనగలు. ఆ 'డాబు' ఫీలింగ్‌పోతే ఈనగలమీది మోజుతగ్గుతుంది. ఒకరకంగా ఇది మన సాంఘిక వాతావరణంతో ముడిపడివుంది. మనసంఘంలో ఆర్థిక అంతస్థులలో వ్యత్యాసం విపరీతంగా ఉంది. సంఘంలో వారివారి



స్థానాలు ఈవ్యత్యాసాల మీద ఆధారపడివున్నాయి. చాలామంది స్త్రీలు ఈకారణం వల్లనే నగలను తమ స్థానాలు నిరూపించు కోవటానికి ఉపకరణాలుగా ప్రదర్శించుకోవాలని ఉబలాటపడుతున్నారు. ఈతారతమ్య దృష్టి పోదు. నగల మీద మోజు పోదు.

"బట్టల విషయంలో కూడా మనకు అందం కంటే ఖరీదే ప్రధానం. దీనికీ పై కారణమే. ఇప్పుడు నేను బట్టల విషయంలో పూర్తిగా అందానికే ప్రాధాన్యమిస్తున్నాను

"ఉద్యోగాలలో స్థిరపడి అన్నీ అమర్చుకున్నాక వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోరు. ఇదొకటి నాకు చాలా నచ్చింది. కానీ, మనలా వాళ్ళకు నిరుద్యోగ సమస్య లేదు లెండి. చదువుపూర్తవుతూనే ఉద్యోగం సిద్ధంగా ఉంటుంది.


"విదేశాలు చూసొచ్చిన కొందరికి స్వదేశం పట్లకొంత నిరసన భావం కలగటం నేనుగమనించాను. కానీ నాకు మాత్రం మనదేశంపట్ల మరింత గౌరవ భావమే పెరిగింది. మనలో ఉన్న "హోమ్లీ" ఫీలింగ్ అక్కడ కనిపించదు. ప్రతిదీ ఏమిటో కృతకంగా అనిపిస్తుంది. మన ఆడవాళ్ళలో అణువణువునా నిండి సహజసౌందర్యానిచ్చే "స్త్రీత్వం" అక్కడి ఆడవాళ్ళలో అంతగా కనిపించదు. అందుకు గర్వపడుతున్నాను."

"థ్యాంక్సండీ! వస్తాను" అని లేచాను.

"సాయంత్రం కూరగాయలమ్మడానికి మీరూ రాకూడదూ!" అన్నారు.

"క్షమించండి. నేను రాలేను. ఇంట్లో కూర్చుని ఇదంతా వ్రాస్తాను." అన్నాను.

ఆవిడ పకపక నవ్వారు.







(క) ఫిజీద్వీపంలో బేరం

ఫిజీదీవులలో ఒకప్పుడు మూల కొందరు ఆదిమజాతి మనుష్యులు నివసిస్తున్నారు. వాళ్లకి డబ్బు అంటే ఏమిటో తెలియదు. తాము నిత్యమూ వాడుకునే బల్లెము, కత్తి, చేపగాలం వంటి వస్తువులకి కొన్ని విలువలు నిర్ణయించుకున్నారు. ఉదాహరణకి 2 బల్లెములు ఇస్తే ఒకకత్తి, 3 చేప గాలములు ఇస్తారు. 25 కొబ్బరికాయలిస్తే 3 బల్లెములు, 2 కత్తులు, ఒక చేపగాలం ఇస్తారు.

అయితే, పైన చెప్పిన మూడు వస్తువులకీ వేరు వేరుగా ఎన్నేసి కొబ్బరికాయలిస్తారు?






(చ) తొమ్మిది చుక్కలు


ఇక్కడ తొమ్మిది చుక్కలున్నాయి. పెనిసిలు తీసుకుని, ఈ తొమ్మిది చుక్కలనూ కలుపుతూ నాలుగు సరళరేఖలు గియ్యాలి. పెనిసిలు పైకి ఎత్తకూడదు. గీసిన చుక్కమీద మళ్లీ గీయకూడదు





(ట) లక్కపూత


3 అంగుళాల పొడవు, 3 అంగుళాలవెడల్పు, 3 అంగుళాల ఎత్తు ఉన్న కర్రముక్క ఘనాకారంలో ఉంది. దానికి అన్ని వైపులా నల్లని రంగు పూసిఉంది. దీనిని 27 ఘనపు టంగుళపు ముక్కలుగా కోశారు. ఇందులో ఎన్ని ముక్కలకు మూడు వైపుల రంగు ఉంటుంది? ఎన్ని ముక్కలకు రెండు వైపుల రంగు ఉంటుంది? ఎన్నింటికి ఒక్కవైపునే ఉంటుంది? ఎన్నింటికి అసలు రంగే ఉండదు?



(త) ముసలి మొగుడు

పద్దెనిమిదేళ్లక్రితం జమీందారు పాపన్నను వనజ అనే అమ్మాయి పెళ్లి చేసుకున్నప్పుడు డబ్బుకి ఆశపడి తనకు మూడు రెట్లు వయస్సు వాడిని కట్టుకున్నదని కిట్టనివాళ్లంతా ఆ అమ్మాయిని ఆడిపోసుకున్నారు. అయినా వనజ వాటిని లెక్క చెయ్యలేదు. "ఇప్పుడు మా మా వయోభేదం మరీ అంత ఎక్కువేమీకాదు. ఆయన నాకన్న రెట్టింపేకదా పెద్ద?" అంటుంది వనజమ్మ.

ఇంతకీ వాళ్లకి ఎన్నేళ్లు?



(ప) కారు లైసెన్సు

ఒక కారుగల ఆసామీ కొత్తగా వచ్చిన లైసెన్సు ప్లేటును పొరపాటున తలకిందులుగా అమర్చాడు. ఆ సంగతి అతనికి తరువాతకాని తెలియలేదు. తప్పు గమనించాక, నాలుక కరుచుకున్నాడు. జాగ్రత్తగా గమనించి, అసలు ఉండవలసిన సంఖ్యకన్న ఈ కొత్త సంఖ్య 78633 ఎక్కువది అని తెలుసుకున్నాడు. ఆ సంఖ్యలో ఉన్న అంకెలు అన్నీ వేరువేరువి.

ఇంతకీ అతని లైసెన్సు నెంబరు ఎంత?


(జవాబులు 64వ పేజీలో)



25 సంవత్సరాలుగా పేరు మోసింది
Asha
FACE POWDER
Asha
SNOW
సోలు డిస్ట్రిబ్యూటర్లు :
జె. ఎల్. మోరిసన్
సన్ & జోన్స్
(ఇండియా) ప్రైవేట్ లి.
బొంబాయి. ఢిల్లీ.
మద్రాసు. కాన్పూరు.
కలకత్తా.
Asha
Unique-A-1
ఆశా స్నో, ఫేస్ పౌడర్, కుంకుం, కాజల్ తదితర సౌందర్య సాధనాలు

అనుబంధం

అత్తిలి వెంకటరత్నం



"ఏమండీ"

రమణ యేమిటన్నట్లుగా చూసాడు భార్య వైపు.

"మా నాన్నవచ్చారు."

"ఎప్పుడు? నాకు కనబడలేదేం?" రమణ షర్టు విప్పి స్టాండుమీద పడేసాడు.

"మధ్యాహ్నం. ఇప్పటివరకూ మీరు వస్తారని ఎదురు చూసి యిప్పుడే అలాగ ఎక్కడికో వెళ్ళారు."

"ఏమిటి విశేషం?" రమణ, సరోజ చేతిలోని కాఫీగ్లాసు అందుకున్నాడు. సరోజ యేమీ జవాబు చెప్పలేదు. రమణ కొంచెం కాఫీ రుచి చూసి బల్ల మీద పెట్టేసాడు.

"అబ్బ! చేదు సరూ! కొంచెం పంచదార తీసికొనిరా" రమణ విసుగ్గా అన్నాడు.

"అయిపోయిందండి." సరోజ బాధగా అంది.

"మరి ముందే చెప్పి యేడవకూడదూ? తెచ్చి పడెయ్యడానికి ఉన్నాగా" చికాకుగా అన్నాడు.

"మరి నాకేంతెలుసు! నిన్న అత్తగారిని అడిగితే ఉందన్నారు." సరోజ చిన్నబుచ్చుకుని అంది.

రమణ ఒక్క గ్రుక్కలో కాఫీ త్రాగేసి బల్ల మీద పెట్టేసాడు గ్లాసు.

"ఉత్తరా లేమయినా వచ్చాయా?"

"వూఁ. దుర్గ దగ్గరనుంచి. వాళ్ళ మామ గారు వ్రాసారు"

"ఏం వ్రాసారేమిటి?"

"వాళ్ళ అబ్బాయికి దిగబెట్టడానికి సెలవు లేదుట. కాబట్టి యేడవనెల దాటకుండా మీరు ఎవరయినా వచ్చి తీసికొని వెళ్ళమని వ్రాసాం."

"ఇక్కడెవరికో తీరిక పడి చస్తున్నట్టు! యిప్పుడు తను వెళ్ళి రావాలంటే కనీసం యేభయి రూపాయలేనా ఉండాలి. ఎక్కడి నుంచి తేవాలి?" రమణకి ఒళ్ళు మండింది.

"అమ్మా! యేమిటా ఉత్తరం? వాళ్ళకి అంత తీరిక లేకపోతే అక్కడే పురుడు పోసుకోమని వ్రాస్తాను" రమణ కోపంగా వంట గదిలోకి అడుగు పెట్టాడు.

గది అంతా పొగతో నిండి యేమీ కనబడటం లేదు. రమణ అడుగు వెనక్కి వేసాడు.

"ఏమిట్రా!" సీతమ్మ బయటికి వచ్చింది వంట గదిలో నుంచి.

"అమ్మా"! రమణ యేదో కోపంగా అనబోయి ఆగిపోయాడు. సీతమ్మ కళ్ళు రెండూ పొగతో నిండి నీళ్ళు కారుతున్నాయి. ముక్కు ఎర్రబడి పోయింది. తల వెంట్రుకలనిండా బూడిద!

"నీళ్ళు కాగాయా? స్నానం చేయాలి!" రమణ దిగజారిపోయి అన్నాడు.

"ముందే పెట్టానురా. పచ్చి కట్టెలేమో మండి చావడంలేదు. రెండు నిముషాలు కూర్చో. కాగిపోతాయి" ఆవిడ మళ్ళీ వంటగదిలోకి వెళ్ళి పోయింది.

"సరూ! నాన్న యింకా ప్రయివేట్లనుంచి యింటికి రాలేదా యేమిటి?" రమణ భార్యతో అన్నాడు.

సరోజ లేదన్నట్లుగా తలవూపింది.

"అన్నట్లు, మురళీ యేడీ? ఒకసారి పిలు. సైకిలు పంక్చరయింది. బాగు చేయించాలి. లేక పోతే రేపు ఖర్మమా అని నడచి వెళ్ళాలి."

"యింట్లో లేడు." సరోజ అంది.

"ఒక్కడికీ బాధ్యత తెలియదు. ఏమీపట్టదు" రమణ నీరసంగా కుర్చీలో వ్రాలాడు. సరోజ గదిలో చిందరవందర సామాన్లన్నీ సర్దుతూ నిలుచుంది. రమణ యెటోచూస్తూ ఉండిపోయాడు. కనుబొమలు ఆలోచిస్తున్నట్టుగా మెలికలు తిరిగాయి. సరోజ మధ్య మధ్యలో ఆగి భర్త ముఖం లోకి చూస్తూ ఉండిపోయింది.

రమణ భార్యవంక చూసి పొడిగా నవ్వాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" సరోజ దగ్గరగా వస్తూ అంది.

"క్రొత్తగా మరొకటేముంది? రేపెలాగ గడుస్తుందా అని" రమణ చికాకుగా అన్నాడు.

"అనవసరంగా మీ మనసు పాడు చేసుకోకండి. అన్నీ అవే చక్కబడతాయి." సరోజ అనునయంగా అంది.

"ఆ రోజుకోసమే జీవితాంతం వరకు ఎదురు చూసేలా ఉంది. యివన్నీ ఆలోచిస్తూ ఉంటే అన్నిబంధాలు వదలి స్వతంత్రంగా ఎక్కడికయినా పోవాలని ఉంది". రమణ బాధగా నుదుటిమీద కొట్టుకున్నాడు.

సరోజ మాట్లాడకుండా వూరుకుంది.

"అమ్మాయ్, నీళ్ళు తోడిపాను. వాణ్ణి పోసుకోమను." వరిటింట్లోనుంచి కేక వినబడింది.

రమణ లేచి భార్యచేతిలో తువ్వాలు అందుకున్నాడు.

భోజనంచేస్తూ వుండగా సీతమ్మగారు అంది:

"దుర్గ మామగారు ఉత్తరం వ్రాసారురా."
"సరోజ చెప్పింది."
ఆవిడ యింక మాట్లాడకుండా వూరుకుంది.
రమణ భోజనం చేసి కంచంలో చేయి కడిగేసుకుని లేచాడు.

"మురళి పరీక్ష ఫీజేదో కట్టాలి. ఎల్లుండి ఆఖరు రోజు. నీతో చెప్పమన్నాడు." మెల్లగా అంది సీతమ్మగారు.

"ఎంతట?" రమణ నిస్పృహగా అన్నాడు.
"ఏభయి అయిదో అరవయ్యో చెప్పాడు."
"మావెయ్యమను! వెధవ చదువు! నేను చెప్పించలేను." రమణ కోపంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"అలాగంటే ఎలాగరా మరి? ఈసారిమట్టుకు ఏదో చూస్తే, తరువాత సంగతి చూసుకోవచ్చు. ఏడాది చదివిన చదువు." సీతమ్మగారు వెనకాలే వస్తూ అంది.

రమణ మాట్లాడకుండా కుర్చీలో వెనక్కి వ్రాలాడు. ఒక నిముషం నిలబడిచూసి రమణ మాట్లాడకపోయేసరికి ఆవిడ లోనికి వెళ్ళిపోయింది.

"సరూ!" రమణ పిలిచాడు. "నీ దగ్గర ఏమయినా డబ్బు ఉందా?" సంకోచిస్తూ అడిగాడు.

"పాతిక రూపాయలు ఉన్నట్టున్నాయి" సరోజ లేచి తీసుకొని రావడానికి వెళ్ళబోయింది. రమణ భార్య చేయిపట్టి ఆపేశాడు.

"వద్దులే ఉంచుకో. ఏమయితే అదే అవుతుంది." రమణ మళ్ళీ అన్నాడు.

"ఫర్వాలేదు. ఫస్టువచ్చాక మళ్ళీ నా కిచ్చేద్దురు గాని." సరోజ అంది.

"ఛ! వద్దు. అది నీ డబ్బు మీవాళ్ళిచ్చింది. నా కధికారం లేదు."

సరోజ "మీ యిష్టం" అని వూరుకుంది.
రెండు నిముషాలు యిద్దరూ ఎవుసంగా ఉండిపోయారు.

"లక్ష్మి యేదీ? కనపడదేం?"
"ఏమో! ఎక్కడికో వెళ్ళినట్టుంది." ఎటో చూస్తూ అంది సరోజ.

వంటగదిలో గొడవ విని ఒక్క ఉదుటున లేచాడు రమణ.

వాసు యిల్లెగిరిపోయేలా యేడుస్తున్నవాడల్లా టక్కున నోరు మూసేసాడు అన్నగారిని చూసి.

"ఏమిటమ్మా? ఏమిటి గొడవ?" రమణ కోపంగా అడిగాడు తల్లిని.

"ఏమీలేదు." చిరాకుగా అని వూరుకుంది ఆవిడ.

"ఏమిట్రా! ఎందుకా యేడుపు? తిన్నది అరగటం లేదనా" వాసు చెవి పట్టుకుని అన్నాడు వాసు మాట్లాడకుండా తలదించేసాడు.

"మాట్లాడవేం?"
రమణ గర్జింపుకి ఉలికిపడ్డాడు వాసు.

"టెస్టు బుక్కు లేవిదే క్లాసుకి రావద్దన్నాడట మాష్టారు స్కూల్లో." సీతమ్మగారు అంది.

రమణ వాసుని వదిలి నీరసంగా వీధిలోకి నడిచాడు.

గుమ్మంలోనే ఎదురువచ్చాడు సీతాపతి. రమణ మామగారిని చూసి చిరునవ్వు అరువు తెచ్చుకున్నాడు ముఖం మీదికి.

"మధ్యాహ్నం వచ్చానోయ్. నువ్వులేవు. అలాగ చిన్నప్పటి స్నేహితు డొకడుంటేను చూసివద్దామని వెళ్ళేను." సీతాపతి ఆయాసపడుతూ కూర్చున్నాడు.

"కాళ్ళు కడుక్కోండి. భోజనం చేసి కూర్చోవచ్చు. యిప్పటికే ఆలస్యమయిపోయింది. నేను యింతకుముందే చేసాను." రమణ కొంచెం సిగ్గుపడుతూ అన్నాడు.

"ఆ ఫర్వాలేదు. దానిదేముంది? యివాళ శనివారం కదూ. అయినా ఆ ఫలహారం యేదో మా వాడింట్లో అయిపోయిందిలే." సీతాపతి నవ్వుతూ అన్నాడు.

"అత్తగారు, అందరూ కులాసాయేనా?" రమణ అడిగాడు.

"ఆ. శ్యామలని చూడడానికి అమలాపురం వెళ్ళాను. వస్తూ దారేకదా, మిమ్మల్ని కూడా చూసినట్టుందని యిక్కడ దిగాను. నాన్నగారు యింకా రాలేదేమిటి?" సీతాపతి యిల్లంతా చూస్తూ అడిగాడు.

"ఇంకా లేదండి. ఎక్కడికో వెళ్ళారు" రమణ అన్నాడు.

"అమ్మాయ్! కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు తల్లీ." సీతాపతి అక్కడే నిలుచున్న సరోజతో అన్నాడు. సరోజ లోనికి వెళ్ళింది.

"ఏమయినా పనుందా? అలాగ కొంచెంసేపు గాలికి తిరిగివద్దా మేమిటి?" సీతాపతి అల్లుడిని అడిగాడు.

"పనేంలేదు, నడవండి." రమణ సాలోచనగా చూస్తూ చెప్పులు వేసుకున్నాడు. ఈలోగా సీతాపతి మంచినీళ్ళు త్రాగి రమణ ననుసరించాడు చీకటి బాగా పడిందేమో వీధులలో జన సంచారం తగ్గిపోయింది. అడుగుల చప్పుడే గట్టిగా వినపడుతోంది.

"గోదావరి గట్టుకేసి వెళ్దామా?" సీతాపతి అడిగాడు.

"వూఁ" పరధ్యానంగా అన్నాడు రమణ.

"అమావాస్య రోజులుకదా! వెన్నెల అంతగా లేదు." సీతాపతి ఏదోఒకటి మాట్లాడాలి అన్నట్టుగా అన్నాడు.

రమణ మాట్లాడక వూరుకున్నాడు.
"ఇక్కడ కూర్చుందామా?" సీతాపతి యిసుకలో కూర్చున్నాడు

రమణ ఒక అడుగుదూరంలో రాయిమీద కూర్చున్నాడు. చల్లనిగాలి మెత్తగా శరీరాన్ని ఆరబెడుతోంది. రమణ అక్కడున్నాడన్నమాటే కాని మనసెక్కడో ఆలోచిస్తోంది. సీతాపతి యేవో ఉద్యోగం విషయాలు అవీ యివీ అడుగుతున్నాడు. రమణ పరధ్యానంగా జవాబులు చెప్తున్నాడు.

"యేమిటో ఆలోచిస్తున్నట్టున్నావు." సీతాపతి ముందుకి వంగి అన్నాడు.

"అబ్బే, యేమీలేదు." రమణ సర్దుకుని కూర్చున్నాడు.

"మురళికి యీయేటితో పి. యు. సి. అయిపోతుందేమో కదూ." సీతాపతి అడిగాడు.

"అవును." రమణ చేతికి అంటిన యిసుక దులిపాడు.

"మరి తరువాత యేంచేద్దాం అనుకుంటున్నారు?"

"ఏమో యింకా ఆలోచించలేదు." రమణ ఒక నిముషం ఆగి అన్నాడు.

"ఒకవేళ స్కాలర్‌షిప్ లాంటిది వచ్చినా పైకి చెప్పించడం కష్టం అనుకుంటాను."

"కష్టమే" రమణ విచారంగా అన్నాడు.

"లక్ష్మికి ఎన్నోయేడు?" సీతాపతి మళ్ళీ అడిగాడు.

"పదిహేడు నిండాయి." రమణకి మామగారి ఉద్దేశ్యం అర్ధమయింది.

"వాసు యింకా సెకండ్‌ఫారమో, థర్డుఫారమో." సీతాపతి ఆగి మళ్ళీ అన్నాడు. "ఈ వూబినుంచి ఎప్పటికి బయట పడతావో అర్ధం కాదు."

రమణకి కొంచెం కోపం వచ్చింది. మాట్లాడకుండా యిసుకలో గీతలు గీస్తూ కూర్చున్నాడు.

"నేనొకటి చెప్తాను వింటావా?" సీతాపతి రెండు చేతులమీద వెనక్కి ఆనుకున్నాడు.

"చెప్పండి."

"వూరికే అనడంకాదు. నిజనిజాలు జాగ్రత్తగా ఆలోచించాలి."

రమణ తలయెత్తి మామగారివంక చూసాడు.

"నువ్వూ, సరోజా నాతోకూడా వచ్చేయండి." సీతాపతి అన్నాడు.

"ఏమిటి? మీ ఉద్దేశ మేమిటి? మీరనేది?" రమణ ముఖం చిట్లించి అన్నాడు.

"అవునోయ్! ఎన్నాళ్ళిలా ఉంటావు? ఎదుగూ బొదుగూ లేకుండా. మురళికి చదువు చెప్పించాలి. లక్ష్మి పెళ్ళి! యింకా వెనకాల వాసు! వీటికి అంతు లేదేమిటి? చివరికి నీ సంగతేమిటి?"

"అయితే యేమంటారు? వాళ్ళమానానికి వదిలేసి నన్ను లేచి రమ్మంటారా?" రమణ కోపంగా అన్నాడు.

"ఇదిగో అబ్బాయ్. ఒకటి చెప్తాను విను. సుఖం యేనాడూ నిన్ను వెదుక్కుని రాదు. నువ్వే ప్రయత్నించాలి. అయ్యో! నావారందరూ నా వెనకాల రావడంలేదే అనుకుంటే నీవూ అక్కడే వుంటావు. జీవితంలో ప్రతిక్షణం నీతి, నిజాయితీ అనుకుంటూ ఆదర్శాలను పట్టుకుని వ్రేలాడితే మిగిలేదేముండదు. కడివెడు కన్నీళ్ళు తప్ప. కొంచెం సావధానంగా ఆలోచించు. నీకిప్పుడు జీతం రెండు వందలు. అందులో నీకోసం, నీభార్యకోసం ఎంత ఖర్చు పెడుతున్నావు?"

"మీరు చెప్పేది నాకు నచ్చలేదు." రమణ దృఢంగా అన్నాడు

"అదికాదోయ్. నేనేం తప్పు చెప్పానా? నీవు బాగుపడితే చూద్దామనే నా ఉద్దేశ్యం. ఏదోయింత వరకు కుటుంబానికి సహాయపడ్డావు. బాగానే వుంది. అవ్వి, తాకట్టు దుర్గ పెళ్ళి జరిగిపోయింది. అంతకంటే యింకెవరు చేస్తారు? ఎన్నాళ్ళిలా జరుగుతుంది? నీకూ పిల్లలు పుడతారు. నీ సంసారం పెద్దదవుతుంది. అప్పుడు కూడా యిలాగే ఉంటావా యేమిటి? కొంచెం ఆలోచన ఉండాలి. ముందు చూపు కూడా ఉండాలి. అప్పుడే నాలుగు రాళ్ళు వెనకేసుకుంటావు. చివర సుఖపడ గలుగుతావు. లేదా ఆ కుటుంబానికి పూడిగం చేయడమే

అవుతుంది. అంతా అయిన తరువాత మిగిలేది నీకు ముప్పయి యేళ్ళకే అరవయియేళ్ళ వార్ధక్యమూ, నీ పెళ్ళాం పిల్లలకి చేతికి చిప్పా కర్రాను.''

సీతాపతి ఆగి అల్లుడి ముఖంలోకి చూసాడు.

రమణ తీక్ష్ణంగా నీటి అలలకేసి చూస్తూ కూర్చున్నాడు. సీతాపతికి ధైర్యం వచ్చింది.

''నేనేమీ మీవాళ్ళను అన్యాయంచేసి వచ్చెయ్యమనటంలేదు. కొంచెం నీసంగతి నీ పెళ్ళాం సంగతి చూసుకోమంటున్నాను. మురళి చదువింక కట్టిపెట్టు. నాకు వదిలెయ్యి. నేను ఎక్కడో ఉద్యోగం వేయిస్తాను.''

''ఛ! వాడికి అప్పుడే ఉద్యోగ మేమిటి? వాడి చదువు ఆపటం నాకిష్టంలేదు.'' రమణ అసహనంగా అన్నాడు.

''ఏం! నీ చదువు ఆగినప్పుడు ఎవరు అడ్డుపడ్డారు?'' సీతాపతి చిరాకుగా అన్నాడు.

రమణ మనసు గతంలోకి పోయింది. అవును. ఆ మాటలు అక్షరాల నిజం. తనకుమాత్రం చదువుకుందామని ఉండేదికాదూ? ఏం జరిగింది? యింటర్ మేడియేట్‌తో చదువు స్వస్తి పలికింది. కాలేజీకి మొదటివాడుగా పాసయ్యాడు. ఆ రోజు తండ్రి తనతో అన్నమాటలు మనసులో శాశ్వతంగా నిలిచిపోయాయి.

''రమణా! నూతిలో నిలుచున్నవాడు ఆకాశం కేసి చూస్తూ పైకివద్దామని ఎగిరితే మరింత మునుగుతాడు. మన పరిస్థితి కూడా అంతే ఇంత కంటే చదువు చెప్పించే తాహతు మనకిలేదు. కొంచెం నాకష్టం అర్థం చేసికో.'' అవి నాన్న తనతో అన్నమాటలు.

ఏం చెయ్యగలిగాడు? కోరికలు చంపుకుని తండ్రి చెప్పినట్లు ఉద్యోగంలో చేరాడు. ఆనాటి నుంచి ఒకటే బ్రతుకు. గానుగెద్దుసామ్యం. నిత్యం 'యేవో'కొత్త సమస్యలు! ఒకటి గడిచిందంటే మరొకటి.

రమణ గట్టిగా నిట్టూర్పు విడిచాడు.

''రమణా! నీ కుటుంబానికి నీవు సహాయం చెయ్యవలసిందే. ఎవ్వరూ కాదనలేరు. అయితే నీ భవిష్యత్తు నాశనం చేసికోకు. ఇది కలియుగం. ఎవరి సుఖం వారు వెదుక్కోకపోతే బ్రతక గలిగే రోజులు కావు. నువ్వు ఎక్కడున్నా నీ కుటుంబానికి ఏదో తగినంత పంపు. లక్ష్మి పెళ్లికి నీ శక్తికి తోచినట్టు సహాయం చెయ్యి. వద్దనను. కాకపోతే నేను కూడా చేతనయిన సహాయం చేస్తాను. నాకు తెలిసిన సంబంధాలు బోలెడున్నాయి. చూద్దాం. అంతేకాని నువ్వు పూర్తిగా యీ విష వలయంలో యిరుక్కుని పోతానంటే....'' సీతాపతి మధ్యలోనే ఆగిపోయాడు.

''సరేలెండి. ఆలోచిద్దాం.'' రమణ లేచి నిలుచున్నాడు.

''అలాగంటే కాదు. నాకు మాట యివ్వాలి. ప్రస్తుతం నాకు తెలిసిన కంపెనీలోనే ఖాళీ వచ్చింది. ఆలస్యంచేస్తే అది కాస్తా చేయి జారి పోతుంది. అవకాశం వచ్చినప్పుడు వినియోగపరచు కోడంలోనే వుంది మానవుడి తెలివి. యిదిగో నీ కిక్కడికంటే యింకో యేభయి రూపాయలు ఎక్కువ వస్తాయి. రేపు ప్రొద్దున్నే నాతో బయలు దేరు. యిప్పుడప్పుడే యింట్లో యేమీ చెప్పసక్కరలేదు. సందర్భంవస్తే అన్నివిషయాలు అవే తెలుస్తాయి. నువ్వు నామాటకి ఒప్పుకున్నానని ఒక్కమాట చెప్పు అంతే చాలు.'' సీతాపతికూడా లేచి బట్టలు దులుపుకున్నాడు.

రమణ దారిలో యేమీ మాట్లాడలేదు.

యింటిముందుకి రాగానే సీతాపతి ఆగి అన్నాడు. ''ఇదిగో రమణా! నాస్వార్థం అనుకోలేక నాకుమార్తె భవిష్యత్తుకోసమో నీ మంచికొరకో చెప్పాను. నీ భార్యతో కూడా ఆలోచించి నాకు చెప్పు. నువ్వు సరేనంటే ప్రొద్దున్నే బయలుదేరివెళ్దాం.''

రమణ మవునంగా అడుగు లోపలికి వేసాడు.

''అబ్బాయ్! లక్ష్మి యింకా యింటికి రాలేదురా. ఒకసారి అలాగ చూసి వస్తావేమిటి?'' సీతమ్మగారు ఎదురువస్తూ అంది.

''ఏం? ఎక్కడికి వెళ్ళింది?'' రమణకి కోపం వచ్చేసింది.

''అదిగో అక్కయ్య వస్తోందే.'' వాసు వీధి లోకి చూస్తూ అన్నాడు,

రమణని చూసి లక్ష్మి గుమ్మంలోనే ఆగిపోయింది.

''అయిందా షికారు? ఆడపిల్లవి కదూ? యింత వరకూ ఎక్కడున్నావు? నీకోసం మేమిక్కడ బెంగపెట్టుకుని చావడం!'' రమణ మండిపడ్డాడు.

సీతాపతి అక్కడే కూర్చుని వున్నాడు.

లక్ష్మి సిగ్గుతో భయంతో పెదవులు కదిల్చింది కాని మాట బయటికి రాలేదు.

''అదికాదురా.....'' సీతమ్మగారు ఏదో చెప్పబోయి ఆగిపోయింది. లక్ష్మి తలవంచుకుని నిలబడిపోయింది.

''లోపలికి నడు. యింకా అక్కడెందుకు?'' రమణ గట్టిగా అన్నాడు.

లక్ష్మి తలయెత్తకుండా లోనికి నడిచింది.

''ఛీ! పాడు సంసారం! రమణ గొణుక్కుంటూ తన గదిలోకి నడిచాడు. మనసంతా అసలే చికాకుగా అయిపోయింది. సరాసరిపోయి మంచంమీద పడుకున్నాడు. ఏవేవో ఆలోచనలు! సీతాపతి అన్న మాటలకి ప్రాధాన్యత యివ్వకుండా ఉండలేకపోతున్నాడు. మామగారు సూచించిన పద్ధతి అనుసరించడం తనకి న్యాయమేనా? కాదా? ఒకనిముషం యివన్నీ వదలిపెట్టి వెళ్ళిపోవాలనే అనిపిస్తుంది. మరు నిముషం అన్యాయమనిపిస్తుంది. ఏం చేయాలి?

అలికిడికి తలత్రిప్పి చూశాడు. సరోజ గదిలో అగరువత్తులు వెలిగించి పెట్టింది. ఒక క్షణం భార్య ముఖంలోకి చూస్తూ అన్ని ఆలోచనలు మరచిపోయాడు రమణ. సరోజ భర్త కనులలోకి క్రీగంట చూసి నవ్వింది. తొలకరి కురిసినట్లయింది. రమణ పెదవులమీదికి కూడా అనాలోచితంగా నవ్వు వచ్చింది.

''మీనాన్నగారికి ప్రక్క, అదీ చూసావా.''

''వూఁ. దొడ్లో ఆరుబయట పడుకుంటూన్నారు.'' సరోజ భర్త ప్రక్కనే కూర్చుంది. రమణ తదేకంగా భార్య కనులలోకి చూస్తూ ఉండిపోయాడు.

''సరూ! మీ నాన్నగారు యిందాక ఒక ముఖ్యమయిన విషయం ప్రస్తావించారు.''

సరోజ ముఖం గంభీరంగా మారిపోయింది. తల దించేసింది.

''మధ్యాహ్నం నాతో చెప్పారు. నేను అసలు మీతో ప్రస్తావించవద్దనే చెప్పాను. వినలేదన్న మాట.'' సిగ్గుతో మెల్లిగా అంది.

రమణ భార్యముఖం తనవైపుకి త్రిప్పుకున్నాడు. ''అందులో పెద్ద తప్పుయేముంది? ఏదో మన సుఖం కోసమే చెప్పారు. మన కిష్టమయితే చూద్దాం. సరేనా.''

''నేనేదో యిక్కడ కష్టపడుతున్నానని మీరు అనుకోకండి. నా సుఖంకోసమని మీరేమీ నిర్ణయాలు చేయవద్దు. నా కింతకుమించి మరేమీ వద్దు.'' సరోజ మెల్లిగా అంది.

''నీకోసం నాకోసం కాదోయ్. పుట్టబోయే వాళ్ళకోసం.'' రమణ అంత గంభీరతలోను నవ్వాడు, సరోజ కూడా నవ్వింది.

''ఇంతకీ నువ్వేమంటావ్? నీ ఉద్దేశమేమిటి?'' రమణ భార్య భుజాలుపట్టి తనవైపు త్రిప్పుకుని అడిగాడు.

''నాకు తెలియదు. నేనేం చెప్పలేను. మీకేది మంచిదనితోస్తే అలాగ చెయండి.'' సరోజ రమణ చూపులు తప్పించుకుంది.

రమణ మళ్ళీ ఆలోచనలో మునిగిపోయాడు. తనిప్పుడు వదలివేస్తే ఏం జరుగుతుంది? నాన్న, అమ్మ పెద్దవాళ్లయి పోయారు. మురళికి యింకా గట్టిగా పందొమ్మిది యేళ్లయినా లేవు. ఉద్యోగంచేసి కుటుంబాన్ని పోషించగలడా? లక్ష్మి పెళ్లెలాగ జరుగుతుంది? వాసు ఇంకా పసివాడేనే! పోనీ తను మురళిని కష్టపడి చదివిస్తేమాత్రం వాడు తనకేం చేస్తాడు? నాకేం తెలియదు? నా బ్రతుకు నాది. అంటే మాత్రం ఏమనగలడు? దుర్గ పెళ్ళికి చేసిన మూడువేల అప్పు మిగిలిపోయింది. వడ్డీ తప్ప అసలు తను తీర్చలేదు. లక్ష్మి పెళ్ళికి మళ్ళీ ఎలాగలేదన్నా అయిదువేలు అన్నా ఉండాలి. యీ అప్పులన్నీ తీర్చగలిగేసరికి తన బ్రతుకు తెల్లవారిపోతుంది. యింకా వాసుని పెద్దవాడిని చేయాలి.

రమణ మనసు ఒక క్షణం వూగిసలాడింది. తన సుఖం తనెందుకు చూసుకోకూడదు ? తన సౌఖ్యం, యవ్వనం ఎందుకు ధారపోయాలి? అందరూ తనలాగే ఉంటున్నారా? క్రొత్తగా పెళ్లయిన వాళ్ళు అనుభవించే సంతోషం తనెన్నో వంతు అనుభవించ గలుగుతున్నాడు? అందరూ భార్యలను వెంటబెట్టుకుని హాయిగా ప్రపంచం అంతా తిరిగి వస్తున్నారు. తనేం చేసాడు? సరోజను కూడా తీసికొనివచ్చి యీ నరకంలో పడేశాడు. ఆఖరికి ఒక్కొక్కరోజు తినడానికి సరిగా తిండి కూడా కరువే.

ఏనాడయినా తను సరోజను సినిమాకు కాని, ఎక్కడికయినా తీసికొని వెళ్ల గలిగాడా? అసలు అటువంటి ఆలోచన చేయగలిగే తాహతు తనకి లేదు. ఆ డబ్బు ఖర్చు చేయకుండావుంటే రెండు రోజులు హాయిగా గడుస్తుంది. అని మనసు బుద్ధి చెప్తుంది. ఆఖరికి ఏదో ఒకటి రెండుసార్లు తప్ప సాయంకాలం రెండణాలు ఖర్చుచేసి పువ్వులు కొని తేలేక పోయేడు. యేమిటి తనకి మిగిలిందని?

తన చేతులతో సరోజకి ఒక్క చీర కొనలేదు. తనెందుకని తన సౌఖ్యం త్యాగం చేయాలి? తనకి దక్కే ప్రతిఫలం యేముంటుంది? అందరికీ చివరకి రెక్కలు వచ్చి ఎగిరిపోతారు. మిగిలేది తనొక్కడే! రెక్కలు సగం విరిగి నాశనమయిపోయి.

రమణ ముఖం నిండా చెమటలు పట్టాయి.

అలాగ జరగడానికి వీలులేదు. తనెందుకు నాశనమవాలి? తను స్వేచ్ఛగా హాయిగా జీవించాలి.

"సరూ! నిద్రపోయావా?" రమణ లేపాడు..

"వూహు . ఏమిటి?" మత్తుగా కళ్ళు తెరువకుండానే అంది సరోజ.

"మనం యిక్కడ ఉండవద్దు. వెళ్ళిపోదాం ఎక్కడికయినా సరే." రమణ ఆవేశంగా అన్నాడు.

"ఏవి టి?" సరోజ ఆశ్చర్యంగా అంది నిద్ర మత్తు వదలిపోయి.

"ఈ బాధ్యతలన్నీ మనకి వద్దు. ఈ బరువు నేను మోయలేను. బట్టలు సర్దుకో. తెల్లవారి మీనాన్నగారితో వెళ్ళిపోదాం." రమణ భార్యను లేపి కూర్చోబెట్టాడు.

"తొందరపడి నిర్ణయాలు చేయకండి." సరోజ భర్తకేసి అనుమానంగా చూస్తూ అంది.

"లేదుసరూ! అన్నీ ఆలోచించే యీ నిశ్చయానికి వచ్చాను." రమణ లేచి నిలుచున్నాడు.

"నాబట్టలు, నీవి ఒకే పెట్టెలో సర్దెయ్యి. వూరికి వెళ్తున్నామని చెప్దాం. అక్కడికి వెళ్ళిన తరువాత వివరంగా ఉత్తరం వ్రాయవచ్చు."

సరోజ మాట్లాడకుండా కూర్చుంది.

"మనం యిక్కడ ఉండలేం సరూ! నేను పూర్తిగా ఆలోచించాను లే మరి!" రమణ భార్యను బలవంతంగా ట్రంకు ముందు కూర్చోబెట్టి తన షర్టులు అవీ ముందు పడేసాడు.

సరోజ పెట్టెలో బట్టలు చేతులతో కదుపుతూ వూరుకుంది.

"నామాటమీద నమ్మకం లేదేమిటి?" రమణ అన్నాడు.

సరోజ ఒకసారి తలయెత్తిచూసి మెల్లిగా బట్టలు సర్దటం మొదలు పెట్టింది.

రమణ అటూ యిటూ తిరుగుతున్నవాడల్లా ఆగిపోయి భార్య ప్రక్కనే కూర్చున్నాడు. "నీకు ఇప్పుడు నిజంగా సంతోషంగా లేదూ?" భార్య గడ్డంపట్టి తనవైపుకు త్రిప్పుకుని అడిగాడు.

సరోజ నవ్వింది. "మీకు సంతోషంగావుంటే నాకూ ఉంటుంది." పెట్టె మూసేస్తూ అంది.

చాలు! సరోజ ముఖంలో తృప్తిచాలు. తను చేసే పనిలో సరోజకి సుఖం ఉంది. రమణ మనసులో సమర్థించుకున్నాడు.

"రేపేనా వెళ్ళిపోవడం?" సరోజ ప్రక్కమీద పడుకుంటూ సంశయంగా అడిగింది.

"వూం." రమణ సంతృప్తిగా చూస్తూ పడక కుర్చీలో కూర్చున్నాడు.

"సరే అయితే లైటు ఆర్పేయండి. నాకు నిద్రవస్తోంది బాబూ." సరోజ ఆవులిస్తూ అంది.

"హాయిగా నిద్రపో. యింక పీడ కలలు లేవు. జీవితమంతా పువ్వులబాట!" రమణ లేచి లైటు ఆర్పేశాడు.

రమణ అలాగేకూర్చున్నాడు చీకటిలోకిచూస్తూ. అరగంట గడచి పోయింది. భవిష్యత్తుకి ఆలోచనలతో ఒక రూపం యివ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. తనకి, సరోజకి అయితే తనకివచ్చే జీతం హాయిగా సరిపోతుంది. రమణ స్వప్నలోకాలలోకి తేలిపోయాడు. అకస్మాత్తుగా గుర్తుకి వచ్చింది.

తన నిర్ణయం అమ్మా నాన్నకి తెలిసి యేమనుకుంటారు? మోసం చేశాడు అనుకుంటారా? ఇందులో నిజంగా తన తప్పేముంది! తనకిమాత్రం కోరిక అనేవి ఉండవూ!

మురళి యేమని అనుకుంటాడు? అన్నయ్య తనని నాశనం చేశాడని అనుకుంటాడేమో! వాడు కూడా చివరకి గుమాస్తా అయిపోతాడా? లక్ష్మి పెళ్ళి యెలాగ జరుగుతుంది? చివరకి డబ్బులేక రెండోపెళ్ళివాడికిచ్చి చేస్తారా? లేకపోతే దాన్ని కూడా పోషించలేని దరిద్రుడి చేతిలో పెట్టరు కదా! వాసు చదువు మానేసి కోమటి కొట్లో చేరతాడేమో! పేపర్లు అమ్ముకోవలసి వస్తుందేమో!

రమణ తల వేడెక్కిపోయింది. ఛీ! తను యింత బలహీనుడయి పోతున్నాడేం? తనేం చేయాలి? తను తప్పటడుగు వేయటం లేదుకదా!

రమణ లేచి చీకటిలోనే అటూ యిటూ తిరగడం ప్రారంభించాడు. గాఢ నిశ్శబ్దంలో సరోజ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గట్టిగా వినపడుతున్నాయి.

రమణకి నోరు యెండిపోయి దాహం వేసింది.

"సరూ!" మెల్లిగా పిలిచాడు.

సరోజ ప్రక్కకి తిరిగింది నిద్రలోనే. రమణ మెల్లిగా తలుపుతీసి బయటకు వచ్చాడు. గడియారం పదకొండు గంటలు కొట్టింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రక్కగదిలో లైటు వెలుగుతోంది.

చప్పుడు చేయకుండా వంటగదిలో అడుగు పెట్టాడు.

"ఎవరు? నాన్నా! రమణా నువ్వేనా? యింకా పడుకోలేదూ? మళ్ళీ ప్రొద్దునే ఆఫీసుకి వెళ్ళాలి కదా! పెందరాళే పడుకో గూడదూ?"

రమణ తల్లి కంఠస్వరంలోని ఆప్యాయతకి చలించిపోయాడు. ఒక్క క్షణం తల్లి "నాన్నా! రమణా" అని పిలిస్తే ఎంతహాయిగా ఉంది. రమణ సర్వం మరచిపోయాడు. తను యీ ప్రేమాప్యాయతలు దూరం చేసికోవాలా?

లైటు వేసాడు. వట్టి క్రిందనే పడుకుంది కాబోలు ఆవిడ, యిక ప్రక్క బట్టలేమీ లేవు.

"క్రింద పడుకున్నా వేమిటమ్మా?" రమణ బాధగా అన్నాడు.

"కడిగిన నేలకదరా." కొడుకు చూపిన ప్రేమకి వాత్సల్యంతో అంది సీతమ్మగారు.

అబద్ధం! మిగిలిన ప్రక్క బట్టలన్నీ తన మామగారికి వేసి ఉంటారు. రమణ మనసులోనే అనుకున్నాడు.

"మంచినీళ్ళు కావాలమ్మా" రమణకి తల్లి ముందు తనెంతో చిన్నవాడయిపోయినట్టు అనిపించింది.

ఆవిడ లేచి గ్లాసుతో నీళ్ళు అందిచ్చింది. రమణ గ్లాసు అందుకోబోయాడు.

"ఉండు. నలకలేవో ఉన్నట్టున్నాయి. మళ్ళీ యిస్తాను." సీతమ్మగారు రమణ చేతిలోని గ్లాసు నీళ్ళు పారబోసేసింది.

రమణ విభ్రాంతుడయిపోయాడు.

అయ్యో! యిటువంటి ప్రేమమయినా తను దూరం చేసికోవాలని అనుకున్నది. రమణకి ఒక్కసారిగా నీరసం ఆవరించింది. అక్కడే కూర్చుండి పోయాడు. కనులలో నీరు తిరిగింది.

"ఏమిటినాన్నా! ఏం జరిగింది?" సీతమ్మగారు కంగారు పడింది.

ఆక్షణాన రమణకి తల్లి ఒడిలో తలదాచుకుని తన పాపిష్టి ఆలోచనలన్నీ చెప్పి క్షమాపణ కోరుకోవాలని అనిపించింది మనసులో.

"తలనొప్పిగా ఉంది. అమ్మా" చివరకి మెల్లిగా అన్నాడు

"మరి చెప్పావుకాదేం. ఉండు. అమృతాంజనం వ్రాస్తే తగ్గిపోతుంది." ఆవిడ ప్రక్క గదిలోకి వెళ్ళింది.

రమణ నీళ్ళు నిండిన కళ్ళతో నీరసంగా కూర్చుండి పోయాడు.

తల్లి చేతివ్రేళ్ళ స్పర్శలోని సుఖం అనుభవిస్తూ మత్తుగా కళ్ళు మూసుకుని పడుకున్నాడు రమణ చాలసేపు.

"అమ్మా! నాన్న పడుకున్నారా?"

"లేదురా. మురళికి కాలేజీకి డబ్బు కావాలి కదూ. ఎక్కడయినా చూస్తానని వెళ్ళారు. ఏదీ యింకా రాలేదు."

"నేనేదో ఎక్కడో చూసేవాడినిగా. ఆయనకెందుకు చెప్పావు? అర్ధరాత్రి ఎక్కడ ఎవరింటికి తిరుగు తున్నారో యేమో!" రమణ మనసు పూర్తిగా మారిపోయింది.

"ఎంతకని నువ్వుమాత్రం బాధపడతావురా?" సీతమ్మగారు జాలిగా అంది.

"యింక చాలమ్మా. తగ్గిపోయింది." రమణ లేచి కూర్చున్నాడు.

"లక్ష్మిని హింది పరీక్షలకి కట్టమని నేనే అన్నారా వూరికేనే కూర్చోవద్దని. ఆ స్కూలు



అనుబంధం

సాయంకాలం అయిదింటికి కాని మొదలు పెట్టరుట. అందుకని ఆలస్యమయిందిట. నువ్వు తి[illegible]వని భోజనం చేయకుండా వుంటుంది. పిచ్చిది!" సీతమ్మగారు అంది.

"వాముసనివాళ చికాకుగా ఉంది యేదో అనే సాను." రమణ గొణుక్కున్నాడు.

"మరింత పడుకో అమ్మా!" రమణ లైటు ఆర్పి బయటికి వచ్చేసాడు.

ప్రక్కగదిలోకి తొంగి చూశాడు. మురళి గుమ్మంకేసి వీపు ఉంచి ముందుకివంగి చదువుతున్నాడు. లక్ష్మి మరొక కుర్చీ మీద కుర్చుంది. చేతులు బల్లమీదఉంచి, తల ఆన్చి నిద్రపోతోంది. రమణ మనసు జాలితో నిండిపోయింది. అందరి ఎదురుగా అభిమానం ఉన్న పిల్లని తిట్టడం తన తప్పు.

రమణ నిశ్శబ్దంగా యిద్దరి వెనుక నిలబడ్డాడు.

తలమీద మెత్తటి రమణ చేతి స్పర్శకు ఉలికిపడి లేచింది లక్ష్మి.

మురళి ఆశ్చర్యంగా చూసాడు.

"లక్ష్మి! అన్నం తినలేదుటగా యింకా. అన్నయ్య తిడితే ఎవరయినా కోపగించకుంటారా? ఒంటరిగా రేపటినుంచి వెళ్లకు. వాసుని కూడా సాయం తీసికొని వెళ్తూవుండు. యేం సరేనా? ముందు భోజనం చేసిరా!" అనునయంగా అన్నాడు రమణ.

లక్ష్మి మాట్లాడకుండా తలవంచుకుంది.

"యింకా కోపం పోలేదా నామీద?" రమణ చెల్లెలి చెక్కిళ్లమీద ఎండిన కన్నీటి చారికలు చేతితో తుడిచేశాడు.

"నా కెందుకు కోపం?" ఈసారి లక్ష్మి తెల్లని పలువరస కనబడేలా నవ్వింది.

"మరి వెళ్ళు. ముందు భోజనం చేసిరా. వెళ్లేటప్పుడు నా గదిలో దిండువుంది అమ్మకి తీసికొని వెళ్లియ్యి." రమణ చెల్లెలిని పంపేశాడు.

"ఏరా! మురళీ! బాగా చదువు తున్నావా?" ముందున్న పుస్తకం పేజీలు తిరగేస్తూ అడిగాడు.

"బాగానే చదువుతున్నా నన్నాయ్. వదిన ఆలస్యంగా చెప్పింది. నేను సైకిలు తీసికొని వెళ్లేసరికి కొట్లు కట్టేసారు." మురళి అన్నాడు.

"పోనీలేరా. స్కాలరుషిప్ రావాలి మరి. జాగ్రత్తగా చదువు." ప్రేమగా వీపుమీద తట్టి వచ్చేశాడు.

పూర్తిగా తెల్లవారకుండానే సరోజ, రమణని నిద్ర లేపింది.

"నాన్నగారు మిమ్మల్ని త్వరగా తయారు కమ్మంటున్నారు. నాస్నానం కూడా అయిపోయింది. బండికి ఆట్టే టయిములేదట."

రమణ బద్ధకంగా ప్రక్కకి తిరిగి పడుకున్నాడు. "అబ్బ! రాత్రి సరిగా నిద్రపట్టలేదు సరూ! యిప్పుడే లేవను. మురళి లేస్తే నా సైకిలు ముందు బాగు చేయించుకుని రమ్మనిపంపు."

సరోజ ఆశ్చర్యపోయి చూసింది. "అయితే మీరు నిజంగా......" మధ్యలోనే వాక్యం పూర్తి చేయకుండా ఆగిపోయింది.

"పీడకల వచ్చింది." రమణ తృప్తిగా నవ్వి మళ్లీ కళ్లు మూసుకున్నాడు. ●

ఏడో ఎక్కం

ఎ.విశ్వేశ్వరరావు



"ఊః! లే!" గర్జించాడు సుందరం పంతులు. "వెధవా! ఏడోఎక్కం రాకపోతే ఎందుకురా మూడో క్లాసులో? చాపు చెయ్యి వెధవా!" భయం భయంగా తన లేత అరచేతిని ముందుకు చూపాడు ఎనిమిదేళ్ళ బాబి. ఛెళ్ మంది బెత్తం. పిల్లలంతా బిత్తరపోతున్నారు. ఎప్పుడూ నవ్విస్తూ పాఠం చెప్పే మాస్టారు ఇవాళ ఇంత కోపంగా వున్నారేమిటా అని. గుడ్ల నీరు కుక్కుకుంటూ అలాగే నిలబడ్డాడు బాబి.

"ఫో! బెంచీ మీద నిలబడు" అరిచాడు సుందరం క్లాసంతా నిశ్శబ్దంగా వుంది.

"ఒరేయ్ సూర్యం! నీవు చెప్పరా ఏడవ ఎక్కం."

"ఏడొకట్లేడు, ఏడ్రెండ్లు పద్నాలుగు" గడగడ మొదలెట్టాడు సూర్యం.

మాస్టారి మనస్సు అక్కడలేదు. సుందరం తను చేసిన పనినే ఆలోచిస్తున్నాడు. ఏడవ ఎక్కం రాకపోతే మటుకు కొట్టాలాచిన్న వెధవని? చదవమనచ్చుగా? బాబి వంక తేరిపార చూచాడు సుందరం. కందగడ్డలా వుంది వాడి మొహం. గుడ్ల నీరుకుక్కుకుంటున్నాడు. హఠాత్తుగా గుర్తుకొచ్చింది సుందరానికి. ఆయన కాళ్ళు, చేతులు వణకసాగాయి. అతను..అతను..బాబి.. ఆ వూరి ప్రెసిడెంటుగారి అబ్బాయి. తనకి ఆశ్రయమిచ్చి, ఆదరించిన ప్రెసిడెంటు ముద్దులకొడుకు... గారాల కూచి.

మాస్టరు పరధ్యానం చూసి, రణగొణ ధ్వని మొదలుపెట్టారు పిల్లలు. కొంతమంది మాత్రం మాస్టారి వంక ఆలోచనగా చూస్తున్నారు.

"తన కెందుకివాళ అంత కోపం వచ్చింది?" ఆలోచించాడు సుందరం. చిరాకు కాక మరేమిటి? ఇంటి నిండా బంధువులు, చేతిలో చిల్లిగవ్వలేదు. అప్పు కూడా పుట్టలేదు. ఏదో పొందికగా సంసారం నెట్టుకొస్తున్న తన ఇంటికి పెళ్ళివారు వచ్చారు. పక్కవూళ్ళో పెళ్ళిట. వెళ్ళేటప్పుడు పలకరిద్దామని. రెండురోజులు వుంటారుట. మళ్ళా వచ్చేటప్పుడు తప్పకుండా దిగుతామని మాట కూడా ఇచ్చారు. వూరంతా తిరిగాడు ఎక్కిన గుమ్మం ఎక్కకుండా. ప్రతివాడు మొండి చెయ్యి చూపించేవాడే. ప్రతివాడూ కుంటి సాకులు చెప్పేవాడే! అందరి కాళ్ళా పట్టుకున్నాడు. చివరికి రామ్మూర్తిగారు దయతలచి, పదిహేను రూపాయలు ఇచ్చాడు. సరే! అవి వాళ్ళకి సరిపోతాయి ఆ రోజుకి. మళ్ళా రోజు ఏం చెయ్యాలిరా భగవంతుడా! అని తల బాదుకుంటున్నాడు. ఎలాగో అలాగ ఇంట్లోంచి బయటపడి స్కూలు చేరుకున్నాడు.

స్కూలుకి రాంగానే, కళకళలాడే పిల్లల మొహాలు చూడంగానే, కష్టాలన్నీ మర్చిపోయేవాడు ప్రతిరోజూ. ఇవాళ అలాకాదు. వాళ్ళ అల్లరి చూసి ఎందుకో చిరాకు అనిపించింది. రెండుమూడుసార్లు వాళ్ళ మీద కేకలు వేశాడు కూడా. పాఠం చెబుతూ అటు తిరిగేసరికి బాబిగాడు సూర్యం చెవిలో ఏదో చెబుతున్నాడు. ఆ అప్రాచ్యపు వెధవ చిరునవ్వులు చిందిస్తున్నాడు. తనకి ఒళ్ళుమండిపోయింది. అందుకనే ఏడోఎక్కం చెప్పమన్నాడు. తనకి బాగా తెలుసు. బాబిగాడు క్లాసులో మంచి తెలివిగలవాడనీ, వాడిని ఏడోఎక్కం ఒక్కటే భూతంలా పట్టేస్తుందనీ. అందుకనే అది అడిగాడు. వాడు నెమ్మదిగా చెబుతుంటే, తనే కేకవేశాడు. వాడు పూర్తిగా కంగారు పడిపోయాడు. ఫలితమే వాడికి దెబ్బలు. నిట్టూర్చాడు సుందరం.

తలెత్తి చూశాడు. పిల్లలంతా ఏదో వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. "ఒరేయ్! గ్రౌండులోకి వెళ్ళి ఆడుకోండిరా! నాలుగున్నర లోపల బయటికి వెళ్ళారో జాగ్రత్త!" హెచ్చరించాడు సుందరం. బిలబిలమంటూ పరిగెత్తారు పిల్లలు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్న బాబిని చూస్తే జాలివేసింది సుందరానికి.

ఆలోచనల్లోకి జారిపోయాడు సుందరం. బాబి ప్రెసిడెంటుగారి ఏకైక పుత్రుడు. వాడి కోసం, ఆయన ఏమైనా చేస్తారని ప్రతీతి. వాడిని కొడితే ఆయన సహించగలడా? ఆయనకి బాబి పుట్టక ముందు విపరీతంగా పొగ త్రాగడం అలవాటు వుండేదిట. కాని బాబి పుట్టాక ఒకటి జరిగిందిట. ఆయన చుట్ట కాలుస్తూ, వాడిని దగ్గరికి తీసుకున్నాడుట. ఆ పొగ పీల్చి బాబి ఉక్కిరిబిక్కిరి అయ్యాడుట

అంతే! ఆయన తిరిగి పొగ పోసిన చూడలేదు. అటు వంటి ముద్దుల కొడుకు చెయ్యి కందేటట్లుగా కొడితే, ఆయన సహిస్తాడా? ఈ సుందరం వున్నంత కాలం, తాను ఆ బడి కెళ్ళనని వాడు మొండికేస్తే, తనకి రెండోరోజున ఉద్వాసన పలకడూ? "ఇది టయ్యా నీవు చేసేది? ఉద్యోగం లేక అల్లాడుతుంటే ఆశ్రయమిస్తే నీవు చేసేది?" అని నిలదీస్తే అడ గడూ? ఇక్కడికి రాకపూర్వం తాను అకౌంట్సు ఆఫీసులో పని చేసేవాడు పట్నంలో. ఏదో ఉన్నంతలో బాగానే జరిగిపోయేది. ఉన్నట్లుండి, ఇరవయి మందిని రిట్రెంచ్ చేశారు. వాళ్ళతోపాటూ తానూ అయి పోయాడు. అంతే! జీవించడానికి వున్న ఒక్క ఆసరా కూలిపోయింది. ఎవరో చెబితే విని, ఈ వూరి నాయుడుగారు, ప్రెసిడెంటు దగ్గరికి వచ్చాడు. ఆయన జాలిదలచి ఉద్యోగం ఇచ్చి, రెండువందలు అప్పు ఇచ్చి, కూలిపోతున్న తన సంసారాన్ని తిరిగి నిలబెట్టాడు.

హఠాత్తుగా చేతివాచీ కేసి చూసుకున్నాడు సుందరం ఆలోచనల్లోంచి తెప్పరిల్లి. "నాలుగూ ఇరవై అయిదు."

"ఒరేయ్! పోండిరా ఇళ్లకి! రేపు పెందలాళే రండి"

తనకే తెలియదు రేపు తను వస్తాడో రాడో?

"అయినా ఒక్క చిన్నదెబ్బ వేసినంతమాత్రానా, ఏం జరుగుతుందిలే! దానికి లేనిపన్నీ వూహించుకుంటు న్నాడు. నిజంగా అంత సీరియస్‌గా ఏమీకాదు. ఆయన తనని మందలించవచ్చు. అయినా మాస్టరు అన్నాక, దెబ్బ వేయకుండా వుంటాడా" ఈ ఆలోచన సుంద రాన్ని తృప్తిపరుస్తోంది కాని, ఎందుకో అతని మనసు

ఏడో ఎక్కం

కీడుని శంకిస్తోంది. నెమ్మదిగా ఇల్లు చేరాడు సుంద రం.

గుమ్మంలో నిల్చున్న శారద భర్తని చూడగానే చిరునవ్వు వలకపోసింది. ఇంకో సమయంలో అయితే, తానూ నవ్వేవాడే! కాని ఇప్పుడు?

ముభావంగా ఉన్న భర్తని ఏమీ ప్రశ్నించలేదు శారద. ఏమైనా వుంటే అతనే, ఆమెకి చెప్పటం అలవాటు.

దొడ్లో స్నానం చేస్తూ ఆలోచిస్తున్నాడు సుంద రం. తన వుద్యోగం పోతే ఏం కావాలి? మళ్లా వుద్యోగం ఎక్కడ దొరుకుతుంది?" స్నానం అయిపోయిందనీ, ఒళ్లు తుడుచుకోవాలనీ, శారద గుర్తు చేస్తేకాని గుర్తే రాలేదు సుందరానికి.

బట్టలు వేసుకొని ఏటి ఒడ్డుకి బయలుదేరాడు సుందరం. అతని ఆలోచనలు అతనిని విడవటల్లేదు. అమాయకమైన బాబి మొహం అతనికి కళ్ల ముందు కన్పిస్తోంది. రుద్రమైన నాయుడుగారి కళ్లు తన వైపే చూస్తున్నాయి.

ఆలోచనన్ని కట్టిపెట్టి భారంగా ఇంటి ముఖం పట్టాడు సుందరం. దూరాన్నుంచే చూశాడు సుంద రం శారదని. శారద గుమ్మంలో నిలబడి వుంది. ఏదో వార్త అతనికి చెప్పాలని ఆమె అనుకుంటున్నట్టు, ఆమె ముహం చూస్తేనే తెలిసిపోతోంది. దగ్గరగా వచ్చాడు సుందరం. "ఏమండీ! నాయుడుగారి పాలేరు వచ్చాడు. మిమ్మల్ని ఉన్నపళంగా రమ్మనమన్నారుట నాయుడుగారు." చెప్పి భర్త మొహంలోకి చూసింది

శారద. అతను వణుకుతున్నాడు. మొహం పాలి పోయింది. పెదవులు కంపిస్తున్నాయి.

"ఏమిటండీ? అట్లా వున్నారు?" శారద ప్రశ్నిం చింది భర్తని భయంగా.

"ఏమీ లేదులే! ఆ! ఇదిగో ఇప్పుడే వెళ్తున్నా" బయలుదేరాడు సుందరం.

సుందరం మనసు పరిపరి విధాలపోతోంది. కాళ్ళు తడబడుతున్నాయి. ఆయనకి దేముడు పదేపదే గుర్తు కొస్తున్నాడు. దూరంగా నాయుడు గారిల్లు కనిపి స్తోంది. తలుపు దగ్గరికి వెళ్లాడు సుందరం. వరం డాలో బాబి, కుక్కతో ఆడుకుంటున్నాడు. గేటు దగ్గర మనిషిని చూడగానే "భౌ" అంది కుక్క.

"ఏయ్ విక్కీ! పద లోపలికి" లోపలికి పరి గెత్తాడు బాబి.

గేటు తెరిచి లోపలికి వెళ్లాడు సుందరం. నిశ్శ బ్దంగా వుంది. రెండు నిమిషాలయింది. ఎవరూ రాలేదు. ఆ నిశ్శబ్దం అతనికి భరింప శక్యం గాకుండా వుంది. ఇంతలో కర్టెను వెనకాల గాజులు చప్పుడు వినిపించింది. సుందరం తలత్రిప్పాడు.

"ఆ కుర్చీ మీద కూర్చోండి. అదుగో! ఆయన స్నానం చేస్తున్నారు. వస్తున్నారు."

కుర్చీలో కూలబడ్డాడు సుందరం.

"బాబి అంతా చెప్పాడులెండి. అదుగో! ఆయన వస్తున్నారుగా! అన్నీ తెల్సుకోవచ్చును."

ఆవిడ మాటలో వ్యంగ్యార్థం స్ఫురించింది సుంద రానికి. నెత్తి మీద సమ్మెటలతో కొట్టినట్లయింది సుందరానికి. కళ్లు భైర్లు కమ్మసాగాయి. గుమ్మంలో నాయుడు భీకరంగా కనిపించాడు. అంతే! సుందరం కళ్ళు మసకలు కమ్మాయి.

కళ్లు తెరిచి చూసేటప్పటికి, ఏదో క్రొత్త లోకంలోకి అడుగు పెట్టినట్లుయింది సుందరానికి. వళ్లంతా బాధగా వుంది. నరాలు జివ్వుమంటున్నాయి. ఏదో హఠాత్తుగా గుర్తుకొచ్చి, అతని మెదడు నిద్ర నుండి లేచింది. "అమ్మా! మేష్టారు కళ్లు తెరిచారు." మృదువైన, పరిచితమైన కంఠం వినిపించింది. ఆ కంఠంలో ఎంతో సంతోషం కనపడింది. అతను తల తిప్పి చూడకపోయినా, గుర్తు పట్టాడు అత డెవడో. వాడే.. బాబిగాడు.. "ఇదిగో! వస్తున్నారు!" నాయుడి భార్య కంఠం వినిపించింది సుందరానికి.

ప్రక్కగదిలో నుండి నాయుడు బొంగురు గొంతు వినబడుతోంది ఖంగుమని.


"బాబి చాలా రోజుల్నించి అడుగుతున్నాడు, "మాస్టార్ని ఇంటికి పిల్చి నాకు ప్రైవేటు చెప్పమను నాన్నా! ఆయన ఎంత బాగా చెబుతారు" అని, అందుకని ఆయన్ని పిలిపించాను. నీరసంగా వున్నా, నా మాట కాదనలేక బయల్దేరి వెంటనే బయలుదేరి వచ్చాడు. కళ్లు తిరిగాయి."


నాయుడుగారి భార్య "పళ్లరసం తీసుకోండి అన్నయ్యగారూ" అంది.

తృప్తిగా తాగి కళ్ళు మూసుకున్నాడు సుందరం. నాయుడు గారింటి తలుపు తీయగానే, కుక్క తోకాడిస్తూ వచ్చింది. దాన్ని ముద్దాడి వరండాలోకి ఎక్కాడు సుందరం. బుద్ధిగా లెక్కలు చేసుకుంటు న్నాడు బాబి.

"మాస్టారూ! నాకు ఏడోఎక్కం బాగా వచ్చిం దండీ." వాడి మొహం వెలిగిపోతోంది.

తృప్తిగా వాడి తల నిమిరాడు సుందరం. అతని కళ్లల్లో నీళ్లు నిండాయి. బాబి బిత్తరపోయాడు. ●





సంక్రాంతి కానుక
ఏవి.ఎమ్ ప్రొడక్షన్సు
భక్త ప్రహ్లాద
AVM
ఈస్ట్‌మన్ కలర్
ప్రొడక్షను
దర్శకత్వం
చిత్రపు నారాయణమూర్తి బి.ఏ
రచన :
డి.వి.నరసరాజు బి.ఏ
సంగీతం ఎస్.రాజేశ్వరరావు
ఛాయాగ్రహణం విన్సెంట్
కళ: ఎ.కె.శేఖర్
నిర్మాతలు వీరప్పన్ & కంపెని
నవయుగ రిలీజ్

మానవత్వం బిల్లుమొత్తం

కొమరాజుగడ్డ రామచంద్రరావు



ఎదురుగుండా దీనంగా కూర్చున్న చంద్రపాదం మాట్లాడ్డం ముగించాడో లేదో ఆడిటరు లాల్ చాలా నిక్కచ్చిగా అన్నాడు.

"మీరు అలా ఆయుస్సు చూడాలనే వచ్చినట్లయితే నన్ను కలుసుకోవటం అనవసరం. మీ ఎకౌంటు ఆఫీసర్లున్నారు— వాళ్ళతో మాట్లాడుకోండి— మాట్లాడించుకోండి.." యింకా యేమో అనబోతున్నాడు.

అప్పటివరకూ పెదాల చివర చిరునవ్వు నటిస్తున్న చంద్రపాదం ముఖం హఠాత్తుగా కంగారు పొందుకుంది:

"అదికాదదికాదు. మనం మొన్న యీ బిల్లు విషయమంతా తర్జన భర్జన చేసి తేల్చుకొంటున్నాం. ఇప్పుడు మీ ఎ. ఒ. కేదయినా కొత్త సందేహాలు వచ్చినట్లయితే, మీరూ నేనూ వెళ్ళి ఆయనతో మాట్లాడి బిల్లు పాస్ చేయిద్దామని. అంతేకాని...." నచ్చులు నచ్చుతున్నాడు చంద్రపాదం.

"నేను పాస్ చేస్తానని చెబుతున్నానుగా."

"థాంక్స్."

చంద్రపాదం ముఖంలో మాత్రం నమ్మకం కలిగిన ఆచూకీ యేమీ లేదు.

నమ్మకం లేకపోతే సమ్మతించి యుండుచున్నారు కున్నాడనేది ప్రశ్న. సమ్మతించ కేం చేస్తాడు కనక?

అదీకాక, చంద్రపాదంలోని మానవుడు ఈమధ్య కొంచెం తప్పుకొన్నాడు. స్వతహాగా మానవుడే అవుగాక. మానవుడుగా తనకు వచ్చిన భావం వచ్చినట్లుగా వెల్లడియ్యటం మాత్రం అతడి మనసుకు ఒప్పదు. కొత్త భావాలు బనాయించి భిన్నమైన ముఖరిమలు వ్యక్తపరచి, ప్రవర్తించటం అతడికి అలవాటయింది. ఎక్కడచూసినా యెదురు దెబ్బలు తగలటంచేత క్రొత్త అలవాటు వచ్చేసింది. ఆ అలవాటిప్పుడు పాతయిపోయింది.

ప్రస్తుతం ... తన పని కోసరం యెదటివాణ్ణి సంతోషపెట్టాలని చూడటమే యీ దిగజారిపోయిన చంద్రపాదం కర్తవ్యం.

అందుకనే, "నేను పాసార్డరు వేయిస్తాగా" అనే భరోసా లోటి మానవుడు యిచ్చినప్పుడు ఆ మాటలో నమ్మకం లేకపోయినా "వూ, ఆ" అనలేదు ఆ వ్యధిత మానవుడు.

చంద్రపాదానికి పోయిన విధంగా మనుష్యత్వం లాల్‌కు పోలేదు. అతడింకా మనిషిగానే వున్నాడు. మనిషేమిటి—మనుషుల్లో నిక్కచ్చి మనిషి.

బిల్లు చూడంగానే అతడికి కలిగే భావాలన్నీ పక్షపాత రహితంగా కాగితం మీదకు ప్రసారం చేసి యెదటివాణ్ణి చిత్తు చెయ్యటానికి యిసుమంతయినా జంకని సుప్రసిద్ధ ఆడిటరు లాల్. ఆ తప్పు పట్టటంలో, ఆ త్రిప్పి వేయటంలో, ఆ వ్యాఖ్య చేయటంలో, ఆ ప్రమాణాలివ్వటంలో శభాస్ అనిపించున్నవాడు కవటంచేత ఎల్లాంటి వాళ్ళకైనా సమాధానం నొవ్వకుండా చెప్పగలడు. వాళ్ళచేతనే వాళ్ళ పొరపాట్లు చెప్పించి పంపించగల ధీమా, నియమనం అతడికి వున్నాయి.

ఆ వాకవక్యాన్ని ఆధారం చేసుకొని ప్రభుత్వ శ్రేయస్సు కోసరం బిల్లుల్ని ప్రత్యక్షర పరిశీలనం చేస్తుంటాడు లాల్. అటువ ప్రభుత్వ సేవకుడుగా కాన్సెన్షస్ వర్కరు. అనుమానంలేదు.

ఐతే అతడికి ఒక విషయం మనోగమనంలో వుండదు. తన ముందున్న కాగితాల వెనక కొందరు మానవుల జీవితాలున్నాయని తన కలం చిందులు వక్రిస్తే ఆ మానవులు మధనపడిపోతారనీ అతడికి తెలీదు.

అతడి దృక్పథం భిన్నమయింది. ప్రభుత్వ పరమయింది. అతని వాదం యేమిటంటే "అసలు సందేహమే లేవదియ్యకపోతే కధే లేకుండాపోతుందే! లోతు పాతులెలా తెలుస్తాయి? పని చెయ్యటానికి గడగట్టినంత కాలం కూడ లేచుకుక్కల్లా తగులోకత

పోతే యెంతెంత నష్టం కలిగేదో ని కాకికోశం ఫ్రెండో చూశారా?'' అని.

కాని యీ రేచుకుక్కల దంష్ట్రా కరాళాల్లో పడేది వట్టి పసిబిడ్డలేగాని పులులూ సింహాలూ కావు సరిగదా పులి చర్మాలు ధరించిన కంచరగాడిదలు కూడ కావు—అని అతడికి యెవరూ చెప్పలేదు.

ఇంతకూ చంద్రపాదం ప్రసంగం పెంచలేదు. కొంచెంసేపుండి, నిట్టూర్చి వూరుకున్నాడు.

అంటే ఇంక చంద్రపాదం యేమీ చెప్పదలచు కోలేదని లాల్‌కు అర్థమయింది.

లాల్‌కు యీ ప్రవర్తనం కొంచెం తమాషాగానే వుంది. ఈపాటికి తన సర్వీసులో యెంతో మంది మనుష్యుల్ని చూశాడు. వాళ్ళూ బిల్లులు ప్యాస్ చేయించుకోటానికి తన దగ్గిరకు వచ్చినవాళ్లే. కాని వాళ్లిలా ప్రవర్తించలేదు.

కొందరు సురసుర చూసి పళ్లకొరికి పరో క్షంగా గింజుకున్నారు కొందరు తిరగబడ్డారు. ఎలా ప్యాస్ కాదో బిల్లు చూస్తామన్నారు. కొందరు తమ బాధలు చెప్పుకొన్నారు. కొందరు తఖ్తుగా యేడ్చారు.

అవేవి లాల్‌ను కదిలించలేదు. వాళ్ళు తిరగబడ్డ కొద్దీ వాళ్ళ బలహీనతను బయటకు వెళ్ళాను గదా అని చిరుగర్వాన్ని చిందించేవాడు లాల్. వాళ్ళు యేడిస్తే అటువంక చూడకుండా తన కూడికలు తను కూడుకొంటూ వుండేవాడు.

చంద్రపాదం అలాంటివేవీ చేయలేదు. ఒక్క మాటికి,—

''మరిప్పుడేం చేయమంటారూ?'' అన్నాడు.

''నేనా చెప్పేది'' అనబోయాడు లాల్. మళ్లీ మార్చుకొని యిలా అన్నాడు: ''మీరు వెళ్ళండి. రేపు ఉదయానికి మీ బిల్లు సంతకమయి వస్తుంది. రేపే మీరు చెక్కు తీసుకోవచ్చు.''

లాల్ చెప్పిన మొదటి వాక్యం విని అది పరమ అబద్ధమేనని భావించాడు చంద్రపాదం. ఐతే రెండో వాక్యం వినంగానే అనూహ్యమైన ఆశ జనించింది. మొదటి పని కాకుండా రెండోది జరగటం అసంభ వమే. ఐనా యీ వ్యధిత హృదయుడికి ఎందుకో అలాంటి ఆశ కలిగింది ఆక్షణాన.

మనుష్యుడికి నిరాశ కలిగిన క్షణానే ఆశ పరు గెత్తుకుంటూ వచ్చి బుర్రలోకి దిగుతుంది. లేకపోతే అతడు బ్రతకటం కష్టమనో యేమో? చంద్రపాదా నికీ అంతే అయింది.

''ఎలా వస్తుందంటారు చెక్కూ'' అన్నాడు.

''మేము బిల్లు పంపిస్తాము. వాళ్ళు చెక్కు వ్రాస్తారు. రేపు మీరు దాన్ని తీసుకోవచ్చు'' ఈమా త్రానికి యేముందీ అన్నట్టు లాల్ చెప్పేశాడు.

ఈ మాటతో చంద్రపాదానికి నిరాశ అలమింది. ఏమాట వింటే యేక్షణాన యే ఆశ జనిస్తుందో, యేమాట వింటే నిరాశ అలముకొంటుందో చెప్ప లేం. లాల్ మాటలకు చంద్రపాదానికి ఆశ ఎదురు వెంటనే నమలింది.

''సరె. రేపు పదకొండింటికి వస్తాను.''

కదిలి వెళ్లాడు చంద్రపాదం. లాల్ తృప్తిగా చిరునవ్వు నవ్వుకొని, కూడికలు చూసుకొన్నాడు.

చంద్రపాదం విశ్వాసం మాత్రం పైకి వినపడ కుండా నిట్టూర్చింది.

లాల్ సంతకమయిం తరవాత యింకొకాయన పుస్తోడు సంతకం వెయ్యాల్సినవాడు. అతని దగ్గర కూడ శెలవు తీసికొని వెళ్లాలి.

ఆయనెవరితోనో మాట్లాడుతున్నాడు. చంద్ర పాదం మనసుకు అరనిముసం విశ్రాంతి దొరి కింది.

కూతుర్ని నిన్న రాత్రి వేళ కాన్పుల ఆస్పత్రికి తీసుకొని వెళ్ళటానికి యెంత అవస్థ పడాల్సి వచ్చింది? జీతం ఒకటో తారీఖు వస్తేనే మనసు ముక్కలయిపోతుంది. తన పెద్ద సంసారాన్ని యీది అందరినోళ్లలోకీ వేళ్ళు పంపించేప్పటికి. యల్. ఫి. సి. ఆలస్యమయి ప్రత్యేకంగా బిల్లు ప్యాస్ చేయించాల్సి వచ్చిన యీ వ్యవహారం చంద్ర పాదాన్ని క్రిందికి త్రొక్కేసినట్లయింది. అర్జు నుడి రథాన్ని ఆరంగుళాలు క్రిందికి తొక్కేసిన శ్రీకృష్ణుడి శ్రీపాదంలా.

వాకిట్లో కొచ్చే బాకీదార్లందరికీ యీ బిల్లు తిరిగి పోయిన ఆలస్యం చెప్పి వాళ్ల మానవత్వాన్ని తనవైపు వర్షింప జేసుకొచ్చాడిన్నాళ్లన్నూ. వాళ్ళు అలామానవత్వాన్ని వర్షించడం మానిననాడు చంద్ర పాదం పనేం చెప్పాలి? క్రోధ ఘూర్ణిత అశని పాతాల, సరాసరి నెత్తిన పడివూరుకున్నా నయమే. అంతకంటె ఘోరం యేమిటంటే చంద్ర పాదంచే (జన్మమే) తలమానికంగాభావింపబడే ఆపరువు కాస్తాభళ్లున పగిలి పోవటం.

నిట్టూర్చి లాల్ కూర్చున్న వంపు తల త్రిప్పాడు. లాల్ అంకెలు కూడ కొంటున్నాడు. ఆఫీ సరు వంక తల త్రిప్పాడు. అతడూ అంకెలు కూడు కొంటున్నాడు. కాదు టిక్కులు పెడుతున్నాడు.

చంద్రపాదం ముందుకు వెళ్లి చిరునవ్వు చిలికించి ఆయనతో మాట్లాడం ప్రారంభించాడు.

''నమస్కారమండి. మొన్నటి బిల్లుయింకా ప్యాస్‌కాలేదండీ— ఈపూటొస్తుంది సాయంత్ర మొస్తుందని చెక్కుకోసం కనిపెట్టుకొనివుండి వుండి వచ్చాను. ఇవాళ పాస్ ఆర్డరువేస్తామని లాల్‌గారు చెప్తున్నారు. అబ్బా చాలా డిలే అయిందిసార్''

ఆయా ఫీసరాయ తలకాయ పైకి కిందికీమూడు సార్లాడింది. ఆయనన్నాడు:

''అవునుమరి! ఏదో మా యల్‌డి. సి. కి కొన్ని అనుమానాలు వచ్చి చర్చించుకున్నాం. దానికి ఎవరేం చేస్తారు?'' ఆయన తల మాటిమాటికీ వంకిం చింది. ''యల్. డి. సి.కి వచ్చిన అనుమానాలు మాత్రం తీర్చద్దూ? లేకపోతే అతనికి మాత్రం అనుభవం కలిగేదెప్పుడూ?'' అని అర్థాంతరన్యాసం కూడ వెలిగించాడు.

చంద్రపాదం ఏదో దిగమ్రింగాడు—మరివచ్చిన కోపమో ఆ కారణంగా అయిన ఆలస్యానికి దుగ్ధో!!

''ఇప్పుడేం చేయమంటారు?''

''సంతకం అయిరానీండి. లాల్ ప్యాస్ ఆర్డరు వ్రాసిపెట్టానే పెట్టాడు. నేను యింతకుముందే సంతకం చేసి పంపనూ పంపాను ఎ. ఒ. గారికి.''

''థ్యాంక్సండీ. అయితే ఇప్పుడు నేను ఎ. ఒ. గార్ని చూడమంటారా? చూస్తే కొంచెం త్వరగా వచ్చే స్తుందేమో?''

ఆఫీసరు చికాకుగా చూశాడు.

''ఇప్పుడు నాలుగు కావచ్చింది. మీరు యివాళ యేమీ చేయగలిగిందిలేదు.''

చంద్రపాదం లేచి యింటి వైపు తిరిగాడు. ఇంటి దగ్గర బయలుదేరినప్పుడు బిల్లు ప్యాస్ చేయించు కోందే చెక్ వ్రాయించుకోందే తిరిగి యింటికి వెళ్ల కూడదని నిశ్చయించుకొని బయలుదేరాడు. ఇప్పు డదేం లేకుండానే భుజాలు వేలవైచుకొని తిరుగు ముఖమయినాడు.

చంద్రపాదం యింటి దగ్గర స్థితి ఆట్టే వర్ణిం చటం అనవసరం. మధ్యతరగతి కుటుంబాల్లో యెలా వుండి వుంటుందో అక్కడా అలాగే వుంది.

మధ్యతరగతి కుటుంబాలు చంద్రపాదం పరి స్థితుల్లో యెలా వుంటారనే విషయం సాధారణంగా అందరికీ తెలిసే వుంటుంది. ప్రత్యక్షంగానో పరో క్షంగానో అందరూ ఎప్పుడో ఒకప్పుడు ఆయిరకాట కాలన్నిటినీ అనుభవించో చూశో కనీసం వినో వుం టారు. కొంచెం జ్ఞాపకం చేసుకొంటే చాలు అర్థ మవుతుంది.

నూనె అబ్బి జీతం రానందుకు విసుక్కొని వెళ్లి పోయాడు. నేతి మనిషి ఎల్లుండి తప్పక ఇయ్యండి సార్ అనిపోయాడు. కుట్టుపని వాడొచ్చాడు. కాదు. వాడి పన్నెండేళ్ల పుత్రసింహం వచ్చాడు.

''డబ్బు తెమ్మన్నాడు సార్ మానాన్న.''

''అదేమిటి అతనితో చెప్పానుగా జీతం రాలేదని.''

''అదంతా యేంకాదు సార్. మానాన్న తెమ్మ న్నాడు.''

''అది కాదయ్యా!..'' గుటక మ్రింగి చెప్ప బోయాడు చంద్రపాదం. ''నోనోయి బోడివెధవా'' అని అనబోయిన నోటితోనే ''అయ్యా'' సంబోధనం చేశాడు.

''జీతం వస్తే యిచ్చేవాణ్ణిగా.. ఇప్పుడివ్వలే కారణం జీతం రాకపోవటమని చెప్పటల్లాగే..వెళ్లి మీనాన్నతో చెప్తావు కదా—'' సాగతీస్తున్నాడు చంద్రపాదం.

''ఆ... అదేంకాదు సార్.''

''ఇదుగో వినూ. నిన్న ఆఫీసుకు సెలవట. ఇవాళ బిల్లు ప్యాసయి రేపుగాని అదే సోమవారంగాని మంగళ వారంగాని డబ్బు వస్తుంది. ఇస్తానని చెప్పు.''

''ఆ. అదేంలేదు సార్'' అలాగే నిలబడ్డాడు మొండి కిశోరం.

చంద్రపాదం యికని పిల్లవాణ్ణి ఎలాగోలా ఒదిలించుకోవాలనే స్థితిలో పడ్డాడు. లోపలికి తప్పుకు పోతే వాడేదో ఒకటి తనకు తోచినట్టు తిట్టుకొని పోతాడు గదా అనే గతిపట్టాడు. తల మీద దువ్వెన్న నడిపిస్తూ ప్రక్క గదిలోకి దారితీస్తూ,—

''అలా చెప్పు.'' అన్నాడు.

మానవత్వం ఈయనకేమీ లేదన్న విషయం ఆ కుర్ర వెధవకు కూడ తెలిసిపోయుండాలి. కదిలి వెళ్ళాడు.

నిజానికది చంద్రపాదంలో యెప్పుడో పోయింది. శీతాన్ని శీతంగా ఉష్ణాన్ని ఉష్ణంగా అతను చూడలేడు. కనీసం అలా చెప్పలేడు. ఏమంటే యేమవుతుందో నని భయం.

* * *

మర్నాడు.

పదకొండింటికి వెళ్లాలి. ఐతే ఇల్లాలి అనారోగ్యం వల్ల పన్నెండు దాకా వెళ్లటం ఎపింది కాదు. ఆనాడు శనివారం. ఆదివారప్పు సెలవు ఛాయలు శనివారం

[illegible] !
అను పైకొన్నాయి.

ఆఫీసులో చాలా సీట్లు ఖాళీగా వున్నాయి. సిబ్బంది పని చెయ్యటం అవుపడలేదు. చంద్రపాదం వూహిస్తున్నాడు. ఈపాటికి బిల్లు పాసయి చెక్కు సెక్షనుకు వెళ్ళిపోయి వుంటే ఎంత బాగుండును?

లాల్ ఎదటకు వెళ్లాడు చంద్రపాదం. వచ్చిన పని ఫలాన అని చెప్పే దాకా ఆ విషయం గురించి మాట్లాడటం అలవాటులేని లాల్ చంద్రపాదాన్ని పలకరించకనే పోను. ఐతే నిన్న అంత హంగామా అయింతరువాత "మీరు వచ్చిన పనేమిటండీ" అని అడక్కుండానే తరువాత కార్యక్రమాని కుపక్రమించాడు.

"మీరూ..." ఎదురుకుండా బల్ల మీద పుస్తకం చూపించి "అది యిల్లాతెండి" అన్నట్లు చంద్రపాదానికి సైగ చేశాడు.

చంద్రపాదం పుస్తకాన్ని తెచ్చియిచ్చాడు.

"ఇదుగోనండీ మీ బిల్లు." లాల్ చూపి అక్కడపెట్టాడు.

"ఇంకా చెక్కు సెక్షనుకు పోలేదా?"

అదేం ప్రశ్నన్నట్లు చూశాడు లాల్. ఇదే మీ

పోనవత్సాల

బిల్లు మొత్తం

బిల్లు అని చూపిస్తున్నప్పుడు చెక్కు సెక్షన్‌కు వెళ్ళలేదనే విషయం తెలుస్తూనే వున్నదిగా. అడగటం యెందుకు? అది మానవుడు చెయ్యాల్సిన పని కాదన్న అర్థం స్ఫురించిందా చూపులో.

"ఇప్పుడు పంపిస్తారా?"

"పంపించమనే యిచ్చేశాను."

"అలాగా" అన్నాడు గాని చంద్రపాదం, విషయం తనకు అర్థం కాలేదు. మళ్లీ తనే సంభాషణ మొదలుపెట్టాల్సి వస్తుందనుకొన్నాడు చంద్రపాదం. కాని,—

"మా యల్ డిసి వచ్చి తీసికొనిపోయి యిస్తాడు" అన్నాడు.

"ఏడీ అతను?"

"ఎక్కడకో వెళ్లాడు. వస్తాడు లెండి."

"అరరె అది యెలాగయిన యిప్పుడే పంపితే బాగుండునండీ."

"ఐతే యేం చెయ్యమంటారు?"

"ఎవరయినా ప్యూనుకిచ్చి.."

చిరునవ్వుతో హేళనాపూర్వకంగా చూశాడు ఆడిటరు.

"చూడండి. మీ అందరి ఆదుర్దాలు వాటి వెనక బాధలూ కూడ మానెత్తిన పెట్టుకొని పనులు చేయటం అది అసంభవమైన పనండి. మీ ఆదుర్దా మీది. మేము యెన్ని పనులని చేస్తాం? పైగా— ఆఫీసు పద్ధతి అనే దొకటుందంటారా లేదంటారా? ఎవరి విధి వాళ్ళు చెయ్యద్దూ? ఆబిల్లును యల్ డిసి తీసికొనిపోయి చెక్కు సెక్షన్‌లో యివ్వాలి. ప్యూను చేత చేయించే పనికాదది. అది చాలా బాధ్యతాయుతమైన పనండీ...."

చంద్రపాదం మనసులో అనుకొన్నాడు. "ఎంత బాధ్యతయితే మాత్రం ఆ బిల్లును అమాంతం మింగేస్తాడా ప్యూను?" కాని పైకి మాత్రం "అవునవునని" హీనస్వరంతో అని వూరుకున్నాడు.

చంద్రపాదం బయటకు వెళ్లాడు. అక్కడే నారాయణ యెదురుపడ్డాడు.

నారాయణ పరోపకారి. ప్రభుత్వంలో అటెండరుగా జీవితం ప్రారంభించి తన అకుంఠిత దీక్షా పరతంత్రత చేతనే అసిస్టెంటు దాకా యెక్కి వచ్చాడు. చంద్రపాదం ఆఫీసులోనే అతడు కూడ పని చేసేది.

అతడు అంతకుముందే ఒక ప్రావిడెంటుఫండు ఎడ్వాన్సు తాలూకు బిల్లు బాపతు చెక్కు తీసుకొని క్యాషు చేసుకున్నాడట. ఆ బిల్లు పాస్ చేసిన ఎకౌంటాఫీసరును కలిసి ధన్యవాదాలు చెప్పుదామని వచ్చాడట.

నారాయణం చంద్రపాదం వచ్చిన పని విన్నాడు. చంద్రపాదం పరిస్థితికి మనసులోనే 'పాపం' అనుకున్నాడు. పైకి అంటే, చంద్రపాదం బాధపడతాడేమోనని. పైకి యిలా అన్నాడు.

"ఈ చెకింగ్ వాళ్ళు అదొక రకం మనస్తత్వాన్ని కలిగి వుంటారండి. ఆఫీసు డ్యూటీ పేరు చెప్పి మానవుడుగా చెయ్యాల్సిన డ్యూటీని మానేస్తామంటారు సార్."

చంద్రపాదం యేమీ అనలేదు.

నారాయణం ఇంకా అన్నాడు,—

"అందాకా యెందుకు సార్! ఉద్యోగాలిచ్చేటప్పుడు కూడ రెండు రెళ్లెంత,ఫలాని ఆఫీసరుకున్న అధికారమెంత అనే పరీక్షలే చేస్తారుగాని వీళ్లకు దయాదాక్షిణ్యాలెంతవరకున్నయ్యని అడగరు గదా సార్! అందుకనే వీళ్లిలా వుంటారు. మొన్న యీ లాల్ నా బిల్లు నిలాగే తిప్పేస్తే ఎకౌంటాఫీసర్ను కలిసి మాట్లాడి పాస్ చేయించి లాల్‌కు పంపించాను. కిక్కురు మనలేదు."

"అలాగా!!" చంద్రపాదం తాను ఎకౌంటాఫీసరును చూడకపోయినందుకు యిప్పుడు నాలుక కొరుక్కొంటున్నాడు. నారాయణం మాత్రం తను మాట్లాడ లేకపోయినాడా?.. ఇప్పుడు బాధపడేం లాభం అప్పుడు లాల్ యేమైనా అనుకుంటాడేమోనని వూరుకొని?

"రండి. వెళ్దాం" అన్నాడు నారాయణం.

ఇద్దరూ లాల్ దగ్గరకు వెళ్లారు.

ఆ పైలు అలాగే బల్ల మీద యేడుస్తూ వుండె

టం చూశాడు చంద్రపాదం.—కాదు —స్టైలును వ్రాసి చంద్రపాదం మనసు లోతుల్లో రగలటం స్టైలు చూసింది.

చంద్రపాదం బుర్ర కోణాలల్లో యెక్కడో అడిటర్ని నమిలి మింగేద్దామన్నంత కోపం రిక్కించింది. కాని సత్వగుణం పెంచుకోవాలని భగవద్గీత తను తెలుసుకొని వూరుకొన్నాడు.

నారాయణం తను బిల్లు క్యాషు చేసికొన్న విషయం లాల్‌కు చెప్పటం అయింతరవాత చంద్రపాదం తన బిల్లు సంగతి మళ్లి ప్రస్తావించాడు.

లాల్ మూసలో పోసిన వుపన్యాసంలా మళ్లి వెనకటి పదాలే పలికాడు.

చంద్రపాదం తన బాధలు కూడ కొన్ని యేకరువు పెట్టిడీసారి. లాల్ తల కూడికల వైపు తిప్పాడు.

నారాయణం హఠాత్తుగా అన్నాడు,—

"బిల్లు మొత్తం ఎంత సార్"

"నాల్గొందలపది" చంద్రపాదం సమాధానం.

"ఐతే యీ నాలుగొందలూ మీరు తీసుకోండి సార్" జేబులోంచి పైకం తీసి చంద్రపాదాని కిచ్చాడు.

"అదేమిటి?"

ఈ మాట చంద్రపాదం ఒక్కడి నోటి వెంటనే వచ్చిందన్న మాటే కాని, చంద్రపాదం ముఖం నుంచి, లాల్ ముఖం నుంచి కూడ ఆ ప్రశ్న అవుపడుతూనే వుంది.

నారాయణం చెప్పుకుపోతున్నాడు.

"ఇక మీ బిల్లు సంగతి. నేను రేపటికి అంటే సోమవారం 12 గంటలకు చెక్కు వ్రాయించి మీరు క్యాషు చేసుకొనేందుకు వీలుగా మీకు వచ్చేటట్లు నేను చేస్తాను."

మామూలుగా అయితే లాల్‌కు కోపమొచ్చేదేమో—కాని, యీ పర్మెనెంటు అక్కౌండరు తన సొంతసొమ్మును ఆయాచితంగా యింకొకడు వాడు కోటానికి సునాయాసంగా యిచ్చి వేయటంతో అలాంటి కోపమేమీ రాలేదు. కళ్ళూ నోరూ ఒప్పజెప్పి వూరుకుండిపోయాడు.

చంద్రపాదం పైకం పుచ్చుకొని కృతజ్ఞతను గుటకలు వేశాడు తృప్తిని కూడ కలిపి.

"నీ కిబ్బంది అవుతుందేమో గదా నారాయణా!"

"కానీండి సార్. నేను సోమవారం దాకా యీ డబ్బు వాడకుండానే వుంటాను సార్, సోమవారానికి మీ డబ్బు రానేవస్తుంది. జీతమనేది 13 తారీఖు దాకా రాకపోతే యెంత కష్టమ వుతుంది సార్!!"

చంద్రపాదం నిట్టూర్చి "సోమవారానికైనా నాది అన్న డబ్బు వస్తుందా అని!" అన్నాడు. పాపం అతనికి ప్రపంచ సరళిలోనే నమ్మకం పోయింది.

"ఎందుకు రాదుసార్? బిల్లు ప్యాసయింది కదా!! లేకున్నా ఎ. ఓ. గారితోచెప్పి రిక్వెస్టు చేస్తాం సార్!" లాల్ వంక తిరిగి, "ఈ బిల్లు యిప్పుడు యిచ్చి పంపండి సార్ చెక్కు సెక్షనుకు. అక్కడ మా డియ్యెస్టు ఫ్రండు ఒకడు, చాల మంచివాడున్నాడు. ఇలా బాధపడుతున్నారంటే ఐదునిముషాల్లో చెక్కు వ్రాసి సంతకం పెట్టించి యిచ్చేస్తాడు సార్."

చంద్రపాదం వంకకు తిరిగి, "మీరు పాపం చాల యిబ్బంది పడుతూ వుంటారు ముందర మీ ఇమీడియెట్ వ్యవహారాలు చూస్కోండి సార్."

ఒకప్రక్క మనుష్యత్వం యింకా నిలబెట్టుకొన్నాడనుకొన్న లాల్‌కూ, పోగొట్టుకొన్నాడనుకొన్న చంద్రపాదంకు కూడ యీ నారాయణనికి యింత వితరణ యెక్కడ నుంచి వచ్చిందో యెలా పంటబట్టి పోయిందో అర్థం కాలేదు. ఇలాంటి త్యాగం వాళ్లకై వాళ్లు యెన్నడూ చేయలేదు సరికదా, చేసి వుండవచ్చుననేవూహ కూడ వాళ్లకు ఉదయించలేదెప్పుడూ. అందులో లాల్ చంద్రపాదం కూడ సమలే. ఒకరికొకరికి భేదం లేదు.

ఇద్దరూ నారాయణాన్నిచూచి ఆశ్చర్యపోయారు. చివరకు యిద్దరికీ జ్ఞాపకానికి వచ్చింది. నారాయణ ఆంజనేయోపాసకుడని. వెంటనే అనుకొన్నారు— ఇలాంటి మహత్తర గుణాలు ఆంజనేయస్వామి ప్రసాదమయ్యుండాలని.

ఒక మామూలు మనిషి నిర్వ్యాజంగా యితరునికి సహాయం అందులో ధన పూర్వకమయిన సహాయం చెయ్యటం యిద్దరినీ కదిలించి వేసింది. నోళ్లల్లో వూటలూరించి గుటకలు మ్రింగింపజేసింది.

నారాయణ ఉదారహృదయాన్ని మాటల్లో మెచ్చుకోలేక, మెచ్చుకో కలిగినా అలా చెయ్యటం బహుశ యిష్టంలేక మెప్పుదలంతా కళ్లల్లో ఒలికిబోశారు.

నారాయణంఅన్నాడు "దానికేముంది సార్ తోటి మానవుడికా మాత్రం! ఇదే కాదు సార్. మీ ఎ. ఓ. గారితో యే విషయమైనా చెప్పాలంటే, ఆయనవల్ల మీకేదయినా ఉపకారం కావాలంటే చెప్పండి సార్ నేను చేస్తాను నేను చెప్పి తినా అంటే ఆయన తప్పక చేసి తీరుతారు సార్.."

లాల్ ఉత్కంఠతతో చూస్తున్నాడు. తనకు యేమయినా కావాలన్నా ఎ. ఓ.కు చెప్పగలడా!!

చంద్రపాదం నారాయణ భుజం మీద చెయ్యివేసి, "పదండి నారాయణగారూ. మీరు చేసింది నిజంగా అసాధారణమైన సహాయం. బగవంతుడు నిజంగా.." వాళ్లింకా యేదో మాట్లాడుతూ కదులుతున్నారు.

లాల్‌కు యీ సంఘటన తలమున్కలుగా వుంది. ఇన్నాళ్లూ తన విధి తను నెరవేర్చుకొనటమే మహాఘనంగా భావిస్తూ వచ్చాడు. గర్వపడ్డాడు కూడాను.

కాని యీ నాడు నారాయణ యాదృచ్ఛికంగా చేసిన యీ పనితో పోలిస్తే తను చేసిన బిల్లుల చెకింగ్ పని యెంతటిది? ఆ మాత్రానికి గర్వపడి పోవటం ఎంత పతనం అనాలి?

హఠాత్తుగా కదిలాడు సీటులోనుంచి, "ఏమండీ చంద్రపాదంగారూ!.... ఈ బిల్లు మీరే ఆ చెక్కు సెక్షన్‌లో యిచ్చేసి యీ పుస్తకం పంపించెయ్యమని అక్కడ వున్నాయనతో చెప్పండి. నారాయణగారికి తెలుసులెండి ఆ పుస్తకం యెవరి ద్వారా పంపాలో"

చంద్రపాదం యాంత్రికంగా పుస్తకం, బిల్లు తీసికొన్నాడు నోరు తెరుచుకొనే.

మనసులో అనుకొన్నాడు "ఇవాళ లాల్ మానవుడయ్యాడ"ని.

నారాయణ చంద్రపాదం చెక్ సెక్షను వైపుకు కదిలారు. లాల్ మనసు ఒక్కచోటే వుండి అలోచిస్తున్నది.

"తను అనేక బిల్లుల్ని, తప్పనిసరి అయినా కాకపోయినా ముందు జాగ్రత అవసరమనే సూత్రం మీద త్రిప్పికొట్టాడు. నాటికి సంబంధించిన మనుష్యులు యెంతో యిబ్బంది పడివుంటారు. ఈ కాగితాల వెనక వున్నది మానవులనే చైతన్యమే తనకు వున్నట్లు లేదిన్నాళ్ళనూ."

"తను ఎప్పటికి యీ అల్పుడైన నారాయణతో సమం కాగలడు? ఎప్పటికి అతని స్థితిని పొందగలడు?"

మనసులో యేదో వెలితి మిగిలింది.

అతడు మామూలుగాడి నుండి మళ్లటాని కుద్యమించింది.

వెళ్తూ వెళ్తూ చంద్రపాదం తనలో గొణుక్కున్నాడు "బిల్లు మొత్తం నాకు యివాళే దక్కింది గని లాల్ మాత్రం మానవత్వాన్ని సంతరించుకొన్నాడు." అని.

"మానవత్వం ముందు బిల్లు మొత్తం యెంతటిది?"

ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు చంద్రపాదం... నారాయణం అతడి తదేకాన్ని భంగం చెయ్యలేదు.

దృష్టిభేదం



జొన్నలగడ్డ రాజగోపాలరావు

భగవంతుడు అందరికీ దృష్టిని ప్రసాదించి నప్పటికీ— అందరినీ ఒకేలా చూడగల శక్తి ప్రసాదించ లేదని పిస్తూంది— కొంత మందిని చూస్తుంటే.

రాజా కమలకు ఏదో దూరపు వరుసలో బంధు వవుతాడు. నా అనే వాళ్ళులేని రాజును తనవద్ద ఉంచుకుందామని కమల అనుకుందంటే మాత్రం కారణం అదికాదు. ఆమెది స్వతహాగా జాలిగుండె. పైగా భర్త తనమాట కాదనడనే ధైర్యంకూడా ఆమె కుంది.

శంకర్రావు భార్యమాట కెదురాడలేని మాట నిజమే కానీ, వ్యక్తిత్వం లేనివాడు మాత్రం కాదు. అతని అభిప్రాయాలు అతనికీ ఉన్నాయి. మొదటి చూపులోనే రాజా అతని కళ్ళకు నచ్చలేదు. అందుకే అతను కమలకు నచ్చజెప్పాలని ప్రయత్నించాడు కూడా.

కానీ కమల మొండి పట్టు పట్టింది. భర్త కళ్ళకు "దొంగ వెధవ"లా కనిపించిన రాజా ఆమె కళ్ళకు అమాయకుడిలా కనిపించాడు. తన మావయ్య గారింట్లో రాజును కష్టపెడుతున్నారనీ— తమ దగ్గిరయితే బాగా చూడొచ్చుననీ— ఇవన్నీకాక కొడుకు సుబ్బారావుకి తోడుగా ఉంటాడనీ ఆమె వాదించింది.

ఎవరో, ఎవరో పిల్లాడిని బాధలు పెడుతూంటే అవి తీర్చవలసిన బాధ్యత తనకు ఉందంటే శంకర్రావు సుతరామూ ఒప్పుకోడు. పదేళ్ళ సుబ్బారావుకి తోడుకావలసిన అవసరం ఉందన్నా అతను ఒప్పుకోడు. కానీ భార్య మాటల కతను అంగీకరించాడంటే రెండే రెండు కారణాలున్నాయి. ఓ అనాథ బాలకుణ్ని యావజ్జీవితమూ పోషించగల ఆర్థికస్తోమతు తన కుండడం మొదటిది, అటు వంటప్పుడు భార్య మనసు కష్టపెట్టడ మెందు కనేది రెండవది.

ఆనాటినుంచీ రాజాకు శంకర్రావింట్లో స్థానం లభించింది. కానీ ఈ విషయంలో శంకర్రావు ఒక షరతుపెట్టాడు. ఎప్పుడైనా రాజా కనుక దొంగతనంలాంటి వెధవ పనులు చేశాడంటే తక్షణం ఇంట్లోంచి పంపించేయాలని. ఈ షరతుకు కమల కూడా ఒప్పుకుంది. అతను షరతు పెట్టడానికి అతనికి రాజామీదున్న దురభిప్రాయం కారణమయితే, ఆమె షరతు అంగీకరించడానికి ఆమెకు రాజామీదున్న సదభిప్రాయం కారణమయింది.

కమల రాజును కొడుకుతో సమానంగా చూసుకునేది. ఆమె ప్రోద్బలంమీదనే శంకర్రావు రాజుని సుబ్బారావు చదువుతూన్న స్కూల్లోనే ఫస్టు ఫారంలో జేర్పించాడు. అప్పుడు సుబ్బారావు సెకండ్ ఫారంలో ఉన్నాడు.

శంకర్రావు సరైన చనువు ఇవ్వకపోవడం వల్ల— అతను కన్పించినప్పుడల్లా— రాజా బెదురు చూపులు చూస్తుండేవాడు. ఆ చూపులు చూస్తే శంకర్రావు కేవేవో అనుమానాలు కలుగుతుండేవి. కానీ రాజామాత్రం కమలను అమ్మా అని పిలిచేవాడు.

తలిదండ్రుల విషయమెలా ఉన్నా— సుబ్బారావుకి మాత్రం మొదట్లో రాజాతో మంచి దోస్తీ కుదిరింది. ఇద్దరిదీ ఒకే వయసయినప్పటికీ, రాజా

కంటే తను ఒకక్లాసు ఎక్కువే అయినప్పటికీ— సుబ్బారావుకి రాజుకున్న అనుభవం లేదు. రాజు ఆరేడేళ్ళుగా పరాయిచోట కష్టాల్లో మసిలాడు. అందువల్ల అతనికి ప్రపంచమంటే ఏమిటో సుబ్బారావుకంటే ఎక్కువ తెలుసును.

అసలు సమస్యలనేవి ఏమిటో సుబ్బారావుకి తెలియవు. తనకు కావలసినవన్నీ తల్లీ, తండ్రీ ఇస్తారు. అందువల్ల రాజు తన కొకప్పు డెదురైన సమస్యలను గురించి వివరిస్తూంటే అతను ఆశ్చర్యంగా వినేవాడు.

అయితే సమస్యలను సృష్టించుకోడం పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. సమస్యల గురించి రాజు చెబుతూంటే ఆశ్చర్యంగా వినే సుబ్బారావు కిప్పుడు సమస్య లెదురయ్యాయి. అందుకు కారణం గోపీతో స్నేహం.!

గోపీకి పదేళ్ళుంటాయి. అయినా అతనికి వయసుకి మించిన ఆలోచనలు. డబ్బున్న వాళ్ళ అబ్బాయే కానీ మనిషికి దురలవాట్లున్నాయి. అతను ఎక్కువగా ఆడవాళ్ళ గురించీ, సినిమాల గురించీ మాట్లాడుతూంటా డు.

గోపీతో స్నేహం కుదిరినప్పట్నుంచీ సుబ్బారావుకి రాజు మాటలమీద ఉత్సాహం తగ్గిపోయింది. గోపీ కబుర్లు చెబుతూంటే అతనికి ఒకరకమైన ఆవేశం కలిగి— ఆనందంగా ఉండేది.

వోరోజు గోపీ సుబ్బారావుని పిలిచి సినిమాల గురించి చిన్న ఉపన్యాసం దంచాడు. సినిమాలు చూడని జీవితం వ్యర్థమని వోసారి నిట్టూర్చాడు. తరువాత వూళ్ళో ఆడుతూన్న వో ఇంగ్లీషు సినిమాలోని రెండు మూడు సన్నివేశాల్ని చెప్పి సుబ్బారావుని రెచ్చగొట్టాడు. తరువాత ఒక్క నిముషం ఆగి— "ఆ సినిమాకు వెడదామా?" అన్నాడు.

గోపీ చెప్పినదంతా వినేసరికి సుబ్బారావుకీ ఆ సినిమా చూడాలనే అనిపించింది. కానీ అతను ఒక్క నిముషం ఆలోచించి— "ఈ రోజు బడి ఉందిగదా— సెలవురోజు వెడదాం!" అన్నాడు.

"సెలవు రోజు దాకా ఇంగ్లీషు సినిమాలుంటాయనుకుంటున్నా వేమిటి? భలేవాడివే — మధ్యాహ్నం బడి మానేసి......"

ఉలిక్కిపడ్డాడు. "అమ్మ బాబోయ్— బడి మానేయడమే— అయినా నా దగ్గర డబ్బులు లేవు బాబూ!"

గోపీ గర్వంగా నవ్వుతూ జేబులోంచి ఐదు రూపాయల నోటు తీశాడు. సుబ్బారావు ఆ నోటు వంకే ఆశ్చర్యంగా చూసి— "అయిదు రూపాయలే — మీ నాన్నగా రేకంగా నీకన్ని డబ్బు లిస్తారేంటీ!" అన్నాడు.

"భలేవాడివే— నాన్నెప్పుడూ అసలు డబ్బే ఇవ్వరు. ఇది నేను పేకాడి గెల్చుకున్న డబ్బు!"

గోపీ అలాచెబుతూంటే సుబ్బారావు కళ్ళు చక్రాల్లా తిరిగాయి. "అయితే పేకాడితే డబ్బులొస్తాయా?"

"ఆ. బోలెడు డబ్బు సంపాదించవచ్చు. నా ఖర్చులకి డబ్బెక్కణ్ణించి వస్తోందను కున్నావు? నీవీ— నువ్వూ పేకాడరాదూ?"

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. నిజంగానే గోపీ డబ్బు ఎక్కువగా ఖర్చుపెడతాడు. అప్పుడప్పుడూ తనకూ అలా ఖర్చుపెట్టాలనిపిస్తూంటుంది. కాని అన్ని డబ్బులు నాన్నగా రివ్వరు, మరి పేకాడితే.......

గోపీ మళ్ళీ అన్నాడు. "ముందు వో రెండ్రూపాయలు పట్టుకురా. అక్కణ్ణించి ఇంక అంతానీదే డబ్బు. అది వ్యాపారానికి పెట్టుబడి లాంటి దన్న మాట— మరి మధ్యాహ్నం సినిమాకు వెడదామా?"

"కానీ— మరి నాన్నగారికి చెప్పలేదే?" నసిగాడు సుబ్బారావు.

గోపీ గట్టిగా నవ్వేసి— "ఇంత అమాయకుడి వేమిట్రా— అన్ని సినిమాలు నాన్నగారితో చెప్పి వెడితే ఎలా? అందులో బడి ఎగ్గొట్టి సినిమాకు వెడుతున్నామంటే నాన్నగారికి అసలు చెప్పకూడ దన్నమాట!" అన్నాడు.

సుబ్బారావు చాలా కంగారు పడ్డాడు. "నాకు ఏదో భయంగా ఉందిరా గోపీ!" అన్నాడు.

"మొదట్లో అలానే ఉంటుంది. తరువాత భలే సరదాగా ఉంటుందిలే"— అన్నాడ గోపీ.

మధ్యాహ్నం ఇంటర్వల్ సమయంలో భోజనాల దగ్గర అన్నాడు సుబ్బారావు రాజుతో— "నేను ఈ రోజు ఇంటికి కొంచెం ఆలశ్యంగా వస్తాను. స్కూల్లో ఏదో మీటింగుందని చెప్పు అమ్మతో!"

"నువ్వెక్కడి కెడుతున్నావు?" అడిగాడు రాజు.

"అదంతా తరువాత చెబుతాన్లే— అమ్మతో మాత్రం నువ్విలాచెప్పు!" సంభాషణ అంతటితో ఆగిపోయింది.

సాయంత్రం రాజు ఒక్కడే రావడం చూసి అడిగింది కమల— "వాడేడిరా— నువ్వొక్కడివే వచ్చావ్!"

"బళ్ళో ఏదో మీటింగుంది. నాకు వినాలని లేక వచ్చేశాను. వాడక్క డున్నాడు. వచ్చేసరికి కొంచెం ఆలశ్యమవుతుంది"— అన్నాడు రాజు.

"వెర్రినాయన, ఎటువంటి సరదాలూ లేవు. వాడి చదువేమిటో వాడి పనేమిటో తప్ప—" అనుకుంది కమల. "వెధవకి— ఎప్పుడింటికొచ్చేద్దామా అని దృష్టి— లేకపోతే మీటింగుకి వెళ్ళకపోవడ మేమిటి?" అనుకున్నాడు శంకర్రావు.....

మర్నాడు ఉదయం శంకర్రావు— జేబులో రెండు రూపాయిలు తక్కువచ్చాయని కారాలూ మిరియాలూ నూరసాగాడు. "స్నానానికి వెళ్ళే ముందే లెక్కెట్టుకున్నాను. వచ్చేసరికి రెండు రూపాయలు తగ్గిపోయాయి. ఇలాగయితే ఈ కొంపలో ఎలా? ఇదివర కెప్పుడూ ఇలాంటివి జరగలేదు!"

"బాగుందండీ వరస— డబ్బులు తీయడానికి ఈ యింట్లో ఎవరున్నారని— ఆ కుర్రవెధవలూ, నేనూ తప్పితే! అసలు మీకు మతిమరుపు ఎక్కువ. తప్పులెక్కెట్టుకున్నారో యేమో!" అంది కమల.

"నేను తప్పు లెక్కపెట్టడమా! బాగుంది వరస— నువ్విలా సమర్థించడం మొదలెడితే ఆ దొంగవెధవలకి ప్రోత్సాహం ఎక్కువైపోతుంది. ఒక్కసారి ఈ కుర్ర వెధవల లాగు జేబుల్లో చూస్తే సరి— తెలిసిపోతుంది!"

అతనీ మాట అనేటప్పుడు రాజును దృష్టిలో ఉంచుకునే అంటున్నాడని కమల గ్రహించి కొద్దిగా బాధపడింది. ఇంక ఏమన్నా శంకర్రావు రెచ్చిపోతాడని— మాట్లాడకుండా వూరుకుంది.

శంకర్రావు ముందు రాజును లాగుజేబులు చూపించమన్నాడు. రాజు చూపించాడు. వాటిల్లో ఏమీలేదు. ఇంక అతను సుబ్బారావు జేబులు చూపించమని అడగలేదు. "అయినా దొంగవెధవలు— లాగుజేబుల్లో ఎందుకు దాస్తారూ?" అంటూ గొణుక్కున్నాడు నెమ్మదిగా.

సుబ్బారావుని జేబులు చూపించమని అడక్కపోవడమూ, తన నొక్కడినే అడగడమూ రాజుకి చాలా బాధ కలిగించింది. శంకర్రావు తననే అనుమానించారని ఆ పసి హృదయం గ్రహించింది. అయితే అతని బాధను కమల అర్థం చేసుకోగలిగింది. అందుకే భోజనాల సమయంలో అతన్ని నెమ్మదిగా లాలించింది.

"చూడుబాబు— పెద్ద వాళ్ళకి బోలెడు గొడవ లుంటాయి. అందువల్ల వాళ్ళు అప్పుడప్పుడు చిరాకు పడుతూంటారు. దాన్ని మనం ఇంకోలా అర్థం చేసుకుని కోపగించుకో కూడదు. నీకిష్టమని బంగాళాదుంపల వేపుడు చేశాను? మరి బొత్తిగా అంత తక్కువ అన్నం పెట్టించుకుంటే ఎలా? ఈ కెరడు కూడా వెయ్యనీయి......"

ఆమె లాలనలో రాజుకి నిజంగా ఏడుపు వచ్చేసింది. ఒక్క నిముషంసేపు ఏడ్చేశాడు. కన్నీళ్ళతో పాటే అతని విచారం కూడా తగ్గిపోయింది. భోంచేస్తూన్నంతసేపూ— కమల రాజువంకే జాలిగా చూసింది. నా అన్నవాళ్ళు లేని ఆ పిల్లవాడు ఆమె హృదయంలో అప్పుడే కొడుకుకంటే ముఖ్యమైన స్థానం సంపాదించుకున్నాడు.

భోజనాలవగానే క్యారేజీపట్టుకుని రాజూ, సుబ్బారావూ బడికి బయల్దేరారు. దోవలో రాజు సుబ్బారావుని అడిగాడు. "నువ్వేకదూ— నాన్న జేబులో డబ్బు తీసింది"—

సుబ్బారావుకి తడబాటుతోపాటు కోపంకూడా వచ్చింది. "ఒరేయ్— ఏం మాట్లాడుతున్నావో తెలిసే అంటున్నావా?"

"కోపగించుకోకురా— నువ్వు చాలా మంచి వాడవని నాకు తెలుసు. కానీ ఆగోపీ ఉన్నాడే— వాడొట్టి దొంగవెధవ. వాడి స్నేహం వల్లనే నీకు చెడు అలవాట్లు వస్తున్నాయి. నిన్న మీరిద్దరూ బడి మానేసి సినిమాకు వెళ్ళారు. ఈ వేళేమో పేకాడ్డానికని ఇంట్లో దొంగిలించి రెండు రూపాయలు తెమ్మన్నాడు. అవునా?" అడిగాడు రాజు.

సుబ్బారావు రాజు వంక ఆశ్చర్యంగా చూశాడు. "నిజమేగానీ ఇవన్నీ నీకెలా తెలిశాయిరా!"

"ఎలాగో తెలిశాయి కానీ నా మాట విని ఆ గోపీ చెప్పినట్లు చెయ్యకు. దొంగతనం పాపం. పాపం చేస్తే మనం చచ్చిపోయాక నరకలోకంలో మన వీపు మీద వాతలు పెడతారుట. మనని కాగుతున్న నూనెలో వేయించేస్తారుట. అందుకే, పాపం చెయ్యకూడదు. బడి మానేసి సినిమా చూడడమూ, పేకాడడమూ, దొంగతనం చేయడమూ— ఇవన్నీ కూడా పాపాలే!"

"నిజంగా!" సుబ్బారావు చాలా భయపడ్డాడు. అప్పుడతనికి నరకలోకంలోని శిక్షలతోపాటు భూలోకంలోని శిక్షలు కూడా గుర్తుకొచ్చాయి. "అయితే ఇంకెప్పుడూ ఏ పాపమూ చెయ్యను. నువ్వు మాత్రం ఈ విషయాలేవీ నాన్నగారికి చెప్పకేం!"

"ఛఛ! నేనెందుకు చెబుతాను. మన మిద్దరం అన్నదమ్ములం కదూ!"

"నువ్వు చాలామంచి వాడవురా రాజూ!"

దృష్టిభేదం

స్కూలు రాగానే ఇద్దరూ విడిపోయారు. క్లాసులో సుబ్బారావుని గోపీ పలకరించాడు కాని సుబ్బారావు ముభావంగా ఉన్నాడు. గోపీ కేదో అనుమానం వచ్చింది. "ఏరా డబ్బు దొరకలేదా?"

"దొరికిందికాని నేనిక నీతో మాట్లాడను. పేకాడ్డమూ, అవన్నీ పాపాలుగా! అవి చేస్తే నరకానికి పోతారుటగా."

గోపీ నవ్వేసి—"ఎవరురా చెప్పింది?" అన్నాడు.

"ఎవరయితే యేంలే నిజమవునా కాదా?"

"కాదు కాబట్టే నవ్వుతున్నాను."

సుబ్బారావు ఆశగా తలెత్తాడు. అతనికి ఈ పాపాలని చెప్పబడే వాటి మీద ఆసక్తి పెరుగుతోంది. అవి పాపాలు కాదని ఎవరైనా చెబితే నమ్మాలని కూడా అతనికి ఉంది. అందుకే గోపీ మాటలు అతనిలో ఆసక్తిని కలిగించాయి. "మరయితే డబ్బులు పోయాయని తెలియగానే మానాన్నకు అంత కోపమొచ్చిందేం?" అన్నాడు గోపీ ఏదో చెప్పబోతుండగా క్లాసులోకి మేష్టారు అడుగెట్టారు. అప్పటికి ఆ సంభాషణ ఆగింది.

ఒక విషయంలోని మంచిచెడ్డలను మనం అర్థం చేసుకోవడం—మనకు ఆ విషయం మీద ఉన్న ఆసక్తి మీద ఆధారపడి ఉంటుంది. గోపీ సుబ్బారావుని తన మార్గం వైపు మళ్ళించగలిగాడంటే అది అతని గొప్పతనంకాదు, సుబ్బారావుకు ఆ మార్గం మీదున్న ఆసక్తి!

మధ్యాహ్నం భోజనాల దగ్గర సుబ్బారావుతో అన్నాడు. "ఈ వేళ కూడా ఏదో మీటింగుందని అమ్మతో చెప్పాలి. కాని అమ్మ నమ్మదేమో—కాబట్టి నువ్వు కూడా ఇంటికి కొంచెం ఆలశ్యంగా వెళ్ళాలి!"

రాజు సుబ్బారావు కేసి అదోలా చూశాడు. "పేకాడుతున్నావా అయితే!"

"లేదురా అందుకోడు. వూరికే సరదాగా, బడి వదిలాక, అలా తిరిగొచ్చేస్తాం. అంతే!" అన్నాడు సుబ్బారావు.

"అయితే మీటింగని అబద్ధ మాడడమెందుకు? స్నేహితులతో షికారు వెళ్ళారని అమ్మతో చెబుతాను. ఏమీ అనదులే!" అన్నాడు రాజు. సుబ్బారావు కూడా అందుకు ఒప్పుకున్నాడు.

ఇలా మరో నాలుగురోజులు గడిచాయి. సుబ్బారావు మారిపోతున్నాడనీ ఈ విషయం కమలకు తెలియబర్చకపోతే ప్రమాదమేమోననీ రాజుకి అనిపించసాగింది. కాని అతను తొందరపడి ఏ విషయమూ తేల్చుకోలేకపోతున్నాడు. ఒకవేళ తను చెప్పినవి వాళ్ళు నమ్మకపోతే ఎంత అసహ్యంగా ఉంటుంది? గిట్టక చాడీలు చెప్పినట్లుండదూ?

దొంగతనం పాపమని తను సుబ్బారావుకి చెప్పిన నీతులు ఏ విధంగానూ పని చేసినట్లు లేదు. ఆ రోజు మళ్ళీ సుబ్బారావు శంకర్రావు జేబులోంచి కొంత డబ్బు తీయడం చూశాడు రాజు. అతని మనస్సు పరిపరివిధాలపోయింది.

కొద్దిసేపట్లో శంకర్రావు డబ్బు పోయిందని గ్రహిస్తాడు. మళ్ళీ రభస జరుగుతుంది. తను సుబ్బారావుని పట్టిద్దామన్నా శంకర్రావు నమ్మడు. తనే తెచ్చి వాడి పుస్తకాల్లో పెట్టాననవచ్చు. ఈ అనుభవం అతను పూర్వాశ్రమంలో పొందనే పొందాడు.

మరి ఇప్పుడేం చేయాలి? అప్పుడతని కొక చిత్రమైన ఆలోచన వచ్చింది.

తను దొంగతనం చేసినా చేయకపోయినా శంకర్రావు తననే అనుమానించి సూటిపోటి మాట లంటాడు. అటువంటప్పుడు తను కూడా దొంగతనం చేస్తే విధం చెడ్తా, ఫలం దక్కినట్లుంటుందేమో.

అతను అయిదు నిముషాల సేపు ఆలోచించి ఓ నిశ్చయాని కొచ్చాడు. సుబ్బారావు బ్రేటిన్‌కు వెళ్ళాడు. కమలమ్మ వంటింట్లో ఉంది. శంకర్రావు స్నానం ఇంకాస్సేపు పట్టవచ్చు.

రాజు అంచనా తప్పయింది. శంకర్రావు స్నానం పూర్తి చేసుకుని వచ్చేసరికి రాజు శంకర్రావు గదిలో ఉన్నాడు. నెమ్మదిగా అతని ఫాంటు కేసి వెడుతున్నాడు. జరగబోయేదేమిటో గ్రహించిన శంకర్రావు దొంగను బరి మీదే పట్టాలన్న ఉద్దేశ్యంతో చప్పుడు చేయకుండా కమలను పిల్చుకొచ్చాడు ఇద్దరూ గుమ్మానికి చెరోప్రక్కా నిలబడి గదిలోకి తొంగి చూస్తున్నారు రహస్యంగా.

కమల కళ్ళ ఎదురుగా, శంకర్రావు చూస్తూండగా రాజు, వంకీకి తగిలించి ఉన్న శంకర్రావు ఫాంటు జేబులో చేయిపెట్టాడు.

"రాజూ!" కమల ఇల్లెగిరిపోయేలా కేక పెట్టింది.

ఉలిక్కిపడిన రాజు చటుక్కున చేయి బైటకు తీసేశాడు. కమల గబగబా రాజు దగ్గరకు వెళ్ళి చెంప మీద చెళ్ళుమనిపించింది. "అమ్మా!" అంటూ బాధగా అరిచాడు రాజు.

"దొంగవెధవా. మంచివాడవని నమ్మి, కొడుకు కంటే ఎక్కువగా చూసుకుంటున్నందుకు ఇదా నువ్వు చేసే పని" రాజు దవడ మళ్ళీ చెళ్ళుమంది.

"వాడి ముఖం చూస్తూంటే నాకు చాలాకాలంగా అనుమానంగా ఉంది. అప్పుడు చెబితే విన్నావా? ఇప్పుడు నీ కళ్ళతో నువ్వే చూశావు గదా ఏమంటావ్!" శంకర్రావులో దొంగతనం జరిగిందన్న కోపం కంటే, రాజుని దొంగగా నిరూపించగలిగానన్న ఆనందమే కనిపిస్తోంది.

కమలకు మాత్రం రాజు మీద చాలా కోపం వచ్చింది. తనెంతో అమాయకుడని నమ్మినవాడు—తన కళ్ళెదురుగా దొంగతనం చేస్తుంటే చూసింది. ఆమెకు మానసిక క్షోభకు అంత కంటే ఏం కావాలి?

రాజు ముఖం అవమానంతో నల్లబడవలసింది కానీ, దెబ్బలు తినడంవల్ల కందిపోయి ఎర్రగా ఉంది. ఎదురుగా శంకర్రావూ, కమలా కనిపిస్తూంటే మరీ కంగారుగా ఉండి నోటమాట రావడంలేదు. కమల మళ్ళీ రాజు వంకే కోపంగా చూసి—"చెప్పు—దొంగతనం ఎందుకు చేయాలనుకున్నావు—అవసరమయితే నీకు నేనిచ్చేదాన్ని కదా అటువంటప్పుడు నీకీ దుర్బుద్ధి ఎందుకు పుట్టింది చెప్పు వూఁ!"

ఎప్పుడూ కమలను ఉగ్రస్వరూపంలో చూడని రాజు ఇంకా కంగారు పడిపోయాడు. నెమ్మదిగా—"నేను దొంగతనం చేయాలనికాదు.." అని ఏదో అనబోయాడు.

"మరయితే నా జేబులో చేతులెందుకెట్టావురా—పరదా వేసిందా?" శంకర్రావు కోపంగా అడిగాడు. రాజు బెదురు చూపులు చూశాడు.

అప్పుడే సుబ్బారావు ఆ గదిలోకి వచ్చాడు. అక్కడి వాతావరణం చూస్తే అతనికి వింతగా అనిపించి "ఏమయిందే అమ్మ!" అంటూ తల్లిని అడిగాడు.

"ఏముంది, రాజుగాడు నా జేబులో డబ్బులు తీయబోయాడు!" అన్నాడు శంకర్రావు. సుబ్బారావుకి ఆశ్చర్యం వేసింది. ఏమిటి దొంగతనం పాపమని చెప్పే రాజు దొంగతనం చేయడమా? ఒకవేళ తను తీసిన డబ్బులు రాజు తీశాడనుకుంటున్నారేమో ఈ అనుమానం రానడంతోనే "ఎంత పోయిందేమిటి?" అని అడిగాడు సుబ్బారావు.

అంతవరకూ శంకర్రావుకి డబ్బేమైనాపోయిందేమోనన్న అనుమానంలేదు. వెంటనే వెళ్ళి ఫాంటు జేబులో డబ్బు తీసి లెక్కపెట్టుకుని "ఏమీ తీయలేదు, సరిపోయిందిలే" అన్నాడు.

సుబ్బారావుకి అనుమానం వచ్చింది. నాన్న పొరబాటు లెక్కెట్టాడేమో, లేకపోతే మూడు రూపాయలు తక్కువ రావద్దూ? అయినా అదీ తన మంచికే ఏ గొడవా లేకుండా జరిగిపోతుంది.

రాజు బొమ్మలా నిశ్చలంగా నిలబడి చూస్తుంటే శంకర్రావు కమలతో అన్నాడు. "నీకు తెలియదు కమలా తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అనుకునే తత్వం నీది. ఇలాంటి వెధవల్ని చేరదీయడం మనకేమీ మంచిదికాదు. మన అబ్బాయి కూడా చెడిపోతాడు.." శంకర్రావు ఏదో చెప్పబోతూండగా కమల అతన్ని ఆపింది.

"ఏమండీ మీకు వాడంటే అంత కక్ష ఎందుకు. వాడు మీకే మపకారం చేశాడు. అసలు మొదట్నించీ మీకు వాడంటే గిట్టడంలేదు. నిజమే, వాడు దొంగతనానికి ప్రయత్నించాడు. అంతమాత్రాన వాణ్ణింట్లోంచి పొమ్మంటే వాడేమైపోతాడు? అదే మీ కొడుకీ పని చేసి ఉంటే ఏంచేద్దురు?"

"ఛా—నా కొడుకెప్పుడూ అటువంటి పనులు చేయడు." అన్నాడు శంకర్రావు. ఆ సమయానికి సుబ్బారావు పక్కగదిలో పుస్తకాల మధ్య తను దాచిన మూడు రూపాయల కోసం వెతుకుతూ అవి కనిపించక ఒక్కకేక పెట్టాడు. "అమ్మ రాజు నిజంగా దొంగ వెధవేనే వాడు నా మూడు రూపాయలు కూడా కొట్టేశాడు!"

ఆ కేక విని శంకర్రావూ, కమలా కూడా ఉలిక్కిపడ్డారు. ఈలోగా సుబ్బారావు కోపంగా ఆ గదిలోకి వచ్చి రాజుని సమీపించి "ఏరా రాజూ! నా మూడు రూపాయలూ తీశావా లేదా—నిజం చెప్పు!" అంటూ గద్దించాడు. కష్టపడి తను దొంగిలించిన డబ్బు పోయిందన్న ఆవేశంతో తనేం చేస్తున్నదీ అతను గమనించలేదు. పైగా తల్లీ, తండ్రీ తన తరపునే మాట్లాడతారని కూడా ఆశించాడు తను.

కమల కొడుకు భుజం తట్టి "అసలు నీకు మూడు రూపాయలెక్కడివిరా?" అని అడిగింది. సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. తను చేసిన పొరపాటు అర్థమయిందతనికి. తడబడుతూ "నేను పోగు చేసుకున్న డబ్బులు ఇప్పటికి మూడు రూపాయలయ్యాయి." అన్నాడు.

"నిన్ననే కదురా కూరగాయల వాడికివ్వడానికి చిల్లర డబ్బులు లేక నిన్నడిగితే కానీకూడా లేదని చెప్పావు నిన్న లేని డబ్బులు ఈవేళెలా వచ్చాయి?"

సుబ్బారావేదో చెప్పబోతుండగా "అమ్మా! నేను నిజం చెప్పనా!" అన్నాడు రాజు.

"మధ్య నీవెందుకు, నోర్మూయ్!" అన్నాడు శంకర్రావు.

"అసలేం చెబుతాడో, చెప్పనివ్వండి!" అంది కమల.

రాజు తలవంచుకునే అన్నాడు. "ఆయన జేబులోని డబ్బులు సుబ్బారావే తీశాడు. అది నేను చూశాను. తరువాత మళ్ళీ గొడవవుతుందని భయమేసి ఎవరూ చూడకుండా ఆ డబ్బులు నేనే ఆయన ఫాంటు జేబులో వేద్దామని వెళ్ళాను. డబ్బులు జేబులో పెడుతూండగా మీరు వచ్చారు." చివరి వాక్యం పూర్తి చేసేసరికి రాజుకి ఏడుపొచ్చేసింది.

శంకర్రావుకీ, కమలకీ కూడా ఆ మాటలు పిడుగుల్లా తగిలాయి. రాజు మాటలు ఎంతవరకూ నిజమయుంటాయని కమల ఆలోచిస్తూండగానే, శంకర్రావుకి కోపం వచ్చేసింది. "దొంగరాస్కెల్—నువ్వు దొంగతనం చేయడమే కాకుండా నా కొడుకును దొంగంటావ్రా" అంటూ మీదకు వెళ్ళబోయాడు.

"చాల్లెండి ఏమిటా వెర్రి ఆవేశం. అసలు సంగతి నేను తేలుస్తాను కానీ మీరూరుకోండి" అంటూ కమల అతన్ని వారించి సుబ్బారావు కేసి గుడ్లురిమి చూసి అడిగింది. "చెప్పు నిజం చెప్పకపోతే చంపేస్తాను. నాన్నగారి జేబులో డబ్బు తీశావా?"

సుబ్బారావుకి అబద్ధాలు చెప్పడంలో అనుభవం లేదు. పైగా తల్లి ఉగ్రస్వరూపం చూస్తే అతనికి భయం వేసింది. వణికిపోతూ "తీశాను!" అన్నాడు. అంతే శంకర్రావు ఉలిక్కిపడ్డాడు.

పావుగంట అనంతరం ఆ ఇంట్లో వాతావరణం మామూలుగా తయారయింది రాజు చెప్పగా సుబ్బారావు చెడు స్నేహాల్ని మరిగిన ఉదంతాన్ని విన్నాడు శంకర్రావు. అన్నీ సుబ్బారావు ఒప్పుకున్నాడు. అప్పటికి శంకర్రావు కళ్ళు తెరచుకున్నాయి.

తన కంటికి సుబ్బారావెప్పుడూ అమాయకుడిలా కనిపించేవాడు. రాజే చెప్పి ఉండకపోతే తను ఏ పరిస్థితుల్లోనూ కొడుకుని అనుమానించి ఉండేవాడు కాదు. అందువల్ల క్రమంగా సుబ్బారావు పతనమైపోయి ఉండేవాడు. నిజంగా రాజు తనకు ఈ విషయంలో మహోపకారం చేశాడు.

అతనొకసారి రాజును చూశాడు. రెండు చెంపలూ కందిపోయి, ఎర్రబారిన కళ్ళతో ఉన్న రాజు ముఖం అతనికి జాలి కలిగించింది. దగ్గరకు వెళ్ళి, భుజం మీద చేయివేసి—"అమ్మ కొట్టిందని బాధగా ఉందా నాన్నా!" అన్నాడు. సరికొత్త ఈ లాలన రాజుకి కన్నీరు రప్పించింది.

శంకర్రావు భార్య వంక చూసి "దేవుడు మనకు కళ్ళేకాదు, మెదడు కూడా ఇచ్చాడు కమలా—చూసినవి చూసినట్లుగా తీసుకోకుండా నిష్పాక్షికంగా ఆలోచించి మరీ ఓ నిర్ణయానికి రాకపోయినప్పుడు, ఆ మెదడు అనవసరం! అసలదంతా ఎందుకొచ్చిదంటే—కారణం లేకుండానే మొదట్నుంచీ రాజు మీద నాకో అభిప్రాయం ఏర్పడిపోవడంవల్ల అది తప్పని ఇప్పుడొప్పుకుంటున్నాను!" అన్నాడు.

కమల కళ్ళు చెమర్చాయి. ●

విజయనిర్మల

"ఈమధ్య 'చిత్రలహరి' కాలమ్స్‌లో విజయనిర్మల పేరు ఎక్కువగా కనిపిస్తున్నది ఎవరామె?" అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు తెలుగా, అరవమా? అని ఇంకొందరు అడుగుతున్నారు. విజయనిర్మల తెలుగు వారమ్మాయి తెలుగు ధారాళంగా మాట్లాడుతుంది చక్కగా రాస్తుంది

1943 ఫిబ్రవరి 20 న విజయనిర్మల మద్రాసులో జన్మించింది ఆమె తండ్రి శ్రీ రామమోహనరావుగారు ఒకప్పుడు వాహినిలో చీఫ్ ఆపరేటర్‌గ ఉండేవారు. విజయనిర్మలకు బాల్యం నుంచీ సంగీతమన్నా, నాట్యాలన్నా మోజూ, ఉత్సాహమూ ఉన్నవి స్థానిక ట్రిప్లికేన్‌లోని నేషనల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఫిఫ్త్ ఫారం వరకూ చదువుకున్నది

ప్రసిద్ధ కెమెరామన్ శ్రీ విన్సెంట్ తొలిసారిగా దర్శకత్వం వహించిన "భార్గవినిలయం" మళయాళ చిత్రంలో కథానాయకిగా నటించి, చక్కని నటిగా పేరు పొందింది. ఇంతవరకు 7 మళయాళ చిత్రాల్లోను, 2 తమిళచిత్రాల్లోను నటించింది బాల్యంలో యీ అమ్మాయి యన్ ఏ టి వారి "పాండురంగ మహాత్మ్యం" చిత్రంలో నటించింది

ప్రస్తుతం విజయనిర్మల రంగులరాట్నం, పిన్ని, పూలరంగడు, గొల్లభామ, సాక్షి తెలుగు చిత్రాలలోను, కమాల్ బ్రదర్స్, సత్యమ్ తవరాదె, శరవణాఫిలిమ్స్ తమిళ చిత్రాలలోను, నాలుగు మళయాళ చిత్రాలలోను నటిస్తున్నది ఏ తరహాకు చెందిన పాత్ర నయినా సమర్థవంతంగా పోషించే నేర్పు యీమెలో ఉన్నది. నృత్యాలు కూడ బాగా చేస్తుంది సన్నివేశం ఒకసారి చెప్తే అర్థం చేసుకొని పాత్రోచితంగా నటించే ప్రతిభ ఉన్నది, విజయనిర్మలలో



'పిన్ని'లో



'రంగులరాట్నం'లో

ఈమె నటించిన రంగులరాట్నం, పిన్ని చిత్రాలు జనవరి మొదటిభాగంలో విడుదల అవుతున్నవి. ఈ చిత్రాలు చూస్తే మీరే చెబుతారు విజయనిర్మల చక్కని నటి అని నటనలోను, నాట్యంలోను విశేషమయిన అనుభవం గడించుకున్న యీ అమ్మాయి అందచందాల్లో ఏం తక్కువకాదు


అందమైన మొహం, ఆకర్షణీయమైన కళ్లు కొనదేలిన నాసిక, సమమయిన ఒడ్డూ పొడుగూ కలిగిన విజయనిర్మల తెలుగుతోపాటు ఆంగ్ల, తమిళ, మళయాళ భాషలు అనర్గళంగా మాట్లాడుతుంది. మాట మంచితనం, సంస్కారం, నెమ్మది యీమె సొత్తు తీరిక వేళల్లో కుందేళ్లను పెంచడమన్నా, పుస్తకాలు చదువుకోవడమన్నా విజయనిర్మలకి ఎక్కువ యిష్టం నటనలో కొత్తదనం సాధించాలని, ప్రముఖ తారగా గణుతి కెక్కాలని యీమె అభిలాష.

ఉత్సాహమూ, కృషి ఉన్న నటి విజయనిర్మలను ప్రోత్సహించవలసిన బాధ్యత మన నిర్మాతలపై ఉన్నది కొత్త సంవత్సరంలో తెలుగు ప్రేక్షకులకు "రంగులరాట్నం" చిత్రం ద్వారా కొత్తతారగా పరిచయం అవుతున్న విజయనిర్మల ఒకనాటి ప్రముఖనటిగా విలుస్తుందనడంలో సందేహంలేదు.

—మోహన్ కుమార్

చిత్రలహరి

మాస్కోలో జరిగిన చలన చిత్రోత్సవానికి 'పదండి ముందుకు' చిత్రంతో వెళ్లివచ్చిన ఆచిత్ర దర్శకుడు శ్రీ వి. మధుసూధనరావు అక్కడి ఫిలిం పరిశ్రమలను గురించి మాట్లాడుతూ "రష్యాలో సినిమటోగ్రఫీ(ఫిల్మిండస్ట్రీ)కి ఒక ప్రత్యేక మంత్రివర్గం ఉంటుంది. ఆర్టిస్టులకు నెలసరి జీతాలు ఉంటాయి. దర్శకుడికి రాయల్టీ కూడా ఉంటుంది. అందరి కన్నా దర్శకుడికి ఎక్కువ మొత్తం వస్తుంది. అన్నివిషయాలలోను దర్శకుడికి స్వాతంత్ర్యముంటున్నది.. ప్రతిరిపబ్లిక్‌లోను ఒకటి రెండు స్టూడియోలు



"భువనసుందరి కథ"లో
మోహినిగా జయశ్రీ.

ఉన్నాయి. వాళ్ళు నిర్మించే చిత్రాలలలో ఎక్కువ భాగం పిల్లలకు సంబంధించినవిగాను, సైన్సుకుచెంది నవిగాను ఉంటాయి. స్టూడియోకు కావలసిన కెమెరాలు తదితర సామగ్రులు అక్కడవాళ్లే తయారు చేస్తున్నారు. ప్రతి స్టూడియోలోను స్పెషల్ ఎఫెక్ట్సు డిపార్టుమెంటు, ప్లాస్టిక్ మేకప్ డిపార్టుమెంటూ వున్నాయి...పిల్లలు, రచయిత, సైంటిస్టు, చిత్రకారుడు, అక్కడి ప్రజానీకం హృదయాలలో చోటు చేసుకున్నారు. వారు ఎక్కువ గౌరవంగా చూడబడతారు" అన్నారాయన.

*   *   *

శ్రీవి. మధుసూధనరావు ప్రస్తుతం 'వీనస్ పద్మిని

కొత్త శీర్షిక ఎందుకు?

సినిమా శీర్షికలో 'కొత్తదనం' కావాలని కోరేవారికి కొత్త ఆకర్షణ!! (అందుకు...)

ఎందుకు?

మీకు సందేహాలేవయినా ఉంటే 'ఎందుకు?' కేరాఫ్ 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక', పో. బా. 212, మద్రాసు-1కి రాయండి-

ఒక సుప్రసిద్ధ హాస్యనటుడు మీ సందేహాలని 'తీరుస్తారు!!'

రెండువారాలకొకసారి వచ్చే

'ఎందుకు?'

శీర్షికకి ప్రతిసారీ ఆ సంచికలోని 'అత్యుత్తమ ప్రశ్న' కి రు. 10లు బహుమతి ఇస్తాము!

సందేహించకుండా మీ సందేహాలని ఎందుకు అని అడిగి తీర్చుకోండి!!

షరా— కొంతె ప్రశ్నలు వేసేవారు కొంతె సమాధానాలనే ఎదురుచూడవచ్చు!! (మరొక షరా— బహుమతి ఎలా, ఎందుకు ఇచ్చారని మాత్రం అడగవద్దు...)

ప్రశ్నలను పోస్టుకార్డు మీదనే రాయాలి. ఒక లేఖలో ఒక్క ప్రశ్నకంటె ఎక్కువ పంపరాదు. ప్రశ్నలు పంపేవారు తమ చిరునామా తెలుగు లిపిలోనే రాయవలసినదిగా కోరుతున్నాము.

వచ్చేవారమే ప్రారంభం!



'ఇద్దరు మొనగాళ్ళు'లో సుకన్య.



గౌతమి పిక్చర్స్‌వారి 'ప్రొడక్షన్ నెం. 1'' లో సావిత్రి, రామారావు.

చిత్రలహరి

కంబైన్స్‌వారి సాంఘికానికి దర్శకత్వం వహిస్తున్నారు ఈ చిత్రం తాలూకు షూటింగ్ డిశంబరు 21న విజయా స్టూడియోస్‌లో ప్రారంభమైంది. యస్. వి రంగారావు, అంజలీదేవి, కృష్ణ, పద్మనాభం, వాణిశ్రీ, శోభన్ బాబు, భారతి, రామ్మోహన్ ముఖ్యభూమికలు పోషిస్తున్నారు రచన, ఆరుద్ర, సంగీతం కె వి మహాదేవన్, కళ, కృష్ణారావు, కెమెరా వి రామమూర్తి, నిర్మాత టి గోవిందరాజన్, అసోసియేట్, టి వి యస్. శాస్త్రి.

* * *

చిరుత ప్రాయంలోనే కళాదర్శకుడిగా నైపుణ్యం సంపాయించి, మంచి పేరు తెచ్చుకున్నారు శ్రీ రాజేంద్రకుమార్ ఆయన యింతవరకు దాదాపు 15 చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. నెల్లూరు రిటయిర్డ్ డి ఎం ఒ శ్రీ కె రాజమన్నార్ గారి అమ్మాయి చి సౌ రత్నమాలతో చి రాజేంద్ర కుమార్ వివాహం డిశంబరు 14న నెల్లూరు లోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది.



''కంచుకోట''లో దేవిక.

18వ తేదీన మద్రాసు వుడ్‌లాండ్స్‌లో రిసెప్షన్ యిచ్చారు. ఫిలిం పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు ఘంటసాల, మాధవపెద్ది పిఠాపురం, పి బి శ్రీనివాస్, మణిమాల(నటి), వసంతచక్కని పాటలు పాడి అతిథులను ఆనందపరిచారు తర్వాత 'పన్నాలు కావాలి' నాటికను ఉదయ సాహితీవారు ప్రదర్శించారు. రాజేంద్రకుమార్ ప్రస్తుతం గృహలక్ష్మి అర్ధరాత్రి, కాంభోజరాజుకథ మొదలయిన చిత్రాలకు కళాదర్శకత్వం నెరపుతున్నారు.

* * *

హాస్యనటుడు శ్రీ పద్మనాభం రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్ తరపున నిర్మిస్తున్న '''శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న'' చిత్రం ద్వారా యస్ పి బాలసుబ్రహ్మణ్యం అనే కొత్త గాయకుణ్ణి పరిచయం చేస్తున్నారు. శ్రీ పద్మనాభం యీ విషయము మాట్లాడుతూ, ''అతను సినిమాల్లో పాడటం

ఇదే మొదటిసారి అయినా, కొత్తవేమీ కనిపించ లేదు వందచిత్రాలలో పాడిన గాయకుడి కంఠంలా ఉంది అతని గొంతులో గాంభీర్యమూ, చక్కని సంగతులుఉన్నవి" అన్నారు మర్యాదరామన్నలో ప్రసిద్ధ తమిళ గాయకుడు టి ఎం సౌందరరాజన్‌చేత కూడా ఒకపాట పాడించారు పద్మనాభం "చెబితే శానా వుంది ఇంటే ఎంతోచెబుతా ఇనుకోరా ఎంకట సామీ" అనేది యీ పాట. బాలసుబ్రమణ్యం పాడిన పాట ఎనిమిది నిమిషాల సేపు ఉంటుంది అతనితో సుశీల పి బి. శ్రీనివాస్, రఘురామయ్య కలిసి పాడారు. "ఏమి యీ వింత మోహం, ఏమియీ కలకలము—ఏమియీ ప్రణయ దాహం"అనే యీ గీతాన్ని రాగమాలికలో మలిచారు సంగీత దర్శకుడు కోదండపాణి.

* * *

రఘురామయ్య యింతవరకు మరొకరికి నేపథ్యం పాడలేదు ఇపుడు మర్యాద రామన్నలో కృష్ణ, రామ కృష్ణలకు పాడారు 'ఇందులో కృష్ణ, రామకృష్ణ లేమిటి? పద్మనాభం హీరోనా?' అనే సందేహం పాఠకులలో ఉత్పన్నం కావచ్చును రాజశ్రీ హరనాథ్ కృష్ణ, రామకృష్ణ శోభన్‌బాబు యీ చిత్రంలో అతిథి నటులుగా పాల్గొంటున్నారు. సుశీల రాజశ్రీకి, శ్రీనివాస్ హరనాథ్ కి, బాలసుబ్రహ్మణ్యం శోభన్‌బాబుకి, రఘురామయ్య కృష్ణ, రామకృష్ణలకి యీ ఎనిమిదినిమిషాల పాటను ఆలపించారు సౌందర రాజన్ పాటను పద్మనాభం మీద చిత్రీకరిస్తారు వీటిని రాసింది వీటూరి పద్మనాభం, గీతాంజలి రాజనాల, ప్రభాకరరెడ్డి, రాజ్ బాబు, బాల కృష్ణ ముక్కామల, పెరుమాళ్ళు, రామచంద్రరావు, ప్రసాద్, రఘురామయ్య, మీనాకుమారి, మాలతి ముఖ్యభూమికలు ధరిస్తున్న యీ చిత్రానికి దర్శకుడు కె హేమాంబరధరరావు నిర్మాత బి పురుషోత్తం.

* * *

కృష్ణ అదృష్టవంతుడు గూఢచారి 116 చిత్రం అతనికి గొప్ప పూవు తీసుకువచ్చింది ఇటీవలనే మరొక కొత్త చిత్రంలో నటించేందుకు కృష్ణ 'సైన్' చేశాడు ఆ కొత్తచిత్రం టైగర్ ప్రొడక్షన్స్‌వారి "ప్రొడక్షన్ నెం 3." ఈ చిత్రంలో కృష్ణ పక్కన కె ఆర్ విజయ కథానాయికగా నటించ బోతున్నది ఆనిసెట్టి సంభాషణలూ, రాజేంద్రకుమార్ కథా దర్శకత్వమూ, టి చలపతిరావు సంగీత దర్శకత్వమూ నిర్వహించే యీ చిత్రానికి కూర్పు ఎన్ ఎస్ ప్రకాశం నిర్మాతలు నెల్లూరి కాంతారావు పహిల్వాన్, ఎస్ హెచ్ హుసేనీ, కెమెరా వి యస్. ఆర్ స్వామి, దర్శకుడు వి రామచంద్రరావు బి. ఏ. (ఆనర్స్)

* * *

కెమెరామన్ వి. యస్. ఆర్ స్వామికి యిదే మొదటి చిత్రం ఆపరేటివ్ కెమెరామన్‌గా రవికాంత్ దగ్గర పనిచేసి చక్కటి అనుభవం సంతరించుకున్న యువకుడు ఈయన కూడా రాజలక్ష్మి యూనిట్ లోని వ్యక్తి ఈ యువ బృందం తయారు చేసే టైగర్ ప్రొడక్షన్స్ వారి మూడవ చిత్రం విజయాన్ని సాధిస్తుందని ఆశించవచ్చును

—మోహన్‌కుమార్



"కాంభోజరాజుకథ"లో శోభన్‌బాబు, వాణిశ్రీ.



టైగర్ ప్రొడక్షన్సువారి "మవ్వె"లో నాగేష్, శాంతి.

మెదడుకి మేత

జవాబులు

(42 వ పేజీ తరువాయి)

(ఙ) బీజ గణితంలో ప్రవేశం ఉన్నవారికి ఇది అసాధ్యపు లెక్కలా కనిపిస్తుంది. ఏమంటే ఇందులో మూడు వస్తువుల విలువలు తెలియాలి. మూడిటి విలువలు తెలియాలంటే బీజ గణిత సూత్రాల ప్రకారం మూడు సమీకరణాలు అవసరం. కాని ఇచ్చినవి రెండే సమీకరణాలు. అయినాసరే, ఇది అసాధ్యపు లెక్కమాత్రంకాదు. నిశితమైన తర్కం అవసరం. అంతే.


లెక్కలో ఇచ్చిన సమాచారాన్నిబట్టి ఈ క్రింది సమీకరణాలు వ్రాయవచ్చు.

2 బల్లెములు=3 గాలములు+1 కత్తి

3 బల్లెములు=2 కత్తులు+1 గాలం=25 కొబ్బరికాయలు. ఈ రెండింటినీ ఉపయోగించి 7 బల్లెములు=25 కాయలు+5 గాలములు అని వ్రాయవచ్చు.

గాలం విలువ ఒక్క కొబ్బరికాయ అనుకుందాం మాటవరుసకి. అప్పుడు బల్లెం విలువ 4 కాయలు అవుతుంది. ఈ వస్తువులకు పూర్తి కొబ్బరికాయలే గాని, కాయలో ముక్కలు ఇవ్వడం సాధ్యంకాదుకదా. కనుక ఈ వస్తువుల విలువలు పూర్ణ సంఖ్యలు అయేటట్లు చూచుకోవాలి. ఇదిగో ఈ అదనపు సమాచారాన్ని ఉపయోగించి లెక్కను సాధించవచ్చు. కనుక గాలం ఖరీదు ఒక్క కొబ్బరికాయ కాదు. పోనీ గాలం విలువ 2 కాయలు అనుకుందాం. అప్పుడు బల్లెం విలువ 5 కాయలు. కత్తి విలువ 4 కాయలు అవుతుంది. ఈ విలువలుతప్ప మరేవీ నప్పవని పరిశీలనవల్ల తెలుస్తుంది. కనుక బల్లెం—5 కాయలు. కత్తి—4 కాయలు. గాలం—2 కాయలు.

(చ) తొమ్మిది చుక్కలు.



(ఛ) లెక్కపూత—27 ముక్కలలోనూ అసలే రంగులేనిది ఒకే ఒక ముక్క ఉంటుంది. మూడు వైపుల రంగున్నవి 8 ముక్కలు. రెండు వైపుల రంగున్నవి 12 ముక్కలు. ఒక్క వైపున రంగున్నవి. 6 ముక్కలు.

(త) వనజకు 36 ఏళ్ళు. పాపన్నకు 72 ఏళ్ళు.

(ప) కారు లైసెన్సు నెంబరు ఐదు అంకెల సంఖ్య అని తెలుస్తోంది. అవి తలకిందులు చేసినా అర్థవంతమైనవే, అని తెలుస్తోంది. అటువంటి అంకెలు ఐదు మాత్రమే ఉన్నాయి. అవి 1, 6, 8, 9, 0. ఆ సంఖ్యలోని అంకెలు అన్నీ వేరు వేరువి అని చెప్పేరు కనుక ఈ అయిదు అంకెలూ ఆ సంఖ్యలో ఉన్నాయని తెలుస్తోంది. తలకిందులు చేస్తే 1, 8, 0 లలో మార్పు ఉండదు. అనీ, 6, 9 లు తారుమారు అవుతాయనీ గుర్తుంచుకోవాలి. అసలు సంఖ్యకీ, తలకిందులు అయినసంఖ్యకీ భేదం 78633 ఉండాలంటే ఈ అయిదు అంకెలనూ ఏవిధంగా అమర్చాలో కొద్దిగా ప్రయత్నిస్తే తెలుస్తుంది. అసలు సంఖ్య 10968.



('టైమ్స్' పత్రిక ముఖచిత్రం.)

వాల్టర్ ఎలియాస్ డిస్నీ

కొన్ని సంవత్సరాల క్రితం సోవియట్ నాయకుడు శ్రీ కృశ్చేవ్ అమెరికా వెళ్ళినప్పుడు ఆయన్ని 'డిస్నీలాండ్' తీసుకువెళ్ళారు. ఒకసారి చూసి తృప్తికలగక ఆయన వేరే డిస్నీలాండ్ చూసి వచ్చాడుట! ఈ వ్యాస రచయిత డిస్నీలాండ్ వెళ్ళినప్పుడు చెప్పుకుంటూ ఉండగా విన్నాడు. కృశ్చేవ్ చేసిన దానిలో అతనికి విడ్డూరమేమీ కనిపించలేదు. డిస్నీలాండ్‌కి వెళ్ళే ముందు ఒక 'మానో రెయిల్' బండి ఎక్కాలి. ఇది ఎక్కినప్పుడే ప్రయాణీకులు మరొక ప్రపంచంలోకి వెడుతున్నామని గుర్తిస్తారు. ఇక దిగిన తర్వాత వారు ఎదుర్కొనే వింతలకి అంతులేదు. కొన్ని నిముషాలలో ఒక స్వాప్నిక జగత్తులో పడిపోతారు! చిన్నప్పుడు విని, చదివి ఆనందించినవన్నీ కళ్ళకి కడ్తాయి—ఆలిస్ ఇన్‌వండర్‌లాండ్, స్నోవైట్, గ్రిమ్ కథలు, మిక్కీ మవుస్..అంతేకాదు, జూల్స్‌వెర్న్, రాబర్ట్ లూయీ స్టీవెన్సన్, ఫెనిమోర్ కూపర్, బాలంటయిన్ పుస్తకాల ప్రపంచం తెరమీద నుంచి భూమి మీదకి దిగి వస్తుంది. అమెరికన్ ప్రెయిరీలు, ఆఫ్రికా, దక్షిణ అమెరికా అడవులు—వీటిలో ప్రయాణం చెయ్యవచ్చు. 'వయిల్డ్ వెస్ట్'ని కళ్లరా చూసి చిన్నప్పటి జ్ఞాపకాలలోకి మునిగిపోవచ్చు...

స్నోవైట్ ఎండ్ దిసెవన్ డ్వార్ఫ్స్, పినోకియో, బాంబీ, డోనాల్డ్ డక్, మిక్కీమౌస్, ఆలిస్ ఇన్‌వండర్‌లాండ్ వంటి కార్టూన్ సినిమాలే కాక ఎటువంటి 'వాస్తవిక' చలన చిత్రాలతోనయినా తేలికగా సరితూగగలిగిన 'దిలోకోమోటివ్ బేస్' వంటి సినిమాలు తీసి, కామిక్ పుస్తకాల ద్వారా కోట్లమందిని సమ్మోహితులని చేసిన వాల్ట్ డిస్నీ మరణించినప్పుడు ఎందరికో ఒక ఆప్తుడు పోయినట్లు అనిపించింది. కాని ఈ రంగురంగుల కలలు సృష్టించిన కళాకారుడి జీవిత విశేషాలు చాలా అశ్చర్యం కలిగిస్తాయి. అతని తండ్రి ఒక సోషలిస్టు. "ది ఎప్పీల్‌టు రీసన్" అనే వార పత్రిక నడిపేవాడు. చిన్నప్పటి నుంచీ వాల్ట్ డిస్నీకి ఆతని శిక్షణ ఉండేది. కొన్ని జంతువులంటే ఇష్టం కాబట్టి అతన్ని తండ్రి గ్రామంలో వ్యవసాయం చేయించి ఆ జంతువుల పోషణకి అలవాటు చేశాడు. కార్టూన్ సినిమాలతో లక్షలు గడించిన వాల్ట్ డిస్నీకి మూగజీవాల మీద ప్రేమ అసలు తగ్గనేలేదు. అందుకనే 'బీవర్ వాలీ', 'లివింగ్ డిసర్ట్' వంటి అద్భుత చలనచిత్రాలు తీశాడు. ప్రకృతిలో దాగి ఉన్న సహజమయిన అందాలని అందరికీ అందించాడు.

కోట్లమంది చిన్నపిల్లలు అతను సృష్టించిన ప్రపంచంలో మునిగిపోయి ముగ్ధులయ్యారు. ఆధునిక సాంకేతికాభివృద్ధిని అతను సద్వినియోగం చేసినంతగా మరెవరూ చెయ్యలేదు. కొద్దికాలమయినా చిన్నపిల్లలుగా మారటానికి ఇష్టపడని పెద్దవారికి కూడా వాల్టర్ ఎలియాస్ డిస్నీ ఆప్తుడే....

ఓ. వి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA



శివకుమార్

తెల్లని దంతములకు, ఆరోగ్యవంతమైన చిగుళ్లకు

రెమి ®

టూత్ పేస్టు

Manufacturers REMY PERFUMS PRIVATE LIMITED,
263, Thambu Chetty St, Madras-1